
'ప్రతి కుటుంబం సుఖ సంతోషాలతో గడపాలి. అందుకు సంక్షేమ పథకాలు పెద్దన్న పాత్ర పోషించాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 16 | సంచిక: 154

SUNDAY Special | ఆదివారం 18-2-2024




రామభద్రాచార్య, గుల్జార్‌కు జ్ఞానపీఠ్

సంస్కృత పండితుడు జగద్గురు రామభద్రాచార్య, ప్రముఖ ఉర్దూ కవి గుల్జార్ జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికయ్యారు. 2023కుగాను వారికి అవార్డు ఇవ్వాలని ఎంపిక కమిటీ నిర్ణయించింది. - 6లో



జ్యోతి యర్రాజీకి స్వర్ణం

ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన అథ్లెట్ జ్యోతి యర్రాజీ స్వర్ణ పతకం గెలుచుకుంది. 60 మీటర్ల హర్డిల్స్‌ను 8.12 సెకన్లలో పూర్తి చేసి జాతీయ రికార్డును కూడా బద్దలుకొట్టింది.

- స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | DELHI | VIJAYAWADA | CHENNAI | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



వర్చువల్‌గా హాజరైన కేజ్రీవాల్

ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ న్యాయస్థానం అనుమతి మేరకు సిటీ కోర్టు ఎదుట వర్చువల్‌గా విచారణకు హాజరయ్యారు.

వివరాలు 6లో ▶



ట్రంప్‌కు భారీ జరిమానా

బ్యాంకులను, బీమా సంస్థలను మోసం చేసిన కేసులో ట్రంప్‌కు న్యూయార్క్ కోర్టు రూ.3,020 కోట్లు జరిమానా విధించింది.

వివరాలు 6లో ▶



బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు

తమిళనాడులోని విరుధునగర్‌లో ఉన్న ఓ బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు సంభవించడంతో 10 మంది ప్రాణాలు కోల్పోయారు.

వివరాలు 6లో ▶



ఐక్యంగా ఉంచడమే దేశభక్తి

ధనిక, పేద వర్గాల మధ్య అంతరాలు భారీగా పెరుగుతున్న తరుణంలో దేశాన్ని ఐక్యంగా ఉంచడమే దేశభక్తి అని రాహుల్ అన్నారు.

వివరాలు 6లో ▶

ఇంగ్లిష్ పదిలం

ఈసారి టెన్త్ విద్యార్థుల్లో అత్యధికులు ఆంగ్ల మాధ్యమంలోనే పరీక్షలు

- మొత్తం 6.23 లక్షల మందిలో 4.51 లక్షల మంది ఇంగ్లిష్‌లోనే సిద్ధం
- ఐదేళ్లలో తెలుగు నుంచి దాదాపు 25 శాతం మంది ఇంగ్లిష్ మీడియంలోకి
- ఇప్పుడు టెన్త్‌లో ఇంగ్లిష్ మీడియం విద్యార్థులు ఏకంగా 72.54 శాతం
- త్వరలోనే అది వంద శాతానికి చేరుతుందంటున్న విద్యావేత్తలు
- ప్రాథమిక స్థాయి నుంచే ఆంగ్లంలో నైపుణ్యాలు పెరిగేలా టోఫెల్ శిక్షణ
- ఫలితాలనిస్తున్న సీఎం జగన్ విద్యా సంస్కరణలు.. నాలుగేళ్ల క్రితం తలపెట్టిన ప్రయత్నానికి ఫలితం ఇది



సాక్షి, అమరావతి: విద్యా రంగంలో సమూల సంస్కరణలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల క్రితం తలపెట్టిన చదువుల యజ్ఞం సత్ఫలితాలనిస్తోంది. మన విద్యార్థులు అంతర్జాతీయంగా సత్తా చాటుకునేలా దూరదృష్టితో ప్రభుత్వ పాఠశాలల్లో తీసుకొచ్చిన ఇంగ్లిష్ మీడియం చదువులకు ఆదరణ పెరుగుతోంది. ఇన్నాళ్లూ మాతృభాష ముసుగులో పేద బిడ్డల ఇంగ్లిష్ చదువులకు అడ్డుపడుతూ కొందరు

మిగతా 2వ పేజీలో ▶

మా లాంటి పేదలకు అండగా సీఎం



"గిరిజన ప్రాంతంలో జన్మించిన నేను ప్రారంభంలో తెలుగు మీడియంలోనే చదువుకున్నా. జగన్ మావయ్య ప్రభుత్వం వచ్చిన తరువాత ఇంగ్లిష్ మీడియంలో చదువుతున్నా. ప్రస్తుతం జీకే వీధి ఇంగ్లిష్ మీడియం ఆశ్రమ పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నా. జగన్ మావయ్య మాలాంటి పేద విద్యార్థులకు అండగా నిలిచారు. ఉన్నత చదువులు చదివి మావయ్య ఆశయాన్ని సాధిస్తా. మా అమ్మ కిల్లో జమున, నాన్న కిల్లో నవకుమార్ పోడు వ్యవసాయం చేస్తారు. ఆ ఆదాయంతో నన్ను చదివించేవారు. ఇప్పుడు ఇంగ్లిష్ మీడియం స్కూల్లో ఉచితంగా వసతి కల్పిస్తున్నారు. టీచర్లు బాగా బోధిస్తున్నారు.

– కె.ధారామణి, ఇంగ్లిష్ మీడియం గిరిజన ఆశ్రమ పాఠశాల, జీకే వీధి, అల్లూరి జిల్లా

100 రోజులు.. 370 స్థానాలు

ఢిల్లీలో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు ప్రారంభం

- సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా శ్రేణులకు అగ్రనేతల దిశానిర్దేశం
- ప్రతి బూత్‌లో అదనంగా 370 ఓట్లు సాధించాలని ప్రధాని మోదీ పిలుపు
- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన
- తెలంగాణలో అధికారం దక్కించుకోవడానికి ప్రణాళికలు సిద్ధమవుతున్నాయి
- బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా వెల్లడి

6లో



బీజేపీ జెండాను ఎగరవేస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ. చిత్రంలో బీజేపీ నేతలు నడ్డా, రాజ్‌నాథ్, అమిత్ షా

"జమ్మూకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తూ రాజ్యాంగంలో చేర్చిన ఆర్టికల్ 370ని జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకించారు. రాబోయే ఎన్నికల్లో 370 స్థానాలు సాధించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి. ఈ లక్ష్యాన్ని సాధించడానికి 100 రోజుల ప్రణాళిక ప్రకారం కార్యకర్తలు బూత్ స్థాయిలో పనిచేయాలి. పదేళ్ల పాలనలో ప్రభుత్వానికి ఒక్క అవినీతి మరక కూడా అంటలేదు. ఇది పేదల ప్రభుత్వం అన్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లండి."

- ప్రధాని మోదీ



జీఎస్ఎల్‌వీ-ఎఫ్14 ప్రయోగం సక్సెస్

- మొత్తం మూడు దశలు విజయవంతం
- రోదసిలోకి ఇన్‌శాట్–3డీఎస్ ఉపగ్రహం
- మరో రెండు మూడు రోజుల్లో భూ స్థిరకక్ష్యలోకి..
- శాటిలైట్‌తో దేశంలో సమాచార వ్యవస్థ బలోపేతం
- వాతావరణంపై అంచనాల్లో మరింత స్పష్టత

6 లో

నవ చరిత్రకు రాస్తాడు 'సిద్ధం'

నేడు వైఎస్సార్‌సీపీ ఎన్నికల సన్నాహక మూడో సభ

- 250 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ఘనంగా ఏర్పాట్లు
- రాయలసీమలో 52 నియోజకవర్గాల నుంచి తరలివెళ్లనున్న పార్టీ శ్రేణులు
- నేటి సభలో పార్టీ 'సీమ' నేతలు, కార్యకర్తలకు సీఎం జగన్ దిశా నిర్దేశం
- ఇప్పటికే నిర్వహించిన భీమిలి, ఏలూరు సభలకు పోటెత్తిన ప్రజానీకం

3 లో

తమ్ముళ్లూ.. త్యాగాలు

పొత్తుల్లో పోగా మిగిలిన 100 సీట్లతో సర్దుకుందాం

- చంద్రబాబు వ్యాఖ్యలతో టీడీపీలో హాహాకారాలు
- జనసేన, బీజేపీకి 75 ఎమ్మెల్యే, 10 ఎంపీ సీట్లు ఇవ్వాల్సిన పరిస్థితి
- సిట్టింగ్‌లందరికీ సీట్లు ఇవ్వాల్సిందేనంటున్న బుచ్చయ్య
- ఆర్థిక బలం ఉన్న తమకు సీట్లు ఇవ్వాలని మరికొందరి ఒత్తిడి

10 లో



పేదింట అభివృద్ధి

రాష్ట్రంలోని పల్లె లోగిళ్లలో కళ్లెదుటే మార్పు

- సీఎం జగన్ ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి పథకాల ఊతం
- భవిష్యత్‌పై బెంగ గతం.. ప్రతి ఇంటా ఆత్మగౌరవం
- నవరత్న పథకాల ద్వారా ప్రతి కుటుంబానికి రూ.లక్షల్లోనే లబ్ధి
- తొలిసారి బంగారం కొనగలిగామంటున్న పేద కుటుంబాలు
- ఒకే గదిలో ఇంటిల్లిపాదీ ఇరుక్కుని పడుకునే రోజులకు చెక్
- మూడు గదులు, వరండాతో సొంతింటి కల సాకారం
- ఎన్నో ఇళ్లలో కుటుంబ సభ్యులు ప్రభుత్వ ఉద్యోగులుగా మారిన తరుణం.. పింఛన్లు, వైఎస్సార్ చేయూత, ఆసరా పథకాల లబ్ధిదారుల్లోనే 2.54 లక్షల విజయగాథలు

- వివరాలు 2లో

ఫ్యాక్ట్‌చెక్

'సున్నావడ్డీ' నడ్డి విరిచింది మీ బాబే

- రైతుల 'రాయితీ'పై రామోజీ వికృత రాతలు
- టీడీపీ ఐదేళ్లలో 40.61 లక్షల మందికి కేవలం రూ.685.46 కోట్ల చెల్లింపు
- చంద్రబాబు 39.08 లక్షల మందికి ఎగ్గొట్టిన బకాయిలు రూ.1,180.66 కోట్లు
- వాటితో కలిపి 57 నెలల్లో 73.88 లక్షల మందికి రూ.1,834.55 కోట్ల చెల్లింపు
- 2022–23 కోసం 10.79 లక్షల మందికి మరో రూ.200 కోట్లు చెల్లించేందుకు ఏర్పాట్లు

- వివరాలు 3లో

పరిశ్రమలపై పనికిమాలిన కథ



- లేనిది ఉన్నట్లుగా రామోజీ అడ్డగోలు రాతలు
- మార్ట్‌గేజ్ బాండ్‌కు గతంలో ఉన్న స్టాంప్ డ్యూటీయే ఇప్పుడూ ఉంది
- డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్స్‌కు, మార్ట్‌గేజ్ బాండ్స్‌కు తేడా తెలియదా?
- ఆ డీడ్స్‌కైనా రూ.50 వేలు చెల్లిస్తే సరిపోతుంది
- చిన్న పరిశ్రమలపై 25 రెట్ల భారం ఎక్కడ వేశారు?
- కనీస అవగాహన లేకుండా గుడ్డి రాతలెందుకు?

13 లో



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

మా బతుకులు బాగుపడ్డాయి

మాది రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబం. మా ఆయన నాగరాజుతో కలిసి వ్యవసాయ పనులతోపాటు పాడి ఆవులు పెట్టుకున్నాం. అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం అంగళ్లు గ్రామంలోని పెద్ద దళితవాడలో ఉంటున్న మేము అరకొర ఆదాయంతోనే ముగ్గురు పిల్లలతో జీవనం సాగిస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో ఎలాంటి సాయానికి నోచుకోలేదు. ఈ ప్రభుత్వం వచ్చిన తర్వాత నాకు వలంటీర్‌గా అవకాశం వచ్చింది. రెండేళ్ల క్రితం పాడి ఆవుల కోసం రూ.2 లక్షలు పొదుపు రుణం తీసుకున్నాం. రూ.1.50 లక్షలతో రెండు పాడి ఆవులు కొన్నాం. రూ.50 వేలతో పశుగ్రాసం కోసం కొంత భూమిని కౌలుకు తీసుకున్నాం. రోజూ ఉదయం, సాయంత్రం 30 లీటర్ల పాలు వస్తున్నాయి. అమూల్ డెయిరీకి పాలు పోయడం ద్వారా నెలకు రూ.27 వేలు వస్తోంది. దాణా, ఇతర ఖర్చులు పోను నెలకు రూ.10 వేలు మిగులుతోంది. 5వ తరగతి చదువుతున్న మా అమ్మాయి వర్షిత



ప్రియకు అమ్మ ఒడి వస్తోంది. ఇప్పటి వరకు ఏడాదికి రూ.15 వేలు చొప్పున, నాలుగు విడతల్లో రూ.60 వేలు వచ్చింది. మా అత్త మల్లక్కకు వైఎస్సార్ చేయూత పథకంలో ఏటా రూ.18,750 వస్తోంది. వృద్ధాప్య పింఛన్ రూ.3 వేలు వస్తోంది. ఇప్పుడు ప్రభుత్వ సంక్షేమ పథకాలతో హాయిగా బతుకుతున్నాం. జగనన్న సాయంతోనే మా బతుకులు బాగుపడ్డాయి.

– మంచూరి దుర్గ, అంగళ్లు
(సిద్దల కోదండరామిరెడ్డి, విలేకరి, కురబలకోట)

నేను టీడీపీ.. అయినా ఇల్లు ఇచ్చారు

చిన్న తనం నుంచీ టీడీపీ అంటే పిచ్చి. పసుపు చొక్కా వేసుకొని జెండా పట్టుకొని తిరిగే వాడిని. నన్ను అందరూ టీడీపీ కార్యకర్తగా ముద్ర వేశారు. 20 ఏళ్లుగా శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట మండలం జమ్ములో ఓ అద్దె ఇంట్లో ఉంటూ చిన్న వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించాను. సొంత ఇంటి కోసం ఆ ప్రభుత్వ కాలంలో ఎంతో ప్రయత్నించాను. అందరి వద్దకూ వెళ్లాను. స్థలం ఉంటే ఇల్లు ఇస్తామన్నారు. స్థలం కొనుగోలు చేసే స్తోమత లేక ఆ ఆశ వదులుకున్నాను. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక జగనన్న కాలనీల్లో ఇంటి స్థలం ఇస్తూ ఇల్లు మంజూరు చేస్తున్నారు అంటే దరఖాస్తు



చేశాను. జమ్ము పంచాయతీ గడ్డెయ్యపేటలో జగనన్న కాలనీలో స్థలం ఇచ్చారు. ఇల్లు కట్టుకునేందుకు రూ.1.80 లక్షలు ఇచ్చారు. డ్వాక్రా నుంచి నా భార్యకు మరో రూ.30 వేలు అప్పుగా ఇచ్చారు. మరికొంత అప్పు చేసి మా కల నెరవేర్చుకున్నాం. భార్య, కుమార్తెతో హాయిగా జీవిస్తున్నాం. నా భార్య శశికళకు రూ.12 వేలు డ్వాక్రాలో రుణ మాఫీ అయ్యింది. కుమార్తెకు విద్యా దీవెన పథకంలో మూడేళ్లలో రూ.60 వేలు వచ్చింది. ఇప్పుడు మాకు ఎలాంటి ఆర్థిక సమస్యా లేదు. ఇప్పుడు జగనన్న గెలుపే నా లక్ష్యం.

– పొట్నూరు జగదీష్, గడ్డెయ్యపేట
(మామిడి రవి, విలేకరి, నరసన్నపేట)

ప్రభుత్వ పథకాలతో బతుకు చింత తీరింది

మాది పేద కుటుంబం. నేను, మావారు చేనేత పనులు చేస్తుండేవాళ్లం. ముగ్గురు పిల్లలు పుట్టాక నా భర్త నన్ను వదిలేయడంతో మగ్గం పనులు చేస్తూనే వారిని పెంచి పెద్ద చేశాను. ముగ్గురికీ పెళ్లిళ్లు చేశాను. అబ్బాయి బంగారం వర్క్ షాపులో పని చేస్తుంటాడు. కోడలు, మనవడితో కలిసి పాత మంగళగిరిలో ఉంటున్నాం. నాకు వచ్చే పెన్షన్‌తో జీవనం కొనసాగిస్తున్నా.



ఇప్పుడు ఓపిక లేక పనులకు కూడా వెళ్లడం లేదు. ఒకరోజు ఒక్కసారిగా గుండె నొప్పి వచ్చింది. డాక్టర్లను సంప్రదిస్తే ఆపరేషన్ చేయాలన్నారు. సుమారు ఏడు లక్షలు ఖర్చవుతుందని చెప్పారు. కాళ్లూ చేతులు ఆడలేదు. అసలే ఆదాయం అంతంత మాత్రం. ఏమి చేయాలో అని ఆలోచిస్తున్న తరుణంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరోగ్య శ్రీ పథకం మాకు శ్రీరామ రక్షగా నిలిచింది. లక్షలు ఖర్చు చేసే ఆపరేషన్‌ను విజయవాడలోని ప్రైవేట్ ఆస్పత్రి వైద్యులు ఉచితంగా చేశారు. దీంతో నా ఆరోగ్యం మెరుగుపడింది. ఆరోగ్యశ్రీ లేకపోతే నా కుటుంబం రోడ్డున పడేది. నాకు సీఎం జగన్ పునర్జన్మ ప్రసాదించారు. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏటా రూ.18,750 అందుతోంది. దానిని కుటుంబ అవసరాలకు వినియోగిస్తున్నా. మా మనవడికి అమ్మ ఒడి డబ్బులు రావడంతో వాడి చదువులకు చింత లేకుండా పోయింది. ప్రభుత్వ పథకాలు మా కుటుంబాన్ని ఆదుకుంటున్నాయి.

– చెరుకు ఆదిలక్ష్మి, పాత మంగళగిరి
(ఐ.వి.రెడ్డి, విలేకరి, మంగళగిరి)



ఇస్రో బృందానికి సీఎం జగన్ అభినందనలు

సాక్షి, అమరావతి: జీఎస్ఎల్‌వీ–ఎఫ్14ను విజయవంతంగా ప్రయోగించి.. ఇన్‌శాట్ 3డీఎస్ ఉపగ్రహాన్ని కక్ష్యలోకి చేర్చిన ఇస్రో బృందానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందనలు తెలిపారు. భవిష్యత్‌లో ఇస్రో చేసే ప్రయోగాలన్నీ ఇలాగే విజయవంతం కావాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు.

పేదింట అభివృద్ధి

సీఎం జగన్ ప్రభుత్వ సంక్షేమాభివృద్ధి పథకాల ఊతం

(పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం గంటావారిపాలెం నుంచి సాక్షి ప్రతినిధి మేడికొండ కోటిరెడ్డి) :

రాష్ట్రంలో గత నాలుగున్నరేళ్లలో వైఎస్ జగన్ ప్రభుత్వ విప్లవాత్మక సంస్కరణలు, సంక్షేమాభివృద్ధి పథకాలు.. కార్యక్రమాల వల్ల పల్లెల్లోని లక్షలాది పేద కుటుంబాల్లో అభివృద్ధితో కూడిన మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఆత్మగౌరవంతో కూడిన ధైర్యంతో అడుగులు ముందుకు వేస్తున్నామని ఆయా కుటుంబాల పెద్దలు చెబుతున్నారు. నాలుగేళ్ల క్రితం వరకు ప్లాస్టిక్ పట్టా కట్టుకొని ఉండే ఒక రేకుల షెడ్డులో భార్య, భర్త, పెళ్లీడుకొచ్చిన కొడుకుతో కలిసి జీవనం సాగించిన పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం గంటావారిపాలెం గ్రామానికి గార్లపాటి కెజియా.. అప్పటిదాకా పనులు చేసుకుంటూ సంపాదించుకున్న సొమ్ముకు ప్రభుత్వ సహకారం తోడు కావడంతో కుమారుడి పెళ్లికి ముందే మూడు గదులు, వరండాతో కూడిన పక్కా ఇంటిని నిర్మించుకోగలిగింది. ఆమె ఇంటి పక్కన నివాసం ఉండే ఆరేటి కోటేశ్వరమ్మ కొడుక్కు గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగాల భర్తీలో ప్రభుత్వ ఉద్యోగమే వచ్చింది. దురదృష్టవశాత్తు రోడ్డు ప్రమాదంలో ఆ కుమారుడు మరణిస్తే, ఆ కుటుంబంలోనే మరొకరికి కారుణ్య నియామక కోటాలో ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చే అంశం ప్రస్తుతం ప్రభుత్వం వద్ద పరిశీలనలో ఉంది. చేతికి అందివచ్చిన కొడుకు దూరమైన ఆ కుటుంబానికి భరోసా కల్పించేందుకే ఆమె మూడో కుమారుడికి ప్రభుత్వ వలంటీరుగా అవకాశం దక్కింది. వీరి ఇళ్లకు పక్కనే ఉండే మరో మహిళకు వివాహమై 25 ఏళ్లు అయినా, చెవి దిద్దులు తప్ప మరే ఇతర బంగారు ఆభరణాలు కొనుక్కోలేకపోయానని బెంగపడేది. ఇప్పుడామె ఈ నాలుగున్నరేళ్లలోనే దాదాపు రూ.2 లక్షలకు పైగా విలువైన కొత్త బంగారు ఆభరణాలు కొనుక్కొంది. ఈ ముగ్గురి ఇళ్ల చుట్టుపక్కలే నివాసం ఉండే మేఘన.. వలంటీర్‌గా పని చేస్తూ నెలనెలా రూ.5 వేల చొప్పున గౌరవ వేతనం పొందడంతో పాటు అంతకు ముందు



కుటుంబ సభ్యులతో ఆరేటి కోటేశ్వరమ్మ



సొంత ఇంటిముందు గార్లపాటి కెజియా

రాష్ట్ర వ్యాప్తంగా ఇదే తరహా లబ్ధి

- వైఎస్సార్ ఆసరా పథకం సద్వినియోగం చేసుకోవడం ద్వారా తమ జీవితాల్లో చోటు చేసుకున్న మార్పులపై 78,189 మంది తమ జీవిత గాథలను వివరిస్తూ వీడియోలు చిత్రీకరించారు. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా తమ జీవితాల్లో వచ్చిన మార్పులపై 76,423 మంది, వైఎస్సార్ పెన్షన్లతో వచ్చిన మార్పుపై 99,436 మంది.. మొత్తంగా 2,54,013 మంది తమ జీవిత గాథలను వీడియోల రూపంలో చిత్రీకరించారు.
- నీతి ఆయోగ్ గణాంకాల ప్రకారం గత చంద్రబాబు ప్రభుత్వ సమయంలో రాష్ట్రంలోని మొత్తం జనాభాలో 11.77 శాతం పేదరికం ఉండగా, 2022–23 నాటికి అది 4.19 శాతానికి తగ్గింది.
- రాష్ట్రంలో 2020–21తో పోలిస్తే 2022–23 సంవత్సరానికి సంబంధించి ఆదాయ పన్ను చెల్లించే వారి సంఖ్య 19.79 లక్షల నుంచి 21.65 లక్షలకు పెరిగింది. రాష్ట్ర సగటు తలసరి ఆదాయం కూడ రూ.47,518 చొప్పున పెరగడం గమనార్హం.
- ప్రభుత్వం వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ సున్నా వడ్డీ వంటి పథకాల ద్వారా అందజేసే సాయాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవడం ద్వారా గత నాలుగేళ్ల కాలంలో ఏకంగా 18.37 లక్షల మంది ప్రతి నెలా స్థిర ఆదాయం పొందేలా శాశ్వత జీవనోపాధులు ఏర్పాటు చేసుకున్నట్టు అధికార గణాంకాలు పేర్కొంటున్నాయి.

చేసుకొనే అన్ని పనులను ఎలాంటి ఆటంకం లేకుండా చేసుకుపోతోంది. వీళ్లంతా ఆ గ్రామంలోని ఒక స్వయం సహాయక పొదుపు సంఘం (యెహోవా) సభ్యులు.

ఆసరా ద్వారానే రూ.3.34 లక్షలు లబ్ధి

మొత్తం పది మంది సభ్యులు ఉండే ఈ పొదుపు సంఘం పేరిట 2019 అసెంబ్లీ ఎన్నికల నాటికి రూ.3,33,440 బ్యాంకు అప్పు ఉండింది. అప్పటి ఎన్నికల్లో హామీ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా నాలుగు విడతల్లో చేసిన రుణ మాఫీ మొత్తం నేరుగా వారి చేతికే అందింది. సంఘ సభ్యులు కెజియా, కోటేశ్వరమ్మ, మేఘన.. ఇలా పది మంది ఒక్కొక్కరు ఒక్కో విడతకు రూ.8,336 చొప్పున.. నాలుగు విడతల్లో రూ.33,344 లబ్ధి పొందారు. ఈ సంఘం ఒకసారి రూ.7,50,000 బ్యాంకు రుణం పొందగా, ఒక్కొక్కరూ రూ.75 వేల చొప్పున రుణ లబ్ధి పొందారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ప్రోత్సాహంతో ఈ రుణ మొత్తాన్ని సంఘ సభ్యులందరూ సకాలంలో కిస్తీ రూపంలో చెల్లించారు. 15 రోజుల క్రితమే మరో విడత ఏకంగా రూ.15,00,000 పొందారు. తద్వారా ఒక్కొక్కరూ రూ.లక్షన్నర దాకా రుణ లబ్ధి పొందారు. గత చంద్రబాబు ప్రభుత్వం మాదిరి కాకుండా పొదుపు సంఘాల రుణాలపై వడ్డీని సున్నా వడ్డీ పథకం కింద జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వమే భరిస్తోంది. దీంతో వారికి మరింత ఊరట లభించింది. గతంలో ఈ సంఘంలోని సభ్యుల కుటుంబాలు తమ కుటుంబానికి ఏ ఆర్థిక అవసరం ఏర్పడినా రూ.100కు నెలకు రూ.2, రూ.3 వడ్డీకి ప్రైవేట్ వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు తెచ్చుకోనే పరిస్థితి ఉండింది. ఈ నాలుగేళ్లలో వీరు ఏకంగా రూ.22.50 లక్షల రుణం తమ పొదుపు సంఘం ద్వారా పొందడంతో వడ్డీ రూపంలోనే ఒక్కొక్కరూ రూ.25 వేలకు పైబడే అదనపు ప్రయోజనం పొందారు.

చేయూత, పింఛను, రైతు భరోసా, ఇతరత్రా లబ్ధి

ఈ పేద కుటుంబాలకు ప్రభుత్వ సాయం కేవలం వైఎస్సార్ ఆసరా పథకం ఒక్కటికే పరిమితం కాలేదు. చేయూత కింద ఏడాదికి ఒక్కొక్కరికి రూ.18,750 చొప్పున అందుతోంది. గార్లపాటి కెజియాకూ, ఆరేటి కోటేశ్వరమ్మకు ఇప్పటికే మూడు విడతలు అందింది. త్వరలో నాలుగో విడత అందనుంది. కెజియా భర్త గార్లపాటి యోహాన్‌కు గత 56 నెలల కాలంలో పెన్షన్ రూపంలో రూ.1,32,750.. ఆరేటి కోటేశ్వరమ్మ భర్త ఆరేటి తిరుమలరావుకు రూ.93,750 పెన్షన్‌గా అందింది. కొడుక్కు ఉద్యోగం వచ్చిన కారణంగా కొంత కాలం పింఛను నిలిపివేసినా, అతను రోడ్డు ప్రమాదంలో మరణించడంలో ఆరేటి తిరుమలరావుకు పెన్షన్ పంపిణీ కొనసాగుతోంది. కోటేశ్వరమ్మ కుటుంబానికి కరోనా సమయంలో ప్రభుత్వ సాయంగా రూ.1000తో పాటు జగనన్న తోడు పథకంలో రెండు విడతల్లో రూ.10 వేల చొప్పున వడ్డీ లేని రుణం అందింది. వీరికి రైతు భరోసా పథకం ద్వారా 2022, 2023లో రెండు విడతలుగా రూ.13,500 చొప్పున అందింది. వీరి చిన్న కుమారుడు సురేష్ 2019–20లో డిగ్రీ చివరి సంవత్సరానికి సంబంధించి విద్యా దీవెన పథకం ద్వారా సాయం అందింది. కెజియా కుటుంబానికి కరోనా సాయంగా ప్రభుత్వమిచ్చిన రూ.1000తో పాటు ఇతర పథకాలన్నీ కలిపి దాదాపు రూ.రెండున్నర లక్షల మేర ప్రయోజనం కలిగింది.

ఇంగ్లిష్ పదిలం

▶ మొదటి పేజీ తరువాయి

పెత్తందార్లు కార్పొరేట్ విద్యా సంస్థల కొమ్ము కాశారు. రాష్ట్ర ప్రభుత్వం సర్కారీ స్కూళ్లలో పేద విద్యార్థుల కోసం ఇంగ్లిషు మీడియం తీసుకొస్తే తెలుగును అణగదొక్కుతున్నారంటూ విష ప్రచారం చేశారు. అందరూ ఆంగ్లంలోనే చదివితే తమ పరిస్థితి ఏం కావాలని కార్పొరేట్ విద్యా సంస్థలు బెంబేలెత్తాయి. ఇవన్నీ అధిగమిస్తూ ప్రభుత్వ విద్యా సంస్థలు మంచి ఫలితాలను నమోదు చేస్తున్నాయి. రాష్ట్రంలో ఇంగ్లిషు మీడియంలో టెన్త్ పరీక్షలు రాసే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సంఖ్య భారీగా పెరుగుతోంది. సర్కారీ స్కూళ్లలో గత ఐదేళ్లలో దాదాపు 25 శాతం మంది విద్యార్థులు తెలుగు నుంచి ఇంగ్లిషు మీడియంలోకి మారిపోయి పదో తరగతి పరీక్షలకు హాజరైనట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి. కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్ది పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఇంగ్లిషు మీడియం చదువులను ముఖ్యమంత్రి జగన్ అందిస్తుండటం తెలిసిందే. ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టడంతో అత్యధిక విద్యార్థులు తెలుగు నుంచి ఆంగ్ల మాధ్యమంలోకి మారారు. ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కింద పాఠ్యపుస్తకాలతో పాటు యూనిఫాం, బూట్లు తదితరాలతో కిట్‌ను ప్రభుత్వం ఉచితంగా అందిస్తోంది. విద్యార్థులు సులభంగా అర్థం చేసుకోవడానికి వీలుగా బైలింగ్యువల్ పాఠ్యపుస్తకాలను సమకూరుస్తోంది. ఇప్పటివరకు జగనన్న విద్యా కానుక కింద రూ.3,366.53 కోట్లను వ్యయం చేయగా వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే విద్యా కానుక నిధులను సిద్ధం చేస్తూ రూ.1,042.51 కోట్లకు పరిపాలన అనుమతి మంజూరు చేసింది.

- వచ్చే నెలలో టెన్త్ పరీక్షలు రాయనున్న మొత్తం విద్యార్థులు 6.23 లక్షల మంది ఉండగా ఏకంగా 4.51 లక్షల మందికిపైగా ఇంగ్లిషు మీడియంలోనే పరీక్షలు రాయనుండటం గమనార్హం. వీరిలో ప్రభుత్వ స్కూళ్లు, సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న వారు ఏకంగా 3.97 లక్షల మంది ఉన్నారు. ప్రైవేట్, అన్ ఎయిడెడ్ స్కూళ్లలో చదువుతున్న వారి సంఖ్య 2.25 లక్షల వరకు ఉంది. ఇంగ్లిషు మీడియంలో పరీక్షలు రాసే విద్యార్థుల సంఖ్య త్వరలోనే వంద శాతానికి చేరుతుందని విద్యావేత్తలు, నిపుణులు పేర్కొంటున్నారు. ప్రభుత్వం ప్రాథమిక స్థాయి నుంచే విద్యార్థుల ఆంగ్ల నైపుణ్యాలకు పదును పెడుతూ టోఫెల్ శిక్షణ సైతం అందుబాటులోకి తెచ్చిందని ఉదహరిస్తున్నారు.

మార్చిలో టెన్త్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇలా..

స్కూలు పేరు	విద్యార్థులు
జిల్లా పరిషత్	2,62,017
ప్రభుత్వ	24,429
మున్సిపల్	33,601
ఏపీ మోడల్ స్కూల్స్	13,396
ఏపీ రెసిడెన్షియల్	3,306
బీసీ సంక్షేమ రెసిడెన్షియల్	5,360
సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్	13,779
గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్	5,793
ఆశ్రమ స్కూల్స్	10,916
కేజీబీవీ	13,094
ప్రభుత్వ ఎయిడెడ్	12,099
ప్రైవేట్ అన్ ఎయిడెడ్	2,25,302
మొత్తం	6,23,092



వీడియో పాఠాలు చూస్తున్న విద్యార్థులు

- చంద్రబాబు హయాంతో పోలిస్తే ఐదేళ్లలో పరిస్థితి తిరగబడింది. సీఎం జగన్ ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టడంతో వచ్చే నెలలో పదో తరగతి పరీక్షలు ఆంగ్ల మాధ్యమంలో రాయనున్న విద్యార్థులు 72.54 శాతానికి పెరిగారు. ఈసారి తెలుగు మీడియంలో టెన్త్ పరీక్షలు రాసే విద్యార్థులు 26.74 శాతం మంది మాత్రమే ఉన్నారు. మిగతా అతి స్వల్ప శాతం విద్యార్థులు ఉర్దూ, కన్నడ, తమిళం, ఒడియా భాషల్లో చదువుతున్న వారున్నారు.
- టీడీపీ హయాంలో ఇంగ్లిషు మీడియంలో పదో తరగతి పరీక్షలు రాసిన విద్యార్థుల సంఖ్య 2.88 లక్షలు కాగా ఇప్పుడు ఏకంగా 4.51 లక్షలకు పెరిగింది. గత సర్కారు హయాం కంటే ఇప్పుడు ఇంగ్లిషు మీడియంలో పరీక్షలు రాసే వారి సంఖ్య 1.63 లక్షలు పెరగడం గమనార్హం. వీరంతా ప్రభుత్వ స్కూళ్లలో ఇంగ్లిషు మీడియంలో చదివిన విద్యార్థులే కావడం మరో విశేషం.

పరీక్షలపై సీఎస్ సమీక్ష

వచ్చే నెలలో జరిగే పదో తరగతి పబ్లిక్ పరీక్షలను కట్టుదిట్టంగా నిర్వహించేలా జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి అధికార యంత్రాంగాన్ని ఆదేశించారు. పరీక్షా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు, ఇతర భద్రతా చర్యలు చేపట్టాలని సూచించారు. కలెక్టర్లు పరీక్షా కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను సమీక్షించాలని ఆదేశించారు. మంచినీటి సౌకర్యంతో పాటు బాలురు, బాలికలకు వేర్వేరుగా టాయిలెట్ సౌకర్యాలుండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మొబైల్ పోలీస్ స్క్వాడ్లను నియమించాలని ఎస్పీలను ఆదేశించారు.

కోరిక నెరవేరింది



మా ఊరి ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి వరకు తెలుగు మీడియంలో చదివా. ఇంగ్లిష్ మీడియంలో చదవాలన్నది నా చిన్ననాటి కోరిక. పేదరికం కారణంగా నా ఆశ నెరవేరదేమో అనుకున్నా. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక మా పాఠశాలలో ఇంగ్లిష్ మీడియం ప్రవేశపెట్టడంతో నా కోరిక నెరవేరింది. ఇప్పుడు ఇంగ్లిషు మీడియంలో ఆరో తరగతి చదువుతున్నా. జగన్ మామకు మేమంతా రుణపడి ఉంటాం. మా అమ్మ చిలకమ్మ నన్ను కాన్వెంట్‌లో ఇంగ్లిషు మీడియంలో చదివించాలని బలంగా కోరుకునేది. ప్రభుత్వ స్కూళ్లలో జగనన్న ఇంగ్లిషు మీడియం ప్రవేశపెట్టడంతో మా అమ్మ కోరిక నెరవేరింది.

– సామాబత్తుల లక్ష్మి, కాకినాడ జిల్లా, సంపర ప్రాథమిక పాఠశాల

మా అదృష్టం..



కళ్యాణదుర్గంలోని కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్నా. ప్రభుత్వ పాఠశాలలో ఇంగ్లిష్ మీడియంలో చదువులు చెప్పడం మా అదృష్టం. భవిష్యత్తులో ఉన్నత చదువులు చదవడానికి, మంచి ఉద్యోగాల్లో స్థిరపడటానికి ఇంగ్లిష్ మీడియం పునాదిగా ఉపయోగపడుతుంది. మా తల్లిదండ్రులు నాగరాజు, పద్మావతి బేల్దారి పనులకు వెళ్తూ కుటుంబాన్ని పోషిస్తున్నారు. మాలాంటి పేదలకు ఇంగ్లిష్ మీడియం అందించిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం.

– తలారి శ్వేత, అనంతపురం జిల్లా, కళ్యాణదుర్గం

ఆపన్నులకు ప్రభుత్వం ఆర్థిక సాయం

- సీఎం వైఎస్ జగన్ ఆదేశాలతో 24 గంటల్లోపే చెక్కులు
- ఆరుగురికి రూ.లక్ష చొప్పున సాయం
- మరో ఆరుగురికి రూ.9.90 లక్షలు
- అందజేసిన గుంటూరు జిల్లా కలెక్టర్



బాధితులకు చెక్కులు అందజేస్తున్న కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి, ఎమ్మెల్యే సుచరిత తదితరులు

గుంటూరు వెస్ట్: ఆపన్నుల పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మరోసారి తన ఔదార్యం చాటుకున్నారు. గుంటూరు జిల్లా ఫిరంగిపురం మండలం రేపూడిలో గురువారం జరిగిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో కొందరు బాధితులు ముఖ్యమంత్రికి తమ బాధలను చెప్పుకున్నారు. దీంతో వారిలో ఆరుగురికి రూ.లక్ష చొప్పున ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్ జిల్లా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డిని ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆర్థిక సాయానికి సంబంధించిన చెక్కులను శనివారం గుంటూరు కలెక్టరేట్‌లో జేసీ జి.రాజకుమారితో కలిసి కలెక్టర్ బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ బాధితులకు ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు కేవలం 24 గంటల్లోపే చెక్కులను అందజేశామన్నారు. అలాగే వారికి కావాల్సిన వైద్య సేవలు కూడా అందిస్తామని తెలిపారు. పేదల కోసం నిరంతరం పనిచేస్తున్న ప్రభుత్వంలో ప్రజలకు ఏ అవసరమొచ్చినా తక్షణ సాయం లభిస్తుందన్నారు. అలాగే తాడికొండ నియోజకవర్గ పరిధిలో ఆరుగురు తమ చికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నారు. వీరికి మొత్తం రూ.9.90 లక్షలు మంజూరు చేస్తూ సీఎంవో కార్యాలయం చెక్కులు పంపింది. ఈ చెక్కులను కూడా ప్రత్తిపాడు ఎమ్మెల్యే సుచరిత, కలెక్టర్, జేసీలు అందజేశారు. మట్టుకొయ్య కోటేశ్వరరావుకు రూ.60 వేలు, నిలకుదిటి రఘుపతమ్మకు రూ.40 వేలు, మర్రి వెంకటేశ్వరరావుకు రూ.3 లక్షలు, ఇట్ల కుసుమసాయికి రూ.1.60 లక్షలు, అజ్మీర్ దివ్యకు రూ.4.30 లక్షల చొప్పున మొత్తం రూ.9.90 లక్షల విలువైన చెక్కులను అందించారు. ఈ సందర్భంగా బాధితులు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు తెలిపారు.

ఆర్థిక సైబర్ నేరాలకు చెక్

- బ్యాంకులకు ప్రత్యేక సిరీస్ ఫోన్ నంబర్లు
- 140+ నంబర్‌తో కేటాయించేందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం
- గత ఏడాది సైబర్ మోసాలకు పాల్పడిన ఫోన్ నంబర్లు భారీగా గుర్తింపు
- 1.40 లక్షల నంబర్లను బ్లాక్ చేసిన సైబర్ పోలీసులు

సాక్షి, అమరావతి :'బ్యాంకు నుంచి మాట్లాడుతున్నాం. మీ ఆధార్ కార్డ్ అప్‌డేట్ చేసుకోవాలి. మీ మొబైల్ ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. అది చెప్పండి' ఇటీవల కాలంలో మితిమీరి పెరుగుతున్న కాల్స్ ఇవీ. ఆ ఫోన్ కాల్ బ్యాంకు నుంచో లేదా ఏదైనా ఆర్థిక సంస్థ నుంచే వచ్చిందని నమ్మి ఓటీపీ చెబితే.. బ్యాంకు ఖాతాలో ఉన్న సొమ్మంతా కొల్లగొడుతున్నారు. ఇలాంటి సైబర్ మోసాలకు చెక్ పెట్టే దిశగా కేంద్ర హోం మంత్రిత్వ శాఖ ఉపక్రమించింది. బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థల పేరుతో మితిమీరుతున్న సైబర్ మోసాలకు అడ్డుకట్ట వేసేందుకు కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తోంది. ఈ మేరకు కేంద్ర హోం మంత్రిత్వ, ఆర్థిక మంత్రిత్వ శాఖలు ఇటీవల బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలతో సమావేశం నిర్వహించి కార్యాచరణ ప్రణాళికపై చర్చించాయి. కేంద్ర హోం శాఖ ఆధ్వర్యంలోని 'ఇండియన్ సైబర్ క్రైమ్ కో–ఆర్డినేషన్ సెంటర్' నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఈ కార్యాచరణ ప్రణాళిక రూపొందించారు.

ప్రత్యేక సిరీస్‌తో నంబర్ల కేటాయింపు

బ్యాంకులు, ఇతర ఆర్థిక సంస్థలు తమ వినియోగదారులకు కాల్ చేసే నంబర్లకు ప్రత్యేక సిరీస్ కేటాయించాలని నిర్ణయించారు. ప్రస్తుతం సాధారణ టెలికాం సంస్థలు వినియోగదారులకు కేటాయిస్తున్న 10 అంకెల సిరీస్ నంబర్లనే బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు కూడా కేటాయిస్తున్నారు. దీన్ని సైబర్ నేరగాళ్లు అవకాశంగా మలుచుకుని బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి బురిడీ కొట్టిస్తున్నారు. 2023లో అటువంటి మోసాలకు పాల్పడ్డ 1.40 లక్షల ఫోన్ నంబర్లను



సైబర్ పోలీసులు గుర్తించి వాటిని బ్లాక్ చేశారు. అంటే ఈ తరహా మోసాల తీవ్రత ఎంత ఎక్కువగా ఉందో తెలుస్తోంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి కాల్ చేస్తున్నామని చెప్పి ఆధార్ కార్డ్ అప్‌డేట్ లేదా పాన్ నంబర్ లింక్ చేయాలనో.. ఫోన్ నంబర్ అప్‌డేట్ చేయాలనో రకరకాల పేరుతో బురిడీ కొట్టించేందుకు యత్నిస్తున్నారు. అవగాహనలేకో పొరపాటులో ఓటీపీ నంబర్ చెబితే నగదు కాజేస్తున్నారు. దీనికి పరిష్కారంగా ఇక నుంచి బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు సాధారణ టెలికాం వినియోగదారులకు కేటాయించే సెల్‌ఫోన్ నంబర్ సిరీస్ కేటాయించకూడదని హోం శాఖ తెలిపింది. టెలికాం రెగ్యులేటరీ ఆథారిటీ (ట్రాయ్) గతంలోనే సూచించిన విధంగా బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు ప్రత్యేకంగా నంబర్ సిరీస్ (140+...)తో ఫోన్ నంబర్లు కేటాయిస్తారు. కాబట్టి ఆ సిరీస్ నంబర్ల నుంచి కాల్ వస్తేనే బ్యాంకులు, ఆర్థిక సంస్థలు చేసినట్టుగా భావించాలి. సాధారణ ఫోన్ నంబర్ల సిరీస్ నుంచి కాల్‌చేసి తాము బ్యాంకులు, ఆర్థిక సంస్థల నుంచి చేస్తున్నామని చెబితే.. వినియోగదారులు వెంటనే అప్రమత్తమవుతారు. సైబర్ నేరాల ముఠాల పనేనని గుర్తించి ఆ ఫోన్ కాల్స్‌కు స్పందించకుండా జాగ్రత్త పడతారు.

మోసపోయిన సొమ్ము తిరిగి ఇప్పించేలా..

సైబర్ నేరాల్లో బాధితులు కోల్పోయిన మొత్తాన్ని నిర్ణీత వ్యవధిలోనే తిరిగి ఇప్పించే ప్రక్రియను కూడా కేంద్ర హోం, ఆర్థిక శాఖలు సంయుక్తంగా చేపట్టాయి. ఈ మేరకు బ్యాంకులు, ఆర్థిక సంస్థలకు స్పష్టమైన మార్గదర్శకాలను జారీ చేశాయి. బాధితుల ఫిర్యాదుపై కేసు నమోదు చేసి.. మోసానికి పాల్పడిన వారి బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయడం, ఆ ఖాతాల్లో ఉన్న మొత్తం నుంచి బాధితుల సొమ్మును వారి ఖాతాలకు మళ్లించడం అనే ప్రక్రియకు నిర్ణీత గడువును నిర్దేశించాలన్నారు. బాధితులు పదేపదే పోలీస్ స్టేషన్లు, బ్యాంకుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా వారు కోల్పోయిన మొత్తాన్ని తిరిగి ఇప్పించనున్నారు. బ్యాంకులు నిర్ణీత ఫార్మాట్‌లో సైబర్ పోలీసులకు సమర్పించాల్సిన సమాచారం నమూనాను రూపొందించారు.

అమరావతి భూ కుంభకోణంపై బాబు చర్చకు రావాలి

వైఎస్సార్‌సీపీ ఎంపీ నందిగం సురేష్



సాక్షి, అమరావతి: రాజధాని పేరిట భూములు ఇవ్వని రైతులపై దౌర్జన్యాలు చేయడమే కాకుండా, అప్పట్లో పంట పొలాల్ని కూడా తగులబెట్టించిన దగుల్బాజీ చంద్రబాబే అని వైఎస్సార్‌సీపీ ఎంపీ నందిగం సురేష్ ధ్వజమెత్తారు. టీడీపీకి చెందిన ప్రత్తిపాటి పుల్లారావు, తెనాలి శ్రావణ్‌కుమార్ కలిసి ఆనాడు పోలీసుల చేత పొలాలకు నిప్పు పెట్టించింది నిజం కాదా అని ప్రశ్నించారు. అమరావతి భూముల కుంభకోణంపై తనతో చర్చకొచ్చే దమ్ము చంద్రబాబుకు ఉందా అని సవాల్ చేశారు. సురేష్ శనివారం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడుతూ.. చంద్రబాబు ఓ డర్టీ పొలిటీషియన్ అని, వయసు పెరిగేకొద్దీ వింత వ్యాధిగ్రస్తుడిలా మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. నోరు అదుపులో పెట్టుకోవాలని, తండ్రీ కొడుకుల్ని మడతేసేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. అమరావతిని కుల రాజధానిగా మార్చింది బాబేనని చెప్పారు. తాను అమరావతి పంట పొలాలను తగులపెట్టించానని అంటున్న చంద్రబాబు.. ఎస్సీలపై నిందలేయడం మానేసి, నార్కో టెస్టుకు సిద్ధమా అని ప్రశ్నించారు. పర్చూరులో బాబు మాట్లాడిన మాటలు చాలా జుగుప్సాకరంగా ఉన్నాయని చెప్పారు. టీడీపీ అంత శక్తివంతమైనదైతే సొంతంగా పోటీ చేయకుండా పవన్ కళ్యాణ్ కాళ్లు పట్టుకుని ఎందుకు వేలాడుతున్నావని నిలదీశారు. రాజకీయంగా శక్తిసామర్థ్యాలు సన్నగిల్లిపోయాయని బాబు ఒప్పుకోవాలని అన్నారు. బాపట్ల ఎంపీగా తానేమీ చేయలేదంటున్న బాబు.. దమ్ముంటే తనపై ఎంపీగా పోటీ చేయాలని, ఓడించకపోతే తాను రాజకీయాల్నుంచి తప్పుకుంటానన్నారు. రోగాల పేరు చెప్పి, పదిమంది ష్యూరిటీ ఉండి, వందమంది లాయర్లు కోర్టుల చుట్టూ పరిగెత్తితే గానీ జైలు నుంచి బయట పడలేకపోయాడని ఎద్దేవా చేశారు. అనేక కుంభకోణాల్లో రూ. లక్షల కోట్లు మింగిన దొంగ చంద్రబాబు అని అన్నారు. విశాఖ, ఏలూరు సిద్ధం సభలను చూసి చంద్రబాబు వణికిపోయారని, రేపు రాప్తాడు సిద్ధం సభలో సీఎం జగన్ కి అందే ప్రజాదరణ చూసింతర్వాత బాబు గుండె ఆగుతుందేమో ఆలోచించుకోవాలని అన్నారు.

'సున్నావడ్డీ' నడ్డి విరిచింది మీ బాబే..

రైతుల 'రాయితీ'పై రామోజీ వికృత రాతలు

- నాడు వడ్డీ క్లెయిమ్‌లు బ్యాంకు ఖాతాలకు చెల్లిస్తే వాటిని రైతుల అప్పులకు సర్దుబాటు చేసుకునే వారు
- నేడు ఏటా క్రమం తప్పకుండా నేరుగా రైతుల ఖాతాలకు జమచేస్తున్న ప్రభుత్వం
- గతంలో లబ్ధిదారులెంతమందో? ఎవరికి ఎంత జమైందో తెలిసేదే కాదు
- నేడు సామాజిక తనిఖీ కోసం పారదర్శకంగా ఆర్బీకేల్లో లబ్ధిదారుల జాబితాలు
- వాస్తవాలు తెలుసుకోకుండా విషం కక్కుతున్న ఈనాడు

ఫ్యాక్ట్ చెక్

సాక్షి, అమరావతి : వైఎస్సార్ సున్నా వడ్డీ రాయితీ పథకంపై ఈనాడు మరోసారి విషం కక్కింది. రైతులను గందరగోళపర్చేలా.. వాస్తవాలకు ముసుగేసి ప్రభుత్వంపై బురద జల్లడమే పనిగా పెట్టుకుంది. చిన్న, సన్నకారు, వాస్తవ సాగుదారులు సాగుకోసం తీసుకునే పంట రుణాలపై వడ్డీ భారాన్ని తగ్గించడం ద్వారా వారిలో ఆర్థిక క్రమశిక్షణ తీసుకురావడమే లక్ష్యంగా అమలుచేస్తున్న వైఎస్సార్ సున్నా వడ్డీ పంట రుణాల పథకంపై తన అక్కసును వెళ్లగక్కింది. 'పావలా తీసేసి.. సున్నా చుట్టేశారు'.. అంటూ అబద్ధాలను అచ్చేసింది. ఈ అవాస్తవ కథనంపై 'ఫ్యాక్ట్‌చెక్' ఏమిటంటే..

ఆరోపణ : గతంలో తక్షణమే ప్రయోజనం..

వాస్తవం : సీజన్‌లో ప్రతీ రైతు వ్యవసాయ అవసరాల కోసం బ్యాంకుల నుంచి పంట రుణాలు తీసుకునేవారు. రూ.లక్షలోపు రుణాన్ని తిరిగి చెల్లిస్తే బ్యాంకులు వసూలుచేసే ఏడు శాతం వడ్డీలో మూడుశాతం కేంద్రం రాయితీ ఇస్తోంది. మిగిలిన నాలుగు శాతం రైతులు భరించేవారు. గతంలో 'వడ్డీలేని రుణ పథకం' కింద రైతులు చెల్లించిన వడ్డీ రాయితీని బడ్జెట్ కేటాయింపులను బట్టి ఏడాదికో.. రెండేళ్లకో బ్యాంకులకు జమ చేసేవారు. ఈ మొత్తాన్ని బ్యాంకులు రైతులు చెల్లించాల్సిన అప్పు ఖాతాలకు సర్దుబాటు చేసుకునే వారు. గతంలో క్లెయిమ్స్ డేటాను అప్‌లోడ్ చేయడానికి నోడల్ బ్రాంచ్‌లకు మాత్రమే యాక్సెస్ ఉండేది. బ్రాంచ్‌లకు ఉండేది కాదు. ఎంతమంది అర్హత పొందారు.. వారికెంత వడ్డీ రాయితీ



జమైందో రైతులకే కాదు.. బ్యాంకులకు కూడా తెలిసేది కాదు. బ్యాంకుల వద్ద కానీ, ప్రభుత్వ కార్యాలయాల వద్ద కానీ ప్రదర్శించే పరిస్థితులు ఉండేవి కాదు.

ఆరోపణ : సవాలక్ష నిబంధనలు?

వాస్తవం : వడ్డీలేని రుణ పథకానికి మరింత మెరుగులు దిద్ది ఖరీఫ్-2019 నుంచి 'వైఎస్సార్ సున్నా వడ్డీ పథకాన్ని' అమలుచేస్తున్నారు. వడ్డీ రాయితీ చెల్లింపుల్లో జాప్యానికి తావులేకుండా ఉండేందుకు ఏడాదిలోపు రుణం చెల్లించిన లబ్ధిదారుల డేటా బ్యాంకుల ద్వారా ఎస్వీపీఆర్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ డేటా ఈ-క్రాప్ డేటాతో ధ్రువీకరించిన తర్వాత అర్హులైన రైతుల జాబితాను గుర్తించి సామాజిక తనిఖీ కోసం ఆర్బీకేల్లో ప్రదర్శిస్తున్నారు. మొబైల్ ద్వారా https://karshak.ap.gov.in/ysrsvpr/ వెబ్‌సైట్‌లోకి వెళ్లి హోంపేజీ లో 'ఇఖారీ దౌటు ట్టుటు' అనే విండో ఓపెన్ చేసి ఆధార్ నంబరుతో చెక్ చేసుకునే వెసులుబాటు రైతులకు కల్పించారు. ఒకవేళ వడ్డీ రాయితీకి అర్హత పొంది, జాబితాలో తమ పేర్లు లేకపోతే దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారు. ఇంతకంటే పారదర్శకత ఏముంటుంది?

ఆరోపణ : కేవలం 12.3 శాతం మందికే వర్తింపు..

వాస్తవం : ఏటా 65 లక్షల మంది రుణాలు తీసుకుంటారు. వీరిలో ఏడాదిలోపు రుణాలు తీసుకునే వారికి ఏటా రూ.3వేల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.15వేల కోట్ల వడ్డీ రాయితీ చెల్లించాలి కదా అంటూ ఈనాడు కొత్త వాదన తెరపైకి తీసుకొచ్చింది. చంద్రబాబు హయాంలో రైతులు పొందిన రుణాలను బట్టి ఏటా రూ.2,500 కోట్ల చొప్పున కనీసం 12వేల కోట్లకు పైగా వడ్డీరాయితీ చెల్లించాలి కదా. కానీ, టీడీపీ ఐదేళ్లలో వడ్డీ రాయితీ చెల్లించింది ఎంతో తెలుసా అక్షరాలా 40.61 లక్షల మందికి కేవలం రూ.685.46 కోట్లు మాత్రమే. చెల్లించిన మొత్తం కంటే ఎగ్గొట్టిన బకాయిలే అధికం. ఏకంగా 39.08 లక్షల మందికి రూ.1,180.66 కోట్లు ఎగ్గొట్టిన ఘనత చంద్రబాబుదే. పోనీ ఐదేళ్ల పాలనలో ఇంత తక్కువ వడ్డీ రాయితీ ఎందుకు చెల్లించావని కానీ, బకాయిలు ఎందుకు ఎగ్గొట్టావ్ బాబు అని కానీ ఏనాడు రామోజీ సింగిల్ కాలమ్ వార్త రాసిన పాపాన పోలేదు కదా..

ఆరోపణ : అరకొరగా పథకం అమలు..

వాస్తవం : చంద్రబాబు ఎగ్గొట్టిన రూ.1,180.66 కోట్ల చెల్లింపునకు ముందుకొచ్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పగ్గాలు చేపట్టిన వెంటనే అణాపైసలతో సహా బకాయిలు చెల్లించి రైతులపట్ల తనకున్న చిత్తశుద్ధిని చాటుకున్నారు. ఇక 57 నెలల్లో బాబు ఎగ్గొట్టిన బకాయిలతో సహా 73.88 లక్షల మంది రైతులకు ఏకంగా రూ.1,834.55 కోట్లు వడ్డీ రాయితీ సొమ్మును జమచేసింది. రబీ 2021-22, ఖరీఫ్ 2022 సీజన్లకు సంబంధించి అర్హత పొందిన 10.79 లక్షల మంది రైతులకు రూ.220 కోట్ల సున్నా వడ్డీ రాయితీ మొత్తాన్ని త్వరలో వారి ఖాతాలకు జమచేసేందుకు ప్రభుత్వం ఏర్పాట్లుచేస్తోంది. బాబు హయాంలో సగటున ఏటా రూ.137 కోట్ల వడ్డీరాయితీ చెల్లిస్తే ఈ ప్రభుత్వం త్వరలో చెల్లించబోయే మొత్తంతో కలుపుకుంటే సగటున రూ.421 కోట్లు చెల్లించినట్లవుతుంది. ఎవరి హయాంలో వడ్డీ రాయితీ ఎక్కువగా చెల్లించారో ఇంతకంటే ఏం చెప్పాలి. నిజంగా అరకొరగా అమలుచేయాలని ఆలోచన చేస్తే బాబు ఎగ్గొట్టిన బకాయిలు చెల్లించాల్సిన అవసరమేముందో రామోజీకే తెలియాలి.

ఆరోపణ : అంతంతమాత్రంగానే పంట రుణాలు..

వాస్తవం : బాబు ఐదేళ్ల పాలనలో 3.97 కోట్ల మందికి రూ.3.64 లక్షల కోట్ల రుణాలు అందిస్తే.. ఈ ప్రభుత్వ హయాంలో గడిచిన 57 నెలల్లో ఏకంగా 5.17 కోట్ల మంది రైతులకు రూ.8.59 లక్షల కోట్ల పంట రుణాలు అందించారు. పంట సాగుదారు హక్కు పత్రాల (సీసీఆర్సీ) ద్వారా ఇప్పటివరకు 14.13 లక్షల కౌలు రైతులకు రూ.8,346 కోట్ల వ్యవసాయ రుణాలు అందించారు. ప్రస్తుత 2023-24 సీజన్‌లో రికార్డుస్థాయిలో 8.31 లక్షల కౌలు రైతులకు సీసీఆర్సీలు జారీచేయగా, ఇప్పటికే వారిలో 5.48 లక్షల మందికి రూ1,907.8 కోట్ల వ్యవసాయ రుణాలు అందించారు. బాబు ఎగ్గొట్టిన బకాయిలు చెల్లించడమే కాదు.. రుణాల మంజూరులో కానీ, సున్నా వడ్డీ రాయితీ చెల్లింపుల్లో కానీ రైతు సంక్షేమమే పరమావధిగా ముందుకెళ్తుంటే ఈనాడు మాత్రం బురదజల్లడమే పనిగా పెట్టుకుంది.

టీడీపీ ఐదేళ్లలో వడ్డీలేని పంట రుణాల పథకం కింద చెల్లించిన క్లెయిమ్‌ల వివరాలు.. (రూ.కోట్లలో)

సంవత్సరం	రైతులు	వడ్డీ రాయితీ
2014-15	80,558	3.87
2015-16	2,42,344	31.10
2016-17	21,02,228	252.65
2017-18	13,81,952	293.64
2018-19	2,53,675	104.20
మొత్తం	40,60,757	685.46

బాబు ఎగ్గొట్టిన బకాయిలతో సహా 57 నెలల్లో రాష్ట్ర ప్రభుత్వం చెల్లించిన వడ్డీ రాయితీ వివరాలు..

సంవత్సరం-సీజన్	రైతులు (లక్షల్లో)	వడ్డీ రాయితీ (రూ. కోట్లలో)
2019-20 (పాత బకాయిలు)	64,431	96.43
2020-21 (పాత బకాయిలు)	38,42,094	1084.23
2020-21 (ఖరీఫ్-2019)	14,26,994	285.62
2021-22 (రబీ 2019-20, ఖరీఫ్-2020)	12,31,672	207.72
2022-23 (రబీ 2020-21, ఖరీఫ్-2021)	8,22,411	160.55
మొత్తం	73,87,602	1,834.55

ఇంటింటా కంటి వెలుగు

- వైఎస్సార్ కంటివెలుగు, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాల ద్వారా కంటి సమస్యల పరిష్కారం
- రాష్ట్రంలో ఏకంగా 1.24 కోట్ల మందికి కంటి పరీక్షలు
- 20.47 లక్షల మందికి ఉచితంగా కళ్లద్దాలు
- 2.44 లక్షల మందికి ఇప్పటి వరకు కేటరాక్ట్ సర్జరీలు

సాక్షి, అమరావతి: ప్రజల ఆరోగ్య పరిరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోంది. కంటి సమస్యల నివారణే లక్ష్యంగా వైఎస్సార్ కంటి వెలుగు, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను అమలు చేస్తోంది. రాష్ట్రంలో 5 కోట్ల మంది ఉండగా.. వీరిలో 1,24,71,561 (24 శాతానికి పైగా) ప్రజలకు కంటి వైద్య పరీక్షలు చేయించింది. చూపు సంబంధిత సమస్యలు గుర్తించి, వారికి అవసరమైన వైద్యాన్ని ఉచితంగా ప్రభుత్వమే చేయిస్తోంది. రాష్ట్రంలో కంటిచూపు సంబంధిత సమస్యల నివారణే లక్ష్యంగా 'వైఎస్సార్ కంటి వెలుగు' కార్యక్రమాన్ని 2019లో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమం కింద తొలి రెండు విడతల్లో 60,393 పాఠశాలల్లో 66,17,613 విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. దృష్టి సమస్యలున్న 1,85,227 మంది విద్యార్థులకు ఉచితంగా ప్రభుత్వం కళ్లద్దాలు పంపిణీ చేయడంతోపాటు.. 310 మందికి కేటరాక్ట్ సర్జరీలు చేయించింది. 60 ఏళ్ల పైబడిన అవ్వాతాతల్లో కంటి సమస్యల నివారణ కోసం మూడో దశ కార్యక్రమాన్ని 2021లో మొదలుపెట్టారు. ఈ కార్యక్రమంలో భాగంగా 47.57 లక్షల మంది వృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి.. 46.22 లక్షల మందిలో కంటి సమస్యలు గుర్తించారు. మం



దులతో నయమయ్యే సమస్యలున్న 32.15 లక్షల మందికి ప్రభుత్వమే ఉచితంగా మందులు అందించింది. మరో 12.40 లక్షల మందికి ఉచితంగా కళ్లద్దాలు పంపిణీ చేయడంతోపాటు, 1.66 లక్షల మందికి కేటరాక్ట్ ఆపరేషన్లు చేయించింది.

అన్నివర్గాల వారికీ వర్తింపు

రాష్ట్రంలో ప్రతి ఒక్కరి ఆరోగ్య సమస్యలు గుర్తించి వాటిని పరిష్కరించడమే లక్ష్యంగా ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోంది. గ్రామ, వార్డు స్థాయిల్లో నిర్వహిస్తున్న సురక్ష వైద్య శిబిరాల్లో వైద్య పరీక్షలు చేయిస్తున్నారు. ఈ క్రమంలో చూపు సంబంధిత సమస్యలతో బాధపడుతున్న అన్నివర్గాల ప్రజలకు కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఇలా రెండు దశల్లో ఇప్పటివరకూ 10.96 లక్షల మందికి వైద్య శాఖ పరీక్షలు చేయించింది. 3.27 లక్షల మందిలో మందులతో నయమయ్యే సమస్యలు గుర్తించి అక్కడికక్కడే మందులు అందజేశారు. మరో 6,22,057 మందికి కళ్లద్దాలు అందజేసి.. 77,531 మందికి కేటరాక్ట్ ఆపరేషన్లను ప్రభుత్వమే చేయించింది. మొత్తంగా ఇప్పటివరకూ 2.44 లక్షల మందికి కేటరాక్ట్ సర్జరీలు, 20.20 లక్షల మందికి కళ్లద్దాలను ప్రభుత్వం అందించింది.

ఆర్థిక భారం పడకుండా..

ప్రైవేట్ క్లినిక్‌లలో కంటి వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే రూ.500 వరకూ ఖర్చవుతోంది. వీటికి కళ్లద్దాల ఖర్చు అదనం. శుక్లాల సమస్య ఉండి కేటరాక్ట్ సర్జరీ చేయాలంటే రూ.10 వేలు, అంతకు మించి ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. అంతమొత్తం వెచ్చించలేక కూలీలు, రైతులు, నిరుపేదలు చూపు సంబంధిత సమస్యలను నిర్లక్ష్యం చేస్తుంటారు. ఇలాంటి పరిస్థితుల్లో వైఎస్సార్ కంటివెలుగు, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలను ప్రభుత్వం అమలు చేయడం వారందరికీ వరంగా మారింది. గ్రామాల్లోనే ప్రత్యేకంగా క్యాంపులు నిర్వహించడంతోపాటు ఉచితంగా కళ్లద్దాలు, మందులు అందిస్తుండటంతో వారికి ప్రయాసలు తప్పాయి. మరోవైపు కేటరాక్ట్ సర్జరీలు అవసరం గల వారికి ఆస్పత్రులకు వెళ్లిరావడానికి రవాణా సదుపాయాన్ని కూడా ప్రభుత్వం కల్పిస్తోంది.

గుంటూరు-గుంతకల్లు మార్గంలో పలు రైళ్ల రద్దు



తిరుపతి(అలిపిరి): రైల్వే లైను డబ్లింగ్ పనుల కారణంగా గుంటూరు-గుంతకల్లు మార్గంలో దొనకొండ మీదుగా ప్రయాణించే పలు రైళ్లను శనివారం నుంచి తాత్కాలికంగా రద్దు చేసినట్లు రైల్వే డైరెక్టర్ సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. హుబ్లీ-విజయవాడ(17329) రైలు ఈ నెల 17 నుంచి 28 వరకు, విజయవాడ-హుబ్లీ(17330) రైలు ఈ నెల 18 నుంచి 29 వరకు, గుంటూరు-సికింద్రాబాద్(17253) రైలు ఈ నెల 18 నుంచి 29 వరకు, సికింద్రాబాద్-గుంటూరు(17254) రైలు ఈ నెల 18 నుంచి 29 వరకు, గుంటూరు-తిరుపతి(17261) రైలు ఈ నెల 17 నుంచి 28 వరకు, తిరుపతి-గుంటూరు(17262) రైలు ఈ నెల 18 నుంచి 29 వరకు రద్దు చేసినట్లు వెల్లడించారు. గుంటూరు-కాచిగూడ(17251) రైలు ఈ నెల 17 నుంచి 28 వరకు, కాచిగూడ-గుంటూరు(17252) రైలు ఈ నెల 18 నుంచి 29 వరకు, గుంటూరు-డోన్(17228) రైలు ఈ నెల 26 నుంచి మార్చి 31 వరకు, డోన్-గుంటూరు (17227) రైలు ఈ నెల 27 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు తాత్కాలికంగా రద్దు చేసినట్లు వివరించారు.

నవ చరిత్రకు రాప్తాడు 'సిద్ధం'

నేడు వైఎస్సార్‌సీపీ ఎన్నికల సన్నాహక మూడో సభ

- 250 ఎకరాలకుపైగా విస్తీర్ణంలో ఘనంగా ఏర్పాట్లు
- రాయలసీమలో 52 నియోజకవర్గాల నుంచి తరలివెళ్లనున్న పార్టీ శ్రేణులు
- కురుక్షేత్ర యుద్ధానికి భీమిలి వేదికగా శంఖం పూరించిన సీఎం వైఎస్ జగన్
- సముద్రంతో పోటీ పడుతూ పోటెత్తిన ఉత్తరాంధ్ర ప్రజానీకం
- ఏలూరు సభకు ఉత్తర కోస్తా నుంచి కదలిలా కదలివచ్చిన జనసంద్రం
- నేటి సభలో పార్టీ 'సీమ' నేతలు, కార్యకర్తలకు సీఎం దిశా నిర్దేశం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి. చిత్రంలో పార్టీ నేతలు

సాక్షి, అమరావతి/రాప్తాడు/అనంతపురం ఎడ్యుకేషన్ : ఎన్నికల కురుక్షేత్ర యుద్ధానికి గత నెల 27న భీమిలి వేదికగా శంఖం పూరించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా క్షేత్రంలో దూసుకుపోతున్నారు. ఓ వైపు ప్రజాబలమే గీటు రాయిగా, సామాజిక న్యాయమే పరమావధిగా శాసన సభ, లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తల నియామకంపై కసరత్తు చేస్తూనే.. మరో వైపు 175కు 175 శాసనసభ, 25కు 25 లోక్‌సభ స్థానాల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులను సన్నద్ధం చేస్తున్నారు. ఇప్పటికే 65 శాసనసభ, 16 లోక్‌సభ స్థానాలకు సమన్వయకర్తలను నియమించిన సీఎం జగన్.. పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడానికి ఉత్తరాంధ్ర ప్రాంతానికి సంబంధించి భీమిలిలో గత నెల 27న, ఉత్తర కోస్తా ప్రాంతానికి సంబంధించి ఈనెల 3న ఏలూరులో 'సిద్ధం' పేరుతో సభలు నిర్వహించారు. భీమిలి సభకు సముద్రపు కెరటాలతో పోటీపడుతూ ఉత్తరాంధ్ర ప్రజానీకం పోటెత్తితే.. ఏలూరు సభకు ఉత్తర కోస్తా ప్రజలు కదలిలా కదలివచ్చారు. పార్టీ శ్రేణులను ఎన్నికలకు సన్నద్ధం చేయడంలో భాగంగా మూడో సభను ఆదివారం అనంతపురానికి సమీపంలో రాప్తాడు వద్ద నిర్వహిస్తున్నారు. రాయలసీమ ప్రాంతంలోని 50 నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు భారీ ఎత్తున తరలిరానున్న నేపథ్యంలో 250 ఎకరాలకుపైగా ఉన్న సువిశాల మైదానంలో సభకు ఘనంగా ఏర్పాట్లు చేశారు. కాగా, భీమిలి, ఏలూరులలో నిర్వహించిన సభలకు జనం సంద్రంలా పోటెత్తడం.. జయహో జగన్, మళ్లీ సీఎం జగనే అన్న నినాదాలతో సభా ప్రాంగణాలు ప్రతిధ్వనించడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణులు సమరోత్సాహంతో కదం తొక్కుతున్నాయి. పొత్తులు తేలక ప్రతిపక్ష పార్టీల సభలు వెలవెలబోతున్నాయి.

సీఎం సభ నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి



అనంతపురం జిల్లా రాప్తాడులో ఈ నెల 18వ తేదీన నిర్వహించనున్న వైఎస్సార్‌సీపీ 'సిద్ధం' సభకు ఏర్పాట్లు పూర్తయ్యాయని జిల్లా ఇన్‌చార్జి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. ఈ సభకు రాయలసీమలోని అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. సభ ఏర్పాట్లను రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషశ్రీ చరణ్, సీఎం ప్రోగ్రామ్స్ కో-ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ప్రభుత్వ విద్యా సలహాదారు ఆలూరి సాంబశివారెడ్డి, హిందూపురం ఎంపీ గోరంట్ల మాధవ్‌తో కలిసి శనివారం పరిశీలించారు. సభ మధ్యాహ్నం ఒంటి గంటకు ప్రారంభమవుతుందని, రాయలసీమలోని 50 అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి లక్షలాది మంది తరలిరానున్నట్లు చెప్పారు. చంద్రబాబు, లోకేశ్, భువనేశ్వరి వేర్వేరుగా ఈ ప్రభుత్వాన్ని, సీఎం జగన్‌ను తిట్టే కార్యక్రమాలు పెట్టుకున్నారే తప్ప తాము రాష్ట్రానికి ఇది చేశామని చెప్పుకోలేకపోతున్నారని మంత్రి పెద్దిరెడ్డి ఎద్దేవా చేశారు. ఈ ఎన్నికల్లో జనసేన ప్రభావం ఏమీ ఉండబోదని తేల్చి చెప్పారు. మంత్రి ఉషశ్రీ చరణ్ మాట్లాడుతూ ప్రజలందరూ జగనన్నకు తోడుగా ఉన్నారని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కో ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ మాట్లాడుతూ రానున్న ఎన్నికల తర్వాత టీడీపీ కనుమరుగవ్వడం ఖాయమని జోస్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఉరవకొండ, శింగనమల సమన్వయకర్తలు విశ్వేశ్వర రెడ్డి, వీరాంజనేయులు, పార్టీ జిల్లా అధ్యక్షుడు పైలా నరసింహయ్య, డిప్యూటీ మేయర్ కోగటం భాస్కర్ రెడ్డి, ఆర్టీసీ జోనల్ చైర్‌పర్సన్ మాల్యవంతం మంజుల తదితరులు పాల్గొన్నారు.

మహిళల పేరుతో రూ.4 కోట్లు స్వాహా!

ప్రకాశం జిల్లా మార్కాపురంలో ఓ బ్యాంక్ ఉద్యోగి నిర్వాకం

మార్కాపురం: ప్రకాశం జిల్లా మార్కాపురంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మెయిన్ బ్రాంచ్‌లో స్వయం సహాయ సంఘాల సభ్యుల పేరిట అదే బ్యాంకులో పని చేస్తున్న ఓ అధికారి నకిలీ అకౌంట్లు తెరిచి సుమారు రూ.4కోట్ల మేర స్వాహా చేశారు. ఈ విషయం మూడు రోజుల క్రితం బ్యాంకు ఆడిట్ అధికారుల తనిఖీల్లో బయటపడింది. దీంతో సదరు అధికారి అనారోగ్యం పేరుతో సెలవుపెట్టాడు. అతను ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అజ్ఞాతంలోకి వెళ్లినట్లు తెలిసింది. ఈ విషయంపై బ్యాంకు ఉన్నతాధికారులు శాఖాపరమైన విచారణ చేపట్టారు. సదరు అధికారికి బ్యాంకు ఉద్యోగులతోపాటు ఎస్‌హెచ్‌జీలో పనిచేస్తున్న రిసోర్స్ పర్సన్‌లు, దొనకొండ మండలంలోని కొచ్చర్లకోట గ్రామానికి చెందిన కొంతమంది సహకరించినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది. రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక బృందాల(ఎస్‌హెచ్‌జీ) సభ్యులు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు చేయూత, ఆసరా, పావలా వడ్డీ రుణాలు వంటి పలు పథకాలు అమలు చేస్తోంది. దీంతో సమీప గ్రామాల నుంచి మహిళలు మార్కాపురం వచ్చి ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచిలో అకౌంట్లు తెరిచి లావాదేవీలు నిర్వహిస్తున్నారు. ఇందుకోసం వారు తమ ఆధార్ కార్డులు జిరాక్సులు ఇస్తున్నారు. ఆ జిరాక్స్ కాపీలతోనే సదరు అధికారి కొందరు మహిళల పేరిట నకిలీ అకౌంట్లు తెరిచి (డబుల్ అకౌంట్లు) వారి పేరుతో రుణాలు తీసుకుని స్వాహా చేసినట్లు తెలిసింది. ఈ విషయమై బ్యాంకు మేనేజర్ శ్రీనివాసరావును వివరణ కోరగా, బ్యాంకులో లోన్‌లు చూసే అధికారి సెలవులో ఉన్నారని, ఆయన వస్తే ఈ విషయంపై విచారణ జరుపుతామని తెలిపారు.

■ తెలంగాణ

పట్టాలు తప్పిన గూడ్స్

చింతకాని: ఖమ్మం జిల్లా చింతకాని మండలం నాగులవంచ స్టేషన్ సమీపాన ఖమ్మం వైపు నుంచి విజయవాడ వైపు బొగ్గు లోడ్‌తో వెళ్తున్న గూడ్స్ రైలు శనివారం పట్టాలు తప్పింది. గూడ్స్ రైలు నాగులవంచ స్టేషన్ సమీపానికి రాగానే ఇంజన్ నుంచి 25వ బోగీకి వెనుక చక్రాలు ఊడిపోవడంతో రైలు పట్టాలు తప్పింది. సుమారు కిలోమీటర్ మేర రైలు ముందుకు వెళ్లడంతో పట్టాలకున్న ఇనుప సీలలు దెబ్బ తిన్నాయి. వెంటనే రైల్వే సిబ్బంది చేరుకుని బోగీలోని బొగ్గును ఖాళీ చేశారు. క్రేన్ల సాయంతో పట్టాలు తప్పిన బోగీని పక్కకు తప్పించాక మిగిలిన బోగీలను కలిపారు. యుద్ధ ప్రాతిపదికన పట్టాలకు మరమ్మతులు చేపట్టగా.. సుమారు నాలుగున్నర గంటల తర్వాత గూడ్స్ రైలు ముందుకు కదిలింది. అంతసేపు విజయవాడ వైపు వెళ్లే పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లను ఎక్కడికక్కడ నిలిపివేశారు.

ఇద్దరు చిన్నారులను బలితీసుకున్న నీటిసంపు

తల్లిదండ్రులు నిద్రిస్తున్న సమయంలో ఆడుకుంటూ సంపులో పడి మృత్యువాత

వరంగల్: ప్రయాణ బడలికతో తల్లిదండ్రులు నిద్రలోకి జారుకోగా, ఆడుకుంటూ వెళ్లి నీటిసంపులో పడి ఇద్దరు చిన్నారులు మృతిచెందారు. ఈ విషాద ఘటన వరంగల్ నగరం ఏనుమాముల బాలాజీనగర్‌లో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ కిషన్ తెలిపిన వివరాల ప్రకారం.. వికారాబాద్ జిల్లా తాండూరుకు చెందిన కరణం బాలేశ్వరి, రవికుమార్ దంపతులు మేడారం జాతరకు వెళ్లడానికి పిల్లలు శౌరితేజ (4), తేజస్విని (2)తో కలిసి వరంగల్ బాలాజీనగర్‌లోని బాలేశ్వరి తల్లిగారింటికి శుక్రవారం రాత్రి వచ్చారు. చాలా దూరంనుంచి రావడంతో అలిసిపోయిన బాలేశ్వరి, రవికుమార్ పడుకునేముందు పిల్లలకు సెల్‌ఫోన్ ఇచ్చారు. పిల్లలు ఆడుకుని పడుకుంటారని తల్లిదండ్రులు భావించారు. అయితే రాత్రి 11గంటల సమయంలో లేచి చూడగా పిల్లలిద్దరూ కనిపించలేదు. ఇల్లంతా వెతకడంతోపాటు పక్కనున్న బంధువుల ఇంటికి వెళ్లి కూడా ఆరా తీశారు. అక్కడ కూడా లేకపోవడంతో అందరూ కలిసి ఇంట్లోని సంప్‌లో వెతకగా ఒక చిన్నారి మృతదేహం నీటిపై తేలియాడుతూ కనిపించింది. దీంతో సంపులో వెతకగా మరో మృతదేహం కూడా లభించింది. ఇద్దరిని బయటకు తీయగా అప్పటికే వారు మరణించారు. చిన్నారులిద్దరూ ఆడుకుంటూ సంపులో పడి ఉంటారని అనుమానిస్తున్నారు. అమ్మవార్లను దర్శించుకునేందుకు వస్తే ఇద్దరు పిల్లలను కోల్పోయామంటూ తల్లిదండ్రులు తీవ్రంగా రోదించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



> ఆయన ఆది యందు దేవునియొద్ద ఉండెను. సమస్తమును ఆయన మూలముగా కలిగెను, కలిగియున్నదేదియు ఆయన లేకుండ కలుగలేదు.
>
> – క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు మాఘ మాసం, **తిథి:** శు.నవమి ప.12.24 వరకు, తదుపరి దశమి, **నక్షత్రం:** రోహిణి ప.1.24 వరకు, తదుపరి మృగశిర, **వర్జ్యం:** రా.7.04 నుండి 8.40 వరకు, **దుర్ముహూర్తం:** సా.4.30 నుండి 5.18 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.14 నుండి 11.48 వరకు.

సూర్యోదయం : 6.29
సూర్యాస్తమయం : 5.56
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

కమల్ నాథ్ (కాంగ్రెస్ దిగ్గజం)
రాయని డైరీ

మాధవ్ శింగరాజు

దిగ్విజయ్ సింగ్‌ని నేను 'డిగ్గీ' అంటాను. 'రాజా' అంటాను. 'డిగ్గీరాజా' అంటాను. 'విజయ్' అంటాను. కొన్నిసార్లు 'దిగ్విజయ్' అని కూడా అంటాను.

కానీ మొదటిసారిగా... ఫిబ్రవరి 14న నేనాయన్ని భోపాల్ లో పట్టుకుని 'హే... కృష్ణా' అనేశాను!

ఫిబ్రవరి 9న నేను ఢిల్లీ వెళ్లి సోనియాజీని కలిసి వచ్చాక కూడా... మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఖాళీ అయిన ఒకే ఒక కాంగ్రెస్ టిక్కెట్‌ను నాకు కాకుండా అశోక్ సింగ్‌కి అనౌన్స్ చేసిన రోజు అది!

అశోక్ సింగ్ 2019 లోక్ సభ ఎన్నికల్లో ఓడిపోయారు. 2014 లోక్ సభ ఎన్నికల్లో ఓడిపోయారు. 2009 లోక్ సభ ఎన్నికల్లో ఓడిపోయారు. 2004 లోక్ సభ ఎన్నికల్లో ఆయన నిలబడలేదు కనుక ఓటమి ఆయన్నుంచి తప్పించుకున్నా... 2007 లోక్ సభ ఉప ఎన్నికల్లో నిలబడి మళ్లీ ఆయన ఓడిపోయారు. తిరిగి ఆయన ఈ 2024 లోక్ సభ ఎన్నికల్లో కూడా ఓడిపోకుండా ఉండటం కోసం ఆయనకిప్పుడు రాజ్యసభ టికెట్



ఇచ్చినట్లున్నారు!

అశోక్ సింగ్... దిగ్విజయ్ సింగ్ మనిషి

మీనాక్షీ నటరాజన్‌ని కూడా పక్కకు తప్పించి అశోక్ సింగ్‌కి రాజ్య సభ టిక్కెట్ ఇప్పించుకోగలిగారు దిగ్విజయ్! మీనాక్షి రాహుల్ ఫ్రెండ్. రాహుల్ ఫ్రెండ్ కే దిగ్విజయ్ టిక్కెట్ రాకుండా చేయగలిగారంటే ఎవరికీ ఫ్రెండ్‌ని కాని నేనెంత అనుకోవాలా!

అందుకే ఆయన్ని 'హే... కృష్ణా..' అన్నాను.

దిగ్విజయ్ నవ్వారు.

"ఎవరా... 'హే.. కృష్ణ'.. కమల్నాథ్?" అన్నారు.

"శ్రీకృష్ణ పరమాత్ముడు" అన్నాను... అర్జునుడిలా చేతులు జోడించి.

జోడించిన నా చేతుల్ని ఆపేక్షగా విడదీశారు దిగ్విజయ్.

"తొమ్మిదిసార్లు ఒకే నియోజకవర్గం నుంచి లోక్ సభకు ఎన్నికైన నాయకుడికా, లేక... ఒకే నియోజకవర్గం నుండి ఒక్కసారి కూడా లోక్ సభకు ఎన్నికకాని నాయకుడికా... చెప్పు... ఎవరికిస్తావు రాజ్యసభ టిక్కెట్... నువ్వే కనుక కాంగ్రెస్‌లోని ఎవరైనా ఒక కారుణ్య మూర్తివి అయివుంటే?!" అన్నారు దిగ్విజయ్.

చింద్వారా నుంచి నేను ఒక్కసారి కూడా ఓడకపోవటాన్ని... 'నీకేం కమల్నాథ్' అన్నట్లుగానూ, గ్వాలియర్ నుంచి అశోక్ సింగ్ ఒక్కసారి కూడా గెలవక పోవటాన్ని.. 'పాపం.. అశోక్' అన్నట్లుగానూ ఉంది దిగ్విజయ్ మాట్లాడటం!!

"చెప్పు కమల్నాథ్. నువ్వైతే ఏం చేస్తావు?!" అన్నారు దిగ్విజయ్ మళ్లీ.

"నేనే కనుక కాంగ్రెస్‌లోని ఎవరైనా ఒక కారుణ్యమూర్తిని అయివుంటే ఏం చేస్తానో చెప్పలేను గానీ కృష్ణా... దిగ్విజయ్ సింగ్‌ని అయితే మాత్రం రాజ్యసభ టిక్కెట్‌ను అశోక్ సింగ్ కే ఇప్పిస్తాను..." అన్నాను, నవ్వేందుకు ప్రయత్నిస్తూ.

నా ప్రయత్నాన్ని సరిగ్గానే అర్థం చేసుకున్నారు దిగ్విజయ్.

"అశోక్ సింగ్ డిప్రెషన్‌లో ఉన్నాడు కమల్. వరుస ఓటముల కన్నా కూడా ఒక్కరోజైనా పదవిలో లేకపోవటం అతడిని ఎక్కువగా కృంగదీస్తోంది..." అన్నారు.

"నేను కూడా ఇక్కడ డిప్రెసివ్ గానే ఉన్నాను విజయ్. మళ్లీ వెనక్కు వెళ్లిపోదాం అనుకుంటున్నా... జాతీయ రాజకీయాల్లోకి..." అన్నాను.

"జాతీయ రాజకీయాల్లోకి అంటే బీజేపీనే కదా..." అని నవ్వారు దిగ్విజయ్.

"చెప్పలేను. కానీ పార్టీ మారతానని మాత్రం అనిపిస్తోంది..." అన్నాను.

"డెబ్బై ఏడేళ్ల వయసులో పార్టీ మారడం ఉండదు కమల్. పార్టీని వదిలి పెట్టడమే ఉంటుంది" అన్నారు దిగ్విజయ్!

ఆ మాటకు నేను ఆయన వైపు అదేమిటో తెలియని విధానంలో చూశాను.

బహుశా ఆనాడు అర్జునుడు కూడా శ్రీ కృష్ణ పరమాత్ముడిని ఇలాగే చూసి ఉంటాడా!!

విశ్వవిజేతల కార్ఖానా!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



తెలుగు ప్రసార మాధ్యమాలు పెద్దగా పట్టించుకోని ఈ వారపు ఘటనల్లో ఎన్నదగ్గవి రెండు: పాఠశాలల్లో ఐబీ సిలబస్‌ను ప్రారంభించేందుకు సన్నాహంగా ఒక బృందం పాఠశాలల పరిశీలనకు బయల్దేరింది. రెండవది – ఏపీ రాష్ట్ర ప్రభుత్వం ఆన్‌లైన్ లెర్నింగ్ సంస్థ ఎడెక్స్‌తో ఒక ఒప్పందం చేసుకున్నది. మొదటిది పాఠశాల విద్యకు సంబంధించినదైతే, రెండోది ఉన్నత విద్యకు సంబంధించిన అంశం. చంద్రబాబు యాచిస్తున్న పొత్తు కౌగిలిని బీజేపీ ప్రసాదిస్తుందా లేదా, జనసైనికులు ఆశిస్తున్న సీట్ల ప్యాకేజీని టీడీపీ అంగీకరిస్తుందా లేదా వగైరా పొలిటికల్ మిర్చి ముందు పై రెండు వార్తలను మీడియా చప్పిడి వార్తలు గానే పరిగణించి ఉండవచ్చు. యెల్లో మీడియా అయితే ఉద్దేశ పూర్వకంగానే విస్మరించింది.

ఎన్నికలు సమీపిస్తున్నకొద్దీ యెల్లో మీడియాలో ఉక్కపోత ఎక్కువైంది. కడుపు ఉబ్బరం పెరిగింది. ఒత్తిడి పెరిగింది. ఫలితంగా దాని వార్తా ప్రాథమ్యాలు మరింత అదుపు తప్పాయి. 'రాజధాని ఫైల్స్' పేరుతో ఓ సినిమాను విడుదల చేశారు. 'ఫైల్స్ కాదు పైల్స్' (మొలలు) అన్నారెవరో! పెత్తందారీ పైల్స్ అనే పేరు పెడితే బాగుండేదన్నారు. యెల్లో మీడియా ఉన్న పరిస్థితికి ఈ సినిమా బాగా కనెక్టయింది. అందుకే యెల్లో మీడియాలో ప్రముఖ వార్తగా మారింది. యెల్లో మీడియాకు తోడయిన ఇంకో కామ్రేడరీ వార్త 'విధ్వంసం' పేరుతో పుస్తకావిష్కరణ. 'కృష్ణశాస్త్రి బాధ ప్రపంచానికి బాధ' అంటారు గదా! అట్లాగే పెత్తందారీ బాధ యెల్లో మీడియా ద్వారా సకల జనులకు బాధ. ఈ రెంటికీ మధ్యనున్న కామ్రేడరీ అనుబంధమే ఆ పుస్తక సారాంశం. కనుక అది కూడా వారికి పెద్ద వార్తే.

స్కూళ్లలో ఐబీ సిలబస్ పెడితే మాత్రం ఏమిటి విశేషం? ఎడెక్స్ ద్వారా కళాశాలల్లో అంతర్జాతీయ సిలబస్‌ను ప్రవేశ పెడితే ఏం ప్రయోజనముంటుంది? ఇటువంటి సందేహాలు కలగడం సహజం. వాటిని గురించి చర్చించడానికి ముందు ప్రస్తుత ప్రపంచ పరిణామ దశ గురించిన ప్రాథమిక అవగాహన మనకు ఉండాలి. టెక్నాలజీ అభివృద్ధి కారణంగా ప్రపంచం ఏకైక గ్లోబల్ మార్కెట్‌గా అవతరిస్తున్నది. ఈ మార్కెట్‌ను ఒకే ఒక వ్యవహారిక భాష నియంత్రించనున్నది. గ్లోబల్ విలేజి గురించి తరచూ మాట్లాడుతుంటారు. మన పూర్వీకులు ఎప్పటి నుంచో 'వసుధైక కుటుంబం' అనే భావనను వ్యాప్తిలోకి తెచ్చారు. ఈ ఏక కుటుంబంలో ఏకైక సంధాన భాష అవసరం కూడా ఏర్పడింది.

ఎలిజర్ బెన్ యెహుదా అనే భాషా శాస్త్రవేత్త ఉండేవారు. ఆయన రష్యాలో పుట్టి పెరిగిన యూదు జాతీయుడు. ప్రపంచమంతా ఒకే భాష మాట్లాడే రోజు వస్తుందనే అభిప్రాయాన్ని వందేళ్లకు పూర్వమే ఆయన ప్రకటించారు. అయితే అది హిబ్రూ భాష కావాలనేది ఆయన కోరిక. అలాగే సంస్కృతానికి గ్లోబల్ భాషయ్యే లక్షణాలున్నాయనే భాషావేత్తలు కూడా చాలామందే ఉన్నారు. కానీ ఇప్పటికే ప్రపంచ భాషగా ఇంగ్లిషు చాలాదూరం వెళ్లిపోయింది. ప్రపంచీకరణ, సాంకేతిక పురోగతి, వలసల కారణంగా ఏర్పడుతున్న సాంస్కృతిక మార్పులన్నీ ఆంగ్లీకరణను వేగవంతం చేస్తున్నాయి.

ఉన్నతమైన జీవనాన్ని ఆకాంక్షించే ప్రతి బాలికా బాలుడు, ప్రతి యువతీ యువకుడు గ్లోబల్ మార్కెట్ లక్ష్యంగా దూసుకొనిపోవలసిన అవసరం ఉన్నది. అలా దూసుకుపోవాలంటే మొదటి అవసరం – ఇంగ్లిషు భాషలో ప్రావీణ్యం. రెండో అవసరం – వేగంగా మారుతున్న టెక్నాలజీల మీద పట్టు సాధించడం. మూడోది – గ్లోబల్ మార్కెట్ అవసరాలకు పనికివచ్చే సబ్జెక్టులను అభ్యసించడం. ఈ అవసరాలను మన పిల్లలు ఎలా సమకూర్చుకోగలరు? ఎవరో పెట్టిపుట్టినవారు, కలవారి పిల్లలు మాత్రమే నెరవేర్చుకోగలిగిన కలలుగా ఇవి కనిపిస్తున్నాయి.

భారతదేశమంతా కలిపి కేవలం 210 అత్యున్నతస్థాయి ప్రైవేట్ పాఠశాలల్లో మాత్రమే ఇప్పుడు ఐబీ సిలబస్‌ను అమలు చేస్తున్నారు. సంపన్నులు మాత్రమే ఆ స్కూళ్ల ఫీజులను భరించగలరు. మనకు అలవాటైన 'భట్టీయం' పద్ధతికి భిన్నంగా ఐబీ విద్యాబోధన ఉంటుంది. మన సంప్రదాయ పద్ధతిలో ఇరవై ఎక్కాలు గడగడ చదివేవారు కూడా సాధారణ లెక్కలు చేయలేక పోవడం మనకు తెలిసిందే. భట్టీయం పద్ధతిలో వివేచన, విశ్లేషణ, ఆలోచనలకు అవకాశం తక్కువ. విమర్శనాత్మకంగా ఆలోచించడం, భిన్నంగా ఆలోచించడం, సమస్యను పరిష్కరించడం వంటి నైపుణ్యాలను ఐబీ పాఠశాలల్లో అలవాటు చేస్తారు. వీటితోపాటు వివిధ రంగాల్లో రాణించేలా ప్రపంచమంతటా

> ఉన్నతమైన జీవనాన్ని ఆకాంక్షించే ప్రతి బాలికా బాలుడు, ప్రతి యువతీ యువకుడు గ్లోబల్ మార్కెట్ లక్ష్యంగా దూసు కొనిపోవలసిన అవసరం ఉన్నది. అలా దూసుకుపోవాలంటే మొదటి అవసరం – ఇంగ్లిషు భాషలో ప్రావీణ్యం. రెండో అవసరం – వేగంగా మారుతున్న టెక్నాలజీల మీద పట్టు సాధించడం. మూడోది – గ్లోబల్ మార్కెట్ అవసరాలకు పనికివచ్చే సబ్జెక్టులను అభ్యసించడం. ఈ అవసరాలను మన పిల్లలు ఎలా సమకూర్చుకోగలరు? ఎవరో పెట్టిపుట్టినవారు, కలవారి పిల్లలు మాత్రమే నెరవేర్చుకోగలిగిన కలలుగా ఇవి కనిపిస్తున్నాయి.
>
> భారతదేశమంతా కలిపి కేవలం 210 అత్యున్నత స్థాయి ప్రైవేట్ పాఠశాలల్లో మాత్రమే ఇప్పుడు ఐబీ సిలబస్‌ను అమలు చేస్తున్నారు. సంపన్నులు మాత్రమే ఆ స్కూళ్ల ఫీజులను భరించగలరు. మనకు అలవాటైన 'భట్టీయం' పద్ధతికి భిన్నంగా ఐబీ విద్యాబోధన ఉంటుంది. మన సంప్రదాయ పద్ధతిలో ఇరవై ఎక్కాలు గడగడ చదివేవారు కూడా సాధారణ లెక్కలు చేయలేక పోవడం మనకు తెలిసిందే. భట్టీయం పద్ధతిలో వివేచన, విశ్లేషణ, ఆలోచనలకు అవకాశం తక్కువ. విమర్శనాత్మకంగా ఆలోచించడం, భిన్నంగా ఆలోచించడం, సమస్యను పరిష్కరించడం వంటి నైపుణ్యాలను ఐబీ పాఠశాలల్లో అలవాటు చేస్తారు. వీటితోపాటు వివిధ రంగాల్లో రాణించేలా ప్రపంచమంతటా ఉపాధి, ఉన్నత విద్యావకాశాలు పొందే విధంగా తర్ఫీదు ఉంటుంది. దేశంలో కేవలం 210 బడుల్లో మాత్రమే ఉన్న ఇటువంటి ఖరీదైన ఐబీ విద్యాబోధనను రాష్ట్రంలోని 40 వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది.

ఉపాధి, ఉన్నత విద్యావకాశాలు పొందే విధంగా తర్ఫీదు ఉంటుంది.

దేశంలో కేవలం 210 బడుల్లో మాత్రమే ఉన్న ఇటువంటి ఖరీదైన ఐబీ విద్యాబోధనను రాష్ట్రంలోని 40 వేల పైచిలుకు ప్రభుత్వ పాఠశాలల్లో దశలవారీగా ప్రవేశపెట్టడానికి ప్రభుత్వం సన్నాహాలు ప్రారంభించింది. ఈ సంవత్సరం ఉపాధ్యాయులకు శిక్షణ ఇస్తారు. వచ్చే సంవత్సరం (2025–26) నుంచి ఒకటో క్లాసులో ఐబీ సిలబస్ ప్రవేశపెడతారు. ఏటా ఒక్కో క్లాసు పెంచుకుంటూ వెళ్తారు. 2037 నాటికి ప్లస్ టూ వరకు ఆంధ్రప్రదేశ్ పాఠశాల విద్యార్థులంతా ఐబీ సిలబస్‌లోనే ఉంటారు.

ప్రపంచ గమనానికి అనుగుణంగా మన ఉన్నత విద్యా కోర్సులు మారలేదన్నది ఒక వాస్తవం. ప్రభుత్వాధినేతలకు ఉండవలసిన దార్శనికత (విజన్) లేకపోవడం ఒక కారణం. అసలు సంకల్పమే లేకపోవడం మరో కారణం. చంద్రబాబు వంటి పెత్తందారీ నాయకులు అసలు విద్యారంగంలో ప్రభుత్వ జోక్యమే అనవసరమనీ, దాన్ని పూర్తిగా ప్రైవేట్ రంగానికే వదిలి వేయాలనీ బహిరంగంగానే ప్రబోధించారు. అందుకు తగ్గట్టుగానే ప్రభుత్వ విద్యారంగం కుప్పకూలిపోయేవిధంగా ఉద్దేశ పూర్వకంగా వ్యవహరించారు. ఇప్పుడు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రారంభించిన సంస్కరణల ఫలితంగా నాణ్యమైన ప్రపంచశ్రేణి విద్య పేద విద్యార్థులందరికీ ప్రభుత్వ రంగంలోనే ఉచితంగా అందుబాటులోకి వచ్చింది. కార్పొరేట్, పెత్తందారీ శక్తులు అందువల్లనే జగన్‌మోహన్‌రెడ్డిని అధికారంలోంచి దింపేయడానికి భయంకరమైన కుట్రను రచించాయి.

ఇప్పుడు గ్రాడ్యుయేషన్ కోర్సులు చేస్తున్న మన విద్యార్థులు ప్రపంచ మార్కెట్‌లో పోటీపడటానికి అనువుగా వారి పాఠ్యాంశాలు, బోధనా ప్రక్రియలు లేవన్నది నిర్వివాదాంశం. వరల్డ్ క్లాస్ స్థాయికి మన కళాశాలలను తీర్చిదిద్దడానికి చాలా సమయం పట్టవచ్చు. అప్పటివరకు ఏటా బయటకొస్తున్న మన పట్టభద్రులంతా అన్యాయానికి గురికావలసిందేనా? అలా జరగకూడదన్న లక్ష్యమే ఎడెక్స్‌తో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందానికి కారణమైంది.

లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, హార్వర్డ్, కొలంబియా, కేంబ్రిడ్జి, ఎమ్ఐటీ వంటి ప్రతిష్ఠాత్మక గ్లోబల్ వర్సిటీలు అందించే కోర్సులను ఎడెక్స్ ద్వారా మన డిగ్రీ, పీజీ, ఇంజనీరింగ్ విద్యార్థులకు అందుబాటులోకి తేవడం ఈ ఒప్పందంలోని ప్రధానాంశం. విద్యార్థులకు ఈ కోర్సులు ఉచితంగా అందుబాటులోకి వస్తాయి. కరిక్యులమ్‌లో భాగమవుతాయి. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, మెషిన్ లెర్నింగ్, డేటా మైనింగ్, డేటా అనలిటిక్స్, వర్చ్యువల్ రియాలిటీ, ఆగ్మెంటెడ్ రియాలిటీ, క్లౌడ్ కంప్యూటింగ్, రిస్క్ మేనేజిమెంట్, రియల్ ఎస్టేట్, లాజిస్టిక్స్, స్టాక్ ఎక్స్ఛేంజ్, వెల్త్ మేనేజిమెంట్ వంటి ఆధునిక కోర్సుల్లో మన దగ్గర ప్రామాణికత లేదు. ఎడెక్స్ ద్వారా ఇందులో వరల్డ్ క్లాస్ కోర్సులను మన విద్యార్థులకు అందుబాటులోకి తెస్తున్నారు. ఈ వర్టికల్స్‌కు సంబంధించిన పరీక్షను ఎంపిక చేసుకున్న గ్లోబల్ యూనివర్సిటీ భాగస్వామ్యంతో నిర్వహిస్తారు. విద్యార్థికి ఆ కోర్సులకు సంబంధించిన క్రెడిట్స్ లభిస్తాయి. గ్లోబల్ మార్కెట్‌లో ఉపాధి పొందడానికి, ఉన్నతమైన విదేశీ విద్యను అభ్యసించడానికి ఈ క్రెడిట్స్ ఉపకరిస్తాయి.

ఈ ప్రయత్నాలు ఇంకో పది పదిహేనేళ్లు నిర్విఘ్నంగా కొనసాగితే మన విద్యార్థులు ప్రపంచ వేదికపై జైత్రయాత్ర చేస్తారు. అత్యున్నత స్థానాలకు ఎగబాకుతారు. వారితోపాటు వారి కుటుంబాలు, గ్రామాలు, రాష్ట్రం, దేశం అభివృద్ధి ఫలాలను అందుకుంటాయి. పేదవాడు అభివృద్ధి చెందడం పెత్తందారీ శక్తులకు నచ్చదు. వారి అభివృద్ధిని ఓర్వలేరు. ఇంతటి విప్లవా

> ఈ ప్రయత్నాలు ఇంకో పది పదిహేనేళ్లు నిర్విఘ్నంగా కొనసాగితే మన విద్యార్థులు ప్రపంచ వేదికపై జైత్ర యాత్ర చేస్తారు. అత్యున్నత స్థానాలకు ఎగబాకు తారు. వారితోపాటు వారి కుటుంబాలు, గ్రామాలు, రాష్ట్రం, దేశం అభివృద్ధి ఫలాలను అందుకుంటాయి. పేదవాడు అభివృద్ధి చెందడం పెత్తందారీ శక్తులకు నచ్చదు. వారి అభివృద్ధిని ఓర్వలేరు. ఇంతటి విప్లవాత్మకమైన ప్రగతి శీలతకు విత్తనాలు చల్లుతున్న శుభఘడి యలకు వారి దృష్టిలో ప్రాధాన్యం లేదు. అందుకే అవి వార్తలు కావు. పైపెచ్చు మసిపూయాలి. బురద చల్లాలి. విధ్వంసం జరుగుతున్నదని ఓండ్రపెట్టాలి. అభివృద్ధి ఎక్కడున్నదని మొరగాలి. మూలశంక వ్యాధి వికారాన్ని సినిమాల్లో ప్రదర్శించాలి. ఇప్పుడదే జరుగుతున్నది.
>
> పేదలకు విజ్ఞాన ఫలాలు అందకూడదు. నాణ్యమైన విద్య అందుబాటులో ఉండకూడదనే పెత్తందారుల కుట్ర కేవలం వారి స్వార్థం మాత్రమే కాదు. ఇదొక దేశ ద్రోహ నేరం. దేశాభివృద్ధికి గొడ్డలిపెట్టు. క్రీస్తుశకం రెండో శతాబ్దం నుంచి ఆరేడు శతాబ్దాల మధ్యకాలంలో భారతీయ మేధావులు చేసిన ఆవిష్కరణలు సామాన్యమైనవి కావు. శూన్యాంకాన్ని (జీరో) ప్రసాదించి ప్రపంచ గణిత శాస్త్రాన్ని మలుపుతిప్పిన ప్రతిభాశాలి, గ్రహగతులను, భూభ్రమణాన్ని నిర్ధారించిన మేధావి ఆర్యభట్ట, గణిత ఖగోళ శాస్త్రజ్ఞులైన భాస్కర – బ్రహ్మగుప్త – వరాహ మిహిర, వైద్యశాస్త్ర పితామహుడు చరకుడు, తత్వవేత్త – రసవాద శాస్త్రవేత్త ఆచార్య నాగార్జునుడు, వగైరాలంతా ఆ కాలం జీవించినవారే. కానీ ఆనాటి విజ్ఞానమంతా సంస్కృత భాషకే పరిమితం కావడం, ఆ భాషను నేర్చుకునే అర్హత పిడికెడు మందికే పరిమితం కావడం జాతికి జరిగిన తీరని ద్రోహం.

త్మకమైన ప్రగతిశీలతకు విత్తనాలు చల్లుతున్న శుభఘడియలకు వారి దృష్టిలో ప్రాధాన్యం లేదు. అందుకే అవి వార్తలు కావు. పైపెచ్చు మసిపూయాలి. బురద చల్లాలి. విధ్వంసం జరుగుతున్నదని ఓండ్రపెట్టాలి. అభివృద్ధి ఎక్కడున్నదని మొరగాలి. మూలశంక వ్యాధి వికారాన్ని సినిమాల్లో ప్రదర్శించాలి. ఇప్పుడదే జరుగుతున్నది.

పేదలకు విజ్ఞాన ఫలాలు అందకూడదు, నాణ్యమైన విద్య అందుబాటులో ఉండకూడదనే పెత్తందారుల కుట్ర కేవలం వారి స్వార్థం మాత్రమే కాదు. ఇదొక దేశద్రోహ నేరం. దేశాభివృద్ధికి గొడ్డలిపెట్టు. క్రీస్తుశకం రెండో శతాబ్దం నుంచి ఆరేడు శతాబ్దాల మధ్యకాలంలో భారతీయ మేధావులు చేసిన ఆవిష్కరణలు సామాన్యమైనవి కావు. శూన్యాంకాన్ని (జీరో) ప్రసాదించి ప్రపంచ గణితశాస్త్రాన్ని మలుపుతిప్పిన ప్రతిభాశాలి, గ్రహగతులను, భూభ్రమణాన్ని నిర్ధారించిన మేధావి ఆర్యభట్ట, గణిత ఖగోళ శాస్త్రజ్ఞులైన భాస్కర – బ్రహ్మగుప్త – వరాహమిహిర, వైద్యశాస్త్ర పితామహుడు చరకుడు, సర్జరీ పితామహుడు సుశ్రుతుడు, ఆటమిక్ థియరీని ప్రతిపాదించిన కణాదుడు, తత్వవేత్త – రసవాద శాస్త్రవేత్త ఆచార్య నాగార్జునుడు, ప్రామాణిక అర్థశాస్త్ర రచయిత చాణక్యుడు, యోగశాస్త్ర సృష్టికర్త పతంజలి వగైరాలంతా ఆ కాలంలో జీవించినవారే. కానీ ఆనాటి విజ్ఞాన మంతా సంస్కృత భాషకే పరిమితం కావడం, ఆ భాషను నేర్చుకునే అర్హత పిడికెడు మందికే పరిమితం కావడం జాతికి జరిగిన తీరని ద్రోహం.

విశాల ప్రజానీకానికి విద్య అందుబాటులో ఉండి ఉంటే, సంస్కృతం నిషిద్ధం కాకపోయి ఉంటే ఈ మేధావుల ఆవిష్కరణలు మరింత ఊర్ధ్వగతి పొందేవి. వందలాదిమంది శాస్త్రవేత్తలు ఉద్భవించేవారు. పారిశ్రామిక విప్లవం బ్రిటన్ కంటే రెండు మూడు శతాబ్దాల ముందే భారత్‌లో ప్రభవించేది. మన నెమలి సింహాసనం, మన కోహినూర్ వజ్రం మన దగ్గరే ఉండేవని చెప్పడం చాలా చిన్న విషయం. ఇంకా ఏమేమి జరిగి ఉండేవనేది ఒక అధ్యయనాంశం. ఇప్పుడు కూడా ప్రపంచ భాష ఇంగ్లిష్ నేర్చుకోవద్దనీ, నాణ్యమైన విద్యను అభ్యసించకూడదనీ పేదవర్గాలను మన పెత్తందార్లు శాసిస్తున్నారు. ఇదే దేశద్రోహం. ఈ దేశద్రోహానికి వ్యతిరేకంగా ఆంధ్రప్రదేశ్ పేద వర్గాల ప్రజలు జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో యుద్ధానికి సిద్ధమవుతున్నారు. పెత్తందారీ – కార్పొరేట్ శక్తులు జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా సకల రాజకీయ పక్షాలను ఏకం చేసి మోహరించేందుకు ప్రయత్నిస్తున్నాయి. 'కుడి ఎడమల డాల్ కత్తులు మెరయగ...' అన్నట్టు అతివాద మితవాద పార్టీలన్నీ ఎవరి దారిలో వారు ఏకైక లక్ష్యంతో పనిచేస్తున్నారు. పెత్తందార్ల సేవలో తరిస్తున్నారు. చివరికి త్యాగాల చరిత గల పతాకాలనూ అపవిత్రం చేస్తున్నారు. పేదవర్గాలు ఈ పరిణామాలను గమనించాయి. సమరోత్సాహంతో నినదిస్తున్నాయి.

vardhelli1959@gmail.com

ప్రమాదపుటంచుల్లో ప్రపంచం

సందర్భం



బి.టి. గోవిందరెడ్డి

పక్కనున్న ఇల్లు తగలబడుతుంటే మనది కాదు కదా అని వదిలేస్తే ఆ మంటలు మన ఇంటినీ కాల్చివేస్తాయి. ఇప్పుడు హమాస్–ఇజ్రాయెల్‌ల మధ్య యుద్ధం ఈ వాస్తవాన్నే నొక్కి చెబుతోంది. రెండేళ్ల క్రితం ఉక్రెయిన్‌లో రష్యా మొదలెట్టిన దురాక్రమణ యుద్ధం ఇంకా చల్లారనే లేదు. ఇంతలో హమాస్ రాజేసిన యుద్ధ జ్వాలలు లెబనాన్ మొదలుకొని జోర్డాన్, సిరియా, ఇరాక్‌ల వరకూ మొత్తం పశ్చిమాసియాను చుట్టుముట్టాయి. ఇదే సమయంలో ఎర్రసముద్రంలో మాటుగాసిన హౌతీ మిలిటెంట్లు అటుగా వచ్చిపోయే భారీ వాణిజ్య నౌకలే లక్ష్యంగా క్షిపణి దాడులు చేయడం ప్రపంచ దేశాలను కలవరపరుస్తోంది.

గత నవంబర్‌లో అయిదువేల కార్లను మోసుకుపోగల 'గెలాక్సీ లీడర్' అనే నౌకపై హెలికాప్టర్‌తో దాడిచేసి, ఆ తర్వాత దాన్ని హైజాక్ చేశారు హౌతీలు. నౌకకు బహమాస్ జెండాయే ఉన్నా అది ఇజ్రాయెల్ కోటీశ్వరుడి షిప్పింగ్ కంపెనీదని హౌతీలు పసిగట్టారు. ఆ తర్వాత ఒక ఫ్రెంచ్ యుద్ధనౌక, ఒక గ్రీక్ నౌక, నార్వే జెండాతో పోతున్న కెమికల్ ట్యాంకర్లున్న నౌక వీరి దాడులకు లక్ష్యంగా మారాయి. మధ్యలో రెండు చైనా, రష్యాల నౌకలపైనా దాడులు జరిగాయి. కానీ పొరపాటైందని హౌతీలు ప్రకటించారు. జనవరి 15న వారు నేరుగా అమెరికా కార్గో నౌకపై దాడి చేశారు. ప్రపంచ నౌకా వాణిజ్యంలో ఇంచుమించు 17 శాతం ఎర్రసముద్రం మీదుగా జరుగుతుందని అంచనా. పర్షియా జలసంధి నుంచి యూరప్‌కు తరలిపోయే చమురు, సహజవాయు ట్యాంకులన్నీ ఎర్రసముద్రం గుండా పోవాల్సిందే. కానీ ఈ దాడుల తర్వాత అందులో చాలా భాగం తగ్గిపోయింది. అనేక సంస్థలు ఆఫ్రికా చుట్టూ తిరిగి నౌకల్ని నడపాలని నిర్ణయించాయి. ఇందువల్ల సరుకు రవాణా వ్యయం భారీగా పెరిగిపోయింది.

ఇరాన్ పెంచి పోషిస్తున్న హౌతీల ఆగడాలు అరికడతామని అమెరికా, బ్రిటన్‌లు రంగంలోకి దిగాయి. అందుకు ఆస్ట్రేలియా, నెదర్లాండ్స్ వంటివి సహకారం అందిస్తున్నాయి. హౌతీ మిలిటెంట్లు క్షిపణులతో, డ్రోన్‌లతో గత ఏడాది అక్టోబర్ 31న ఎర్రసముద్రంలోని ఇజ్రాయెల్ టూరిస్టు రిసార్ట్‌పై బాంబు దాడులు చేశారు. అయితే వాటిని ఇంటర్‌సెప్టర్ల సాయంతో ఇజ్రాయెల్ జయప్రదంగా అడ్డుకోగలిగింది. దాంతో రెండు ఈజిప్టు పట్టణాల్లో పేలుళ్లు సంభవించాయి. ఆ తర్వాత వారు అమెరికా ఎమ్‌క్యూ–9 రీపర్ డ్రోన్‌ను కూల్చారు. సమర్థవంతమైన ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల సాయంతో హౌతీలు ఎడతెరిపి లేకుండా ప్రయోగిస్తున్న డ్రోన్‌లు, క్షిపణులను అమెరికా, ఇజ్రా



యెల్ అడ్డుకోగలుగుతున్నాయి. కానీ ఎక్కడో తేడా కొట్టి అడపాదడపా నౌకలు బుగ్గిపాలవుతున్నాయి. గత నెల 10న అసంఖ్యాకంగా ఒకేసారి వదిలిన డ్రోన్లలో కొన్ని రక్షణ వ్యవస్థల్ని తప్పించుకెళ్లి అమెరికా యుద్ధ నౌకలోని ముగ్గురు నౌకాదళ సభ్యుల ప్రాణాలు తీశాయి. అమెరికా కూటమి దేశాలు సాగిస్తున్న దాడులు వృథా ప్రయాసగా మిగలటమే కాదు... చివరకు ప్రపంచయుద్ధానికి కూడా దారితీసే ప్రమాదం వుంది.

గాజాపై ఇజ్రాయెల్ దాడులు ఆగేదాకా ఎర్రసముద్రం ప్రశాంతంగా ఉండబోదని హౌతీలు చేసిన ప్రకటనను ప్రపంచదేశాలు సకాలంలో పట్టించుకోవాలి. 2004 మొదలుకొని గత రెండు దశాబ్దాలుగా నిత్యమూ యుద్ధరంగంలో నిలిచిన హౌతీలను తక్కువ అంచనా వేస్తే చేజేతులా వారిని హీరోలను చేసినట్టే! యెమెన్‌లో ఇరాన్–సౌదీ అరేబియాలు సాగించిన ఆధిపత్య పోరు నుంచి పుట్టుకొచ్చిన సంస్థ 'హౌతీ'. మొదట్లో ఒక ముఠా నాయకుడి జేబుసంస్థగా మొదలైన ఈ సంస్థ షియాల్లోని 'జైదీ' తెగ పరిరక్షకురాలిగా అవతరించింది. దక్షిణ, తూర్పు యెమెన్ ప్రాంతాల్లో ప్రాబల్యం ఉన్న సున్నీలపై ఎడతెగని దాడులు చేసి రాజధాని సానాను చేజిక్కించుకున్నారు. ఈలోగా ఇజ్రాయెల్ దుందుడుకు చర్యలు, అందుకు అమెరికా వత్తాసుగా నిలిచిన వైనాలను హౌతీలు స్వీయ ఎదుగుదలకు వాడుకున్నారు. అమెరికా, ఇజ్రాయెల్ నాశనమే తమ ధ్యేయమనీ, వారివల్ల అన్యాయానికి గురవుతున్న ముస్లింలు ఏ వర్గం వారైనా అండగా ఉంటామని హౌతీలు తమ చర్యల ద్వారా ప్రకటిస్తున్నారు. పాలస్తీనాలో సున్నీలు, షియాలు, క్రిస్టియన్లతో సహా భిన్న వర్గాలున్నా అక్కడ సున్నీలదే మెజారిటీ. హౌతీల ఎత్తుగడలను అమెరికా సరిగానే గ్రహించింది. అందుకే జనవరి నెలనుంచి ఇజ్రాయెల్‌కు సామరస్యత, శాంతి ప్రబోధిస్తోంది. కానీ ఆ దేశం వింటే కదా!

హౌతీలు ప్రపంచంలో ఒంటరివారు కారు. వారికి ఇరాన్ అండదండలు పుష్కలంగా ఉన్నాయి. అలాగని వారు ఇరాన్ చెప్పుచేతల్లో ఉండే అవకాశం లేదు. ఎవరైనా తమ ఎదుగుదలకు తోడ్పడే వరకే వారికి మిత్రులు. నచ్చనిది చెప్పిన మరుక్షణం వారు శత్రువుతో సమానం. ఇరాన్‌పై ఎన్ని రకాల ఆంక్షలు విధించినా నానావిధ ఎత్తుగడలతో తనకంటూ మిత్రుల్ని పోగేసుకుంటోంది. హౌతీలకు అది అండదండలు అందివ్వటం వెనక రష్యా, చైనాలు లేకపోలేదు. అందుకే ఆ రెండు దేశాలూ చోద్యం చూస్తూ నిలబడ్డాయి. ఇప్పుడు హౌతీల దుందుడుకుతనాన్ని కట్టడి చేయాలన్నా, కనీసం వారి చర్యల తీవ్రతను తగ్గించాలన్నా ఇరాన్ సాయం అవసరం. రష్యా, చైనాల జోక్యం తప్పనిసరి. ఈ దశలో ప్రతిష్ఠకు పోతే ముున్ముందు మరిన్ని పరాభవాలు తప్పవనీ, ఇది మరో ప్రపంచయుద్ధానికి దారి తీస్తుందనీ అమెరికా, మిత్రదేశాలు గుర్తించాలి.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

విజ్ఞాన ద్వారాలు పుస్తకాలు

పుస్తకాలు చదివే విద్యార్థుల ఆలోచనలూ, మానసిక ప్రవర్తనా పుస్తకాలు చదవని విద్యార్థులతో పోల్చుకుంటే మెరుగ్గా ఉంటాయి. మార్గ సర్వే 2022–23 ప్రకారం అత్యధికంగా పుస్తక పఠనం చేసే దేశాలలో భారతదేశం ముందు ఉన్నప్పటికీ జనాభాతో పోలిస్తే విద్యార్థులలో, యువకులలో ఇది పెరగవలసిన అవసరం ఉంది. దాని కనుగుణంగా ప్రభుత్వ పాఠశాలల్లో, గ్రామాలలో, కళాశాలల్లో విద్యార్థులకు గ్రంథాలయాలు అందుబాటులో ఉంచాలి. సబ్జెక్టుకు సంబంధించిన పుస్తకాలే కాకుండా సమాజ శాస్త్రాలకు సంబంధించిన, విలువలకు సంబంధించిన పుస్తకాలూ అందుబాటులో ఉంచాలి. వాటిని ఉపయోగించుకునే విధంగా విద్యార్థులను ప్రేరేపించాలి.


విద్యార్థులను పుస్తక ప్రదర్శనలకూ, నూతన పుస్తక పరిచయ కార్యక్రమాలకూ, పుస్తక రివ్యూ కార్యక్రమాలకూ, గ్రంథాలయాలకూ తల్లితండ్రులు కానీ, ఉపాధ్యాయులు కానీ తీసుకువెళ్లి పుస్తక పఠన రుచిని కలిగించాలి.

పౌర గ్రంథాలయాలను అన్ని రకాల చదువరులూ ఉపయోగించు కోవాలి. కానీ ప్రస్తుతం పౌర గ్రంథాలయాలను ఎక్కువ భాగం పోటీ పరీక్షలకు సంసిద్ధమయ్యే వారు మాత్రమే ఉపయోగించుకుంటున్నారు. మహిళలకూ, పిల్లలకూ అన్ని మండల, జిల్లా కేంద్రాలలో ఉన్న గ్రంథాలయాలలో ఆ యా విభాగాలు లేక పోవడం, ఒకవేళ ఉన్నా వారికి సంబంధించిన పుస్తక సంపద అందుబాటులో లేకపోవడం గమనార్హం.

ప్రస్తుతం హైదరాబాద్‌లో 36వ పుస్తక ప్రదర్శన జరుగుతుందన్న విషయం తెలిసిందే. ఫిబ్రవరి 19 వరకూ ఎన్టీఆర్ స్టేడియంలో సుమారు 350 స్టాళ్లలో లక్షలాది పుస్తకాలు కొలువుదీరి పాఠకుల మదిని దోస్తున్నాయి. అనేక రకాల పుస్తకాలను ఆ యా స్టాళ్లలో అందుబాటులో ఉంచడం గొప్ప విషయం. చిన్న పిల్లల కథల పుస్తకాలు, కార్టూన్ బొమ్మల పుస్తకాలు మొదలుకొని నవలలు, చరిత్ర, రాజనీతి శాస్త్రం, ఆంగ్లసాహిత్యం, వివిధ పోటీ పరీక్షల పుస్తకాలను అందుబాటులో ఉంచి పుస్తక ప్రియులకు జ్ఞానాన్ని పంచడం అరుదుగా దొరికే అవకాశం.

– డా॥ సుంకరి రాజారామ్, లైబ్రరీ సైన్స్ లెక్చరర్, నల్లగొండ

మే నెల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్ల కోటా రేపు విడుదల



తిరుమల(అలిపిరి): తిరుమల శ్రీవారి ఆర్జిత సేవా టికెట్లకు సంబంధించిన మే నెల కోటాను ఈ నెల 19న ఉదయం 10 గంటలకు టీటీడీ ఆన్‌లైన్‌లో విడుదల చేయనుందని ఈవో ఏవీ ధర్మారెడ్డి ప్రకటించారు. ఈ సేవా టికెట్ల ఎల్రక్టానిక్ డిప్ కోసం 21వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. అదేరోజు మధ్యాహ్నం 12 గంటలకు లక్కీడిప్‌లో టికెట్లు మంజూరవుతాయి. అలాగే కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకార సేవా టికెట్ల కోటాను 22న ఉదయం 10 గంటలకు విడుదల చేస్తారు. వర్చువల్ సేవలు, వాటి దర్శన స్లాట్లకు సంబంధించిన మే నెల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేయనున్నారు. శ్రీవాణి ట్రస్టు టికెట్లకు సంబంధించిన మే నెల ఆన్‌లైన్ కోటాను ఈ నెల 23వ తేదీ ఉదయం 11 గంటలకు విడుదల చేస్తారు. అలాగే మే నెలకు సంబంధించిన అంగప్రదక్షిణం టోకెన్ల కోటాను ఉదయం 10 గంటలకు విడుదల చేయనుంది. వయోవృద్ధులు, దివ్యాంగులు, దీర్ఘకాలిక వ్యాధులున్నవారు తిరుమల శ్రీవారిని దర్శించుకునేందుకు వీలుగా మే నెల ఉచిత ప్రత్యేక దర్శనం టోకెన్ల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. మే నెలకు సంబంధించిన ప్రత్యేక ప్రవేశ దర్శన టికెట్ల కోటాను ఈ నెల 24న ఉదయం 10 గంటలకు, తిరుమల, తిరుపతిలో మే నెల గదుల కోటాను మధ్యాహ్నం 3 గంటలకు విడుదల చేస్తారు. ఈ నెల 27న ఉదయం 11 గంటలకు శ్రీవారి సేవ, మధ్యాహ్నం 12 గంటలకు నవనీత సేవ, మధ్యాహ్నం 2 గంటలకు పరకామణి సేవ కోటాను విడుదల చేయనున్నారు.

విశాఖలో ఇంటిగ్రేటెడ్ క్రికెట్ స్టేడియం



50 వేలకుపైగా సీటింగ్ సామర్థ్యం.. త్వరలో శంకుస్థాపన

- విశాఖ, విజయవాడ, కడపలో ఏపీఎల్ సీజన్–3
- మార్చిలో విశాఖలో ఐపీఎల్ మ్యాచ్‌లు
- ప్రతి జిల్లాలో ఏసీఏ మైదానం, జోన్‌కు ఒక స్టేడియం నిర్మాణం
- ప్రతిభగల యువ క్రికెటర్లకు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లో వరల్డ్‌క్లాస్ శిక్షణ
- త్వరలోనే 175 నియోజకవర్గాల్లో మెగా స్కూల్ క్రికెట్ లీగ్
- ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి

సాక్షి, అమరావతి: విశాఖపట్నంలో అంతర్జాతీయ ప్రమాణాలతో అత్యాధునిక ఇంటిగ్రేటెడ్ క్రికెట్ స్టేడియాన్ని నిర్మించనున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) కార్యదర్శి ఎస్ఆర్ గోపినాథ్‌రెడ్డి చెప్పారు. ప్రస్తుతం విశాఖలో ఉన్న వైఎస్సార్ క్రికెట్ స్టేడియం సామర్థ్యం 27 వేల లోపు ఉందని, క్రికెట్‌కు పెరుగుతున్న ఆదరణ దృష్ట్యా మరో ప్రపంచ స్థాయి స్టేడియాన్ని నిర్మిస్తున్నామని, దానికి త్వరలోనే శంకుస్థాన చేస్తామని తెలిపారు. విశాఖ స్టేడియంలోని బి గ్రౌండ్‌లో ఇండోర్ స్టేడియం నిర్మిస్తామన్నారు. ఆయన శనివారం విజయవాడలో మీడియాతో మాట్లాడుతూ.. ప్రతి జిల్లాలో ఏసీఏ క్రికెట్ మైదానాలను అభివృద్ధి చేస్తామని, ప్రతి జోన్‌కు ఒక స్టేడియం నిర్మిస్తామని తెలిపారు. మంగళగిరి స్టేడియాన్ని నెమ్మదిగా అభివృద్ధి చేస్తూ దేశవాళీ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇక్కడ రూ.10 కోట్లతో ఫ్లడ్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. కోర్టు కేసులు పరిష్కరించి, ఇతర మౌలిక సదుపాయాలు కల్పించి అంతర్జాతీయ మ్యాచ్‌లకు సిద్ధం చేస్తామన్నారు. విశాఖలో మార్చిలో ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) మ్యాచ్‌ల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు.

మూడు జోన్లలోనూ ఏపీఎల్ మ్యాచ్‌లు

ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) రెండు సీజన్‌లు విజయవంతమయ్యాయని, మూడో సీజన్‌ను విశాఖ, విజయవాడ, కడపలో మూడు జోన్లలోనూ నిర్వహిస్తామని చెప్పారు. ఏపీఎల్ ద్వారా ప్రతిభగల యువ క్రికెటర్లు వెలుగులోకి వచ్చి, ఐపీఎల్ జట్లలో స్థానం సంపాదించారన్నారు. దేశంలో తొలిసారిగా మహిళా ఏపీఎల్ నిర్వహణతో ఏపీకి ప్రత్యేక గుర్తింపు దక్కిందన్నారు. ఉమెన్ ఏపీఎల్ స్ఫూర్తితోనే బీసీసీఐ ఉమెన్ ప్రీమియర్ లీగ్‌ను ప్రవేశపెట్టిందని అన్నారు. దేశంలోనే ఏకైక మహిళా క్రికెట్ అకాడమీ ఉన్న రాష్ట్రం ఏపీ అని చెప్పారు. రాష్ట్రంలో ఇప్పటికే అండర్–14 ఇంటర్ క్లబ్ క్రికెట్ లీగ్‌లు ప్రారంభించామని, త్వరలో 175 నియోజకవర్గాల్లో మెగా స్కూల్ క్రికెట్ లీగ్‌లు నిర్వహిస్తామన్నారు. సుమారు 20 వేల మంది యువ క్రికెటర్లు వారి ప్రతిభను ప్రదర్శించేలా విధివిధానాలను రూపొందిస్తున్నామన్నారు.

ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లో శిక్షణ..

ఆంధ్రప్రదేశ్ నుంచి అంతర్జాతీయ క్రీడాకారులను తయారు చేసేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామన్నారు. జాతీయ జట్టులో చోటు సంపాదించేలా ప్రతిభ గల క్రీడాకారులకు ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లలో వరల్డ్ క్లాస్ శిక్షణ ఇప్పిస్తామని చెప్పారు. క్రికెటర్లతో పాటు కోచ్‌లకు కూడా ఆటలో మెళకువలు, ఫిట్‌నెస్ కోసం భారత జట్టు మాజీ కెప్టెన్ రవిశాస్త్రి, మాజీ బౌలింగ్ కోచ్ శేఖర్ భరత్‌కు చెందిన 'కోచింగ్ బియాండ్' సంస్థతో ఏసీఏ ఒప్పందం చేసుకుందన్నారు. అకాడమీలు, కోచింగ్ క్యాంప్‌లలో శిక్షణ తీసుకున్న విద్యార్థులు పౌష్టికాహారం కోసం ఇంటి దగ్గర ఆర్థికంగా ఇబ్బంది పడకుండా నెలకు రూ.3 వేల చొప్పున 400 మంది క్రికెటర్లకు ఏటా రూ.1.50 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఏసీఏ సిబ్బందితో పాటు క్రికెటర్లకు కూడా గ్రూప్ ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించామన్నారు. బీసీసీఐ పరిధిలోకి రాని రంజీ మాజీ క్రికెటర్లకు నెలకు రూ.10 వేలు చొప్పున ఏడాదికి రూ.90 లక్షలు ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏసీఏ సీనియర్ సెలక్షన్ కమిటీ చైర్మన్ ఆర్.వి.చంద్రమౌళి చౌదరి, సీఈవో శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్కూల్ గేమ్స్‌లో ఏపీ విద్యార్థుల సత్తా

- వెయిట్ లిఫ్టింగ్‌లో రెండు బంగారు, మూడు రజత పతకాలు
- బాలికల ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానం
- 60 క్రీడాంశాల్లో రాష్ట్రానికి 45 పతకాలు



ఓవరాల్ చాంపియన్‌షిప్ ట్రోఫీని అందుకుంటున్న ఏపీ క్రీడాకారులు

సాక్షి, అమరావతి: జాతీయ స్కూల్ గేమ్స్‌లో ఆంధ్రప్రదేశ్ విద్యార్థులు మరోసారి తమ సత్తా చాటారు. వెయిట్‌లిఫ్టింగ్ అండర్–17 బాలికల విభాగంలో ఆరు పతకాలు సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానం సాధించారు. మూడు రోజులుగా బిహార్ రాజధాని పట్నాలో జరుగుతున్న బాలికల బాక్సింగ్ పోటీలు శనివారం ముగిశాయి. ఈ పోటీల్లో ఏపీ విద్యార్థులు రెండు బంగారు, మూడు రజత, ఒక కాంస్య పతకం సాధించి జాతీయస్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచారు. 49 కేజీల విభాగంలో రాజమండ్రి రెయిన్‌బో హైస్కూల్ విద్యార్థిని కారంగి హేమశ్రీ, 59 కేజీల విభాగంలో నెల్లిమర్ల శ్రీచక్ర జూనియర్ కాలేజీ విద్యార్థిని వి.సుస్మిత బంగారు పతకాలు సొంతం చేసుకున్నారు. 45 కేజీల విభాగంలో ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థిని రెడ్డి భవానీ, 55 కేజీల విభాగంలో రాజమండ్రి రెయిన్‌బో స్కూల్ విద్యార్థిని కారంగి తరణి, 76 కేజీల విభాగంలో గుంటూరు జిల్లా నందివెలుగు జెడ్పీ స్కూల్ విద్యార్థిని బిట్ర రోచిష్మతి రజత పతకాలు సాధించారు. ఏఎస్సార్ జిల్లా చింతూరు కేజీబీవీ విద్యార్థిని గుత్తుల మధు చందన 81 ప్లస్ కేజీల విభాగంలో కాంస్య పతకాన్ని గెలుచుకుంది. ఈ సందర్భంగా విజేతలను శనివారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేశ్ కుమార్, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు అభినందించారు. కాగా, బాలికల క్రీడా బృందానికి కోచ్‌గా కొల్లిపర నాగ శిరీష వ్యవహరించారని ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి భానుమూర్తిరాజు తెలిపారు. 67వ జాతీయ స్కూల్ గేమ్స్ దేశంలోని వివిధ పట్టణాల్లో నవంబర్‌లో ప్రారంభమయ్యాయి. మొత్తం అరవై క్రీడాంశాల్లో జరిగిన పోటీల్లో రాష్ట్రం నుంచి 192 జట్లు పాల్గొనగా, 45 మెడల్స్‌సాధించారు.

చంద్రబాబు కాస్కో.. నీ డైరీలో రాస్కో..

ఎంపీ కేశినేని వార్నింగ్



విజయవాడ స్పోర్ట్స్: విజయవాడ నుంచే టీడీపీకి, చంద్రబాబుకు గుండుకొట్టడం మొదలవుతుందని ఎంపీ కేశినేని వ్యాఖ్యానించారు. ఎన్టీఆర్ జిల్లా ముప్పాళ్లలో మీడియాతో మాట్లాడారు. తాజాగా జరిగిన రాజ్యసభ ఎన్నికల్లో పోటీచేయలేకపోయిన టీడీపీ రాజ్యసభలో సున్నా అయిందని, తెలంగాణలో 2014 ఎన్నికల్లో బీజేపీతో కలిసి, 2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌తో కలిసి దారుణంగా ఓడిపోయి అక్కడా సున్నా అయిందని ఎద్దేవా చేశారు. రానున్న ఎన్నికల్లో జిత్తులమారి పొత్తులతో ఎన్నికలకు వస్తున్న టీడీపీ ఆంధ్రాలోనూ గుండుసున్నా కాబోతుందన్నారు. విజయవాడ ఎంపీ సీటు అమ్ముకున్న నీకు (చంద్రబాబు), నీ పార్టీ (టీడీపీ)కి.. విజయవాడ నుంచే గుండు కొట్టడం ప్రారంభమవుతుందన్నారు. దీనికి సిద్ధంగా ఉండాలని.. ఎన్నికల తర్వాత ఇదే జరుగుతుంది.. కాస్కో.. దీన్నే నీ డైరీలో రాస్కో.. అంటూ చంద్రబాబుకు సవాల్ విసిరారు.

దళిత మహిళపై 'అగ్ర' పెత్తనం

- శింగనమల నియోజకవర్గంలో బండారు శ్రావణికి అడుగడుగునా అవమానాలు
- తండ్రిపై జరిగిన దాడిని ప్రశ్నించినందుకు కక్ష సాధింపు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: ఒక దళిత మహిళ. పదేళ్లుగా టీడీపీలో పనిచేస్తున్నారు. ఒకమారు ఎంఎల్ఏగా కూడా పోటీ చేశారు. అయినా ఆమెకు ఆ పార్టీలో అడుగడుగునా అవమానాలే ఎదురవుతున్నాయి. తాజాగా మళ్లీ పోటీ చేయడానికి సిద్ధపడుతున్న వేళ.. 'అగ్ర' పెత్తనం అడ్డుపడుతోంది. శింగనమల నియోజకవర్గంలో బండారు శ్రావణి పరిస్థితి ఇది. ఎస్సీ రిజర్వుడ్ అయిన శింగనమల నియోజకవర్గం నుంచి 2019 ఎన్నికల్లో టీడీపీ తరఫున బండారు శ్రావణి పోటీ చేసి ఓడిపోయారు. అయినా పార్టీ కోసం పని చేస్తున్నారు. ఆ పార్టీలోని అగ్రకుల నేతలు ఈ దళిత మహిళ పెత్తనం సహించలేకపోయారు. 2024లో మళ్లీ పోటీచేయడానికి సిద్ధమవుతుండగా..ఇంతలోనే 'షాక్' ఇచ్చారు. వారి ఒత్తిళ్లకు తలొగ్గిన అధిష్టానం ఆలం నరసానాయుడు, ముంటిమడుగు కేశవరెడ్డిలతో 'టూమెన్ కమిటీ' వేసింది. ఈ కమిటీని వేయించడంలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు కాలవ శ్రీనివాసులు కీలకంగా వ్యవహరించినట్లు ప్రచారం ఉంది. ఈ కమిటీ వచ్చినప్పటి నుంచి శ్రావణికి కష్టాలు మొదలయ్యాయి. ఈమె అభ్యర్థిత్వాన్ని టూమెన్ కమిటీ సభ్యులు ఏమాత్రమూ ఒప్పుకోవడం లేదు. టికెట్ రాకుండా చేసేందుకు అధిష్టానంపై ఒత్తిడి పెంచారు. తమ చెప్పుచేతల్లో ఉండే వ్యక్తిని మాత్రమే అభ్యర్థిగా పెట్టాలని డిమాండ్ చేస్తున్నారు.


తండ్రికి న్యాయం చేయాలని అడిగినందుకేనా?

రెండు నెలల క్రితం అనంతపురం జిల్లాలో నారా లోకేశ్ యువగళం పేరుతో పాదయాత్ర చేశారు. ఆ సమయంలో బండారు శ్రావణి తండ్రి రవికుమార్‌పై సొంత పార్టీకే చెందిన కొందరు దాడిచేశారు. ఈ ఘటనపై గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో కేసు కూడా నమోదైంది. తన తండ్రిపై దాడికి కారకులైన వారిని శిక్షించాలని, తనకు అండగా నిలవాలని లోకేశ్‌ను శ్రావణి గట్టిగా అడిగారు. కానీ ఆమె ఆవేదనను పట్టించుకోలేదు. కనీసం దాడి ఎలా జరిగిందని కూడా లోకేశ్ ఆరా తీయలేదు. పైగా తనను నిలదీసినందుకు ఈమెకు టికెట్ కూడా ఇవ్వకుండా టూమెన్ కమిటీ చెప్పినట్టుగా వింటున్నట్టు చర్చ జరుగుతోంది. ఒకవైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరుపేద కుటుంబం నుంచి వచ్చిన ఎస్సీ యువకుడిని సమన్వయకర్తగా నియమించి దళితులకు పెద్దపీట వేయగా..టీడీపీ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తూ అగ్రకుల నేతలకే పెత్తనం అప్పగించింది.

జనసేనలో 23 సీట్లు ఇతర కులాలకు ఇవ్వాలి

- కాపులు, తూర్పు కాపులకు 40 సీట్లు కేటాయించాలి
- పవన్‌కు హరిరామజోగయ్య లేఖ


పాలకొల్లు సెంట్రల్: జనసేన పార్టీ తరఫున పోటీ చేసేందుకు ఆర్థికంగా బలవంతులైన కాపు, తూర్పు కాపులకు 40 సీట్లను కేటాయించాలని, మరో 23 అసెంబ్లీ స్థానాలను ఇతర కులస్తులకు కేటాయించాలని మాజీ ఎంపీ చేగొండి హరిరామజోగయ్య పేర్కొన్నారు. ఈ మేరకు జనసేన ఇతర కులాలకు కేటాయించాల్సిన నియోజకవర్గాలు, అభ్యర్థుల వివరాలతో ఆ పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌కు ఆయన శనివారం లేఖ రాశారు. ఈ లేఖను పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లులో విలేకరులకు విడుదల చేశారు. నరసాపురం–బొమ్మిడి నాయకర్ (అగ్నికుల క్షత్రియ), గోపాలపురం–బి.సువర్ణరాజు (ఎస్సీ), కొవ్వూరు–టీవీ రామారావు (ఎస్సీ), విశాఖపట్నం దక్షిణం–వంశీకృష్ణయాదవ్ (యాదవ్), ఇచ్ఛాపురం–దాసరి రాజు (యాదవ), ముమ్మిడివరం–పితాని బాలకృష్ణ (శెట్టిబలిజ)తో పాటు రాజోలులో బొంతు రాజేశ్వరరావు, డాక్టర్ రాపాక రమేష్‌బాబు, దేవీ వరప్రసాద్ (ఎస్సీ)లలో ఒకరికి, అమలాపురం సీటురాజబాబు లేదా డీఎంఆర్ శేఖర్ (ఎస్సీ)కు ఇవ్వాలని పేర్కొన్నారు. అదేవిధంగా అవనిగడ్డ–పాపారావు (అగ్నికుల క్షత్రియ), నందిగామ–రమాదేవి (ఎస్సీ), విజయవాడ వెస్ట్–పోతిన మహేష్ (బీసీ), గుంటూరు వెస్ట్–బోనబోయిన శ్రీనివాస యాదవ్ (యాదవ), పెదకూరపాడు–బొర్రా వెంకట అప్పారావు(కమ్మ), తెనాలి–నాదెండ్ల మనోహర్ (కమ్మ), అనకాపల్లి–కొణతాల రామకృష్ణ (బీసీ), కోవూరు–జానీ మాస్టర్ (ముస్లిం), బద్వేల్–డాక్టర్ రాజశేఖర్ (ఎస్సీ), రైల్వే కోడూరు–మద్దెల వెంకట సుబ్బయ్య (ఎస్సీ), ఉంగుటూరు–పచ్చమట్ల ధర్మరాజు (క్షత్రియ), పోలవరం–చిర్రి బాలరాజు (ఎస్టీ), ఉండి–జుత్తుక నాగరాజు (బీసీ)కు, పాడేరు–వంపూరు గంగులయ్య (ఎస్టీ)లతోపాటు తణుకు సీటు విడివాడ రామచంద్రరావు లేదా భోగవల్లి ప్రసాద్ (కమ్మ)కు ఇవ్వాలని జోగయ్య తన లేఖలో సూచించారు.



(యూఎన్ గణాంకాల ఆధారంగా..) (అంచనా)

పిల్లల ప్రపంచం తగ్గిపోతోంది!

దాదాపు వందేళ్లుగా భూమ్మీద జనాభా విపరీతంగా పెరిగిపోతూ వచ్చింది. ఇదిలాగే పెరిగితే ఏమవుతుందోనన్న ఆందోళనా పెరుగుతూ వచ్చింది. కానీ ఆ టెన్షన్‌ను తగ్గిస్తూ.. కొన్నేళ్లుగా జననాల రేటు తగ్గుతూ పోతోంది. దీనివల్ల జనాభాలో వృద్ధుల శాతం పెరుగుతూ.. పిల్లల శాతం తరుగుతూ వస్తోంది. భూమ్మీద ఒకే సమయంలో అత్యంత ఎక్కువ మంది చిన్న పిల్లలు (ఐదేళ్ల వయసు లోపు) ఉన్న సమయాన్ని కూడా దాటేశామని నిపుణులు తాజాగా తేల్చారు. ప్రపంచవ్యాప్తంగా చూస్తే.. 2017వ సంవత్సరమే అత్యంత ఎక్కువ సంఖ్యలో పిల్లలు ఉన్న ఏడాది (పీక్ చైల్డ్ ఇయర్) అని.. తర్వాతి నుంచి పిల్లల సంఖ్య తగ్గుతూ వస్తోందని గుర్తించారు. 'ఐక్యరాజ్యసమితి (యూఎన్) జనాభా అంచనాలు–2022 నివేదిక' ఆధారంగా ఈ గణాంకాలను రూపొందించారు.



- సాక్షి సెంట్రల్ డెస్క్

- ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో వేర్వేరు సమయాల్లో చేపట్టిన జనాభా నియంత్రణ చర్యలు, ఆ దేశాల్లో పిల్లలను కనగలిగే వయసులో ఉన్నవారి శాతంలో తేడాల కారణంగా.. ప్రపంచ వ్యాప్తంగా పిల్లల సంఖ్య హెచ్చుతగ్గులకు లోనవుతూ వస్తోందని యూఎన్ నివేదిక వెల్లడించింది.
- మన దేశానికి వస్తే.. జనాభా నియంత్రణ, ప్రజల్లో అవగాహన కల్పించే చర్యలతో 2004వ సంవత్సరం నుంచే చిన్న పిల్లల సంఖ్య తగ్గుతూ వస్తోందని పేర్కొంది. 2021 నాటికి దేశంలో 11.53 కోట్ల మంది చిన్నారులు ఉన్నారని.. 2100 నాటికి ఇది 6.86 కోట్లకు తగ్గుతుందని అంచనా వేసింది.
- ఇటీవలి దాకా ప్రపంచంలోనే అత్యధిక జనాభా ఉన్న దేశంగా కొనసాగిన చైనాలో అత్యధికంగా 13.82 కోట్ల మంది పిల్లలు ఉన్నది 1972లోనే. నాటి నుంచి పిల్లల సంఖ్య తగ్గుతూనే ఉంది. ఈ సంఖ్య 2000వ సంవత్సరం నాటికి 8.41 కోట్లకు, 2021 నాటికి 7.47 కోట్లకు తగ్గింది. 2100 ఏడాది నాటికి అక్కడ ఐదేళ్లలోపు పిల్లల సంఖ్య 2.38 కోట్లలోపే ఉంటుందని యూఎన్ అంచనా వేసింది.

భవిష్యత్ బాగుండాలంటే మళ్లీ జగనే రావాలి

వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి



మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న న్యాయవాదులు

చిత్తూరు కార్పొరేషన్: రాష్ట్ర ప్రజలందరి భవిష్యత్ బాగుండాలంటే వైఎస్ జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రి చేసుకోవాల్సిన అవసరముందని వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం చిత్తూరులో జరిగిన వైఎస్సార్‌సీపీ చిత్తూరు జిల్లా లీగల్ సెల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం చేస్తున్న సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. ప్రతిపక్షాల ఆగడాలను ఎండగడుతూ ప్రజలను చైతన్యపరచాలని.. చంద్రబాబును ఓడించడానికి లీగల్ సెల్ విభాగం సైనికులుగా పనిచేయాలని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్ ప్రభుత్వం న్యాయవాదులకు అండగా ఉంటోందని.. సంక్షేమ నిధి కింద రూ.100 కోట్లు, జూనియర్ లాయర్లకు ఆర్థిక సాయం అందజేస్తోందని వివరించారు. జోనల్ ఇంచార్జి లోకేశ్వర్‌రెడ్డి, లీగల్ సెల్ నాయకులు పాల్గొన్నారు.

పార్థసారథికి టికెటిస్తే ఓడిస్తాం!

- ఆత్మీయ సమావేశంలో టీడీపీ కేడర్‌కు స్పష్టం చేసిన ముద్దరబోయిన
- రెండు రోజుల్లో తేల్చకపోతే తీవ్ర పరిణామాలంటూ హెచ్చరిక
- చంద్రబాబు మోసంపై కన్నీళ్లు పెట్టుకున్న ముద్దరబోయిన



ముద్దరబోయిన



పార్థసారథి

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఏలూరు జిల్లా నూజివీడు టీడీపీలో రాజకీయ ప్రకంపనలు తారాస్థాయికి చేరాయి. తాజా పరిణామాలు ఆ పార్టీ ఆశావహ అభ్యర్థి పార్థసారథికి గట్టి షాక్ ఇస్తున్నాయి. స్థానికేతరుడికి టికెట్ ఇవ్వడంతో నియోజకవర్గంలో టీడీపీ టికెట్ ఆశిస్తున్న కాపా శ్రీనివాస్ ఇప్పటికే పార్టీకి రాజీనామా చేయగా.. రెండు రోజుల్లో టికెట్ విషయం తేల్చకపోతే తన దారి తాను చూసుకుంటానని ముద్దరబోయిన అల్టిమేటం ఇచ్చారు. స్థానికేతరుడికి టికెటిస్తే ఓడించి తీరతామని అల్టిమేటం జారీచేశారు. టీడీపీ కేడర్‌తో శనివారం జరిగిన సమావేశంలో ఆయన కన్నీళ్లు పెట్టుకున్నారు.

పార్థసారథికి టీడీపీ కేడర్ ఝలక్

పార్థసారథి టీడీపీలో చేరడం ఇప్పటికే ఖరారైంది. చంద్రబాబు చింతలపూడిలో నిర్వహించిన సభకు పార్థసారథి వాహనాలు ఏర్పాటు చేసి జనాలను తరలించారు. దీంతో పాటు నియోజకవర్గంలోనూ స్వాగత ఫ్లెక్సీలు ఏర్పాటు చేసుకున్నారు. గత మూడు రోజులుగా టీడీపీ ఐవీఆర్ఎస్ సర్వే పేరుతో పార్టీ కేడర్‌కు ఫోన్లు చేస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో శనివారం నూజివీడు నియోజకవర్గంలోని ముసునూరు మండలం గోగులంపాడులో టీడీపీ మండల నేతలు ఏర్పాటు చేసిన సమావేశంలో పార్థసారథి పాల్గొన్నారు. చంద్రబాబు సొంత సామాజికవర్గ నాయకులు మినహా మిగిలిన వారు ఎవరూ హాజరుకాలేదు. నూజివీడు టికెట్ ఆశిస్తున్న కాపా శ్రీనివాస్ టికెట్ పోరాటంలో అలసిపోయి పార్టీకి రాజీనామా చేశారు. టికెట్ కోసం ముద్దరబోయినపై కాపా గట్టి పోరాటం చేశారు. పోటీ కార్యక్రమాలు, పార్టీ కార్యాలయాలకు వెళ్లి ఇన్‌చార్జిపై ఫిర్యాదు కూడా చేశారు. చివరకు పార్టీకి, రాజకీయాలకు గుడ్‌బై చెప్పారు. అయితే నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముద్దరబోయిన వెంకటేశ్వరరావు మాత్రం అందుకు సిద్ధంగా లేరు.

మూటలతో వస్తే మద్దతివ్వం: ముద్దరబోయిన

శనివారం సాయంత్రం ముద్దరబోయిన తన అనుచరులతో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసి జనసేన నేతలను కూడా ఆహ్వానించగా వారు సభకు దూరంగా ఉన్నారు. రెండు రోజుల క్రితం చంద్రబాబునాయుడిని కలిస్తే మీకు సర్వేలన్నీ బాగున్నా.. టికెట్ సర్దుబాటు చేయలేకపోతున్నామని తనకు చెప్పారని కేడర్ ముందు ఆయన వాపోయారు. పదేళ్ల నుంచి ఓడిపోతున్నా పార్టీ కోసం నియోజకవర్గంలో పనిచేస్తుంటే ఇప్పుడు టికెట్ లేదనడం కరెక్ట్ కాదని, రెండు మూడు రోజుల్లో టికెట్ విషయం తేల్చి చెప్పాలని అల్టిమేటం జారీ చేశారు. టికెట్ ఇవ్వకుంటే తీవ్ర పరిణామాలు ఉంటాయని, తన దారి తాను చూసుకుంటానని అధిష్టానానికి ముద్దరబోయిన స్పష్టం చేసినట్లు సమాచారం. పార్థసారథి వస్తే ఓడించి తీరుతామని, పార్టీ కోసం పనిచేసేవారికి కాకుండా మూటలతో వచ్చిన వారిని సమర్థించమని సమావేశంలో బహిరంగంగానే ప్రకటనలు చేశారు.

దళితుల జీవితాల్లో వెలుగులు

- మరోసారి సీఎం జగన్‌ను గెలిపించుకునేందుకు ప్రజలంతా సిద్ధం
- నమ్మలేని నాయకుడు బాబు.. నిలకడ లేని వ్యక్తి పవన్
- రాష్ట్ర సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్‌రావు



సాక్షి, మచిలీపట్నం: దళితుల జీవితాల్లో వెలుగులు నింపిన ఏకైక నేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని రాష్ట్ర సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకర్ రావు కొనియాడారు. గతంలో దళితులు ఉద్యమాలు చేసినా సమస్యలు పరిష్కారమయ్యేవి కావన్నారు. అయితే ఎలాంటి ధర్నాలు, ఆందోళనలు లేకుండానే బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ పథకాలను సీఎం జగన్ అమలు చేస్తున్నారన్నారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో శనివారం జూపూడి మీడియాతో మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని ప్రశంసించారు. ఎంతో గొప్ప ఆలోచనతో ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్ఈ విధానాన్ని తీసుకొచ్చారని కొనియాడారు. ప్రతిపక్ష నేతలు దీన్ని జీర్ణించుకోలేక కుటిల రాజకీయాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. నమ్మలేని నాయకుడు చంద్రబాబు కాగా నిలకడ లేని వ్యక్తి పవన్ కళ్యాణ్ అని ధ్వజమెత్తారు. వైఎస్సార్‌సీపీని అడ్డుకునేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా వచ్చే ఎన్నికల్లో గెలుపు మాత్రం ఆగదన్నారు. ప్రతి వర్గానికీ మేలు చేస్తున్న జగన్ లాంటి నాయకుడిని వదులుకునేందుకు ఏ ఒక్కరూ ఇష్టపడరన్నారు. విద్య, వైద్యంతో పాటు సంక్షేమ, సుపరిపాలన రంగాల్లో విప్లవాత్మక మార్పులు తెచ్చిన ఘనత ఆయనదేనని తెలిపారు. వైఎస్ జగన్‌ను పేదలు తమ గుండెల్లో పెట్టుకున్నారని చెప్పారు. ఎవరెన్ని చెప్పినా ఆయనను మరోసారి సీఎంగా గెలిపించుకునేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారన్నారు. తమ పార్టీ అభ్యర్థులను మారుస్తుంటే విమర్శలు చేస్తున్న చంద్రబాబు.. చంద్రగిరి నుంచి కుప్పంకు ఎందుకు వెళ్లారని నిలదీశారు.

టంగుటూరు టోల్ ప్లాజా వద్ద రూ.2.9 కోట్లు స్వాధీనం

టంగుటూరు: ప్రకాశం జిల్లాలోని టంగుటూరు టోల్ ప్లాజా వద్ద శనివారం కారులో తరలిస్తున్న రూ.2.9 కోట్లను పోలీసులు, ఆదాయపన్ను శాఖ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. విజయవాడ ఆదాయపన్ను శాఖాధికారులు అందించిన సమాచారం మేరకు.. జాతీయ రహదారిపై టోల్ ప్లాజా వద్ద పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. అదే సమయంలో హైదరాబాద్ నుంచి నెల్లూరు వెళ్తున్న కారును తనిఖీ చేయగా.. బ్యాగులో పెద్ద మొత్తంలో నగదున్నట్లు గుర్తించారు. కారులో ఉన్న ముగ్గురు వ్యక్తులను విచారించగా, సరైన ఆధారాలు చూపించలేదు. దీంతో వారితో పాటు నగదు, కారును స్థానిక పోలీసుస్టేషన్‌కు తరలించారు. కారుతో సహా రూ.2.9 కోట్లను విజయవాడ ఆదాయపన్ను శాఖాధికారులకు అప్పగించారు.

భారీగా కర్ణాటక మద్యం స్వాధీనం

- చిత్తూరులో అక్రమ మద్యం విక్రయాలపై దాడులు
- రూ.11.22 లక్షల మద్యం సీజ్.. నలుగురు అరెస్టు

చిత్తూరు అర్బన్: చిత్తూరు నగరంలో అక్రమ మద్యం విక్రయాలపై పోలీసులు శనివారం దాడులు నిర్వహించారు. భారీ స్థాయిలో కర్ణాటక మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ ఈఎస్ శ్రీధర్‌రావు తెలిపిన వివరాల ప్రకారం... చిత్తూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అర్బన్ సీఐ విజయకుమార్, ఎస్ఐ పవన్‌కుమార్ చిత్తూరు ఇరువారం కూడలి వద్ద సోమవారం తనిఖీలు నిర్వహించారు. పాల వాహనంలో తరలిస్తున్న 92 బాక్సుల్లోని 6,048 ప్యాకెట్ల కర్ణాటక మద్యం పట్టుకున్నారు. వాటి విలువ రూ.9.42 లక్షలుగా నిర్ణయించారు. చిత్తూరు నగరానికి చెందిన ఎ.విశ్వనాథ్, ఎన్.దేవ, ఎస్.రాజేష్‌ను అరెస్టు చేశారు. అలాగే చిత్తూరు టూటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రాజా అనే వ్యక్తి నుంచి 22 బాక్సుల మద్యాన్ని సీఐ ఉలసయ్య పట్టుకున్నారు. దీని విలువ రూ.1.80 లక్షలు ఉంటుందని డీఎస్పీ రాజగోపాల్‌రెడ్డి వెల్లడించారు. ఇతనికి మద్యం సరఫరా చేసిన ప్రధాన నిందితుడు తేనబండకు చెందిన జయశంకర్‌పై కేసు నమోదు చేశారు.

ఇంటిపై 'కోటి'సూర్య కాంతులు

- పీఎం సూర్య ఘర్ పథకాన్ని ప్రారంభించిన కేంద్రం
- నెలకు 300 యూనిట్ల లోపు విద్యుత్ వాడే వారికి ఉపయోగం
- ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరణ



సాక్షి, అమరావతి: నివాస గృహాలపై సౌర పలకలను అమర్చి విద్యుత్ ఉత్పత్తి చేసుకునేందుకు వీలుగా కేంద్ర ప్రభుత్వం ఇటీవల సూర్య ఘర్ పథకాన్ని ప్రారంభించింది. నెలకు 300 యూనిట్ల విద్యుత్‌ను వినియోగించే కోటి మందికి విద్యుత్‌ను ఉచితంగా ఇచ్చేందుకు రూ. 75 వేల కోట్లతో ఈ కొత్త సోలార్ రూఫ్‌టాప్ పథకాన్ని తీసుకువచ్చినట్లు కేంద్ర పునరుత్పాదక ఇంధన వనరుల శాఖ చెబుతోంది. కాగా ఈ పథకాన్ని పొందాలనుకునేవారు జాతీయ పోర్టల్ (https:pmsuryaghar. gov.in)లో దరఖాస్తు చేసుకోవచ్చు.

గరిష్టంగా రూ. 78 వేల వరకూ రాయితీ

రూఫ్‌టాప్ సోలార్ సిస్టం ఏర్పాటు చేయాలంటే ప్రతి కిలోవాట్‌కు 100 చదరపు అడుగుల స్థలం ఉండాలి. 1 కిలోవాట్‌కి రూ. 50 వేలు, 1 కిలోవాట్‌పైన 2 కిలోవాట్ల వరకూ కిలోవాట్‌కి రూ. 47 వేలు, 2 కిలోవాట్లపైబడి 3 కిలోవాట్ల వరకూ కిలోవాట్‌కు రూ.45 వేలు, 3 కిలోవాట్ల పైన 10 కిలోవాట్ల వరకూ కిలోవాట్‌కి రూ. 44 వేలు, 10 కిలోవాట్ల పైబడి 100 కిలోవాట్ల వరకూ కిలోవాట్‌కి రూ. 38 వేలు, 100 కిలోవాట్లపైన 500 కిలోవాట్ల వరకూ కిలోవాట్‌కు రూ.36 వేలు ఖర్చవుతుంది. కొత్త పథకం ప్రకారం.. సోలార్ ప్యానెళ్లను ఏర్పాటు చేసుకునే గృహాలకు మొదటి 2 కిలోవాట్లకి కిలోవాట్‌కు రూ. 30 వేల వరకూ సబ్సిడీ వస్తుంది. 3 కిలోవాట్ల వరకూ అదనంగా సామర్థ్యం జోడిస్తే కిలోవాట్‌కి రూ. 18 వేలు చొప్పున రాయితీ వస్తుంది. ఇలా గరిష్టంగా రూ. 78 వేల వరకూ రాయితీని పొందవచ్చు.

ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం

ప్రజలు తమ గృహ, వాణిజ్య అవసరాలకు సౌర విద్యుత్‌ను వినియోగించుకునేందుకు వీలుగా సోలార్ రూఫ్‌టాప్ పాలసీ (ఎస్ఆర్‌టీ)ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చింది. ఉత్పత్తి అయిన విద్యుత్తును సొంత అవసరానికి వాడుకోగా మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు ఎగుమతి చేస్తే దానిని డిస్కంలు తమ మీటరు ద్వారా రికార్డ్ చేస్తాయి. ఎగుమతి చేసిన యూనిట్లకు ఏపీఈఆర్‌సీ నిర్ణయించిన పూల్ కాస్ట్ ధర (రూ. 4.60 పైసలు)ను డిస్కంలు చెల్లిస్తున్నాయి. దీనివల్ల రూఫ్‌టాప్ నిర్వాహకులకు ప్రయోజనం చేకూరుతోంది. అటు డిస్కంలు కూడా నెట్ మీటరింగ్ ద్వారా రూఫ్‌టాప్ సోలార్ సిస్టంల నుంచి ఉత్పత్తి చేసిన విద్యుత్‌ను 'రెన్యూవబుల్ పవర్ పర్చేజ్ ఆబ్లిగేషన్ (ఆర్‌పీఓ) లక్ష్యంలో చూపించుకునే వెసులుబాటు మన రాష్ట్రంలో ఉంది. ఈ చర్యల కారణంగా రాష్ట్రంలో సోలార్ రూఫ్‌టాప్ ఇన్‌స్టాలేషన్స్ 138 శాతం పెరిగాయి. కేంద్రం తెచ్చిన కొత్త పథకంలో నెలకు 300 యూనిట్లు వాడే వినియోగదారులకు ఏటా రూ.15 వేలు విద్యుత్ బిల్లు ఆదా అవుతుంది.

బారామతిలో ప'వార్'!


సునేత్ర


సుప్రియా సూలే

శరద్‌పవార్ కుమార్తె సుప్రియా సూలేపై భార్య సునేత్రను పోటీకి దింపే యోచనలో అజిత్ పవార్

సార్వత్రిక సమరంలో వదినా మరదళ్లలో గెలుపెవరిది?

ఎన్సీపీ పార్టీని చీల్చి బీజేపీ ప్రభుత్వంలో చేరి ఉపముఖ్యమంత్రి పదవి చేపట్టిన అజిత్ పవార్.. తన భార్యను రాజకీయ అరంగేట్రం చేయిస్తున్నారా? అందులోనూ దిగ్గజ నేత శరద్‌పవార్ కుమార్తె, సిట్టింగ్ ఎంపీ సుప్రియా సూలే ప్రాతినిధ్యం వహిస్తున్న 'బారామతి' నుంచే బరిలో దింపుతున్నారా? అంటే ఎన్సీపీ వర్గాలు అవుననే అంటున్నాయి. ఈ వార్తలను బలం చేకూరుస్తూ ఇప్పటికే కొన్ని చోట్ల 'బారామతి ఎంపీ సునేత్రా పవార్' అంటూ భారీ హోర్డింగ్‌లనూ పెట్టేశారు. ఇక అధికారికంగా ప్రకటించడమే తరువాయి అనే పుకార్లు బారామతి నియోజకవర్గంలో షికార్లుచేస్తున్నాయి. అసలు సునేత్రా పేరు తెరమీదకు ఎందుకొచ్చింది? అనే ప్రశ్నకు ఆమె భర్త అజిత్ వ్యాఖ్యల్లో సమాధానం దొరుకుతుంది. శుక్రవారం జరిగిన ఓ కార్యక్రమంలో డెప్యూటీ సీఎం అజిత్ పవార్ భావోద్వేగంతో చేసిన ప్రసంగం ఈ వార్తలకు బలం చేకూర్చింది. బారామతి లోక్‌సభ స్థానం నుంచి ఎవరిని నిలపబోతున్నారో ఆయన స్పష్టంగా చెప్పకపోయినా..' ఈసారి బారామతిలో కొత్త అభ్యర్థిని నిలుపుతాం. తొలిసారి పోటీచేస్తున్న అభ్యర్థి.. మన భవిష్యత్ తరాల సంక్షేమం కోసం అవిశ్రాంతంగా పనిచేయగలరు. కొందరు 'పాత' భావోద్వేగాలతో ఓటేయాలని మిమ్మల్ని అడుగుతారు. పట్టించుకోకండి. జరగబోయే నిరంతర అభివృద్ధిని మాత్రమే దృష్టిలో పెట్టుకోండి. మొదటిసారి పోటీచేస్తున్నా ఆశీర్వదించండి. అభివృద్ధిని గెలిపించండి' అని పిలుపునిచ్చారు. వెంటనే భార్య సునేత్రనే ఆయన రంగంలోకి దింపబోతున్నారని భావించిన ఎన్సీపీ పార్టీ వర్గాలు ఆ నియోజకవర్గం ప్రధాన కూడళ్లలో భారీ హోర్డింగ్‌లు పెట్టేశాయి. కాబోయే ఎంపీ సునేత్రా పవార్ అని రాసి ఉన్న ఫ్లెక్సీలతో బారామతిలో అప్పుడే ఎన్నికల కోలాహలం మొదలైంది. శరద్‌పవార్ కుటుంబానికి కంచుకోట ఈ నియోజకవర్గం. ఇక్కడ ఎన్సీపీ దిగ్గజ నేత శరదపవార్ కూతురు సుప్రియా సూలే సిట్టింగ్ ఎంపీగా కొనసాగుతున్నారు. 2009 ఏడాది నుంచి అప్రతిహతంగా ఆమె జైత్రయాత్ర కొనసాగుతోంది. ఆమెను ఢీకొట్టాలంటే తమ కుటుంబానికే చెందిన మహిళా అభ్యర్థి అయితేనే ఎన్నికల రణరంగంలో నెగ్గుకు రాగలరని అజిత్ పవార్ భావిస్తున్నారు. అందుకే భార్యను బరిలో నిలుపుతున్నట్లు తెలుస్తోంది. అయితే ఎన్సీపీ పార్టీని అజిత్ పవార్ చీల్చిన నేపథ్యంలో పార్టీ ఓటర్లు సైతం రెండు వర్గాలుగా చీలే అవకాశముంది. అప్పుడు సుప్రియా, సునేత్రలలో ఎవరు గెలుపు తలుపు తట్టగలరో వేచి చూడాల్సిందే.

- సాక్షి, నేషనల్ డెస్క్

ఎవరీ సునేత్రా?

అజిత్ భార్యగా తప్పితే రాజకీయ వర్గాల్లో ఎవరికీ తెలియని పేరు సునేత్ర. ఆమె చాలా సంవత్సరాలుగా సామాజిక కార్యక్రమాల్లో నిమగ్నమయ్యారు. శరద్‌పవార్‌కు ఒకప్పటి సన్నిహిత నేత, మాజీ మంత్రి పద్మసిన్హా పాటిల్ చెల్లెలే ఈమె. ప్రత్యక్ష రాజకీయాలు ఈమెకు కొత్త. ఎన్విరాన్‌మెంట్ ఫోరమ్ ఆఫ్ ఇండియా పేరిట ఒక ఎన్‌జీవోను సునేత్ర నడుపుతున్నారు. సేంద్రీయ వ్యవసాయం, సేంద్రీయ ఎరువుల వినియోగాన్ని ఈమె అమితంగా ప్రోత్సహిస్తున్నారు. పర్యావరణహిత గ్రామాల స్థాపనకు కృషిచేస్తున్నారు. ప్రముఖ విద్యాసంస్థ 'విద్యా ప్రతిష్ఠాన్'కు ట్రస్టీగా ఉన్నారు. ఫ్రాన్స్‌లోని మేథో సంస్థ వరల్డ్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ ఫోరమ్‌లో 2011 నుంచి భాగస్వామిగా కొనసాగుతున్నారు. అయితే ఈమె మెల్లిగా ప్రచారకార్యక్రమాలు మొదలెట్టినట్లు తెలుస్తోంది. 2019లో సుప్రియాపై పోటీచేసి ఓడిపోయిన బీజేపీ మహిళా అభ్యర్థి కంచన్ రాహుల్ కౌల్‌ను ఈవారమే కలిసి చర్చించారని వార్తలొచ్చాయి. అజిత్, సునేత్రలకు ఇద్దరు కుమారులు. జై పవార్, పార్థపవార్. 2019లో మావాల్ లోక్‌సభ స్థానం నుంచి పోటీచేసి పార్థపవార్ ఓటమిని చవిచూశారు.

కంచుకోట బారామతి

పవార్‌ల కుటుంబానికి పుణె జిల్లాలోని బారామతి పెట్టనికోట. గత 55 సంవత్సరాలుగా ఇక్కడ వీరిదే హవా. తొలిసారిగా మహారాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో 1967లో బారామతి ఎమ్మెల్యే నియోజకవర్గం నుంచి పోటీ చేసి శరద్‌పవార్ గెలిచారు. తర్వాత 1972, 1978, 1980, 1985, 1990 అసెంబ్లీ ఎన్నికల్లోనూ ఇదే స్థానంలో ఘన విజయం సాధించారు. ఇదే బారామతి లోక్‌సభ స్థానం నుంచీ శరద్‌పవార్ 1984, 1996, 1999, 2004 ఎన్నికల్లో విజయఢంకా మోగించారు. అజిత్ పవార్ సైతం 1991లో ఇదే లోక్‌సభ స్థానం నుంచి ప్రాతినిధ్యం వహించారు. ఇక్కడి నుంచి అజిత్ ఏకంగా ఏడుసార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. ప్రస్తుతం బారామతి ఎమ్మెల్యే అజితే. 2009 నుంచి సుప్రియా సూలే ఇక్కడ ఎంపీగా గెలుస్తూ వస్తున్నారు. ఇక్కడ ఈసారి సునేత్రను దింపితే స్పష్టంగా 'పవర్'ప్లే మొదలైనట్లే. పెదనాన్న కొడుకైన అజిత్.. సుప్రియాకు అన్నయ్య అవుతారు. ఆ లెక్కన వదినా, మరదళ్ల పోరులో గెలుపెవరిదో చూడాలి మరి!

'కమలం' చెంతకు కమల్‌నాథ్?

- కుమారుడు సైతం పార్టీ మారొచ్చంటూ పుకార్లు
- కొట్టిపారేసిన మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి



న్యూఢిల్లీ/భోపాల్: మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ సీనియర్ నేత కమల్‌నాథ్ హస్తం పార్టీకి గుడ్‌బై చెప్పబోతున్నారంటూ వార్తలు గుప్పుమన్నాయి. అయితే అలాంటిదేమీ లేదని కమల్‌నాథ్ ఆ వార్తలను కొట్టిపారేశారు. అయితే శనివారం జరిగిన పరిణామాలు చూస్తుంటే ఆయన బీజేపీ కండువా కప్పుకోవడం ఖాయంగా కనిపిస్తోందని విశ్లేషణలు వినవచ్చాయి.

అసలేం జరిగింది?

కమల్‌నాథ్‌కు మాజీ మీడియా సలహాదారు, ప్రస్తుత బీజేపీ అధికార ప్రతినిధి అయిన నరేంద్ర సలూజా.. కమల్‌నాథ్, ఆయన కుమారుడు, ఛింద్వారా కాంగ్రెస్ ఎంపీ నకుల్‌నాథ్‌లతో దిగిన భోపాల్‌లో దిగిన ఒక ఫొటోను 'ఎక్స్'లో పోస్ట్‌చేసి దానికి 'జై శ్రీరామ్' అని ట్వీట్‌చేశారు. దీంతో తండ్రీకొడుకులు కమలం గూటికి చేరుకుంటున్నారని వార్తలు మొదలయ్యాయి. వీటికి బలం చేకూరుస్తూ నకుల్‌నాథ్ తన 'ఎక్స్(పాత ట్విట్టర్)' ఖాతా వివరాల్లో కాంగ్రెస్ పదాన్ని తొలగించారు. ముందస్తు షెడ్యూల్ లేకుండా హడావుడిగా ఇద్దరూ ఢిల్లీకి వచ్చారు. రాగానే మీడియా కమల్‌ను ప్రశ్నించింది. మీరు పార్టీ మారుతున్నారా? అన్న ప్రశ్నకు '' అలాంటిదేమైనా ఉంటే ముందు మీకే చెబుతా' అని అన్నారుగానీ పార్టీని వీడట్లేదనే సమాధానం చెప్పలేదు. దీంతో అనుమానాలు మరింత బలపడ్డాయి. రాజ్యసభ సీటు ఆశించి భంగపడినందుకే కమల్‌నాథ్ పార్టీని వీడుతున్నారని మరో విశ్లేషణ వినిపించింది. బీజేపీలోకి వస్తామంటే ఇప్పుడే మీకు స్వాగతం పలుకుతామని మధ్యప్రదేశ్ బీజేపీ చీఫ్ వీడీ శర్మ శుక్రవారం వ్యాఖ్యానించడం తెల్సిందే. గత ఏడాది మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ పేలవ ప్రదర్శనకు కమల్‌నాథ్ బాధ్యుడని రాహుల్ భావిస్తున్నారని, అందుకే కమల్‌ను తప్పించి జీతూ పట్వారీకి కాంగ్రెస్ మధ్యప్రదేశ్ చీఫ్ పదవి కట్టబెట్టారని వార్తలొచ్చాయి.

అన్నీ అసత్యాలు : జీతూ పట్వారీ

ఇలాంటి వార్తలను కాంగ్రెస్ మధ్యప్రదేశ్ అధ్యక్షుడు జీతూ పట్వారీ తోసిపుచ్చారు. '' కాంగ్రెస్‌తో కమల్‌నాథ్ బంధం ఈనాటిది కాదు. ఇందిరాగాంధీ తనయుడు సంజయ్ గాంధీతో కలిసి డెహ్రాడూన్ డూన్ స్కూల్‌లో చదివారు. ఒకానొక సమయంలో కమల్ నా మూడో కుమారుడు అంటూ స్వయంగా ఇందిరగాంధీనే వ్యాఖ్యానించారు. అలాంటి వ్యక్తి కాంగ్రెస్‌ను వీడుతారా?'' అని మీడియానే పట్వారీ నిలదీశారు. ''రాజ్యసభ సీటు ఇవ్వలేదన్నది అవాస్తం. నిజానికి ఆ స్థానం కోసం నామినేషన్ వేసిన పార్టీ కోశాధికారి అశోక్‌సింగ్ పేరును బలపరిచింది కమల్‌నాథే'' అని పట్వారీ వివరణ ఇచ్చారు. దశాబ్దాలుగా కాంగ్రెస్‌తో అనుబంధమున్న కమల్ ఛింద్వారా నుంచి తొమ్మిదిసార్లు ఎంపీగా గెలిచారు. 2019లో ఆ స్థానం నుంచి కమల్ కుమారుడు నకుల్ గెలిచారు. ఈ ఒక్క స్థానం తప్ప రాష్ట్రంలోని మిగతా 28 ఎంపీ స్థానాలను బీజేపీ కైవసం చేసుకుంది.

గుల్జార్, రామభద్రలకు జ్ఞానపీఠ్


గుల్జార్


రామభద్రాచార్య


దామోదర్ మౌజో (2022 గ్రహీత)

న్యూఢిల్లీ: ప్రముఖ ఉర్దూ కవి గుల్జార్, సంస్కృత పండితుడు జగద్గురు రామభద్రాచార్య ప్రతిష్ఠాత్మక 58వ జ్ఞానపీఠ్ పురస్కారానికి ఎంపికయ్యారు. జ్ఞానపీఠ్ ఎంపిక కమిటీ శనివారం ఈ విషయం వెల్లడించింది. 2023వ సంవత్సరానికి గాను ఈ ఇద్దరు ప్రముఖులకు అవార్డు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలియజేసింది. 2022వ సంత్సరానికి గాను గోవా రచయిత దామోదర్ మౌజోకు జ్ఞానపీఠ్ లభించింది. ప్రసిద్ధ బాలీవుడ్ సినీ రచయిత, ఉర్దూ కవి సంపూరణ్ సింగ్ కాల్రా అలియాస్ గుల్జార్(89)ను ఇప్పటికే ఎన్నో పురస్కారాలు వరించాయి. 2002లో సాహిత్య అకాడమీ అవార్డు స్వీకరించారు. 2013లో దాదాసాహెబ్ ఫాల్కే, 2004లో పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు. ఐదు సార్లు జాతీయ ఫిలిం అవార్డు పొందారు. స్లమ్‌డాగ్ మిలియనీర్, మాచీస్, ఓంకారా, దిల్ సే, గురు వంటి చిత్రాల్లో ఆయన రాసిన పాటలు విమర్శకుల ప్రశంసలు అందుకున్నాయి. స్లమ్‌డాగ్ మిలియనీర్‌లోని 'జై హో' పాటకు 2009లో ఆస్కార్ అవార్డు దక్కింది.

బహుముఖ ప్రజ్ఞాశాలి రామభద్రాచార్య

ఉత్తరప్రదేశ్‌లో జన్మించిన జగద్గురు రామభద్రాచార్య(74) మధ్యప్రదేశ్‌లోని చిత్రకూట్‌లో తులసీ పీఠాన్ని స్థాపించారు. రామానంద పరంపరలో ప్రస్తుతం ఉన్న నలుగురు జగద్గురువుల్లో ఆయన కూడా ఒకరు. రెండు నెలల వయసులో ఇన్ఫెక్షన్ వల్ల కంటి చూపు కోల్పోయారు. ఐదేళ్ల వయసులోనే భగవద్గీతను, ఎనిమిదేళ్ల వయసులో రామచరితమానస్‌ను కంఠస్థం చేశారు. రామభద్రాచార్య బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరుగాంచారు. 22 భాషల్లో మాట్లాడగలరు. సంస్కృతం, హిందీ, అవధీ, మైథిలీ తదితర భాషల్లో రచనలు చేశారు. 240కిపైగా పుస్తకాలు రాశారు.2015లో కేంద్ర ప్రభుత్వం ఆయనను పద్మవిభూషణ్ పురస్కారంతో సత్కరించింది.

100 రోజులు.. 370 స్థానాలు

ఢిల్లీలో బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు ప్రారంభం

- సార్వత్రిక ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులకు అగ్రనేతల దిశానిర్దేశం
- ప్రతి బూత్‌లో అదనంగా 370 ఓట్లు సాధించాలని ప్రధాని మోదీ పిలుపు
- ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచన


సమావేశంలో ప్రధాని మోదీకి పూలమాల వేస్తున్న జేపీ నడ్డా

సాక్షి, న్యూఢిల్లీ: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ముచ్చటగా మూడోసారి 370 నియోజకవర్గాల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు సాగాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాల్లో అగ్రనేతలు దిశానిర్దేశం చేశారు. బీజేపీ సొంతంగానే 370 స్థానాలు, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే కనీసం 400 స్థానాలు దక్కించుకోవడానికి రాబోయే వంద రోజులు కష్టపడి పనిచేయాలని వెల్లడించారు. గడిచిన పదేళ్ల కాలంలో కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రపంచవ్యాప్తంగా భారత్‌కు లభిస్తున్నగౌరవాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కృషి చేయాలని పార్టీ నేతలకు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలు శనివారం ఢిల్లీలోని భారత్ మండపంలో ప్రారంభమయ్యాయి. మరో మూడు నెలల్లోగా జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయమే లక్ష్యంగా వ్యూహరచన చేస్తున్నారు. తొలిరోజు భేటీకి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్రం హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాశ్ నడ్డా, పలువురు కేంద్ర మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎంపీలు, కోర్ కమిటీ సభ్యులు, ఇతర సీనియర్ నేతలు సహా 11 వేల మందికి పైగా ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విజయాలను తెలిలియజేసే ఎగ్జిబిషన్‌ను ప్రధాని మోదీ, నడ్డా తదితరులు తిలకించారు. అనంతరం పలువురు ముఖ్యనేతలు ప్రసంగించారు. ఎన్నికల్లో గెలుపు లక్ష్యాలు, ప్రచార వ్యూహాలపై మార్గనిర్దేశం చేశారు.

ముఖర్జీకి నిజమైన నివాళి: మోదీ

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో సొంతంగా 370 సీట్లు గెలుచుకోవడమే బీజేపీ లక్ష్యమని ప్రధాని మోదీ పునరుద్ఘాటించారు. శనివారం బీజేపీ జాతీయ ఆఫీసు–బేరర్ల భేటీలో ఆయన ప్రసంగించారు. జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పిస్తూ రాజ్యాంగంలో చేర్చిన ఆర్టికల్ 370ని జనసంఘ్ వ్యవస్థాపకుడు శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ తీవ్రంగా వ్యతిరేకించారని గుర్తుచేశారు. రాబోయే ఎన్నికల్లో 370 స్థానాలు సాధించడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ లక్ష్యాన్ని సాధించడానికి 100 రోజుల ప్రణాళిక ప్రకారం కార్యకర్తలు బూత్ స్థాయిలో పనిచేయాలని సూచించారు. ప్రతి బూత్‌లో కొత్తగా 370 ఓట్లు అధికంగా బీజేపీకి లభించేలా చూడటంతోపాటు కొత్త ఓటర్లను ఆకర్షించాలని చెప్పారు.

తెలంగాణలోనూ అధికారంలోకి వస్తాం: జేపీ నడ్డా

ప్రధాని మోదీ నాయకత్వంలో పదేళ్ల కాలంలో బీజేపీ అనేక విజయాలు సాధించిందని జేపీ నడ్డా అన్నారు. 2014లో 5 రాష్ట్రాల్లో బీజేపీ అధికారంలో ఉండగా, ప్రస్తుతం 12 రాష్ట్రాల్లో బీజేపీ, 17 రాష్ట్రాల్లో ఎన్డీయే అధికారంలో ఉందని గుర్తుచేశారు. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీకి 10 శాతం ఓట్లు పెరిగాయని చెప్పారు. కొన్ని నెలల క్రితం జరిగిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి ఓట్ల శాతం గణనీయంగా పెరిగిందని, మూడు రాష్ట్రాల్లో విజయం సాధించామని తెలిపారు. తెలంగాణ ఎన్నికల్లో ఓడిపోయినా పార్టీ పరంగా గెలిచామని అన్నారు. రాష్ట్రంలో తమ ఎమ్మెల్యేల సంఖ్య ఒక్కటి నుంచి 8కి, ఓట్ల శాతం 7.1 నుంచి 14కు పెరిగిందని వెల్లడించారు. తెలంగాణను వదిలిపెట్టబోమని, అక్కడ అధికారంలోకి వస్తామని, అందుకు ప్రణాళికలు తయారవుతున్నాయని పేర్కొన్నారు. అయోధ్యలో రామమందిర ప్రాణప్రతిష్ట సందర్భంగా దేశ ప్రజలంతా దీపాలు వెలిగించినా, ప్రతిపక్ష నేతలు మాత్రం ఈ మహత్కార్యానికి దూరంగా ఉన్నారని విమర్శించారు.

తెలంగాణ, ఏపీ నుంచి భారీగా హాజరైన నేతలు

బీజేపీ జాతీయ కార్యవర్గ సమావేశాలకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి బీజేపీ నేతలు భారీగా హాజరయ్యారు. తెలంగాణ నుంచి రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డితో పాటు జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, ప్రధాన కార్యదర్శి బండి సంజయ్, ఎంపీ కె.లక్ష్మణ్‌లతో పాటు సీనియర్ నేతలు ఈటల రాజేందర్, పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మర్రి శశిధర్‌రెడ్డి, బూర నర్సయ్యగౌడ్, కూన శ్రీశైలం గౌడ్, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే కాటేపల్లి వెంకటరమణారెడ్డి హాజరయ్యారు. ఆంధ్రప్రదేశ్ నుంచి రాష్ట్ర బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి, సీనియర్ నేతలు సోము వీర్రాజు, కిరణ్‌కుమార్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, సత్యకుమార్, కిలారు దిలీప్ హాజరయ్యారు.

జీఎస్ఎల్‌వీ-ఎఫ్14 సక్సెస్



సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) జియో సింక్రనస్ లాంచింగ్ శాటిలైట్ వెహికల్ (జీఎస్ఎల్‌వీ-ఎఫ్14) ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించింది. శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ 'షార్'లోని రెండో ప్రయోగ వేదిక నుంచి శనివారం సాయంత్రం 5.35 గంటలకు రాకెట్ నింగిలోకి దూసుకెళ్లింది. శుక్రవారం మధ్యాహ్నం 2.05 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. 27.30 గంటల అనంతరం నిర్దేశిత సమయానికి రాకెట్ ప్రయోగం చేపట్టారు. ఈ ప్రయోగంలోని మొత్తం మూడు దశలు విజయవంతమయ్యాయి. 2,275 కిలోల బరువు కలిగిన ఇన్‌శాట్-3డీఎస్ సమాచార ఉపగ్రహాన్ని భూమికి దగ్గరగా 170 కిలోమీటర్లు(పెరిజీ), భూమికి దూరంగా 36,647 కిలోమీటర్ల(అపోజీ) జియో ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్ (భూబదిలీ కక్ష్య)లో ప్రవేశపెట్టారు. ఇన్‌శాట్-3డీఎస్‌లో నింపిన 1,250 కిలోల ఇంధనాన్ని దశల వారీగా మండించి, మరో రెండు మూడు రోజుల్లో భూమికి 36 వేల కిలోమీటర్ల ఎత్తులోని జియో ఆర్బిట్(భూ స్థిరకక్ష్య)లోకి ఉపగ్రహాన్ని ప్రవేశపెడతారు.

ఏమిటీ ఇన్‌శాట్-3డీఎస్?

దేశంలో సమాచార వ్యవస్థను మరింత బలోపేతం చేయడానికి ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహాన్ని ప్రయోగించారు. వాతావరణ పరిస్థితులపై పరిశోధనలు, విపత్తుల గురించి ముందస్తు సమాచారం అందించడానికి ఈ ఉపగ్రహం తోడ్పడనుంది. దీంతో వాతావరణంపై అంచనాల్లో మరింత స్పష్టత రానుంది. ఇన్‌శాట్-3, ఇన్‌శాట్-3ఆర్ ఉపగ్రహాలకు అనుసంధానంగా మూడో తరం ఇన్‌శాట్-3డీఎస్ ఉపగ్రహం పని చేస్తుంది. ఇప్పటిదాకా ఇన్‌శాట్ శ్రేణిలో 23 ఉపగ్రహాలను ప్రయోగించారు. ఇన్‌శాట్-3డీ, ఇన్‌శాట్-3డీఆర్ శాటిలైట్లకు కొనసాగింపుగా ఇన్‌శాట్-3డీఎస్‌ని అభివృద్ధి చేశారు. ఇందులో ఆరు చానెల్ ఇమేజర్స్, 19 చానెల్ సౌండర్స్ తోపాటు మెట్రోలాజికల్ పేలోడ్స్, కమ్యూనికేషన్ పేలోడ్స్‌ను అమర్చారు. వాతావరణ పరిశీలనతోపాటు భూమి, సముద్ర ఉపరితలాల అధ్యయనం కోసం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఈ ఉపగ్రహాన్ని రూపొందించారు. ఇది ఐదేళ్ల నుంచి పదేళ్ల దాకా సేవలు అందించనుంది.

త్వరలో నిస్సార్ ప్రయోగం: సోమనాథ్

నాసా-ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్(నిస్సార్) మిషన్ అనే జాయింట్ ఆపరేషన్ ఉపగ్రహాన్ని ఈ ఏడాది జూన్‌లో జీఎస్ఎల్‌వీ-ఎఫ్15 రాకెట్ ద్వారా ప్రయోగించనున్నట్లు ఇస్రో చైర్మన్ సోమనాథ్ చెప్పారు. పీఎస్ఎల్‌వీ-సీ59, ఎస్ఎస్ఎల్‌వీ-డీ3, జీఎస్ఎల్‌వీ-ఎఫ్15 ప్రయోగాలతో పాటు కర్ణాటకలోని చిత్రదుర్గ నుంచి ఆర్ఎల్‌వీ-టీడీ-2 ప్రయోగం కూడా నిర్వహించబోతున్నట్లు ఎస్.సోమనాథ్ తెలిపారు.

ట్రంప్‌కు 3 వేల కోట్ల జరిమానా



న్యూయార్క్: అమెరికా మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ పార్టీ నేత డొనాల్డ్ ట్రంప్‌కు వరుసగా ఎదురుదెబ్బలు తగులుతున్నాయి. రెండోసారి అధ్యక్ష పదవి దక్కించుకోవాలని ఆరాటపడుతున్న ఆయనకు కొత్త కష్టాలు వచ్చిపడుతున్నాయి. తప్పుడు ఆర్థిక పత్రాలతో బ్యాంకులను, బీమా సంస్థలను మోసం చేసిన కేసులో న్యూయార్క్ కోర్టు ట్రంప్‌కు శుక్రవారం 364 మిలియన్ డాలర్ల (రూ.3,020 కోట్లు) జరిమానా విధించింది. తన ఆదాయం, ఆస్తుల విలువను వాస్తవ విలువ కంటే కాగితాలపై అధికంగా చూపించి, బ్యాంకులు, బీమా సంస్థల నుంచి చౌకగా రుణాలు, బీమా పొందడంతోపాటు ఇతరత్రా ఆర్థికంగా లాభపడినట్లు ట్రంప్‌పై ఆరోపణలు వచ్చాయి. బ్యాంకులు, బీమా సంస్థలను మోసగించినట్లు కేసు నమోదైంది. న్యూయార్క్ అటార్నీ, జనరల్ డెమొక్రటిక్ పార్టీ నేత జేమ్స్ కోర్టులో దావా వేశారు. దీనిపై న్యాయస్థానం రెండున్నర నెలలపాటు విచారణ జరిపింది. ట్రంప్‌పై వచ్చిన అభియోగాలు నిజమేనని తేల్చింది. ట్రంప్ నిర్వాకం వల్ల బ్యాంకులు, ఇన్సూరెన్స్ కంపెనీలు నష్టపోయినట్లు గుర్తించింది. ఈ కేసులో ట్రంప్‌నకు 355 మిలియన్ డాలర్లు, ఆయన ఇద్దరు కుమారులు ఎరిక్ ట్రంప్, డొనాల్డ్ ట్రంప్ జూనియర్‌కు 4 మిలియన్ డాలర్ల చొప్పున, ట్రంప్ మాజీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్‌కు ఒక మిలియన్ డాలర్ల జరిమానా విధిస్తూ న్యూయార్క్ కోర్టు న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. అంటే ట్రంప్ మొత్తం 364 మిలియన్ డాలర్ల జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. అలాగే న్యూయార్క్‌కు చెందిన ఏ సంస్థలోనూ ఆయన డైరెక్టర్ లేదా ఆఫీసర్‌గా ఉండకూడదని న్యాయమూర్తి ఆదేశించారు. ఇది సివిల్ కేసు కావడంతో ట్రంప్‌కు జైలు శిక్ష విధించడం లేదని స్పష్టం చేశారు. న్యూయార్క్ కోర్టు తీర్పుపై ఉన్నత న్యాయస్థానంలో అప్పీల్ చేస్తామని ట్రంప్ తరఫు న్యాయవాదులు చెప్పారు.

కోర్టులో వర్చువల్‌గా హాజరైన కేజ్రీవాల్

సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నిసార్లు సమన్లు జారీచేసినా గైర్హాజరవుతున్న ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ వైఖరిపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కోర్టుకెక్కిన నేపథ్యంలో కేజ్రీవాల్ చివరకు కోర్టు ఎదుట వర్చువల్‌గా హాజరయ్యారు. ఢిల్లీ అసెంబ్లీలో రాష్ట్ర బడ్జెట్ సమావేశాలు ఉన్నందున కోర్టుకు స్వయంగా రాలేనని ఆయన అంతకుముందు పెట్టుకున్న అభ్యర్థనను కోర్టు మన్నించింది. దీంతో ఆయన శనివారం ఢిల్లీ సిటీ కోర్టులో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్చువల్ విధానంలో కోర్టు విచారణకు హాజరయ్యారు. కేసు తదుపరి విచారణను జడ్జి మార్చి 16వ తేదీకి వాయిదావేశారు.

సుప్రీంకు వెళతాం: శరద్ పవార్

బారామతి(మహారాష్ట్ర): నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం, మహారాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ తీసుకున్న నిర్ణయం అన్యాయపూరితమని ఆ పార్టీ వ్యవస్థాపకుడు శరద్ పవార్ శనివారం పేర్కొన్నారు. దీనిపై తాము సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామన్నారు. డిప్యూటీ సీఎం అజిత్ పవార్ సారథ్యంలోని చీలికవర్గమే అసలైన ఎన్సీపీ అని, పార్టీ పేరు, ఎన్నికల గుర్తును కూడా అజిత్ పవార్ వర్గానికే కేటాయిస్తూ ఈసీతోపాటు స్పీకర్ నర్వేకర్ ఇటీవల నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే.

బాణసంచా ఫ్యాక్టరీలో పేలుడు..10 మంది మృతి

సాక్షి, చెన్నై: తమిళనాడు రాష్ట్రం విరుధునగర్‌లో బాణసంచా ఫ్యాక్టరీలో సంభవించిన పేలుడులో నలుగురు మహిళలు సహా 10 మంది ప్రాణాలు కోల్పోయారు. వెంబకొట్టై ప్రాంతంలోని కుండయిరుప్పులో నిర్వహిస్తున్న బాణసంచా తయారీ యూనిట్ కెమికల్ మిక్సింగ్ రూంలో శనివారం మధ్యాహ్నం పేలుడు చోటుచేసుకుంది. ఘటనలో నలుగురు మహిళలు, ఆరుగురు పురుషులు చనిపోగా మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. మానవతప్పిదం వల్లే ప్రమాదం జరిగి ఉండొచ్చని కలెక్టర్ జయశీలన్ చెప్పారు.

తండ్రి సహా 12 మందిని చంపేశాడు!

టెహ్రాన్: ఇరాన్‌లో ఓ వ్యక్తి దారుణానికి ఒడిగట్టాడు. తండ్రి, సోదరుడు సహా మొత్తం 12 మంది కుటుంబసభ్యులను పొట్టనబెట్టుకున్నాడు. కెర్మాన్ ప్రావిన్స్‌లో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు ఇరాన్ మీడియా శనివారం తెలిపింది. 30 ఏళ్ల వ్యక్తి తన తండ్రి, సోదరుడితోపాటు మొత్తం 12 మందిని ఏకే రైఫిల్‌తో కాల్చి చంపాడని, అనంతరం పోలీసులు అతడిని కాల్చి చంపారని తెలిపింది. మారుమూల గ్రామంలో చోటుచేసుకున్న ఈ దారుణానికి కుటుంబకలహాలే కారణమని పేర్కొంది. మృతుల్లో చిన్నారులు ఎక్కువ మంది ఉన్నట్లు సమాచారం. అయితే, మృతుల వివరాలు, ఘటనకు కారణాలను మాత్రం మీడియా వెల్లడించలేదు.

మోదీకి మరోసారి అధికారం ఇవ్వొద్దు: ఖర్గే

మంగళూరు: దేశాన్ని నియంతృత్వం దిశగా నడిపిస్తున్న నరేంద్ర మోదీ ప్రభుత్వానికి మరోసారి అధికారం ఇవ్వరాదని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే వ్యాఖ్యానించారు. నిరుద్యోగుల కోసం మరిన్ని ఉద్యోగావకాశాలు సృష్టిస్తామని, ప్రతి ఒక్కరి బ్యాంకు అకౌంట్‌లో రూ.15 లక్షలు జమ చేస్తామంటూ ఇచ్చిన వాగ్దానాలను ప్రధాని మోదీ తుంగలో తొక్కారన్నారు. కర్ణాటకలో లోక్‌సభ ఎన్నికల ప్రచార కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. రాష్ట్ర ప్రజలకిచ్చిన హామీలన్నిటినీ కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేర్చిందని, కనీసం 20 లోక్‌సభ స్థానాలను సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

సింహానికి 'సీత'పేరు.. హైకోర్టులో పిటిషన్

సిలిగురి: త్రిపుర నుంచి బెంగాల్ సఫారీ పార్కుకు తీసుకువచ్చిన ఆడ సింహానికి సీత అంటూ పేరు పెట్టడంపై విశ్వహిందూ పరిషత్(వీహెచ్‌పీ) అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ చర్య మత విశ్వాసాలను దెబ్బతీసేలా ఉందని పేర్కొంది. పేరును మార్చేలా అధికారులను ఆదేశించాలంటూ కలకత్తా హైకోర్టు జల్పాయిగురి సర్క్యూట్ బెంచ్‌లో పిటిషన్ వేసింది. భవిష్యత్తులో సైతం దేవుళ్ల, దేవతల పేర్లను జంతువులకు పెట్టకుండా అడ్డుకోవాలని కోరింది. త్రిపురలోని సెపాహిజల జూలాజికల్ పార్కు నుంచి ఈ నెల 12వ తేదీన రెండు సింహాలను తీసుకువచ్చారు. అందులో ఒక సింహానికి అక్బర్ అనీ, మరో సింహానికి సీత అని పేరు పెట్టారని ఈ నెల 16న వేసిన పిటిషన్‌లో వివరించింది. దీనిపై ఈ నెల 20న విచారణ చేపడతామని బెంచ్ తెలిపినట్లు లాయర్ సుభాకర్ తెలిపారు. అయితే, తాము ఎలాంటి పేరూ పెట్టలేదని పార్కు అధికారులు అంటున్నారు.

కనీసం చివరిచూపు చూసుకోనివ్వండి

నవాల్నీ మృతదేహం అప్పగింత కోసం తల్లి ఆవేదన

మాస్కో: రష్యా మారుమూల జైలులో అనుమానాస్పద స్థితిలో మృతిచెందిన విపక్ష నేత, హక్కుల ఉద్యమకారుడు అలెక్సీ నవాల్నీ పార్థివదేహాన్ని వెంటనే అప్పగించాలని ఆయన తల్లి ఆవేదనతో ప్రభుత్వాన్ని అభ్యర్థించారు. చనిపోయాక మృతదేహాన్ని వేరే చోటుకు తరలించామంటూ తల్లి, నవాల్నీ న్యాయవాదులను అటూ ఇటూ తిప్పుతూ అధికారులు తిప్పలు పెడుతున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని ల్యాబ్ పరీక్షలు చేయిస్తేగానీ విషప్రయోగం జరిగిందా లేదా అనేది తెలియని పరిస్థితి. అందుకే కుటుంబసభ్యులకు మృతదేహాన్ని అప్పగించట్లేరనే వాదన వినిపిస్తోంది. మాస్కోకు 1,900 కిలోమీటర్ల దూరంలోని ఆర్కిటిక్ ధృవ సమీపంలో మంచుమయ మారుమూల కారాగారంలో శుక్రవారం నవాల్నీ మరణించిన విషయం తెల్సిందే. విషయం తెల్సి నవాల్నీ తల్లితో కలిసి న్యాయవాది కిరా యామిష్క ఆ జైలుకెళ్లారు. అక్కడ మృతదేహం లేదు. దర్యాప్తులో భాగంగా సలేఖర్డ్ సిటీకి తరలించామని అధికారులు చెప్పారు. తీరా అక్కడి సిటీ మార్చురీకి వెళ్తే మూసేసి ఉంది. ఇక్కడికి తీసుకురాలేదని అక్కడి అధికారులు చెప్పారు. 'మరణానికి కారణాన్ని రష్యా ప్రభుత్వం ఇంతవరకు వెల్లడించలేదు. మృతదేహాన్ని అయినా అప్పగించాలి' అని లాయర్ డిమాండ్‌చేశారు.

'మద్దతు'పై ఆర్డినెన్స్ తెండి: పంధేర్

ఛండీగఢ్: ఓవైపు పంజాబ్, హరియాణా సరిహద్దుల వద్ద పోలీసులతో ఘర్షణ పడుతూనే రైతు సంఘాల నేతలు మరోవైపు కేంద్రప్రభుత్వం వద్ద మరో డిమాండ్ వినిపించారు. పంటలకు కనీస మద్దతు ధర(ఎంఎస్‌పీ)కి చట్టబద్ధత కోరుతూ రైతులు 'ఢిల్లీ చలో' పేరిట ఉద్యమిస్తున్న విషయం తెల్సిందే. ఆదివారం కేంద్ర మంత్రులు, రైతు సంఘాల నేతల మధ్య నాలుగో విడత చర్చలు మొదలు కానున్న తరుణంలో రైతు సంఘాలు తమ డిమాండ్లను వినిపించాయి. సంయుక్త కిసాన్ మోర్చా(రాజకీయేతర), కిసాన్ మజ్దూర్ మోర్చాల పిలుపుమేరకు వేలాదిగా పంజాబ్, హరియాణా సరిహద్దుల్లోని శంభు, ఖనౌరీ బోర్డర్ పాయింట్‌లకు చేరుకున్న రైతులు శనివారం సైతం ప్రభుత్వంపై తమ నిరసనను ట్రాక్టర్ ర్యాలీలు, ధర్నాల ద్వారా వ్యక్తంచేశారు. ఎంఎస్‌పీకి చట్టబద్ధత కల్పిస్తూ వెంటనే ప్రభుత్వం ఆర్డినెన్స్ జారీచేయాలని రైతు నేత శర్వాణ్ పంధేర్ డిమాండ్‌చేశారు.

దేశాన్ని ఐక్యంగా ఉంచడమే దేశభక్తి: రాహుల్

వారణాసి: సమాజంలో ధనిక, పేద వర్గాల మధ్య అంతరాలు పెరిగిపోతున్న ఈ తరుణంలో దేశాన్ని ఐక్యంగా ఉంచడమే అసలైన దేశభక్తి అని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఉత్తరప్రదేశ్‌లో శనివారం రెండో రోజు భారత్ జోడో న్యాయ్ యాత్ర కొనసాగింది. వారణాసిలోని గడొలియా జంక్షన్‌లో జరిగిన ర్యాలీలో రాహుల్ మాట్లాడారు. 'మన దేశంలో రెండు భారత్‌లున్నాయి. అందులో ఒకటి ధనిక, మరొకటి పేద భారత్. అన్నదమ్ముల మధ్య విభేదాలతో దేశం బలహీనమైపోతోంది. దేశాన్ని ఐక్యంగా ఉంచడమే నిజమైన దేశభక్తి. ప్రేమను పంచే మన దేశంలో ద్వేషాన్ని చోటులేదు'అని ఆయన అన్నారు.

బీజేపీకి పెద్ద సవాల్‌గా ఎదిగాం: కేజ్రీవాల్

న్యూఢిల్లీ: బీజేపీకి రాజకీయాల్లో అతిపెద్ద సవాల్‌గా, కొరకరాని కొయ్యలా తయారయ్యాం కాబట్టే ఆప్‌పై బీజేపీ అన్ని వైపుల నుంచి దాడులు చేస్తోందని ఆప్ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. బడ్జెట్ సమావేశాల్లో తన ప్రభుత్వంపై పెట్టుకున్న విశ్వాస తీర్మానంపై చర్చ సందర్భంగా శనివారం కేజ్రీవాల్ ప్రసంగిస్తూ బీజేపీపై విమర్శలు గుప్పించారు. '' ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీదే గెలుపు కావచ్చు. కానీ 2029 సార్వత్రిక ఎన్నికల్లో మాత్రం దేశానికి బీజేపీ నుంచి విముక్తి కల్పిస్తాం. ఆ బాధ్యత ఆప్ తన భుజస్కంధాలపై వేసుకుంది. సభలో ఆప్‌కే మెజారిటీ ఉందనేది స్పష్టం. అయితే ఆప్ ఎమ్మెల్యేలకు ఎరవేసి తమ వైపు లాక్కుని, ఆప్ సర్కార్‌ను కూల్చేద్దామని బీజేపీ కుట్ర పన్నింది. అందుకే ఈ విశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టాల్సి వచ్చింది'' అని కేజ్రీవాల్ స్పష్టంచేశారు. తర్వాత విశ్వాస తీర్మానం మూజువాణి ఓటుతో నెగ్గింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం | 18 ఫిబ్రవరి | 2024

చెరువులో చేపల తుదిశ్వాస


ఒడ్డుకు కొట్టుకొచ్చిన చేపలు

మైసూరు: మైసూరు నగరంలో ఉన్న కుక్కరెహళ్ళి చెరువులో నీరు కలుషితం కావడంతో చెరువులు మృత్యువాత పడుతున్నాయి. పెద్ద పెద్ద సైజులో ఉన్న 60కి పైగా చేపలు చనిపోయాయి. ఆ చేపలను కుక్కలు పట్టుకొచ్చి ఇళ్ల మధ్య తింటున్నాయని ప్రజలు వాపోయారు. పాలికె అధికారులు పట్టించుకోవడం లేదని, చెరువు కలుషితం కాకుండా చర్యలు తీసుకుని జలచరాల్ని కాపాడాలని ప్రజలు కోరారు.

న్యూస్‌రీల్

నగరంలో బాల్య వివాహం

బనశంకరి: సిలికాన్ నగరంలో బాల్య వివాహం జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాలిక తల్లిదండ్రులకు చెప్పకుండా ఆమె పెదనాన్న , పెద్దమ్మ కలిసి ఓ యువకునితో మూడుముళ్లు వేయించారు. బాలిక తల్లి ఈ ఘటన పై సర్జాపుర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తమ కూతురు ఇంకా మైనర్ అని, ఆమెను బలవంతం చేసి చింతామణి కైవారలోని యల్లమ్మ గుడిలో పెళ్లి చేశారని ఫిర్యాదులో తెలిపారు. హలసినకాయపుర గ్రామానికి చెందిన వినోద్‌కుమార్‌తో బాలిక కొన్నిరోజుల కిందట వివాహమైంది. వరుడు, అతని కుటుంబీకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరింది.

నక్సలైటు శ్రీమతికి కస్టడీ



శివాజీనగర: కరపత్రాల పంపిణీ, ప్రభుత్వ ఆస్తి నష్టం, విధ్వంసానికి కుట్ర పన్నిన ఆరోపణలతో కేరళలో అరెస్టయిన చిక్కమగళూరు జిల్లాకు చెందిన మహిళా నక్సలైటు శ్రీమతికి ఎన్‌ఆర్ పుర కోర్టు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించింది. పై ఆరోపణలతో పాటు బెదిరింపులు, తుపాకీ చూపి చోరీ చేయడం వంటి 9 ఆరోపణలతో పోలీసులు కేసులు నమోదు చేశారు. వాటి ప్రకారం కేరళలో తలదాచుకున్న శ్రీమతిని అరెస్ట్ చేసి కార్కళ పోలీసులకు అప్పగించారు. కార్కళ పోలీసుల నుంచి శృంగేరి పోలీసులు అదుపులోకి తీసుకుని ఎన్‌ఆర్ పుర కోర్టుకు హాజరుపరిచారు. జ్యుడిషియల్ కస్టడీ విధించడంతో ఆమెను జైలుకు తరలించారు.

మహిళా పోలీస్ ఆత్మహత్య


మంజుశ్రీ (ఫైల్)

దొడ్డబళ్లాపురం: మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామనగర తాలూకా ద్యావసంద్ర గ్రామంలో చోటుచేసుకుంది. బెంగళూరు మైకో లేఔట్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసే మంజుశ్రీ (29) కి శివాజీనగర పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యింది. శుక్రవారం రాత్రి స్వగ్రామం ద్యావసంద్రకు వచ్చి ఇంట్లో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకుంది. పని ఒత్తిడి లేదా బదిలీ ఇష్టం లేక ఇలా చేసుకుని ఉంటుందని అనుమానిస్తున్నారు. హారోహళ్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

మణిపాల్‌లో విద్యార్థి..

యశవంతపుర: పరీక్షల భయంతో విద్యార్థి ఒకరు భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉడుపి జిల్లా మణిపాల్ మాహె వర్సిటీలో జరిగింది. బిహార్‌కు చెందిన సత్యం సుమన్ (19) ఇంజినీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. పరీక్ష జరుగుతున్న సమయంలో భవనం 6వ అంతస్తు నుంచి దూకడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. ఈ దుర్ఘటనతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.



బెంగళూరు షెరటాన్‌లో నగల ప్రదర్శనలో నటి నిశ్వికా నాయుడు

సైబర్ నేరం.. ఆచూకీ కష్టం


సైబర్ నేరాలకు అమాయకులు బలి

- అధిక కేసుల్లో దొరకని దొంగలు
- కేసులు వేలాది, అరెస్టులు వందల్లోనే
- దేశంలో సైబర్ నేరాల్లో రెండవ స్థానంలో కన్నడనాడు
- జాగ్రత్తే జనానికి రక్ష




సైబర్ దొంగల బారిన పడకుండా ఉండడమే శ్రేయస్కరం

బనశంకరి: చోరీలు, దొంగతనాలు, దోపిడీలు, మోసాలు లాంటి కనిపించే నేర కార్యకలాపాలు తగ్గుముఖం పడితే, కంటికి కనబడని ఆన్‌లైన్ లోకంలో సైబర్ నేరాలు హెచ్చుమీరిపోయాయి. ఆదమరిచిన తక్షణం లక్షలాది రూపాయలను కేటుగాళ్లు కాజేస్తారు. ఇటువంటి నేరాల్లో నేరగాళ్ల బ్యాంక్ అకౌంట్ ఫ్రీజ్ చేసి వెనక్కి రప్పించడంలో పోలీసులు కొద్దిమేరే సఫలం అవుతున్నారు. ఎక్కువ నేరాల్లో సైబర్ వంచకులను అరెస్టు చేసి జైలుశిక్ష విధించడంలో ఆశించిన వేగం లేదు.

దేశంలో సైబర్ నేరాల్లో వృద్ధి..

- ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం దేశంలో సైబర్ నేరాలు 24 శాతం హెచ్చుమీరాయి. సైబర్ క్రైంలో కర్ణాటక రెండో స్థానంలో ఉంది. దేశంలోని మహానగరాలతో పోలిస్తే బెంగళూరులో ఎక్కువ సైబర్ నేరాలు జరుగుతున్నాయి. బాధితుల్లో విద్యావంతులు, ఐటీ బీటీ ఉద్యోగులు, శ్రీమంతులు అధికంగా ఉంటున్నారు.
- దేశంలో 2021లో 52,974 సైబర్ వంచన కేసులు నమోదు కాగా 2022లో 65,893 కేసులు వచ్చాయి. దేశంలో 2021లో 736 మంది, 2022లో 1407 మంది సైబర్ నేరగాళ్లకు మాత్రమే జైలు శిక్ష పడింది. అనేక కేసుల్లో నిందితుల ఆచూకీ లేదు.
- మరికొన్ని కేసుల్లో వంచకులు పట్టుబడినప్పటికీ నేరాలు రుజువు చేయడానికి సాక్ష్యాధారాలు లేక పోవడంతో విడుదలయ్యారు. ఇంకా కొన్ని కేసులు కోర్టుల్లో విచారణదశలో ఉన్నాయి. అందుకే సైబర్ దొంగల చేతిలో మోసపోకుండా జాగ్రత్తలు పాటించడమే ఉత్తమం.

బాధితుల కోసం 1930..

ఊరట ఏమిటంటే సైబర్ నేరాలకు గురైన బాధితులు తక్షణమే 1930 హెల్ప్‌లైన్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే వంచకుల అకౌంట్‌కు బదిలీ కాబడిన నగదును ఫ్రీజ్ చేస్తారు. తరువాత చట్టప్రకారం బాధితులకు వాపస్ అందిస్తారు. ఇలా దేశవ్యాప్తంగా 2021 ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు 4 లక్షల సైబర్ కేసుల్లో రూ.1000 కోట్లకు పైగా నగదును బాధితులకు అప్పగించారు. బెంగళూరు, కర్ణాటకలో కూడా పెద్దసంఖ్యలో బాధితులకు ప్రయోజనం కలిగింది. 2021 ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు దేశంలో రూ.10,300 కోట్లను సైబర్ చోరులు దోచుకోగా ఇందులో 10 శాతం డబ్బును బ్యాంక్ అకౌంట్లలో ఫ్రీజ్ చేసి బాధితులకు అప్పగించారు.

కర్ణాటక కంటే యూపీ వేగం..

సైబర్ దొంగలను పట్టుకోవడంలో కర్ణాటక పోలీసులు వెనుకబడ్డారని ఎన్‌సీఆర్‌బీ నివేదికలో ప్రస్తావించింది. దీనికి సాంకేతిక పరిజ్ఞానం కొరత అని పోలీస్ అధికారులు తెలిపారు. 12,556 కేసులు నమోదైతే, 679 మంది నేరగాళ్లను మాత్రమే అరెస్ట్ చేశారు. కానీ ఉత్తరప్రదేశ్ పోలీసులు 8,249 కేసుల్లో 7,122 నిందితులను అరెస్టు చేయడం గమనార్హం.

● సప్తమి రథోత్సవం


రథ సప్తమి మహోత్సవం సందర్భంగా రేవు నగరం మంగళూరులో వేంకట రమణ స్వామి రథోత్సవం వైభవోపేతంగా జరిగిన దృశ్యం. స్వామి వారి తేరు వేడుక, అదే సమయంలో పల్లకీ ఉత్సవం జరిగింది. వేలాది భక్తజనం తిలకించి తరించారు.


డిమాండ్ల సాధన కోసం బెంగళూరు స్వతంత్ర పార్కులో దళిత సంఘాల ధర్నా

అన్ని వర్గాలకు మోదీ పెద్దపీట: కేంద్రమంత్రి

బనశంకరి: గత 70 ఏళ్ల నుంచి దేశంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దేశం అభివృద్ధి సాధించలేదని కేంద్ర సామాజిక న్యాయ మంత్రి రామదాస్ అథవాలె ఆరోపించారు. శనివారం బెంగళూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతోందన్నారు. నేడు అన్ని సముదాయాలు రిజర్వేషన్ల కోసం డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు. రాహుల్‌గాంధీ ఓబీసీ గణనకు డిమాండ్ చేస్తున్నారని, కానీ యుపీఏ ప్రభుత్వం ఉన్న సమయంలో ఎందుకు నిర్ణయం తీసుకోలేదని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల పెంపునకు డిమాండ్ ఉందన్నారు. కర్ణాటకలో 28 ఎంపీ సీట్లలో బీజేపీ 25 సీట్లు గెలుస్తుందని చెప్పారు.

● తేరుపై రంగనాథుడు



తుమకూరు: తుమకూరు జిల్లాలోని శిర తాలూకాలోని తావరెకెరె గ్రామంలో వెలసిన చరిత్ర ప్రఖ్యాత బండి రంగనాథ స్వామి దేవస్థానం బ్రహ్మరథోత్సవం వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. వేలాది మంది భక్తుల మధ్య తేరు సంబరం సాగింది. జై రంగనాథా అని జపిస్తూ తేరును లాగారు. ఈ సందర్భంగా భక్తులు తేరుపైకి అరటిపండ్లు, పూల వర్షం కురిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు టిఆర్ దేవరాజు, తహసిల్దార్ దత్తాత్రేయ గాద, అజయ్‌గౌడ, ఎంటి రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్ర తలకిందులు


ఢీకొని బోల్తా పడిన టిప్పర్ లారీ


తుక్కు తుక్కయిన కారు

- కారును ఢీకొన్న టిప్పర్
- నలుగురు బెంగళూరువాసులకు తీవ్రగాయాలు

మైసూరు: కంకర మట్టితో వెళ్తున్న టిప్పర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి కారును ఢీకొట్టాడు, కారు నుజ్జునుజ్జు కాగా అందులోని నలుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన మైసూరు జిల్లా నంజనగూడు తాలూకాలో మైసూరు– ఊటీ హైవేలో జరిగింది. బెంగళూరు యలహంకకు చెందిన బీజేపీ రాష్ట్ర ఎస్సీ యువ మోర్చా అధ్యక్షుడు జగదీష్ (40), జాన్ (40), హలసూరుకు చెందిన సుజయ్ (29), సతీష్ (35) తీవ్రంగా గాయపడినవారు. అంబులెన్సులో వారిని మైసూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వీరిలో జగదీష్, జాన్‌ల పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బెంగళూరు నుంచి కారులో బండీపుర అడవి టూర్‌కి వెళ్లారు. అక్కడ సరదాగా గడిపి తిరిగి వస్తున్న సమయంలో టిప్పర్ డ్రైవర్ అడ్డదిడ్డంగా నడుపుతూ కారును ఢీకొన్నాడు. దీంతో కారు ఎగిరి కొంత దూరం పడిపోయింది. లారీ కూడా పల్టీలు కొట్టింది. నంజనగూడు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని బైకిస్టు బలి..

చెరుకు లోడుతో వెళుతున్న లారీ, ఢీకొనడంతో బైకిస్టు చనిపోయిన సంఘటన జిల్లాలో టి.నరిసిపుర తాలూకాలోని విజయపుర గ్రామంలో జరిగింది. కుక్కూరు గ్రామానికి చెందిన ప్రశాంత్ (31) ధర్మస్థల సేవాసంస్థలో పనిచేస్తుంటాడు. 7 నెలల కిందటే ఇతనికి పెళ్లయింది. శనివారం పని మీద బైక్‌పై వెళ్తుండగా చెరుకు లారీ ఢీకొనడంతో ఘటనాస్థలంలోనే మరణించాడు. తలకాడు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

కుక్కల దాడిలో బాలికకు గాయాలు

మైసూరు: వీధి కుక్కలు దాడి చేయడంతో బాలికకు తీవ్ర గాయాలైన దుర్ఘటన మైసూరు నగరంలో జరిగింది. గుండూరావు నగరలో నివాసం ఉంటున్న పి.యోగీష్ నాలుగేళ్ల కుమార్తె శనివారం ఇంటి ముందు ఆడుకుంటోంది. ఈ సమయంలో కొన్ని వీధి కుక్కలు బాలిక మీద దాడి చేశాయి. బాలిక గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి కుక్కలను తరిమివేశారు. కాళ్లు చేతులు, కడుపు, ముఖంపై ఎక్కువగా కరిచాయి. తీవ్రంగా గాయపడిన చిన్నారిని కేఆర్ ఆస్పత్రికి తరలించారు.

ఇరానీ చోరుల ముఠా అరెస్టు

బనశంకరి: ఇళ్లలో చోరీలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడి దోచుకుని, ఆ సొత్తును అమ్ముకునే ముగ్గురు ఇరానీ గ్యాంగ్‌ను మహాలక్ష్మీ లేఔట్ పోలీసులు అరెస్ట్‌చేశారు. వీరి వద్ద నుంచి రూ.7.82 లక్షల విలువచేసే 127 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. బెళగావి జిల్లా గోకాక్ తాలూకా నాసీర్ ఇరాని, అమీర్‌జాద ఇరాని, జాహీర్ అబ్బాస్ అనే ముగ్గురు దొంగలు కురబరహళ్లిలో 60 ఫీట్ రోడ్డు సమీపంలోని బంగారు నగల షాపులో చోరీ సొత్తును విక్రయిస్తున్నట్లు పోలీసులకు తెలిసింది. వెంటనే మహాలక్ష్మీ లేఔట్ పోలీసులు వెళ్లి దొంగలను అరెస్టు చేశారు.

కార్ల షోరూంలలో మంటలు


అగ్ని ప్రమాదానికి గురైన షోరూం


పాక్షికంగా కాలిన కార్లు

- శివమొగ్గలో సంఘటన

శివమొగ్గ: శివమొగ్గ నగరంలో ఉన్న శంకరమఠం రోడ్డులోని హుండై కార్ల షోరూంలో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. కొన్ని కార్లు దెబ్బ తిన్నాయి. ఆ షోరూం పక్కనే ఉన్న టాటా కార్ల షోరూంలోకి కూడా మంటలు వ్యాపించి అందులో ఉన్న నాలుగు కార్లు కాలిపోయాయి. సిబ్బంది రాత్రి షోరూం మూసివేసి వెళ్లిపోయారు. ప్రమాదం ఎలా జరిగిందో గానీ ఉవ్వెత్తున మంటలు ఎగసిపడ్డాయి. అందులోని రెండు కార్లు, ఫర్నిచర్, కంప్యూటర్లు ఇతర సామగ్రి బుగ్గి అయిపోయింది. మంటలు పక్కనే ఉన్న టాటా షోరూంని కూడా తాకడంతో అక్కడా అగ్నిప్రమాదం జరిగి నాలుగు కార్లు, ఇతరత్రా వస్తుసామగ్రి దగ్ధమయ్యాయి. ఫైర్, పోలీసులు చేరుకుని మంటలను ఆర్పివేశారు. కరెంటు షార్ట్ సర్క్యూట్ వలన ప్రమాదం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు.

సీఎం కారు అడ్డగింత

యశవంతపుర: మంగళూరులో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి హాజరు కావడానికి వెళ్తున్న సీఎం సిద్దరామయ్య, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కార్లను బీజేపీ కార్యకర్తలు అడ్డుకుని హిందూ వ్యతిరేకులంటూ నినాదాలు చేశారు. కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం మంగళూరు ఆడ్యార్‌లోని సహ్యాద్రి కాలేజీలో బృహత్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఇందులో సిద్దు, ఖర్గే, డీసీఎం డీకే శివకుమార్, కేసీ వేణుగోపాల్, రణదీప్ సింగ్ సుర్జేవాలతో పాటు మంత్రులు, ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకుల వాహనాలను బీజేపీ కార్యకర్తలు అడ్డుకుని ఉద్రిక్తతను సృష్టించారు.

సాంత్వనం.. చిత్రలేఖనం

- నగరంలో అలరించే ప్రదర్శన


చిత్ర ప్రదర్శనలో వర్ధమాన చిత్రకారులు

బనశంకరి: నగర ఒత్తిడి జీవనంలో అలసిన మనసులకు హృద్యమైన చిత్రలేఖనాలు సాంత్వననిస్తాయి. బసవనగుడిలో కలర్స్ బ్రీజ్ పేరుతో మొదలైన పెయింటింగ్స్ ప్రదర్శన నగరవాసులకు కనువిందు చేస్తోంది. బీపీ.వడియా రోడ్డులో ఇన్స్టిట్యూట్ ఆఫ్ వరల్డ్ కల్చర్‌లో సీనియర్ చిత్రకారుడు కే.మాల్యాద్రి ఆధ్వర్యంలో బృంద చిత్ర ప్రదర్శన శుక్రవారం ఆరంభమైంది. ఇందులో 18 మంది వర్ధమాన కళాకారులు గీసిన విభిన్న రకాల చిత్రాలు ఆకట్టుకుంటాయి. ప్రకృతి, వన్యజీవులు, దేవీ దేవతలు, నగర జీవనం తదితరాలను ఇతివృత్తంగా చేసుకుని చిత్రకారులు కుంచె ద్వారా నవ్యమైన చిత్రాలను గీశారు. మహిళా కళాకారులు ఎక్కువమంది పాల్గొనడం విశేషం. మేటి కళాకారులకు తీసిపోని రీతిలో వైవిధ్య రీతిలో పెయింటింగ్స్‌ను గీశారు. ఈ ప్రదర్శన 20 వరకు జరుగుతుంది.




పెయింటింగ్స్ వీక్షణం



ఎమ్మెల్సీ ఎన్నికలో రికార్డు ఓటింగ్



శివాజీనగర: బెంగళూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉప ఎన్నికలకు శుక్రవారం శాంతియుత పోలింగ్ జరిగింది. సుమారు 86.38 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి 20న నిర్వహిస్తారు. బెంగళూరు నగర, గ్రామీణ, రామనగర జిల్లాల పరిధిలో పోలింగ్ జరిగింది. ఈసారి రికార్డుస్థాయిలో ఓటేశారు. బెంగళూరు నగర జిల్లాలో 83.97 శాతం, బీబీఎంపీ సెంట్రల్‌లో 83.19 శాతం, ఉత్తరలో 82.43 శాతం, దక్షిణలో 82.51 శాతం మంది ఓటేశారు. బెంగళూరు గ్రామీణ జిల్లాలో 96.02 శాతం పోలింగ్, రామనగర జిల్లాలో 95.77 శాతం పోలింగ్ జరిగింది. కాంగ్రెస్ అభ్యర్థి పుట్టణ్ణ, జేడీఎస్ అభ్యర్థి ఏపీ రంగనాథ్‌తో పాటు ఎన్నికల్లో 9 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈ ఉప ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థి పదవీకాలం 2026 నవంబర్ 11 వరకే ఉంటుంది. రంగనాథ్, పుట్టణ్ణ మధ్య తీవ్ర పోటీ నెలకొంది.

రాజ్యసభ బరిలో ఐదుగురు..

రాష్ట్రంలో రాజ్యసభకు జరుగుతున్న ఎన్నికల నామినేషన్ల పరిశీలనలో ఇద్దరు అభ్యర్థులు తిరస్కరణకు గురయ్యారు. ఐదుగురి నామినేషన్లను ఆమోదించారు. బీజేపీ అభ్యర్థి నారాయణ సా.కె బాండెగె, కాంగ్రెస్ అభ్యర్థులైన అజయ్ మాకెన్, జీ.సీ.చంద్రశేఖర్, సయ్యద్ నాసీర్ హుసేన్, జేడీఎస్ అభ్యర్థి డీ.కుపేంద్ర రెడ్డి నామినేషన్ అంగీకారమయ్యాయి. స్వతంత్రులు కే.పద్మరాజన్, కెంగనూరులను తిరస్కరించారు. 20వ తేదీ సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. మూడు పార్టీల నుంచి ఐదుమంది అభ్యర్థులు దిగడంతో పోలింగ్ అనివార్యంగా మారింది. ఈ నెల 27న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధానసౌధలో పోలింగ్ జరుగుతుంది. సాయంత్రం 5 గంటల తరువాత ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు.

24, 25న రాజ్యాంగ ఐక్యత సభ: సీఎం

శివాజీనగర: భారత రాజ్యాంగం, ఐక్యత గురించి ఈ నెల 24, 25 తేదీల్లో బెంగళూరులో జాతీయ ఐక్యతా సమావేశం ఏర్పాటు చేసినట్లు సీఎం సిద్దరామయ్య తెలిపారు. శనివారం బెంగళూరు విధానసౌధలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల కోసం అంబేడ్కర్ రాజ్యాంగం అందజేశారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలైంది. అయినా కూడా నేటికీ దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతలు ఉన్నాయి. పేదలు అవకాశాలకు నోచుకోలేకపోయారు. అందుచేత రాజ్యాంగంపై జాగృతి కల్పించే లక్ష్యంతో 24, 25 తేదీల్లో ఐక్యతా సమావేశం జరుగుతుందని చెప్పారు. జిల్లాల్లోనూ జాగృతి అభియాన సాగుతుందని తెలిపారు.

క్లుప్తంగా

దేవదాసిల పెన్షన్ పెంపుపై హర్షం



ఆనందం వ్యక్తం చేస్తున్న దేవదాసీలు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో దేవదాసీలకు సర్కార్ మాసిక పెన్షన్ పెంచడంపై హర్షం వ్యక్త మవుతోంది. ఈ సందర్భంగా శనివారం సంచాలకురాలు పద్మ మాట్లాడుతూ... బడ్జెట్‌లో పెన్షన్ రూ. 2 వేలు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారంతా ఒక్కచోటకు చేరి ఆనందం పంచుకున్నారు.

శ్రీ కృష్ణ దేవరాయలను ఆదర్శంగా తీసుకోవాలి



కృష్ణ దేవరాయల విగ్రహానికి నివాళి

రాయచూరు రూరల్: మూన్నూరు కాపు సమాజం సభ్యులు శ్రీకృష్ణ దేవరాయలను ఆదర్శంగా తీసుకోవాలని మాజీ శాసన సభ్యుడు పాపారెడ్డి అన్నారు. మూన్నూరు కాపు సమాజం వీరాంజనేయ కళ్యాణ మంటపంలో శ్రీ కృష్ణ దేవరాయల జయంతిని పురస్కరించుకుని జ్యోతి వెలిగించి మాట్లాడారు. నేటి యువత విజయనగర రాజుల చరిత్రను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో నరసరెడ్డి, క్రిష్ణమూర్తి, సర్వమంగళ, చెన్నారెడ్డి, జ్యోతి, శంకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రంభాపురి స్వామీపై భక్తుల ఆగ్రహం

యశవంతపుర: బాగలకోటె జిల్లా రంభాపురి పంచగృహ గురులింగేశ్వర మఠం వివాదం కోర్టులో ఉండగానే గంగాధరస్వామిని పీఠాధిపతిగా ఎంపిక చేయటం పెద్ద వివాదంగా మారింది. భాగలకోటె నుంచి కలాదగి మార్గంలోని ఉదగట్టి గ్రామంలో జరిగే అడ్డపల్లకీ కార్యక్రమానికి రంభాపుర జగద్గురు కారులో వెళ్తుండగా భక్తులు అడ్డుకున్నారు. దీంతో తోపులాట జరిగటంతో ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది.

ఘనంగా చిక్కదేవి వేడుకలు

మైసూరు: మైసూరు జిల్లా సరగూరులో నాయక సముదాయం ఆధ్వర్యంలో చిక్కదేవమ్మ 47వ వార్షిక వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రతి ఐదేళ్లకొకమారు జరిగే ఈ ఉత్సవాలకు ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రతి వీధిని ముగ్గులతో నింపారు. ప్రధాన అర్చకులు హరీష్, గోపీనాథ్ ఆధ్వర్యంలో మంగళ వాయిద్యాల మధ్య యాగశాల ప్రవేశం, వందన సంకల్పం, మహాగణపతి పూజలు నిర్వహించారు.

కాశప్ప నియామకం



దొడ్డబళ్లాపురం: కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయానంద కాశప్పనవర్‌ను లింగాయత అభివృద్ధి మండలి అధ్యక్షుడిగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.గతంలో ఆయనను ప్రభుత్వం కర్ణాటక క్రీడా ప్రాధికారకు అధ్యక్షుడిగా నియమించగా అది రద్దు చేస్తూ కొత్త గా లింగాయత అభివృద్ధి మండలి అధ్యక్షుడిగా నియమించారు.

హత్యకేసులో నిందితుల అరెస్ట్

బనశంకరి: చించోళి క్రాస్ వద్ద ఈనెల 6న జరిగిన రోహన్ హత్యకేసు మిస్టరీ వీడింది. బాకీ అడిగినందుకు స్నేహితులే అతన్ని అంతమొందించినట్లు కలబురిగి పోలీసులు తేల్చారు. ఈమేరకు సునీల్‌సింగ్, భగత్‌సింగ్, సోహెల్ అనే నిందితులను శనివారం అరెస్ట్ చేశారు. మరో యువకుడు పరారీలో ఉండగా గాలిస్తున్నారు. రోహన్ నుంచి నిందితులు రూ.3 వేల నగదు అప్పు తీసుకున్నారు. నెలరోజులు గడిచినప్పటికీ డబ్బు తిరిగి ఇవ్వలేదు. తన డబ్బు ఇవ్వాలని ఈనెల 6న రోహన్ డిమాండ్ చేశాడు. దీంతో నిందితులు రోహన్‌ను ఇంటినుంచి బయటికి తీసుకెళ్లి చించోళి క్రాస్ వద్ద హత్యచేసి ఉడాయించారని పోలీసులు తెలిపారు.

బసవణ్ణ మార్గంలో నడవాలి

గంగావతి: కర్ణాటక సాంస్కృతిక నేతగా విశ్వగురు బసవన్నను ప్రభుత్వం ప్రకటించడంతో ఆయన చిత్రపటానికి శనివారం ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... బసవన్న తత్వాలు ఆదర్శాలను పాటించడం ద్వారా సంతోషకరమైన జీవనాన్ని పొందవచ్చని తెలిపారు. అదే విధంగా లక్ష్మీ నారాయణ చెరువును పూడికతీతకు పలు సంఘాలు ఎమ్మెల్యే జనార్ధన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆనెగుంది ఉత్సవాన్ని మార్చి 11, 12 తేదీలలో నిర్వహిస్తామని ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి ప్రకటించారు. మార్చి 2,3 కనకగిరి ఉత్సవం జరుగుతున్న కారణంగా ఆనెగుంది ఉత్సవాన్ని 11,12కు నిర్వహించేందు నిర్ణయించామన్నారు. తహసీల్దార్ నాగరాజ్, సిబ్బంది, చెరువు అభివృద్ధి రైతు సంఘం, గంగావతి పరిసర సంరక్షణ సమితి, శరణ బళగ నేతలు డాక్టర్, శివకుమార్ మాల పాటిల్, బీ.కరీంబాష, ఉల్లేశప్ప పాల్గొన్నారు.

భక్తుల కొంగుబంగారం సవదత్తి యల్లమ్మ



రేణుక యల్లమ్మ ఆలయం



జాతరకు ఎద్దుల బండ్లలో వస్తున్న భక్తులు

- ఏడు కొండల ఆది దేవతగా పూజలు
- బెళగావి జిల్లా సవదత్తిలో మహిమాన్విత క్షేత్రం

సాక్షి,బళ్లారి: పవిత్ర పుణ్యక్షేత్రాలు, మఠాలకు నిలయమైన కర్ణాటకలో సవదత్తి యల్లమ్మ ఆలయానికి ప్రత్యేకత ఉంది. బెళగావి జిల్లాలోని సవదత్తిలో వెలసిన ఈ రేణుకా యల్లమ్మ ఆలయానికి చారిత్రాత్మక, మహిమాన్విత నేపథ్యం ఉంది. పురాణ కాలం నుంచి రేణుక యల్లమ్మ చరిత్రకు ఎంతో పేరు వచ్చింది. దక్షిణ భారత దేశంలో ఏడు కొండలపై వెలసిన శ్రీ వెంకటేశ్వర సన్నిధి తర్వాత అత్యధిక జనాలను తమ అపార మహిమలతో ఆకర్షించే శ్రీ రేణుక యల్లమ్మ జాతర దేశ, నలుమూల నుంచి భక్తులు తరలివస్తారు. అంతేకాకుండా ఏడాది పొడవున భక్త జన సందడి షరామాములే. ఎంతో చరిత్ర కలిగిన ఏడు కొండలపై కొలువు దీరిన ధార్మిక పుణ్యక్షేత్రంగా భాసిల్లుతోంది.



ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీ

ఆదిశక్తి స్వరూపం :

అగస్త్యముని ఆశీర్వాదంతో పుత్ర కామేష్టి యాగం చేసిన కాశ్మీర రాజు, రేణుక రాజ, భోగవతి దంపతులకు జన్మించిన రేణుక ఆదిశక్తి స్వరూపం. జమదగ్ని ధర్మపత్ని, పతివ్రతగా చూపించిన ఆమె గురించి కథనాలు, మహిమలు నిజంగా దైవ స్వరూపమే. మామ రుచికముని, అత్త సత్యవతిని తల్లిదండ్రులు సమానంగా అనురాగం చూపిన ప్రేమ విశ్వాసాలను గడించడంతో పాటు, ఇంటిల్లిపాది పిల్లలకు తన సంతానంతో పాటు ప్రాతివ్రత్యాన్ని కాపాడిన జగత్తులో తన ఆదర్శాలతో చరస్మరణీయమయ్యారు.

ఏడు కొండల అదిదేవత :

రేణుకాదేవి యల్లమ్మ పేరుతో కర్ణాటక, మహారాష్ట్ర, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి కాకుండా దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులకు ఆరాధ్యదేవతగా పేరుగాంచారు. ఏడు కొండలు అది దేవత యల్లమ్మగా పూజలు అందుకుంటున్నారు. యల్లమ్మ గుడ్డ పరిసరాలు పరిధిలో సిద్దరకొళ్ల, పరసగడ్డకొళ్ల, గౌరవనకొళ్ల, తమ్మననకళ్ల, మావినకొళ్ల, సంగప్పనకొళ్ల, బోరోసాబినకొళ్ల ఇలా ఏడు పర్వతాలకు చరిత్రలో జరిగే ఘటనలో దృష్ట్యాంతాలకు నిదర్శనంగా ఈ ఏడు పర్వతాలు వెలిశాయి. ఏడు కొండలయల్లమ్మ నీవమ్మా అంటూ పాటలు పాడుకుంటూ తమ పయనాన్ని కొనసాగిస్తారు.

దేవాలయ ప్రాధాన్యత :

దేవాలయంలో ప్రవేశించే భక్తులు పసుపుపచ్చని బండారం, నుదిటిపై దిద్దుకోవడంతో పాటు యల్లమ్మ తల్లి నీ పాదాలకు ఉదో...ఉదో అంటూ (నమస్కారాలు) దేవాలయం చుట్టు తిరుగుతారు. ఈ బండారం తమ సిరిసంపదల భాగ్యాలకు ప్రతీకగా, గౌరవంతో తీసుకెళ్లడం ఇక్కడికి వచ్చిన భక్తులు సంప్రదాయంగా కొనసాగుతోంది. కాగా మాఘ మాసంలో భారత పౌర్ణమి శుభవేళ జరిగే జాతరకు భారీ సంఖ్యలో భక్త జన సందోహం వస్తారు. శివరాత్రి అమావాస్య వరకు 25 లక్షలు మంది యల్లమ్మను దర్శించుకుంటారు. ప్రతి రోజు ఉదయం 4 గంటల నుంచి 6 గంటల వరకు, సాయంత్రం అభిషేకాలు నిత్యం కొనసాగుతాయి. ప్రతి మంగళ, శుక్రవారాలలో ఇదే సమయాలలో ప్రత్యేక అలంకారాలు పూజలు జరుగుతాయి. యల్లమ్మ గుడ్డకు విచ్చేసే భక్తులు గ్రామీణ ప్రాంతాల నుంచి ఎద్దులు బండ్లలో పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఈనెల 24న జరగనున్న భారత (మాఘ) పౌర్ణమి యల్లమ్మ ఆలయం భక్త జన సందడితో నెలకొంటుంది.

ఘనగా రథసప్తమి వేడుకలు



మంత్రి రామలింగారెడ్డిని వెండి కిరీటంతో సన్మానిస్తున్న దృశ్యం



కుస్తీ పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

బొమ్మనహళ్లి: బెంగళూరు బీటీఎం లేఔట్ నియోజకవర్గం ఆడుగోడిలో ప్రగతి యువకుల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి రథసప్తమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర రవాణ శాఖ, దేవదాయ శాఖ మంత్రి రామలింగా రెడ్డి, జయనగర మాజీ ఎమ్మెల్యే సౌమ్యా రెడ్డి పాల్గొని వేంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రిని వెండి కిరీటంతో సన్మానించారు. తర్వాత కుస్తీ పోటీలు నిర్వహించగా పలు జిల్లాలనుంచి వచ్చిన కుస్తీ వీరులు సత్తా చాటారు. విజేతలకు ఆడుగోడి బీ మోహన్, మాజీ కార్పొరేటర్ జీ మంజునాథ్ బహుమతులు అందజేశారు. చంద్రప్ప, సంపత్ కుమార, ప్రగతి సంఘం సభ్యులు హేమంత్ కుమార్ ప్యాట్రిక్ రాజు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

విలేకరులపై దుండగుల దాడి

కృష్ణరాజపురం: బెంగళూరు గ్రామీణ జిల్లాలోని హోసకోటె తాలూకాలో విలేకరులకు రక్షణ లేకుండా పోయిందని వాపోయారు. ఏకంగా పోలీసుల ముందే దాడులు చేస్తున్నా అడ్డుకునేవారు లేరని ఆరోపించారు. బిసనహళ్ళి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘంలో ఎన్నికలు ఉండడంతో విలేరులు వార్తా సేకరణకోసం వెళ్లారు. కానీ కొందరు ఎవరూలోనికి వెళ్ళవద్దని హెచ్చరించారు. మాకు అనుమతి ఉందని విలేకరులు చెప్పగా, మాకే ఎదురు మాట్లాడతారా? అని వారి వద్ద ఉన్న కెమెరాలు, మొబైల్‌ఫోన్లను లాక్కుని దాడికి దిగారు. అక్కడ ఉన్న పోలీసులు అడ్డుకోకుండా ప్రేక్షకుల్లా చూస్తుండిపోయారని బాధిత విలేకరులు ఆరోపించారు. రక్షణ కల్పించాలని నిరసన తెలిపారు.



నిరసన తెలుపుతున్న విలేకరులు

నేర రహిత సమాజానికి చేతులు కలపాలి

కోలారు: చట్టాలు తెలీదని తప్పులు చేస్తే శిక్షలు తప్పవని జిల్లా కానూను ప్రాధికార కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి సునీల్ ఎస్ హొసమని తెలిపారు. శనివారం తాలూకాలోని సుందరపాళ్య ప్రభుత్వ పబ్లిక్ పాఠశాలలో జిల్లా కానూను సేవల ప్రాధికార, న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కానూను అరివు నెరవు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నేర రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, గర్భస్థ శిశువుకు కూడా హక్కులు ఉంటాయనేది తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో మంజుల భీమరావ్, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఉపాధ్యాయుడు పరమేష్, భీమప్ప, రశ్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న న్యాయమూర్తి సునీల్

29న ప్రభుత్వ ఉద్యోగుల సమ్మేళనం

కోలారు: బెంగుళూరులోని ప్యాలెస్ మైదానంలో ఈ నెల 29న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మహా సమ్మేళనాన్ని ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రారంభిస్తున్నారని, జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సురేష్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని వ్యవసాయ శాఖ సభాంగణంలో నిర్వహించిన జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమితి సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. 7వ వేతన సంఘం, ఓపీఎస్ అమలు, నగదు రహిత చికిత్స పథకం, అమలు చేయడానికి సమ్మేళనంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల గౌెయర బళగ అధ్యక్షుడు నారాయణ స్వామి, నౌకరుల సంఘం జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, కోశాధికారి విజయ్, కార్యాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

- కరువు సాయం చేయరూ



శనివారం బెంగళూరు ఫ్రీడంపార్క్‌లో అన్నదాతల ఆందోళన. కరువు పీడిత రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్యాకేజీ కింద సహాయం చేయాలని కోరారు

విశ్వశాంతిని కాంక్షిస్తూ హోమం



హోమం నిర్వహిస్తున్న రుత్వికులు

ప్రశాంతి నిలయం: విశ్వశాంతిని కాంక్షిస్తూ సత్యసాయి గ్లోబల్ కౌన్సిల్ జోన్ -5 భక్తులు చండీ హోమం, ఏకాదశి రుద్రహోమం నిర్వహించారు. శనివారం ప్రశాంతి నిలయంలోని ఉత్తరం వైపు భవనాల వెనుక మైదానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హోమ గుండం వద్ద భక్తులు హోమకృతువులు నిర్వహించారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్ రాజు, ట్రస్ట్ సభ్యుడు నాగానందలు హోమకృతువులో పాల్గొని హోమ ద్రవ్యాలు అగ్ని దేవునికి సమర్పించారు. రుత్వికుల వేద ఘోష నడుమ సాగిన హోమాలలో విదేశీయులు పాల్గొని తరించారు.



పాల్గొన్న విదేశీ భక్తులు

కోలారు వార్తలు...

విజ్ఞాన వస్తు ప్రదర్శనలు ఎంతో ఉపయుక్తం

కోలారు: విజ్ఞాన వస్తు ప్రదర్శనలు విద్యార్థులలో క్రియాశీలతను పెంచడంతో పాటు ప్రశ్నించే స్థాయి వస్తుందని విద్యాశాఖ సంయోజకుడు ఎస్ రాఘవేంద్ర తెలిపారు. శనివారం నగరంలోని ఆర్క్ ఇంటర్ నేషనల్ పాఠశాలలో నిర్వహించిన విజ్ఞాన వస్తు కళా ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. విజ్ఞానం, గణితం కష్టతర విషయమనే భయాన్ని పిల్లలో కలగడానికి అవకాశం కలిపించరాదన్నారు. కృత్యాధార లేదా ప్రయోగాత్మక పద్ధతుల ద్వారా బోధించినట్లయితే వీటిని సులభంగా విద్యార్థులకు అర్థమయ్యేలా చేయవచ్చునని తెలిపారు. వస్తు ప్రదర్శనలో విద్యార్థులు తయారు చేసిన రోబో, డ్రోన్, ఆధునిక నగర నిర్మాణ సౌలభ్యాలు విశేషంగా ఆకట్టుకోవడంతో విద్యార్థుల సృజనాత్మకత ఎంతో మెచ్చుకోదగినదన్నారు. నేడు విద్యార్థులకు విద్యతో పాటు సంస్కారం నేర్పించడం ఎంతో అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల పాలక మండలి అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, సిఎల్ శ్రీనివాసులు, జెఎన్ రామకృష్ణ పాల్గొన్నారు.



వస్తు ప్రదర్శనను పరిశీలిస్తున్న దృశ్యం

గనుల అక్రమ తవ్వకాలపై లోకాయుక్తకు ఫిర్యాదు

కెజీఎఫ్: తాలూకాలోని కదరిగానకుప్ప గ్రామ సర్వే నెంబర్ 3లో 20 ఎకరాలు, సర్వే నెంబర్ 71లో ఐదు ఎకరాల స్థలంలో కొంతమంది అక్రమంగా గనుల తవ్వకాలు జరుపుతున్నారని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని లోకాయుక్త ఎస్పీ ఉమేష్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. శనివారం లోకాయుక్త ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా లోకాయుక్తకు పలు ఫిర్యాదులు అందాయి. అందులో ప్రధానంగా గనుల తవ్వకాలపై ఫిర్యాదులు వచ్చాయి. 25 ఎకరాల స్థలంలో అత్యంత విలువైన నల్లరాయి ఉందని, అక్రమ తవ్వకాల వల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం కలుగుతోంది. వెంటనే దీనికి అడ్డుకట్ట వేయాలన్నారు. ఏపీఎంసీ ప్రాంతంలోని 25 ఎకరాల స్థలంలో విలువైన నల్లరాతి నిక్షేపాలు ఉన్నాయి. దీనిని అక్రమంగా తరలించి కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. లోకాయుక్త ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు ఏ విషయంపైనైనా నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ప్రజల ఫిర్యాదులకు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా లోకాయుక్తకు 23 ఫిర్యాదులు అందాయి.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న లోకాయుక్త ఎస్పీ

రైతు సంఘం ధర్నా



తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించిన దృశ్యం

కోలారు: వివిధ డిమాండ్ల సాధన కోసం రైతు సంఘం పదాధికారులు శనివారం బంగారుపేట పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు టీఎస్ రామేగౌడ కరువు సమయంలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని, రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపలేదన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో పంటలు సాగు చేస్తే వాటికి మద్దతు ధరలు లభించడం లేదన్నారు. అదే విధంగా అర్హులైన రైతులందరికి పహణీ అందించాలని, రైతులను పదే పదే కార్యాలయం చుట్టూ తిప్పుకోకూడదన్నారు. గోశాలలు స్థాపించాలని, పశువుల మేతకు ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బంగారుపేట తాలూకా వ్యాప్తంగా ఆక్రమణలకు గురైన చెరువులు, గుండుతోపు, రాజకాలువలలో వెంటనే ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ స్టాంప్ వ్యయాన్ని రైతుల హిత దృష్టిలో ఉంచుకుని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో తాలూకా అధ్యక్షుడు మురళి, వినోద్, మంజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవం

కోలారు: తాలూకాలోని నెనుమనహళ్లి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడిగా ఎన్‌వీ రాజేంద్ర, 5వ సారి ఉపాధ్యక్షుడిగా సాదిన్‌కుర్కి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం సహకార సంఘ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికలో అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు వీరిద్దరే నామినేషన్ దాఖలు చేయడం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను సంఘం డైరెక్టర్లు అభినందించారు.

బడ్జెట్‌లో తుమకూరు జిల్లాకు పెద్దపీట



సంబరాల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

తుమకూరు: ముఖ్యమంత్రి సిద్దరామయ్య ప్రవేశ పెట్టిన బడ్జెట్‌లో తుమకూరు జిల్లా అభివృద్ధికి పెద్దపీట వేశారని కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈమేరకు తుమకూరు నగరంలోని బీజీఎస్ సర్కి ల్ వద్ద శనివారం స్వీట్లు పంపిణీ చేశారు. జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ గౌడ మాట్లాడుతూ మంత్రులు పరమేశ్వర్, కే.ఎన్ రాజణ్ణ, ఎమ్మెల్యే టీబీ జయచంద్ర కృషితో జిల్లాకు ఎక్కువ నిధులు కేటాయించారన్నారు.

ప్రశాంతి నిలయానికి చైనీస్ సాంస్కృతిక శోభ



సంగీత కచేరి నిర్వహిస్తున్న భక్తులు

ప్రశాంతి నిలయం: చైనీస్ నూతన సంవత్సర వేడుకలతో ప్రశాంతి నిలయంలో సందడి నెలకొంది. చైనీస్ సంస్కృతి సంప్రదాయాలను పాటించే దేశాలకు చెందిన భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. రెండో రోజు వేడుకలలో భాగంగా ఉదయం సత్యసాయి మహాసమాధి చెంత వేదపఠనంతో వేడుకలు ప్రాంభమయ్యాయి. అనంతరం సత్యసాయి సేవాదల్ సీనియర్ సభ్యుడు థామస్ టీ సత్యసాయి ఆధ్యాత్మిక వైభవాన్ని వివరిస్తూ ప్రసంగించారు. అనంతరం సత్యసాయి సేవాదళ్‌లో సేవలను అందించిన పలువురు సీనియర్ భక్తులను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె.రత్నాకర్‌రాజు, ట్రస్ట్ సభ్యుడు చక్రవర్తి సన్మానించారు. సాయంత్రం ఇండోనేషియా దేశానికి చెందిన ఇంద్ర, చైనీస్ భక్తిగీతాలు ఆలపించాడు. సింగపూర్‌కు చెందిన ప్రముఖ సంగీత విద్వాంసురాలు సుష్మా సోమా, విద్వాంసుడు అక్షయ్ అనంత పద్మనాభన్‌లు సంగీత కచేరి నిర్వహించారు. భక్తులు సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి



రాజ్యాంగ జాగృతి రథానికి స్వాగతం పలుకున్న దృశ్యం

కెజీఎఫ్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని విద్యావంతులు కావాలని దళిత సంఘర్ష సమితి రాష్ట్ర సంఘటనా సంచాలకుడు సూలికుంటె రమేష్ అన్నారు. శనివారం బంగారుపేట తాలూకా సూలికుంటె గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన రాజ్యాంగ జాగృతి జాతా రథానికి ఆయన స్వాగతం పలికి మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రపంచంలో ఉత్తమ రాజ్యాంగం గుర్తింపు సాధించిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రశ్మి, దళిత నాయకుడు చంద్రశేఖర్, తాపం ఈఓ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బయలు బసవేశ్వర స్వామి రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మాలూరు: తాలూకాలోని సొణకపనహట్టి గ్రామ సమీపంలో ఉన్న శ్రీ బయలు బసవేశ్వర స్వామి రథోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూల విగ్రహానికి విశేష అలంకరణ, పూజలు చేశారు. ఉదయం మూల విరాట్టుకు అభిషేకం, మహా మంగళారతి తదితర పూజాది కార్యక్రమాలు జరిగాయి. అనంతరం రథోత్సవం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నెత్తురోడిన రహదారులు

- వేర్వేరు ప్రమాదాల్లో 8మంది మృతి
- రామనగర జిల్లాలో
లారీని ఢీకొన్న టీటీ వాహనం
- ముగ్గురు మైసూరు వాసుల మృతి
- ఇదే జిల్లాలో ట్రాక్టర్ బోల్తాపడి ఇద్దరు..
- లారీని ఢీకొని సాఫ్ట్‌వేర్ ఇంజినీర్..
- మరో రెండు ఘటనల్లో ఇద్దరు మృతి


ప్రమాదాల్లో నుజ్జయిన టీటీ వాహనం


బోల్తా పడిన వాహనం

దొడ్డబళ్లాపురం: రామనగర, బెంగళూరు గ్రామీణ, మైసూరు జిల్లాల్లో రోడ్లు నెత్తురోడాయి. వ్యక్తిగత పనులపై, ఉపాధి పనుల కోసం వెళ్తున్న వారు మార్గం మధ్యలోనే ప్రాణాలు కోల్పోయారు. శుక్రవారం, శనివారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో 8 మంది అసువులు బాసారు. రామనగర జిల్లా చెన్నపట్టణ తాలూకా కోలూరు గేట్ వద్ద బెంగళూరు–మైసూరు దశపథ రహదారిపై లారీని బెంగళూరు నుంచి మైసూరు వెళ్తున్న టీటీ వాహనం ఢీకొంది. ప్రమాదంలో మైసూరుకు చెందిన సోమలింగప్ప,సోమన్న,రాజేశ్వరి అనేవారు మృతి చెందారు. మరో ముగ్గురు గాయపడ్డారు. చెన్నపట్టణ ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ట్రాక్టర్ బోల్తాపడి...

అదేవిధంగా కనకపుర–సాతనూరు రహదారి మార్గంలోని జక్కేగౌడనదొడ్డి గ్రామంలో ఇనుప కంబీల లోడ్‌తో వెళ్తున్న ట్రాక్టర్ బోల్తాపడి కోల్‌కత్తాకు చెందిన ఇద్దరు వలస కార్మికులు మృతిచెందారు. మరో కార్మికుడు తీవ్రంగా గాయపడ్డాడు. వీరంతా బీడబ్ల్యూఎస్ఎస్‌బీ తాగునీటి పైప్‌లైన్ పనికి వచ్చారు. ట్రాక్టర్‌పై కనకపుర నుంచి జక్కేగౌడనదొడ్డి వైపు వెళ్తుండగా ఈఘటన జరిగింది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

లారీని ఢీకొని...

దొడ్డబళ్లాపుర తాలూకా తపసీహళ్లి వద్ద బెంగళూరు–హిందూపురం రహదారి మార్గంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గౌరిబిదనూరు తాలూకా నక్కలపల్లికి చెందిన తేజు(29) అనే యువకుడు మృతి చెందాడు. ఇతను యలహంకలో ప్రావిజన్ స్టోర్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం రాత్రి నక్కలపల్లి నుంచి బైక్‌పై యలహంకకు వెళ్తుండగా తపసీహళ్లి వద్ద రిపేరి వచ్చి రోడ్డు పక్కన నిలిపి ఉన్న లారీని ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగిందని దొడ్డబళ్లాపుర గ్రామీణ పోలీసులు తెలిపారు.

బైక్‌లు పరస్పరం ఢీకొని...

యలహక మీనుకుంట నివాసి దేవరాజ్(32)ఐటీసీ కంపెనీలో పని చేస్తున్నాడు. విధులు ముగించుకొని స్నేహితుడు రాజేశ్‌తో కలిసి తమ తమ బైకుల్లో మాట్లాడుకుంటూ వెళ్తుండగా దేవనహళ్లి తాలూకా బచ్చనహళ్లి వద్ద రాజేశ్ బైక్ బ్యాలెన్స్ తప్పి దేవరాజు బైక్‌ను ఢీకొంది. కిందపడ్డ దేవరాజు తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. దేవనహళ్లి పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

బైక్ పైనుంచి పడి మహిళ మృతి

మైసూరు : బైక్ పైనుంచి పడి మహిళ మృతి చెందింది. ఈఘటన మైసూరు తాలూకా ఆలోణి చిక్కకాన్యద వద్ద చోటు చేసుకుంది. మైసూరు తాలూకా దొడ్డకాన్యద గ్రామానికి చెందిన శివణ్ణ భార్య లక్ష్మమ్మ కాలి నడకన వెళ్తూ మార్గం మధ్యలో అరసికెరె సిద్దరాజు అనే వ్యక్తిని లిఫ్ట్ అడిగింది. ఆమెను బైక్‌పై ఎక్కించుకొని వెళ్తుండగా అతి వేగం వల్ల లక్ష్మమ్మ కింద పడి గాయపడింది. కేఆర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు.

క్లుప్తంగా

బసవణ్ణ ఆదర్శాలు ఆచరణీయం


బసవణ్ణ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీబీఎంపీ కమిషనర్ తుషార్ గిరినాథ్

బనశంకరి: తన రచనలు సాహిత్యం ద్వారా సమాజంలో సమానతకోసం పాటుపడిన బసవణ్ణ తత్వసిద్ధాంతాలు యువతరానికి ఆదర్శమని బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్ అన్నారు. పాలికె కేంద్ర కార్యాలయంలోని సభాంగణంలో విశ్వగురు బసవణ్ణ చిత్రపటాన్ని శనివారం ఏర్పాటు చేసి పూజలు చేశారు. 12వ శతమానంలో క్రాంతికారి సామాజికపోరాటం కోసం పాటుపడిన బసవణ్ణ ప్రపంచ దార్శినికుల్లో ఒకరని తెలిపారు. మూఢనమ్మకాలు, అస్పృశ్యతపై పోరాడిన బసవణ్ణ తన రచనల ద్వారా సమానత తీసుకువచ్చారని కొనియాడారు. ఆర్థిక విభాగ ప్రత్యేక కమిషనర్ శివానందకల్కెరె, పాడిచెత్త విభాగం జాయింట్ కమిషనర్ ప్రతిభ, డిప్యూటీ కమిషనర్ మంజునాథస్వామి, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

బీడీఏ ప్లాట్ల విక్రయ మేళాకు స్పందన


కొనుగోలుదారులకు పత్రాలు అందజేస్తున్న దృశ్యం

కృష్ణరాజపురం: బెంగళూరు ఉత్తర తాలూకా కనకదాసపురలో బీడీఏ అపార్ట్‌మెంటులో ప్లాట్లకు శనివారం విక్రయ మేళా నిర్వహించగా ప్రజలనుంచి విశేష స్పందన లభించింది. బీడీఏ కమిషనర్ డాక్టర్ దేవరాజు పాల్గొని వేలం నిర్వహించారు. ప్రజలు వందల సంఖ్యలో తరలివచ్చి ప్లాట్లను కొనుగోలు చేశారు.

మార్కులే కాదు.. మంచి వ్యక్తిత్వం అవసరం


స్నాతకోత్సవంలో పాల్గొన్న శాస్త్రవేత్త బీ సుబ్బారెడ్డి తదితరులు

తుమకూరు : విద్యార్థులు మంచి మార్కులు, డిగ్రీలు సాధించడంతోపాటు మంచి నడవడిక, సమాజ బాధ్యతలు నెరవేర్చడమే లక్ష్యం కావాలని భారతీయ సైన్స్ సంస్థ సీనియర్ పరిశోధకుడు, శాస్త్రవేత్త డాక్టర్ బీ.సుబ్బారెడ్డి అన్నారు. తుమకూరులోని అక్షయ ఇంజినీరింగ్ కళాశాల 11వ స్నాతకోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ బీ సుబ్బారెడ్డి పాల్గొని విద్యార్థులకు డిగ్రీ పట్టాలు ప్రదానం చేసి మాట్లాడారు. పోటీ ప్రపంచంలో రాణించాలంటే క్రమశిక్షణ అవసరమన్నారు.

పీజీ కళాశాల ఏర్పాటు చేయండి


విద్యార్థులతో చర్చిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివశంకరరెడ్డి

గౌరిబిదనూరు: పట్టణంలోని ప్రభుత్వ ఫస్ట్ గ్రేడ్ కళాశాలను శనివారం శనివారం మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే ఎన్‌హెచ్ శివశంకరరెడ్డి సందర్శించారు. విద్యార్థులతో ముచ్చటించారు. వారి సమస్యలపై ఆరా తీశారు. పీజీ కోర్సులకు బెంగళూరు వెళ్లాల్సి వస్తుందని, ఇది పేద విద్యార్థులకు భారంగా ఉంటుందని, పట్టణంలోనే పీజీ కళాశాల ఏర్పాటు చేయాలని విద్యార్థులు విజ్ఞప్తి చేశారు. ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని ఆయన హామీ ఇచ్చారు.

ప్రశాంతంగా పాల డెయిరీ ఎన్నికలు


ఎన్నికైన డైరెక్టర్లను పూలమాలతో అభినందించిన దృశ్యం

గౌరిబిదనూరు: ఇడగూరు పాల డెయిరీ సహకార సంఘానికి శుక్రవారం ఎన్నిక నిర్వహించారు. 13 మంది డైరెక్టర్ల పదవులకు 23 మంది పోటీ చేశారు. వెనుక బడిన వర్గాల అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నిక కాగా 12 స్థానాలకు ఎన్నికలు జరిగాయి. 104 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. 11 ఓట్లు చెల్లుబాటు కాలేదు. బీజేపీ, జేడీఎస్, పుట్టస్వామిగౌడ మద్దతుదారులు విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి వీణ తెలిపారు. నూతన డైరెక్టర్లు మాట్లాడుతూ పాల డెయిరీ అభివృద్ధికి శ్రమిస్తామన్నారు. అనంతరం నూతన డైరెక్టర్లను అభినందించారు.

ట్రాఫిక్ ఉల్లంఘనులపై కొరడా

- 80 వేల బైకులు, కార్లు సీజ్


స్వాధీనం చేసుకున్న బైక్‌లు, మాట్లాడుతున్న దక్షిణ విభాగం ట్రాఫిక్ డీసీపీ శివప్రకాష్‌దేవరాజ్

బనశంకరి: రోడ్డు నిబంధనలు ఉల్లంఘించిన వారిపై ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝుళిపించారు. రూ.50 వేలకుపైగా జరిమానా పెండింగ్ కలిగిన 80 వేల బైకులు, కార్లు పోలీస్‌శాఖ సీజ్‌చేసినట్లు బెంగళూరు దక్షిణ విభాగ ట్రాఫిక్ డీసీపీ శివప్రకాష్‌దేవరాజ్ తెలిపారు. శనివారం ఆయన నగరంలో విలేకరులతో మాట్లాడారు. హెల్మెట్ లేకుండా వాహనాలు డ్రైవింగ్ చేయడం , నోపార్కింగ్, పదేపదే ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘనపై పదివేలకుపైగా కేసులు నమోదయ్యాయని తెలిపారు. సీసీకెమెరాల ద్వారా ఉల్లంఘనులను గుర్తించి కేసులు నమోదు చేస్తున్నట్లు తెలిపారు. జరిమానా చెల్లించలేదంటే కోర్టుకు హాజరుకావాలని, ఆన్‌లైన్‌ద్వారా జరిమానా చెల్లించవచ్చునని తెలిపారు. సిటీలో 100 బైకులపై ఒకటిన్నర లక్షల రూపాయలకు పైగా జరిమానా ఉందని డీసీపీ తెలిపారు. పెండింగ్‌లో ఉన్న సుమారు రూ.కోటీ 7 లక్షలు జరిమానా వసూలు చేయాల్సి ఉందన్నారు.

అన్నదాతల సమస్యలపై రైతు సంఘాల ధర్నా

శివాజీనగర: మధ్యప్రదేశ్‌లో రాష్ట్ర రైతులను అరెస్ట్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ, రైతుల వివిధ డిమాండ్ల పరిష్కారానికై కర్ణాటక రైతు సంఘాల సమాఖ్య ఉద్యమించింది. రాష్ట్ర రైతు సంఘం (రైతు వర్గం) రాష్ట్రాధ్యక్షుడు ఇ.ఎన్.కృష్ణేగౌడ నేతృత్వంలో రైతు సంఘాల నాయకులు బెంగళూరు నగరంలోని ఫ్రీడం పార్కులో శనివారం ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ రైతుల డిమాండ్లను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని మండిపడ్డారు. రాష్ట్రంలో నెలకొన్న కరువుతో రైతులు అవస్థలు పడుతున్నారన్నారు. పంటల ధరల తగ్గడంతో అప్పుల పాలయ్యారన్నారు. వరికి గిట్టుబాటు ధర కల్పించాలని కోరినా స్పందన లేదన్నారు. రాయచురు జిల్లాలోని ఏడు తాలూకాల్లో వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు ఉచితంగా విద్యుత్ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ ఉత్పత్తి స్థావరాలు నుంచి వెలువడుతున్న కాలుష్యంతో ప్రజలు గుండెజబ్బు, అలర్జీ, శ్వాసకోశ వ్యాధులకు గురవుతున్నారని, వాయి కాలుష్యాన్ని అరికట్టాలని అఖిల కర్ణాటక రైతు సంఘం రాష్ట్రాధ్యక్షుడు హనుమంతప్ప దీవిగిహళ్లి డిమాండ్ చేశారు.

రూ.వెయ్యి కోట్లతో మైసూరు పాలికె బడ్జెట్


బడ్జెట్‌తో కమిషనర్ తదితరులు

మైసూరు: మైసూరు మహా నగర పాలికే 2024–25 సంవత్సర బడ్జెట్‌ను రూ. 1,067 కోట్లతో ప్రకటించారు. రూ. 6.88 కోట్ల మిగులును చూపారు. శనివారం పాలికే కమిషనర్ జీసి ప్రకాశ్, కౌన్సిల్ సమావేశంలో బడ్జెట్‌ను ప్రకటించారు. 12 పేజీలతో కూడిన పద్దు పుస్తకాన్ని ఐదు నిమిషాల్లో చదివి పూర్తి చేశారు. మరో నిమిషాలు ఆర్థిక సహాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి మనవి చేశారు. 15 నిమిషాల్లో కమిషనర్ బడ్జెట్ తంతును పూర్తి చేయడం గమనార్హం. చర్చలు, వాదనలు ఏవీ లేకుండా ముగిసింది. నగర పరిశుభ్రతకు ఎక్కువ నిధులను కేటాయించారు. చెత్త సేకరణకు, విభజనకు 336 మంది సిబ్బందిని నియమిస్తామని తెలిపారు. ప్లాస్టిక్ చెత్త సంస్కరణకు యూనిట్‌ను ఏర్పాటు చేస్తామన్నారు.

యశ్ దంపతుల సందడి


ఐస్ క్రీం కొనుగోలు చేస్తున్న నటుడు యష్, ఐస్ క్యాండీ తింటున్న రాధికా పండిత్

యశవంతపుర: నటుడు యశ్ తన సతీమణి రాధికా పండిత్‌తో కలిసి సందడి చేశారు. కన్నడ జిల్లా భట్కళ సమీపంలోని ఒక ఆలయానికి వెళ్లి పూజలు చేశారు. అనంతరం సామాన్య ప్రజల మాదిరిగా రోడ్లపై సంచరించారు. యశ్ ఓ దుకాణంలోకి వెళ్లి భార్యకు ఐస్‌క్యాండి ఇప్పించారు. ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి.

మూడు నెలల్లో చక్కెర కర్మాగారానికి శంకుస్థాపన

మండ్య : సీఎం సిద్దరామయ్య బడ్జెట్‌లో ప్రకటించిన మేరకు జిల్లాలో రూ.500 కోట్లతో కొత్త చెక్కర పరిశ్రమ ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే పి. రవికుమార్ తెలిపారు. మండ్యలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సాతనూరులో 75 ఎకరాల్లో ఈ పరిశ్రమ ఏర్పాటు చేయాలనేది తన అభిమతమని, అయితే ప్రభుత్వం ఎక్కడ ఏర్పాటు చేస్తుందో వేచి చూడాలన్నారు. రూ. వంద కోట్లు ప్రభుత్వం కేటాయిస్తుందని, మిగతా రూ.400 కోట్లు రుణంగా తీసుకొని పరిశ్రమ ఏర్పాటు చేస్తారన్నారు. మూడు నెలల్లో సీఎం సిద్దరామయ్య చెక్కెర పరిశ్రమకు శంకుస్థాపన చేస్తారన్నారు.

బసవణ్ణ వచనాలు దారి దీపాలు


చిక్కబళ్లాపురంలో బసవణ్ణకు నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యే


మండ్యలో నివాళులర్పిస్తున్న కలెక్టర్ డాక్టర్ కుమార్

చిక్కబళ్లాపురం: బసవణ్ణ వచనాలు దారిదీపాలని కలెక్టర్ పీఎస్ రవీంద్ర, ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ అన్నారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం బసవణ్ణ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బసవణ్ణ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుర్పించారు. సమాజంలో అసమానతలను నిర్మూలించేందుకు బసవణ్ణ తన వచనాల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేశారన్నారు. ఉపన్యాసకులు ప్రకాశ్, జెడ్పీ సీఈఓ ప్రకాశ్, జిల్లా అదనపు కలెక్టర్ తిప్పేస్వామి పాల్గొన్నారు.

మండ్య : బసవణ్ణ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని కలెక్టర్ డాక్టర్ కుమార్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో బసవేశ్వర జయంతి నిర్వహించారు.

తుమకూరు: కలెక్టరేట్‌లోని సమావేశం హాల్లో బసవణ్ణ జయంతిని ఆచరించారు. కలెక్టర్ శుభకల్యాణ్ పాల్గొని బసవణ్ణ చిత్రపటానికి నివాళులర్పించారు.

మళ్లీ తెరపైకి ప్రత్యేక బస్‌లేన్

- బెంగళూరులో 9 కారిడార్లలో
83 కిలోమీటర్ల మేర ప్రత్యేక మార్గం
- రూ.280 కోట్ల వ్యయం
- ప్రభుత్వానికి బీబీఎంపీ ప్రతిపాదనలు



శివాజీనగర: బెంగళూరు నగరంలో ఔటర్ రింగ్ రోడ్డులో అధిక ట్రాఫిక్ సాంద్రత ఉన్న తొమ్మిది కారిడార్లలో బీబీఎంపీ బస్ లేన్ విధానాన్ని మళ్లీ తెరపైకి తెచ్చారు. మైసూరు రోడ్డు, మాగడి రోడ్డు, తుమకూరు రోడ్డు, బళ్లారి రోడ్డు, కనకపుర రోడ్డు, హొసూరు రోడ్డు, పాత మద్రాసు రోడ్డు, పాతవిమానాశ్రయం రోడ్డు, గొరగుంటెపాళ్య–కేఆర్‌పురం కారిడార్లలలో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా ఉంది. ఉదాహరణకు సెంట్రల్ సిల్క్ బోర్డు నుంచి టిన్ ఫ్యాక్టరీ జంక్షన్‌కు చేరుకోవాలంటే 45నుంచి గంట సమయం పడుతుంది. ప్రత్యేక బస్‌లేన్ ఏర్పాటు చేస్తే అరగంటలో చేరుకోవచ్చు. 83 కిలోమీటర్ల మేర విస్తరించి ఉన్నర ఆ కారిడార్లలో బస్సులు ఎలాంటి ఆటంకాలు లేకుండా వేగవంతంగా సంచరించేందుకు బస్‌లైన్ ఏర్పాటు చేస్తారు. ఈమేరకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేయనున్నారు. అనుమతి రాగానే టెండర్లు పిలిచేందుకు బీబీఎంపీ ఏర్పాట్లు సిద్ధం చేస్తోంది. గతంలో సిల్క్‌బోర్డు నుంచి కే.ఆర్.పురం టిన్ ఫ్యాక్టరీ వరకు ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన బస్ లేన్ విధానం విజయవంతమైంది. అయితే మెట్రో పనుల నేపథ్యంలో దానిని అమలు చేయలేదు. తాజాగా 9 కారిడార్ల పరిధిలో రూ. 280 కోట్లతో 83 కి.మీ.బస్ లేన్ అమలు చేయాలని యోచిస్తున్నారు. ఆయా రోడ్లలో బీఎంటీసీ బస్సులు, అంబులెన్స్‌లు, ఫైర్ వాహనాలు మాత్రమే సంచరించేందుకు అనుమతి ఉంటుంది.

అన్న చేతిలో తమ్ముడు హతం


నిందితుడు శంకరప్ప, హతుడు హనుమంతప్ప(ఫైల్)

యశవంతపుర: అన్న చేతిలో తమ్ముడు హతమైన ఘటన హవేరి తాలూకా నెలోగల్ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన శంకరప్ప, హనుమంతప్ప(42) సోదరులు. తన భార్యతో హనుమంతప్ప సన్నిహితంగా ఉంటున్నట్లు అన్న అనుమానం పెంచుకున్నాడు. శంకరప్ప శుక్రవారం సాయంత్రం మద్యం తాగి తమ్ముడితో వాగ్వాదానికి దిగాడు. ఓ దశలో తమ్ముడి ఎదపై చాకుతో పొడవటంతో తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని హవేరి జిల్లా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందాడు. హవేరి గ్రామీణ పోలీసులు నిందితుడు శంకరప్పను అరెస్ట్ చేశారని ఎస్పీ అంశుకుమార్ తెలిపారు.

చెరువు అభివృద్ధి పనులకు శ్రీకారం


భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ

గౌరిబిదనూరు: పూర్వీకులు ఎంతో ముందుచూపుతో నిర్మించిన చెరువులను అభివృద్ధి చేస్తున్న ధర్మస్థల గ్రామీణాభివృద్ధి సంస్థ చొరవ అభినందనీయమని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ అన్నారు. ఆ సంస్థ ఆధ్వర్యంలో తాలూకాలోని తొండేబావి గ్రామ చెరువును పునరుద్ధరించే పనులకు శనివారం ఆయన శ్రీకారం చుట్టారు. వర్షాకాలంలోపు చెరువు పునరుద్ధరణ చేయాలని సంస్థ ప్రతినిధులకు సూచించారు. సంస్థ ప్రాజెక్ట్ అధికారి నాగరాజనాయక్, కోచిముల్ డైరెక్టర్ కాంతరాజు, పంచాయితీ అభివృద్ధి అధికారి బసవరాజు, అధ్యక్షులు కామాక్షి రామదాస్, రంగాచారి, జయచంద్రారెడ్డి పాల్గొన్నారు.

నిధులు తెప్పించా


మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్

చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం నియోజకవర్గ అభివృద్ధికి బడ్జెట్‌లో రూ.వంద కోట్లు కేటాయించారని ఎమ్మెల్యే ప్రదీప్ ఈశ్వర్ అన్నారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని వాబసంద్ర 20వ వార్డులో నమస్తే చిక్కబళ్లాపుర కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు విజయేంద్ర పేర్కొనడం సరికాదన్నారు. రాజకాలువపై ఇళ్లు నిర్మించుకున్నవారికి సీఎంతో చర్చించి న్యాయం చేస్తామన్నారు.

హోసూరు వార్తలు..

సేంద్రియ ఎరువులే మంచిది


రైతులకు జాగృతి కల్పిస్తున్న దృశ్యం

కెలమంగలం: తళి వ్యవసాయ శాఖ కార్యాలయంలో సేంద్రియ ఎరువుల ఉపయోగాలపై రైతులకు ఒక్క రోజు శిక్షణా శిబిరాన్ని నిర్వహించారు. వ్యవసాయ శాఖ ఉప డైరెక్టర్ మురుగన్ మాట్లాడుతూ నేటిరోజుల్లో రైతులు ఎక్కువ దిగుబడులకు ఆశపడి రసాయన ఎరువులను విపరీతంగా వినియోగించడంతో భూమి సారాన్ని కోల్పోతోందన్నారు. దీని వల్ల తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని, అందుకు బదులుగా సేంద్రియ ఎరువులను ఉపయోగిస్తే అనేక ప్రయోజనాలు కలుగుతాయని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

క్రేన్ డ్రైవర్ దుర్మరణం

క్రిష్ణగిరి: ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో క్రేన్ ఆపరేటర్ మృతి చెందిన ఘటన పోచ్చంపల్లి వద్ద చోటుచేసుకొంది. వివరాల మేరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన రవికుమార్ వర్మ (24) పోచ్చంపల్లి ప్రాంతంలో నివాసముంటూ క్రేన్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం బైక్ మీద పోచ్చంపల్లి – కల్లావి రోడ్డుపై వెళుతుండగా ఆ మార్గంలో ఎదురుగా వచ్చిన మరో ద్విచక్రవాహనం ఢీకొనింది. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలేర్పడిన రవికుమార్‌వర్మను స్థానికులు చికిత్స కోసం బెంగళూరులోని ఆస్పత్రికి తరలించగా అక్కడ మరణించాడు.

ఆలయానికి ముస్లింల వాయనం


వాయనాలు అందజేస్తున్న ముస్లింలు

హోసూరు: హోసూరు తాలూకా బాగలూరులో ప్రసిద్ధ కోట మారియమ్మ ఆలయ కుంభాభిషేకోత్సవానికి ముస్లిం సోదరులు వాయనాలను అందజేశారు. శిథిలావస్థకు చేరిన ఆలయాన్ని కొత్తగా నిర్మించారు. ఇందులో భాగంగా సోమవారం 19వ తేదీ గోపుర కుంభాభిషేకోత్సవం జరుగనుంది. శనివారం ఉదయం విశేష పూజలను నిర్వహించారు. స్థానిక ముస్లింలు అమ్మవారికి వాయనాన్ని సమర్పించి మత సమైక్యతకు దర్పణం పట్టారు.

యువతికి టోపీ పెట్టిన వంచకులు

మైసూరు: ఆన్‌లైన్ వంచకుల వలకు చిక్కి యువతి మోసపోయి లక్షల రూపాయలు పోగొట్టుకుంది. మైసూరులోని ఆలనహళ్లికి చెందిన ఉషా అనే మహిళ స్నేహితులు శ్రీధర్ మూర్తి రూపా, నయాజ్‌తో కలిసి ఆన్‌లైన్‌లో గాలించి ఒక కంపెనీలో రూ.9.64లక్షలు పెట్టుబడి పెట్టారు. అయితే అది నకిలీ కంపెనీ తేలింది. దీంతో బాధితురాలు మైసూరు పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ప్రైవేటు ఉద్యోగికి రూ.26 లక్షల బురిడీ

హోసూరు: సైబర్ నేరగాళ్లు ఓ ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి వద్ద రూ. 26. 50 లక్షలు కాజేసిన సంఘటన క్రిష్ణగిరి వద్ద జరిగింది. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా పోచ్చంపల్లి సమీపంలోని జింగల్‌కదిరంబట్టి గ్రామానికి చెందిన గోవిందరాజ్ (50). ప్రైవేట్ కంపెనీ ఉద్యోగి. కొద్ది రోజుల క్రితం అతని వాట్సాప్ నంబర్‌కు ఓ మెసేజ్ వచ్చింది. మెసేజ్‌పై స్పందించిన అతను ఆ నంబర్‌ను సంప్రదించగా పార్ట్‌టైం ఉద్యోగం చేయడంతో పాటు తమ వద్ద పెట్టుబడి పెడితే అధిక లాభం అందజేస్తామని చెప్పారు. ఇది నమ్మిన బాధితుడు రూ. 26.50 లక్షల నగదును వారి బ్యాంకు ఖాతాలోకి జమ చేశాడు. తరువాత మోసగాళ్ల ఫోన్ నంబర్ స్విచ్ఛాఫ్ రావడంతో మోసపోయినట్లు తెలుసుకున్న గోవిందరాజ్.. క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బోనులో పడ్డ చిరుత



దొడ్డబళ్లాపురం: దొడ్డబళ్లాపురం తాలూకా సూలుకుంటలో కొన్ని రోజులుగా గ్రామస్తులకు కంటి మీద కునుకు లేకుండా చేసిన చిరుత ఎట్టకేలకు బోనులో చిక్కింది. చిరుత వారం రోజులుగా రాత్రి పూట గ్రామంలో చొరబడి పెండు జంతువులను, వీధి కుక్కలను బలితీసుకుంది. అటవీశాఖ అధికారులు గ్రామ శివారులో బోను ఏర్పాటు చేయగా శుక్రవారం రాత్రి ఆహారం కోసం వచ్చిన చిరుత అందులో చిక్కుకుంది. శనివారం ఉదయం అటవీశాఖ అధికారులు వచ్చి చిరుతను బంధించి తీసుకెళ్లారు.

కోరింది రూ.8,050 కోట్లు, ఇచ్చింది రూ.3,500 కోట్లు

శివాజీనగర: రాష్ట్ర బడ్జెట్‌లో బెంగళూరు నగరాభివృద్ధికి అరకొర నిధులు కేటాయించారు. ప్రజలకు వివిధ సదుపాయాలు కల్పించేందుకు రూ.8050 కోట్లు కేటాయించాలని బీబీఎంపీ కోరగా కేవలం రూ.3,500 కోట్లు కేటాయించారు. ఈ నిధులతో బెంగళూరు సమగ్రాభివృద్ధి ఎలా అంటూ నగరవాసులు ప్రశ్నిస్తున్నారు. నగరంలో దాదాపు 3వేల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉందని బీబీఎంపీ విన్నవించినా అరకొరగా నిధులు కేటాయించారు.

పుట్టినరోజే యువతి ఆత్మహత్య

కెలమంగలం: పుట్టినరోజు ఆలయానికెళ్లేందుకు తల్లిదండ్రులు ఒప్పుకోలేదని యువతి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన డెంకణీకోట వద్ద చోటు చేసుకొంది. వివరాల మేరకు డెంకణీకోట తాలూకా తళి సమీపంలోని దిన్నూరు గ్రామానికి చెందిన రమేష్‌బాబు కూతురు (19) నర్సింగ్ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతుంది. శుక్రవారం తనకి పుట్టిన రోజు కావడంతో డెంకణీకోటలోని బేటరాయస్వామి ఆలయానికి వెళ్తానని సిద్ధమైంది. కానీ తల్లిదండ్రులు గుడికి వెళ్లవద్దని ఆమెను అడ్డుకున్నారు. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకొంది.

ఉరివేసుకొని కార్మికుడు..


తాగుడుకు బానిసైన కూలి కార్మికుడు ఉరివేసుకొన్నాడు. వివరాల మేరకు డెంకణీకోట పట్టణ పంచాయితీలోని తేరుపేట ప్రాంతానికి చెందిన మహాదేవయ్య కూలి కార్మికుడు(60). ఇతనికి తాగుడు అలవాటుండేది. గత కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురికావడంతో పలు ఆస్పత్రుల్లో చికిత్స పొందిన ఆరోగ్యం చేకూరలేదు. దీంతో ఆవేదన చెంది శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ రెండు ఘటనలపై డెంకణీకోట పోలీసులు కేసులు నమోదు చేశారు.

మేకెదాటును నిలిపేయాలి

హోసూరు: కావేరి నదికి అడ్డంగా మేకెదాటు వద్ద కర్ణాటక ప్రభుత్వం ఆనకట్టకు చర్యలు చేపట్టిందని, దీనిని నిలిపివేయాలని శనివారం హోసూరులో టీఎంసీ నాయకుడు, రాజ్యసభ ఎంపి జి.కే. వాసన్ అన్నారు. బెంగళూరు– హోసూరు మధ్య మెట్రో రైలు సేవలను పొడిగించాలని, హోసూరు నుంచి క్రిష్ణగిరి మీదుగా జోలార్‌పేట వరకు రైలు మార్గాన్ని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. తమిళనాడులో దోపిడీలు, దొంగతనాలు, హత్యలు, మానభంగాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వీటి నివారణకు పోలీసులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నేతలు కేశవరెడ్డి, కె.మనోహరన్, కార్యకర్తలు పాల్గొన్నారు.

తమ్ముళ్లూ.. త్యాగాలు..

పొత్తుల్లో పోగా మిగిలిన 100 సీట్లతో సర్దుకుందాం • చంద్రబాబు వ్యాఖ్యలతో టీడీపీలో హాహాకారాలు



సాక్షి, అమరావతి: ఎన్నికల్లో అందరికీ సీట్లు ఇవ్వలేనని, చాలామంది నాయకులు త్యాగాలకు సిద్ధం కావాలంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలతో టీడీపీలో హాహాకారాలు మిన్నంటుతున్నాయి. పోటీకి సిద్ధమైన నాయకులు ఇప్పుడు ఏం చేయాలో తోచక గగ్గోలు పెడుతున్నారు. పొత్తుల కోసం పాకులాడుతూ తమ గొంతు కోస్తున్నారని పలువురు నేతలు బహిరంగంగానే చంద్రబాబుపై ఆక్రోశాన్ని వెళ్లగక్కుతున్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత అందరికీ న్యాయం చేస్తామని చెప్పడంపై మండిపడుతున్నారు. అన్ని సీట్లు వదులుకున్నాక ఇక అధికారం ఎలా వస్తుందని నిర్వేదం వ్యక్తం చేస్తున్నారు. పొత్తులో భాగంగా జనసేనకు 50కిపైగా ఎమ్మెల్యే, మూడు ఎంపీ స్థానాలు, బీజేపీకి 25 ఎమ్మెల్యే, ఏడు ఎంపీ స్థానాలు ఇవ్వక తప్పదని టీడీపీలో పది రోజులుగా చర్చ జరుగుతోంది. మొత్తం 75 ఎమ్మెల్యే, పది ఎంపీ స్థానాలను టీడీపీ ఆ రెండు పార్టీలకు వదిలేయాల్సిన పరిస్థితి నెలకొంది. మిగిలిన వంద ఎమ్మెల్యే, 15 ఎంపీ స్థానాల్లో మాత్రమే టీడీపీ పోటీ చేయాల్సి ఉంటుంది. వాటిలోనే నేతలు సర్దుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే విషయాన్ని చంద్రబాబు శుక్రవారం రాత్రి టెలీకాన్ఫరెన్స్‌లో నాయకులందరికీ స్పష్టంగా చెప్పారు.

మానసికంగా సిద్ధం చేస్తున్న బాబు

సీట్ల సర్దుబాటుపై చంద్రబాబు బహిరంగంగా మాట్లాడకుండా గుంభనంగా వ్యవహరిస్తున్నారు. జనసేనతో పొత్తు గురించి పలు సందర్భాల్లో ప్రస్తావించినా... సీట్లపై నోరు మెదపలేదు. పొత్తు కోసం ఢిల్లీ వెళ్లి అమిత్‌షా శరణు కోరిన తర్వాత బీజేపీ ఎన్ని సీట్లు అడిగితే అన్ని ఇచ్చేందుకు చంద్రబాబు సిద్ధమయ్యారు. టీడీపీ నేతలను మానసికంగా సిద్ధం చేసేందుకు టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి తొలిసారి సీట్ల సర్దుబాటు గురించి చర్చించారు. పొత్తుల వల్ల అందరికీ సీట్లు ఇవ్వడం కుదరదని, సర్దుకుపోవాలని బాంబు పేల్చారు. చంద్రబాబు వ్యాఖ్యలతో టీడీపీ నేతలు ఒక్కసారిగా డీలా పడిపోయారు. జిల్లాల వారీగా ఎవరి సీట్లు ఎగిరిపోయే జాబితాలో ఉన్నాయో ఆరా తీస్తూ భగ్గుమంటున్నారు. బీజేపీ, జనసేనకు అన్ని సీట్లు ఇవ్వడానికి ఎలా ఒప్పుకున్నారని వాపోతున్నారు. చంద్రబాబు తాను, తన కుటుంబ ప్రయోజనాల కోసం పార్టీని పణంగా పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. టీడీపీని బీజేపీ కాళ్ల కింద పెడుతున్నారని, ఎన్టీఆర్ పెట్టిన పార్టీకి, చంద్రబాబు నడుపుతున్న పార్టీకి సంబంధం లేదని కృష్ణా జిల్లాకు చెందిన ఓ సీనియర్ నేత వ్యాఖ్యానించారు.

సీనియర్లకు ఎసరు..

సిట్టింగ్ ఎమ్మెల్యేలందరికీ టికెట్లు ఇస్తానని గతంలో చంద్రబాబు హామీ ఇవ్వటాన్ని సీనియర్ నేత, రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి పదేపదే మీడియా ఎదుట ప్రస్తావిస్తున్నారు. తన సీటుకు ఢోకా లేదని ఆయన చెప్పుకుంటున్నా... జనసేనకు కేటాయించి బుచ్చయ్యకు చంద్రబాబు ఝలక్ ఇవ్వడం ఖాయంగా కనిపిస్తోంది. పలువురు మాజీ మంత్రుల సీట్లు కూడా ఎగిరిపోయే జాబితాలో ఉన్నాయి. భూమా అఖిలప్రియ, గంటా శ్రీనివాసరావు, చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆలపాటి రాజా, బొండా ఉమా తదితర నేతల సీట్లు గల్లంతు కానున్నాయి. ఎన్నో ఏళ్లుగా తాము పోటీ చేస్తున్న స్థానాలను వేరే పార్టీకి ఇవ్వడం తగదని సీనియర్ నేతలు వాపోతున్నారు.

ఎన్నారై నేతల ఆందోళన

సీట్లు ఆశ చూపించి కొందరు ఎన్నారై, పారిశ్రామికవేత్తలను రంగంలోకి దించిన చంద్రబాబు వారితో నియోజకవర్గాల్లో భారీగా ఖర్చు చేయించారు. విజయవాడలో కేశినేని చిన్ని, గుంటూరులో ఉయ్యూరు శ్రీనివాస్, భాష్యం ప్రవీణ్, కాకినాడలో సానా సతీష్, నెల్లిమర్లలో బంగర్రాజు తదితరులను పార్టీ కోసం వాడుకున్నారు. వారంతా ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని నిలదీస్తున్నారు. ఇన్నాళ్లూ పార్టీ కోసం కష్టపడి డబ్బులు ఖర్చు చేశామని, ఇప్పుడు తమను నట్టేట ముంచవద్దని వేడుకుంటున్నారు.

ఒంటరి పోరుకు ససేమిరా..

పొత్తులు లేకపోతే పార్టీ ఉనికే ప్రశ్నార్థకమవుతుందంటూ నేతలను చంద్రబాబు బుజ్జగించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో సీఎం వైఎస్ జగన్‌ను ఒంటరిగా ఎదుర్కోవడం అసాధ్యమని, బీజేపీ, జనసేన పార్టీలను కూడగడితేగానీ తలపడలేమని స్పష్టం చేస్తున్నారు. టీడీపీ నేతలు మాత్రం అధినేత అభ్యర్థనను ఆలకించేందుకు నిరాకరిస్తున్నారు.

క్లుప్తంగా...

వైఎస్సార్‌సీపీ ఎన్నారై విభాగాల నియామకం

సాక్షి, అమరావతి: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పలు ఎన్నారై విభాగాలకు కమిటీలను ప్రకటించారు. ఈ మేరకు శనివారం పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. 10 మందితో బహ్రెయిన్ కమిటీని నియమించారు. కన్వీనర్‌గా చామంతి బలరామరాజు, కో– కన్వీనర్లుగా డి.సురేష్, వి.శివరాజు, ఎం.ఇస్మాయిల్‌లకు బాధ్యతలు అప్పగించారు. వైఎస్సార్‌సీపీ కెనడా కమిటీని 47 మందితో, యూరోపియన్ కమిటీని 78 మందితో, గల్ఫ్ కౌన్సిల్ కంట్రీస్(జీసీసీ) కమిటీని పది మందితో, కువైట్ కమిటీని 17 మందితో, మలేషియా కమిటీని 33 మందితో, న్యూజిలాండ్ కమిటీని 27 మందితో, ఖతార్ కమిటీని 34 మందితో, సింగపూర్ కమిటీని 49 మందితో, యూఏఈ కమిటీని 47 మందితో, యూకే కమిటీని 34 మందితో, ఆస్ట్రేలియా కమిటీని 79 మందితో నియమించారు. ఆస్ట్రేలియా కమిటీ కన్వీనర్‌గా సి.సూర్యనారాయణ, కో కన్వీనర్‌గా ఎల్.రాజశేఖర్‌లకు బాధ్యతలు అప్పగించారు.

ఏపీకి ఏమిచ్చారని ఎన్డీఏలో చేరుతున్నారు?

చంద్రబాబుపై సీపీఐ నేత రామకృష్ణ ధ్వజం



కర్నూలు(సెంట్రల్): ఆంధ్రప్రదేశ్‌కు ఏమిచ్చారని ఎన్డీఏలో చేరుతున్నారని టీడీపీ అధినేత చంద్రబాబుపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ధ్వజమెత్తారు. కనీసం విభజన హామీలను కూడా అమలు చేయని బీజేపీతో ఎలా జతకడుతారని ప్రశ్నించారు. ఆయన శనివారం కర్నూలులోని సీపీఐ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ నీచ రాజకీయాలు చంద్రబాబుకే చెల్లుతాయన్నారు. అధికారం కోసం చంద్రబాబు మతతత్వ పార్టీ బీజేపీకి మద్దతు ఇస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్రంలోని అధికార వైఎస్సార్‌సీపీ, ప్రతిపక్ష పార్టీలు టీడీపీ, జనసేనలు మోదీకే మద్దతు తెలపడం దారుణమన్నారు. ఏపీకి ప్రత్యేక హోదాను విస్మరించిన బీజేపీకి మద్దతు ఇవ్వడం అన్యాయమని తెలిపారు. కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి వస్తే ప్రాంతీయ పార్టీలను మింగేస్తుందన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బి.గిడ్డయ్య, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి మునెప్ప తదితరులు పాల్గొన్నారు.

రెడ్‌బుక్‌తో అధికారుల సంగతి చూస్తా..

వేపగుంట, లక్కవరపుకోట శంఖారావం సభల్లో లోకేశ్


బారికేడ్లలో నుంచి దూరి బయటకు వెళ్లిపోతున్న జనం

పెందుర్తి/లక్కవరపుకోట : రెడ్‌బుక్ పట్టుకుని తిరుగుతున్న టీడీపీ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ మరోసారి అధికారులపై విరుచుకుపడ్డారు. ప్రస్తుత ప్రభుత్వానికి సహకరిస్తున్న ప్రతీ అధికారిని తాము అధికారంలోకి వచ్చాక డిస్మిస్ చేస్తామని హెచ్చరించారు. టీడీపీ–జనసేన ఉమ్మడి ప్రభుత్వం వచ్చాక విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని చెప్పారు. పెందుర్తి నియోజకవర్గం వేపగుంట, విజయనగరం జిల్లా ఎల్.కోట మండలం సోంపురం కూడలిలో శనివారం శంఖారావం సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేశ్ మాట్లాడుతూ రాష్ట్రంలో దుర్మార్గపు పాలన నడుస్తోందన్నారు. చంద్రబాబు హయాంలో విశాఖ ఎంతో అభివృద్ధి చెందిందని.. కానీ సీఎం జగన్ అధికారంలోకి వచ్చాక కిడ్నాప్‌లు, కబ్జాలు పెరిగిపోయాయని ఆరోపించారు. టీడీపీ అధికారంలోకి వస్తే సింహాచలం దేవస్థానం పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరించడం తన బాధ్యత అని లోకేశ్ అన్నారు. కార్యకర్తలపై వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేసులు పెడుతోందని.. అధికారంలోకి వచ్చాక వెతుక్కుంటూ వచ్చి వారందరికీ నామినేటెడ్ పదవులు ఇస్తామన్నారు. విజయనగరం జిల్లా ఎల్.కోట మండలం సోంపురంలో లోకేశ్ పసలేని ప్రసంగంతో పార్టీ శ్రేణులు విసుగెత్తిపోయి మధ్యలోనే వెళ్లిపోయారు. ఇక్కడ సభా ప్రాంగణంలో మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి, గొంప కృష్ణ వర్గీయులు తోపులాటకు దిగారు.

పొత్తులపై అధిష్టానమే నిర్ణయం తీసుకుంటుంది

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

సాక్షి, న్యూఢిల్లీ : ఆంధ్రప్రదేశ్‌లో పొత్తులపై నిర్ణయాన్ని బీజేపీ అధిష్టానమే తీసుకుంటుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి చెప్పారు. పొత్తులపై అధిష్టానం ఇప్పటికే రాష్ట్ర నాయకత్వం అభిప్రాయాలు తెలుసుకుందని తెలిపారు. శనివారం ఢిల్లీలో ప్రారంభమైన బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశాల్లో పురందేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో దొంగ ఓట్లు, ప్రజా సమస్యలపై బీజేపీ పోరాటం సాగిస్తోందని చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఏపీ ప్రజలు తమను ఆశీర్వదిస్తారని భావిస్తున్నామన్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులుగా పోటీ చేసేందుకు అనేక మంది ముందుకువచ్చారని, ఎన్నికల షెడ్యూల్ వచ్చిన తరువాతే అభ్యర్థుల ఎంపిక చేపడతామని చెప్పారు.

అడ్డొస్తే తొక్కుకుంటూ పోతా

- ఇంకొల్లు రా.. కదలి రా సభలో రెచ్చిపోయిన చంద్రబాబు
- పోలీసులు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరిక
- ఈ ఐదేళ్లలో జగన్ ధనవం తుడయ్యాడు... ప్రజలు పేదలయ్యారంటూ వ్యాఖ్య


ఇంకొల్లు సభలో చంద్రబాబు ప్రసంగిస్తుండగా ఖాళీగా ఉన్న కుర్చీలు

సాక్షి ప్రతినిధి, బాపట్ల: తనను అడ్డుకునేందుకు ఎవరైనా వస్తే తొక్కుకుంటూ పోతా అంటూ టీడీపీ అధినేత చంద్రబాబు రెచ్చిపోయి ప్రసంగించారు. పోలీసులూ జాగ్రత్తగా ఉండాలంటూ హెచ్చరించారు. శనివారం బాపట్ల జిల్లా పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులో జరిగిన రా.. కదలి రా సభలో ఆయన మాట్లాడారు. చిల్లర రాజకీయాలు వద్దు... నా రాజకీయాల ముందు నువ్వొక బచ్చా. మీ నాన్నే నా దెబ్బకు భయపడ్డాడు అంటూ సీఎం వైఎస్ జగన్‌పై రెచ్చిపోయి మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక జగన్ ధనవంతుడైతే ప్రజలు మరింత పేదవాళ్లయ్యారని అన్నారు. ఐదేళ్లుగా రాష్ట్రంలో అభివృద్ధి లేక ప్రజల జీవన ప్రమాణాలు దారుణంగా పడిపోయాయని విమర్శించారు. జగన్‌ను ఓడించటానికి, వైసీపీని భూస్థాపితం చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అభ్యర్థులు దొరక్క జగన్ సందిగ్ధంలో పడ్డాడన్నారు. పులివెందులలో సహా పోయే పరిస్థితి వచ్చిందన్నారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని జగన్ రూ.43 వేల కోట్లు దోచేశారని విమర్శించారు. అధికారంలోకి వచ్చాక జగన్ నిజ స్వరూపం బయటపడిందని, జగన్ ఓ సైకో.. అవసరం కోసం కాళ్ళు పట్టుకుంటాడు.. తర్వాత కాళ్ళు లాగేస్తాడని, వ్యవస్థలను నాశనం చేసి లాండు, శాండు, వైన్, మైన్ ఏది దొరికినా వదిలిపెట్టలేదని, జగన్ అన్నం తినటం మానేసి ఉదయం అల్పాహారంగా ఇసుక, మధ్యాహ్న భోజనంగా మైన్స్, రాత్రికి డిన్నర్‌గా జే బ్రాండ్ మద్యం, డబ్బులు తింటున్నాడంటూ నోరు పారేసుకున్నారు. ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్‌ను పార్టీ మారాలని ఒత్తిడి తెచ్చినా మారకపోవడంతో రూ.350 కోట్లు ఫైన్ వేశారన్నారు. జగన్ బటన్ నొక్కుడుతోనే అన్ని రకాల ఛార్జీలు పెరిగాయని అన్నారు. మద్యపాన నిషేధంపై బటన్ ఎందుకు నొక్కలేదన్నారు. వారంలో సీపీఎస్ రద్దు చేస్తానన్నాడని, నువ్వు పోయే వారం కూడా వచ్చిందని అన్నారు. జగన్ నిర్వాకం వల్ల తలసరి ఆదాయంలో తెలంగాణతో పోల్చితే రాష్ట్రం 44 శాతం తక్కువగా ఉందన్నారు. వాలంటీర్ల మీటింగ్‌లో చొక్కా మడత పెడతాపెట్టాలంటున్నాడని, ఆయన చొక్కా మడత పెడితే మా తమ్ముళ్లు కుర్చీలు మడతపెడతారని, ఆయన కుర్చీ ఊడిపోతుందంటూ రెచ్చిపోయారు. ఫ్యానుకు మూడు రెక్కలున్నాయని, బాదుడే బాదుడు అనే రెక్కను ఉత్తరాంధ్ర ప్రజలు, దోపిడీ రెక్కను కోస్తా ప్రజలు, హింసా రాజకీయాల రెక్కను సీమ ప్రజలు విరిచేయాలని అన్నారు.

విచక్షణ కోల్పోయి.. విలన్‌లా బాబు

వయసు మరచి బరితెగింపు వ్యాఖ్యలు

'నాకు అడ్డొచ్చిన వాళ్లని తొక్కుకుంటూ పోతా' అనేది ఓ సినిమాలో విలన్ డైలాగ్. సేమ్ అదే డైలాగ్ శనివారం చంద్రబాబు చెప్పి, ఆయనలోని విలన్‌ను మరోసారి పర్చూరు నియోజకవర్గం ఇంకొల్లులో బహిరంగ వేదికపై చూపించారు. తన సభకు అడ్డంకులు సృష్టిస్తున్నారని, తనకు అడ్డొచ్చిన వారిని తొక్కుకుంటూ పోతా అంటూ రెచ్చిపోయి మాట్లాడారు. వయసును కూడా మరిచి సీఎం వైఎస్ జగన్, వైఎస్సార్‌సీపీపై ప్రేలాపనలకు దిగారు. తమను గెలిపిస్తే ప్రజలకు చేసే మేలేమిటో చెప్పకుండా, అధికార పార్టీ పైన, సీఎం జగన్‌పైన అడ్డగోలు విమర్శలు చేయడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తాయి. 'నువ్వు నా ముందొక బచ్చా.. మీ నాన్నే నాకు భయపడ్డాడు' అంటూ దిగజారి మాట్లాడారు. పర్చూరు పౌరుషం చూడు.. నిన్ను, నీ పార్టీని భూస్థాపితం చేస్తామంటూ విచక్షణ కోల్పోయి మాట్లాడారు. చంద్రబాబు ప్రేలాపనలతో విసిగిపోయిన జనం.. బాబు ప్రసంగం మొదలైన కొద్దిసేపటికే ఇవేమి మాటలంటూ ఆయనపై విమర్శలు చేయడం మొదలెట్టారు. బహిరంగ వేదికపై బాబు మాటలు, విన్యాసాలకు విసిగిపోయి, ఈ వయసులో తిట్ల దండకమేంటంటూ లేచి వెళ్లిపోయారు. చంద్రబాబు ప్రసంగం పూర్తయ్యే వరకు ఉండాలంటూ టీడీపీ నేతలు బతిమాలినా, పట్టించుకోకుండా వెళ్లిపోయారు. దీంతో కొద్దిసేపటికే కుర్చీలు ఖాళీ అయ్యాయి.

రూ.500, బిర్యానీ ప్యాకెట్లు, మందు

ఈ సమావేశానికి టీడీపీ నేతలు బాపట్ల, ప్రకాశం జిల్లాల్లోని 13 నియోజకవర్గాల నుంచి జనాన్ని తరలించారు. ఒక్కొక్కరికీ రూ.500, బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు. మద్యం సరఫరా చేశారు.

చంద్రబాబు నయవంచకుడు

- ఆయన మాటలు ప్రజలు నమ్మరు
- వైఎస్సార్‌సీపీ 175 సీట్లూ కైవశం చేసుకుంటుంది
- మంత్రి కారుమూరి నాగేశ్వరరావు


మాట్లాడుతున్న కారుమూరి. పక్కన కన్నబాబు

కాకినాడ రూరల్: చంద్రబాబు నయవంచకుడు, ద్రోహి అని, ఆయన మాటలు ప్రజలు నమ్మే పరిస్థితిలేదని మంత్రి కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. కాకినాడలో ఓ వివాహ వేడుకకు వచ్చిన ఆయన మాజీమంత్రి, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబును ఆయన నివాసంలో శనివారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కన్నబాబుతో కలిసి మంత్రి మీడియాతో మాట్లాడారు. ప్రజలకు సంక్షేమ పథకాలు అందించి, పేదరికం నిర్మూలన దిశగా అడుగులు వేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ రావాలి.. ఆయనే మళ్లీ సీఎం కావాలని ప్రజలు కోరుకుంటున్నారని చెప్పారు. ఇటీవల గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో టీడీపీకి చెందిన ఓ మహిళ కనిపించి 'మీకు ఓటు వేయలేదు బాబూ. కానీ, రూ.2 లక్షల వరకూ వివిధ పథకాల ద్వారా సొమ్ములు వచ్చాయి. మా భార్యాభర్తలం జగన్‌కే ఓటు వేస్తాం' అని సంతోషంగా చెప్పిందన్నారు. దీనిని బట్టి ప్రజల్లో జగన్‌పట్ల విశ్వాసం ఎంతగా పెరిగిందో అర్థంచేసుకోవచ్చన్నారు. దాచుకో.. దోచుకో.. పంచుకో అన్నట్లుగా చంద్రబాబు పాలన సాగిందన్నారు. ఇక ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలనివ్వబోనని పవన్‌కళ్యాణ్ అంటున్నాడని, తమకు వ్యతిరేక ఓటులేదని, అన్నీ అనుకూల ఓట్లేనని మంత్రి కారుమూరి ధీమాగా చెప్పారు. సంక్షేమ పథకాల ఫలితంగా రాష్ట్రంలో పేదరికం 12 నుంచి 6 శాతానికి తగ్గిందన్నారు. నాడు–నేడు ద్వారా సీఎం జగన్ పాఠశాలలను ఆధునీకరించి, ఇంగ్లిషు మీడియం తీసుకొచ్చారన్నారు. చంద్రబాబు ఏ రోజూ ఇటువంటివి పట్టించుకోలేదన్నారు. పైగా.. ఇంగ్లిషు మీడియం కావాలని తాము అసెంబ్లీలో బిల్లు పాస్‌చేసి పంపితే, నాడు కౌన్సిల్‌లో మెజార్టీ ఉండటంతో చంద్రబాబు దీనిని తిరస్కరించారని గుర్తుచేశారు. ఇటువంటి దుర్బుద్ధి కలిగిన ఆయనకు ప్రజలెలా ఓటు వేస్తారని మంత్రి ప్రశ్నించారు. చంద్రబాబు చాప్టర్ అయిపోయిందని, జగన్‌మోహన్‌రెడ్డి యుగం ప్రారంభమైందని, రానున్న ఎన్నికల్లో మొత్తం 175 సీట్లూ కైవసం చేసుకోబోతున్నామని కారుమూరి చెప్పారు. ముఖ్యమంత్రి జగన్ బీసీల పక్షపాతి అని మంత్రి కారుమూరి అన్నారు.

మూడు, నాలుగు రోజుల్లోనే ధాన్యం డబ్బులు

ఖరీఫ్‌లో సుమారు 30 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని.. మూడు, నాలుగు రోజుల్లోనే సంబంధిత రైతుల ఖాతాల్లో ఆ సొమ్ము వేశామని మంత్రి తెలిపారు. నిజానికి.. చంద్రబాబు దళారీ వ్యవస్థను పెంచి పోషించగా.. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రైతుభరోసా కేంద్రాలు తీసుకొచ్చి మద్దతు ధరకే ధాన్యం కొనుగోలు చేశారన్నారు. రంగు మారిన ధాన్యం సైతం కొనుగోలు చేశారని, జగన్ చేసిన మేలును రైతులు మరువరాదని కోరారు. మరోవైపు.. నాణ్యమైన రేషన్ బియ్యంతో పాటు రాష్ట్రమంతటా రాగి పిండి పంపిణీ చేయబోతున్నామని ఆయన తెలిపారు. రబీ ధాన్యం సేకరణకు కూడా సిద్ధంగా ఉన్నామన్నారు.

వచ్చే ఎన్నికల్లో అసెంబ్లీలోనూ టీడీపీ ఖాళీ

వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి


వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమంలో వైవీ సుబ్బారెడ్డి, అమర్‌నాథ్ తదితరులు

సాక్షి, విశాఖపట్నం/సీతంపేట(విశాఖ, ఉత్తర) : రాజకీయాల్లో 40 ఇయర్స్ ఇండస్ట్రీ అని చెప్పుకొనే చంద్రబాబు టీడీపీకి రాజ్యసభలో ఒక్క సీటు కూడా లేదు.. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో అసెంబ్లీలో కూడా ఇదే పరిస్థితి రానుందని వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి అన్నారు. శనివారం ఎండాడలో గల పార్టీ కార్యాలయంలో ఉత్తరాంధ్రలో గల 34 నియోజకవర్గాల ఇన్‌చార్జులు, పరిశీలకులతో ఆయన సమావేశం నిర్వహించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మానస పుత్రులు వలంటీర్లు అని, 57 నెలల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అందించిన సంక్షేమ పథకాలను మరోమారు ప్రజలకు గుర్తు చేసే హక్కు వారికి ఉందన్నారు. తాము అధికారంలోకి వస్తే వలంటీర్ వ్యవస్థను తీసేస్తామని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేశ్‌లు బెదిరింపులకు పాల్పడతున్న విషయాన్ని గుర్తు చేశారు. అసలు టీడీపీ, జనసేనలకు ఒక్క సీటు కూడా వచ్చే పరిస్థితి లేదన్నారు. మీడియా అడిగిన ప్రశ్నకు సమాధానంగా చంద్రబాబు కుర్చీ మడత పెట్టడానికి వారికి కుర్చీనే లేదన్నారు. విధ్వంసం పుస్తకం రాసిన వాళ్లు, ఆవిష్కరించిన వాళ్లను చూస్తేనే దాని వెనుక ఉన్న విధ్వంసం అర్థమవుతోందని చెప్పారు. కార్యక్రమంలో డిప్యూటీ రీజనల్ కోఆర్డినేటర్, మంత్రి గుడివాడ అమర్‌నాథ్ ఉన్నారు.

60 అడుగుల వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ

విశాఖ నగరం నడి బొడ్డున ఉత్తర నియోజకవర్గంలో రాష్ట్రంలోనే అతిపెద్ద వైఎస్సార్‌సీపీ జెండా ఆవిష్కరణ కార్యక్రమం పార్టీ శ్రేణుల మధ్య శనివారం సాయంత్రం అట్టహాసంగా జరిగింది. నగరంలోని అక్కయ్యపాలెం హైవే కూడలి వద్ద జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 60 అడుగుల వైఎస్సార్‌సీపీ జెండాను పార్టీ రీజనల్ కోఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డి, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కేకే రాజు, మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వైవీ సుబ్బారెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో విశాఖపట్నం పరిపాలన రాజధానిగా ఇక్కడ నుంచే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తారని చెప్పారు. విశాఖ అభివృద్ధికి మా పార్టీ కట్టుబడి ఉందనడానికి నిదర్శనమే ఈ రోజు విశాఖనగరం నడి బొడ్డులో రాష్ట్రంలోనే అతి పెద్ద జెండా ఆవిష్కరణ జరిగిందన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ గొలగాని హరివెంకటకుమారి, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పలువురు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

పచ్చ నేతల ప్రలోభ పర్వం

హిందూపురంలో కోడ్‌కు ముందే చీరల పంపిణీ మొదలు

- అక్కడ బాలకృష్ణ ఓటమి ఖాయమని తెలిసి మహిళలను ఆకట్టుకునే యత్నం
- ఇప్పుడు గుర్తొచ్చామా అంటూ నిలదీస్తున్న ప్రజలు


చీరలు పంపిణీ చేస్తున్న టీడీపీ వర్గీయులు

హిందూపురం అర్బన్/చిలమత్తూరు: ఎన్నికలు సమీపిస్తున్న వేళ హిందూపురం నియోజకవర్గంలో టీడీపీ నేతలు ప్రలోభాలకు తెరతీశారు. స్థానిక నేతల ద్వారా చీరల పంపిణీకి శ్రీకారం చుట్టారు. క్లస్టర్, బూత్ లెవెల్ కన్వీనర్ల కనుసన్నల్లో ఈ కార్యక్రమం చురుగ్గా సాగుతోంది. అయితే, చాలాచోట్ల ప్రజల నుంచి వారికి చుక్కెదురవుతోంది. చిలమత్తూరు మండలంలోని అప్పనపల్లిలో శనివారం రాత్రి టీడీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి చీరలు పంపిణీ చేస్తుండగా... సుధాకర్ అనే రైతు వారికి చీవాట్లు పెట్టాడు. 'ఏమి చేశారని మాకు చీరలు ఇచ్చేందుకు వస్తున్నారు? ఏదైనా మంచి చేసి అప్పుడు పంపిణీ చేయండి. ఎన్నికలు వస్తేనే చీరలు పంచుతారా?! ఇదొక్కటి చేస్తే ఓట్లు పడవు. మంచి చేసిన వారికే ప్రజలు ఓట్లు వేస్తారు. మీలాంటి వాళ్లకు కాదు' అని ఆయన చురకలు అంటించారు. దీంతో వారు మెల్లగా అక్కడి నుంచి జారుకున్నారు.

రాత్రికి రాత్రే పంపిణీ

హిందూపురం నియోజకవర్గంలో టీడీపీ నాయకులు రాత్రిపూట చీరల పంపిణీ చేపడుతున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తే చీరలు పంచేందుకు ఇబ్బందిగా ఉంటుందనే ఉద్దేశంతో ఇప్పుడే మొదలుపెట్టారు. ఈసారి మహిళా ఓట్లు పడవని నిర్ధారణకు వచ్చారో ఏమో తెలియదు కానీ హిందూపురం రూరల్, లేపాక్షి, చిలమత్తూరు మండలాల్లో క్లస్టర్, బూత్ కన్వీనర్ల కనుసన్నల్లో మహిళా ఓటర్లకు చీరల పంపిణీ కొనసాగుతోంది. నియోజకవర్గ వ్యాప్తంగా 2,46,463 మంది ఓటర్లు ఉండగా.. అందులో మహిళా ఓటర్లు 1,22,471 మంది ఉన్నారు. ఇందులో లక్ష మందికైనా చీరలు పంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. ఎమ్మెల్యే బాలకృష్ణ ఫొటోతో ఉన్న బ్యాగులో చీరలు ఉంచి మహిళలకు అందిస్తున్నారు. నాలుగు రోజులుగా ఈ పంపిణీ ప్రక్రియ సాగుతోంది. ఇప్పటికే లేపాక్షి మండలంలోని తిలక్ నగర్, నాయనపల్లి, లేపాక్షి, కంచిసముద్రం, చోళసముద్రం, హిందూపురం రూరల్ మండలంలోని బేవనహళ్లి, చౌళూరు, మనేసముద్రం, చిలమత్తూరు మండలంలో సోమఘట్ట, చాగలేరు, కోడూరు, చిలమత్తూరు, దేమకేతేపల్లిలో పంపిణీ పూర్తి చేశారు. టేకులోడు, తుమ్మలకుంట, వీరాపురంలో రెండు రోజుల్లో పంపిణీ చేయాలని నిర్ణయించారు. ఈసారి నందమూరివారి కంచుకోట బద్దలవ్వడం ఖాయమని నిర్ధారణకు వచ్చిన బాలకృష్ణ పీఏలు ఈ సమాచారాన్ని పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్లడంతో తప్పనిసరి పరిస్థితులలో చీరలు పంపిణీ చేసి మహిళా ఓటర్లను ఆకర్షించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే వారి ప్రయత్నాఫలించవని ప్రజలు అంటున్నారు.

ఓట్లు దండుకునేందుకే గోబెల్స్ ప్రచారం


1,238వ రోజు రిలే దీక్షలో బహుజన నాయకులు


రిలే దీక్షలో పాల్గొన్న బహుజన నేతలు

తాడికొండ: ఏపీలోని రాజకీయ పెత్తందారులంతా కలిసి రియల్ ఎస్టేట్ దందా కోసం ఎల్లో మీడియాలో గోబెల్స్ ప్రచారం చేసుకుంటూ ఓట్లు దండుకునేందుకు ఎత్తుగడ వేస్తున్నారని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. గుంటూరు జిల్లా తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా బహుజన పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శనివారం 1,238వ రోజుకు చేరాయి. పలువురు నాయకులు మాట్లాడుతూ అనుభవజ్ఞుడని గత ఎన్నికల్లో గెలిపిస్తే.. రాష్ట్రాన్ని నిలువు దోపిడీ చేసిన చంద్రబాబు ఇప్పుడు మళ్లీ అమరావతి డ్రామా కంపెనీ పెట్టి అధికారం కోసం పాకులాడుతుండడం సిగ్గుచేటన్నారు. నీచమైన సంస్కృతికి కేరాఫ్ అయిన చంద్రబాబు ఓటుకు కోట్లు కేసులో పట్టుబడి ఉమ్మడి రాజధాని హైదరాబాద్‌ను వదిలి కరకట్టకు పారిపోయి వచ్చాడన్నారు. నాయకులు మాదిగాని గురునాథం, బేతపూడి రాజేంద్ర, పెద్దింటి విజయ్, పులి దాసు, కుమ్మరవల్లి కిషోర్, బి.సలోమి, ఈపూరి ఆదాం, బొలిమేర శ్యామ్యేలు, కారుమూరు పుష్పరాజు, బి.సౌమ్య, పల్లె బాబు, బేతపూడి సాంబయ్య, నూతక్కి జోషి పాల్గొన్నారు.

మోదీ నంబర్ ఉంటే.. ప్రత్యేక హోదా తేవచ్చుగా!

పవన్‌ను ఉద్దేశించి లక్ష్మీనారాయణ పరోక్ష విమర్శ



శ్రీశైలం ప్రాజెక్ట్: 'ఒక రాజకీయ పార్టీ నేత తన జేబులో ప్రధాని మోదీ, అమిత్ షా నంబర్లు ఉన్నాయని చెబుతుంటారు. వాడి అంతుచూస్తా... వీడి అంతు చూస్తానంటూ బెదిరిస్తుంటారు. ఆయనకు అంత పరపతి ఉంటే ప్రత్యేక హోదా ఇప్పించొచ్చు కదా' అని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌ను ఉద్దేశించి జై భారత్ పార్టీ అధ్యక్షుడు వి.వి.లక్ష్మీనారాయణ పరోక్ష వ్యాఖ్యలు చేశారు. నంద్యాల జిల్లా శ్రీశైలం ప్రాజెక్టులో ఏర్పాటు చేసిన జై భారత్ పార్టీ కార్యాలయాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడుతూ అనేక ఏళ్లపాటు రాష్ట్రాన్ని పాలించిన ఓ నేత ప్రత్యేక హోదా ఏమైనా సంజీవనా అని ప్రశ్నించారని.. ఆయనే రాష్ట్రాభివృద్ధిని ఆదిలోనే తుంచివేశారని విమర్శించారు. రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించి ప్రత్యేక హోదాపై చట్టం తీసుకురాకుండా ఏపీ భవిష్యత్‌ను నాశనం చేసిన కాంగ్రెస్ పార్టీ.. ఇప్పుడు అధికారంలోకి వస్తే ప్రత్యేక హోదాపైనే తొలి సంతకం పెడతామనడం సిగ్గుచేటన్నారు.

సాక్షి ఫ్యామిలీ
బెంగళూరు
ఆదివారం ॥ 18-2-2024

వైరల్



ఆలియా భట్ గొంతును అనుకరిస్తూ బోలెడు పాపులారిటీ సంపాదించింది 24 సంవత్సరాల కంటెంట్ క్రియేటర్ చాందిని భాబ్డా. ఈ పాపులారిటీనే ఆమెను ముంబైలో ఒక ఫ్లాట్‌కు ఓనర్‌ను చేసింది. సంప్రదాయ రీతిలో గృహప్రవేశంతో తన విజయాన్ని సెలబ్రేట్ చేసుకుంది చాందిని.



మిమిక్రీ శాయవలే... ముంబైలో ఫ్లాట్ కొనవలే!

ఇన్‌స్టాలో షేర్ చేసిన ఈ ఫోటోలు వైరల్ అయ్యాయి. 2022లో ఆన్-పాయింట్ మిమిక్రీ క్లిప్స్‌తో సోషల్ మీడియా సెన్సేషన్‌గా మారింది చాందిని.


సొంత ఇంటి కలతో మిమిక్రీ కళను నమ్ముకొని డబ్బులను పొదుపు చేసేది. ఎట్టకేలకు ఆమె కల ఫలించింది. ఈ ఫ్లాట్ కొనడానికి ఎన్నో ఇష్టాలను వదులుకొని, ఎలా డబ్బు పొదుపు చేసిందీ ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో వివరించింది చాందిని. 'ఫ్రెండ్స్ విదేశాలకు వెళుతున్నప్పుడు నాకు కూడా వెళ్లాలనిపించేది. బర్త్‌డే ఫంక్షన్‌ను ఘనంగా జరుపుకోవాలనుకునేదాన్ని... ఇలాంటి ఎన్నో సందర్భాలలో ఇంటికల గుర్తుచ్చేది. పొదుపు చేయడం ఎప్పుడూ మానలేదు' అని రాసింది చాందిని.

సెల్యూట్ టు కల్నల్ స్వప్న రాణా



'ఉమెన్ ఆఫ్ ఇంపాక్ట్' సిరీస్‌లో భాగంగా కల్నల్ స్వప్న రాణా అసాధారణ ప్రయాణానికి సంబంధించిన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌పై ఆన్‌లైన్ కమ్యూనిటీలో ప్రశంసల జల్లు కురుస్తోంది. కంగనా రనౌత్‌లాంటి బాలీవుడ్ నటీమణులు రాణా జీవిత కథను తమ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేస్తున్నారు. హిమాచల్ ప్రదేశ్‌లోని చిన్న గ్రామంలో పుట్టిన స్వప్న వ్యవసాయ పనులు చేసింది. బస్సు ఎక్కడానికి డబ్బులు లేక నడుచుకుంటూనే కాలేజీకి వెళ్లేది. కష్టపడుతూనే చదువుకుంది. 'హిమాచల్‌ప్రదేశ్ యూనివర్శిటీ'లో ఎంబీఏలో చేరిన స్వప్న ఆ తరువాత సివిల్ సర్వీసెస్‌కు ప్రిపేరవుతూనే కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామ్ రాసి సెలెక్టైంది. ఆ తరువాత చెన్నైలోని ట్రైనింగ్ అకాడమీలో శిక్షణ తీసుకుంది. 2004లో లెఫ్టినెంట్‌గా నియమితురాలైంది. ప్రస్తుతం ఈశాన్య రాష్ట్రాల్లో ఆర్మీ సర్వీస్ కార్ప్స్ బెటాలియన్‌కు కమాండింగ్ ఆఫీసర్‌గా విధులు నిర్వహిస్తున్న స్వప్న రాణా ప్రతిష్ఠాత్మకమైన అవార్డులు ఎన్నో అందుకుంది.

వాహ్! ఐస్ టీ వాహ్!





బయట మంచు కురుస్తుంటే లోపల టీ తాగితే బాగుంటుంది. కాని మంచు సెలయేటిలో కూచుని మంచుని కరిగించి టీ కాచుకుంటే? అదీ బాగుంటుందని 78 మిలియన్ల వ్యూస్ చెబుతున్నాయి. కశ్మీర్‌కు షికారుకు వెళ్లిన ముగ్గురు మిత్రులు మంచి పాట వింటూ గుప్పెడు మంచుతో టీ కాచారు. వైరల్ అయ్యారు.

చల్లటి ప్రాంతంలో అందరూ తాగే ద్రవం టీ. చలి ముఖాన చరుస్తూ ఉంటే పొగలు గక్కే టీ పెదాలకు అందుతూ ఉంటే ఆ మజాయే వేరు. రాహుల్ యాదవ్ అనే ట్రావెలర్ ఇన్‌స్టాలో 'ట్రాహులర్' అనే అకౌంట్‌లో తన ట్రావెల్ వీడియోలు పోస్ట్ చేస్తుంటాడు. జనవరి 29న అతను తన ఇద్దరు మిత్రులతో ఒక వీడియో పెట్టాడు. అది విపరీతంగా జనానికి నచ్చేసింది. కారణం... కశ్మీర్‌లో నిర్మానుష్యమైన లోయలో, గడ్డ కట్టిన సెలయేటి మధ్యలో కూచుని ఆ మిత్రులు 'టీ తయారు చేశారు'. మామూలుగా కాదు. టీ గిన్నెలో అక్కడున్న మంచును వేసి మరీ! క్యాంప్ స్టవ్ మీద ఆ మంచు నిండిన టీ గిన్నె కాసేపటికి వేడి నీరుగా మారింది. అందులో కొంత టెట్రా మిల్క్ వేశారు. ఆ పై టీయాకును, చక్కెరను వేస్తే చిక్కటి రంగులో ఘుమఘుమలాడే టీ తయారైంది. ఇటీవల విడుదలైన 'డంకీ'లోని పాట బ్యాక్‌గ్రౌండ్‌లో వినిపిస్తూ ఉండగా ఆ ముగ్గురూ మనకు ఈర్ష్య కలిగేలా టీ తాగారు. ఈ వీడియో రెండు వారాల్లో 7 కోట్ల 8 లక్షల మంది చూశారు. 'మేం కూడా ఎప్పుడో ఒకసారి ఇలా తాగకపోతామా?' అని కొందరంటే 'సేఫేనా?' అని కొందరన్నారు. బ్యాక్టీరియా ఉంటుందేమో అని మరికొందరు సందేహం వెలిబుచ్చారు. బాగా వేడి చేశారు కనుక బ్యాక్టీరియా ఉండకపోవచ్చు. అయినా స్వచ్ఛమైన మంచు టీ తయారు చేసుకుని తాగే ముందు ఈ సందేహాల గోల ఏల?

డ్రైఫ్రూట్స్ నగల ధగధగలు

ఫంక్షన్‌లో పదిమంది దృష్టి పడేలా ప్రత్యేకంగా కనిపించాలనుకోవడం సహజం. మేకప్ ఆర్టిస్ట్ వసుంధర మరింత ప్రత్యేకంగా కనిపించాలని డిసైడై 'డ్రై ఫ్రూట్స్ జ్యూలరీ' ధరించింది. యూనిక్ లుక్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో బజ్ క్రియేట్ చేసింది. మాంగ్ టిక్క, గాజులు, జూకాలు, వడ్డాణం... ఇలా అన్నీ డ్రైఫ్రూట్స్‌తో తయారు చేసినవే. ఫంక్షన్ తరువాత డ్రైఫ్రూట్స్‌ను రీయూజ్ చేస్తారా, పారేస్తారా అనేది మాత్రం తెలియదు. 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఈ వీడియో వేలాది లైక్‌లతో వైరల్ అయింది.



'భలే ఉన్నారు' అనే ప్రశంసలతో పాటు 'వేస్టేజ్ ఆఫ్ ఫుడ్'లాంటి కామెంట్స్ కనిపించాయి.

ఎంత ఎమర్జెన్సీ అయితే మాత్రం ఇదేమిటి తమ్ముడూ!

అమీర్‌ఖాన్, మాధవన్, శర్మన్ జోషిల 'త్రీ ఇడియెట్స్' సినిమాలోని సన్నివేశాలను ఇప్పటికీ గుర్తు తెచ్చుకుంటాం.

అందులో ఒకటి హాస్పిటల్ సీన్. అనారోగ్యంతో బాధపడుతున్న శర్మన్ తండ్రిని అమీర్‌ఖాన్ స్కూటర్‌పై కూర్చోబెట్టుకొని, భుజాలకు కట్టేసుకొని ఆస్పత్రి ఎమర్జెన్సీ వార్డులోకి దూసుకువెళ్లే సీన్ ఉంది. మధ్యప్రదేశ్‌లోని ఒక హాస్పిటల్‌లో అచ్చం ఇలాంటి సీనే కనిపించింది.



అపస్మారకస్థితిలో ఉన్న తన తాతను బైక్‌పై కూర్చోపెట్టుకొని ఆస్పత్రి ఎమర్జెన్సీ వార్డులోకి దూసుకువెళ్లాడు ఒక వ్యక్తి. సదరు ఈ వ్యక్తి ఇదే ఆస్పత్రిలో పనిచేస్తాడట. 'ఎక్స్'లో ఒక యూజర్ షేర్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది. 'త్రీఇడియెట్స్' సినిమా సీన్‌ను గుర్తు తెస్తుంది.

మచ్చా... మైండ్‌బ్లోయింగ్!

*** ఇంగ్లీష్ మస్తు మాట్లాడుతడు**



ఇంగ్లీష్‌లో తట్టుకుంటూ మాట్లాడటం వేరు, భయంగా మాట్లాడటం వేరు. ఫ్లుయెంట్‌గా, ధైర్యంగా మాట్లాడటం వేరు. ఢిల్లీలోని జామా మసీద్ ప్రాంతంలో తన రిక్షాలో కూర్చున్న విదేశీ దంపతులతో ఒక రిక్షావాలా ఇంగ్లీష్‌లో ఫ్లూయెంట్‌గా మాట్లాడడం చూస్తుంటే 'మైండ్‌బ్లోయింగ్ మచ్చా' అనిపిస్తుంది. 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఈ వీడియో వైరల్ అయింది. ఇంగ్లీష్ నేర్చుకోవాలనే తపన ఉన్న వారిలో ధైర్యం నింపుతోంది. ఈ వీడియోలాగే ఇటీవల మరో వీడియో వైరల్ అయింది. గోవా బీచ్‌లో గాజులు అమ్మే మహిళ ఆ ప్రాంతం గురించి విదేశీ టూరిస్టులతో గడ గడా ఇంగ్లీష్‌లో మాట్లాడుతున్న వీడియో నెట్‌లోకంలో చక్కర్లు కొట్టింది. ఎనిమిదేళ్ల వయసు నుంచి గోవా బీచ్‌లో తల్లిదండ్రులతో కలిసి తిరిగిన ఆమెకు ఆ పరిసర ప్రాంతాల్లో వినిపించే మాటలే ఇంగ్లీష్ నేర్చుకునే పాఠాలు అయ్యాయి.

ఈ వైరల్ వీడియోను చూసిన వాళ్లు 'చెట్లకు డబ్బులు కాస్తాయా!' అనే సామెతకు 'భేషుగ్గా' అని జవాబు చెప్పవచ్చు. 2.8 లక్షల వ్యూస్‌ను సొంతం చేసుకున్న ఈ వీడియోలో రాయితో కొట్టి చెట్టు నుంచి ప్రజలు కాయిన్స్ తీసుకోవడం కనిపిస్తుంది. 'సీయింగ్ ఈజ్ బిలీవింగ్' అనే మాట నిజమేగానీ 'ఇదెలా సాధ్యం?' అనే ఒక ప్రశ్న మన ముందు నిటారుగా నిలబడుతుంది.

ఇక అసలు విషయానికి వస్తే బిహార్‌లోని రాజ్‌గిర్ ప్రాంతంలో ఎన్నో సంవత్సరాల చరిత్ర ఉన్న చెట్టు ఇది.

ఇచట చెట్లకు డబ్బులు కాయబడును!



ఈ చెట్టు బెరడు తీసి అందులో నాణెం పెడితే శుభం జరుగుతుందనే సెంటిమెంట్ ఉంది. ఈ సెంటిమెంట్ పుణ్యమా అని చెట్టులో ఎటు చూసినా డబ్బులే డబ్బులు!

అదృష్టం కోసం ఇంట్లో 'మనీ ప్లాంట్' పెట్టుకోవడం మనకు తెలిసిందే. ఈ వీడియోను చూసిన తరువాత మాత్రం 'ఇదే అసలు సిసలు మనీప్లాంట్' అంటున్నారు నెటిజనులు.

హెల్త్

ఈ ప్రపంచంలోని ప్రతి ముగ్గురిలో ఒకరు తమ జీవితకాలంలో మెదడుకు సంబంధించిన వ్యాధి బారిన పడితీరతారు. 1990లో బ్రెయిన్ స్కాన్ తీసే ఎమ్మారైను కనుగొన్న నాటి నుంచి ఇప్పటివరకు ... ఈ సమస్యల మీద 50,000 హెల్త్ ఆర్టికల్స్ ప్రచురితమయ్యాయి. వాటి ద్వారా తెలిసిన విషయం ఏమిటంటే... 0.5 శాతం ఆర్టికల్స్‌లో మాత్రమే కేవలం మహిళలకు సంబంధించిన మెదడు సమస్యలపై విశ్లేషణలు జరిగాయి. దీన్ని బట్టే ఇప్పటివరకూ మహిళ మెదడు ఆరోగ్యంపై ప్రపంచం అంతగా దృష్టి కేంద్రీకరించలేదని అర్థమవుతోంది. మెదడు సంబంధిత సమస్యలు స్త్రీ, పురుషులిరువురిలోనూ కనిపించినా... మహిళల్లో కాస్త భిన్నంగా, సంక్లిష్టంగా ఉండే కొన్ని ఆరోగ్య సమస్యలపై అవగాహన కోసం ఈ కథనం.

కొన్ని మెదడు సంబంధిత సమస్యలు...
మహిళల్లోనే ఎందుకు సంక్లిష్టం?



మహిళల జీవితంలో పీరియడ్స్ మొదలు కావడం, గర్భం దాల్చడం, బిడ్డకు పాలివ్వాల్సి రావడం, ప్రత్యుత్పత్తి సైకిల్‌లో చివరన పీరియడ్స్ ఆగిపోవడంలాంటి అనేక సంక్లిష్టమైన జీవక్రియల హార్మోన్ల ప్రభావంతో మెదడు తాలూకు సమస్యలకు ఆస్కారం ఎక్కువ.

మైగ్రేన్: పురుషులతో పోలిస్తే మహిళల్లో ఈ సమస్య మూడు రెట్లు ఎక్కువ. లక్షణాల తీవ్రతా మూడు రెట్లు అధికం. మెనోపాజ్‌కు కాస్త ముందు... కాస్త తర్వాత మైగ్రేన్ తలనొప్పుల తీవ్రత మరింత పెరుగుతుంది.

మెనోపాజ్‌తో పీరియడ్స్ ఆగిపోయిన కొంతకాలానికి దేహంలోని హార్మోన్ల స్రావాల్లోని హెచ్చుతగ్గులన్నీ ఒక సమస్థాయికి చేరాక మైగ్రేన్ బాధలు క్రమంగా ఓ కొలిక్కి వస్తాయి. పీరియడ్స్ సమయాల్లో ఒక్కసారిగా ఈస్ట్రోజెన్ మోతాదులు తగ్గడం వల్ల మైగ్రేన్ బాధలు చాలా తీవ్రంగా ఉండి, సుదీర్ఘంగానూ బాధపెడతాయి. అంతేకాకుండా మందులకూ వాళ్లు తక్కువగానే స్పందిస్తారు.

▲ నోటిద్వారా తీసుకునే కుటుంబ నియంత్రణ మాత్రలు వాడుతున్న కొందరిలో మైగ్రేన్‌లో తగ్గుదల కనిపించినప్పటికీ, మరికొందరిలో ఆ బాధలు తీవ్రతరమవుతాయి. మైగ్రేన్ నివారణకు వాడే టోపిరామేట్ వంటి మందులతో కుటుంబ నియంత్రణ మాత్రల ప్రభావమూ తగ్గుతుంది. కాబట్టి మైగ్రేన్‌తో బాధపడుతూ కుటుంబ నియంత్రణ మందులు వాడుతున్నవారు లేదా వాడాలనుకుంటున్నవారు తమ డాక్టర్‌తో ఆ విషయాల్ని స్పష్టంగా చర్చించాలి.

▲ మైగ్రేన్ ఉన్న కొందరిలో గర్భం ధరించి ఉన్న సమయంలో కొంతమందిలో కాస్త ఉపశమనం దొరికే అవకాశముంది. అయితే మైగ్రేన్ మందుల వల్ల కడుపులోని చిన్నారిపై దుష్ప్రభావం పడే అవకాశం ఉంది కాబట్టి, గర్భధారణ టైమ్‌లో వాడే పెయిన్ కిల్లర్స్, సోడియమ్ వాల్‌ప్రోయేట్, టోపిరమేట్, ప్రొపనాల్, ఎర్గోటమైన్ వంటి మందుల్ని పూర్తిగా ఆపేయాలి. ఆ టైమ్‌లో సురక్షితమైన పారాసిటమాల్, సుమట్రిప్టాన్స్ వంటివే వాడాలి.

▲ ఇక గర్భధారణ తర్వాత బిడ్డకు పాలిచ్చే సమయంలోనూ కొన్ని మందులు వాడకూడదు. ఎందుకంటే ఆ ఔషధాలు పాలలోకి ఊరి, బిడ్డ మీదా ప్రభావం చూపే అవకాశమున్నందున ఈ జాగ్రత్త పాటించాలి.

పక్షవాతం: మహిళల్లో, పురుషుల్లో ఈ సమస్య తాలూకు రిస్క్‌ఫ్యాక్టర్స్ సమానమే అయినా... కుటుంబ నియంత్రణ మందుల వాడకం, గర్భధారణ, పీరియడ్స్ ఆగడం (మెనోపాజ్) వంటి అంశాల వల్ల మహిళల్లో మరికాస్త ఎక్కువ ముప్పు ఉంటుంది.

▲ మహిళల్లోని ఈస్ట్రోజెన్ హార్మోన్ గుండెపోటు, పక్షవాతం నుంచి వారికి రక్షణ కల్పిస్తుంది. అయితే మెనోపాజ్ వచ్చే నాటికి ఈస్ట్రోజెన్ తగ్గుతూ పోతుండటంతో పక్షవాతం ముప్పు పెరుగుతూ పోతుంది. ఇక 40 ఏళ్లకు ముందే పీరియడ్స్ ఆగిపోయేవారిలో ఈ ముప్పు మరింత ఎక్కువ. ఈ అంశం వల్ల కొందరిలో హైబీపీ, కొలెస్ట్రాల్ పెరగడం, ఊబకాయం, పొట్ట పెరగడం, ఏట్రియల్ ఫిబ్రిలేషన్ వంటి గుండె లయలో వచ్చే మార్పులు, డిప్రెషన్ వంటి సమస్యల వల్ల పక్షవాతం అవకాశాలూ పెరుగుతాయి. ఈ మార్పులు రక్తనాళాల్లో అడ్డంకులూ లేదా రక్తనాళాలు చిట్లడానికి ఆస్కారమిచ్చి, పక్షవాతానికి దారితీస్తాయి.

మెనోపాజ్ సమస్యలను చక్కదిద్దే హార్మోన్ రీప్లేస్‌మెంట్ చికిత్సను 10 ఏళ్లకు మించి తీసుకుంటున్నవారిలో హైబీపీ, డయాబెటిస్ ఉంటే.. వాళ్లలో పక్షవాతం ముప్పు మరింత ఎక్కువ.

▲ మిగతా సాధారణ మహిళలతో పోలిస్తే... గర్భధారణ సమయంలోని చివరి మూడు నెలలూ, అలాగే బిడ్డ పుట్టాక మరో నెలన్నర పాటు రక్తం గడ్డకట్టే గుణం ఎక్కువగా ఉండటం వల్ల పక్షవాతం ముప్పు మూడు రెట్లు ఎక్కువ. అందుకే ఆ రిస్క్ ఫ్యాక్టర్స్ ఉన్నవారు తమ సమస్యలను తప్పనిసరిగా డాక్టర్లతో చర్చించాలి.

అందుకే ఓ ప్రత్యేక ప్రాజెక్ట్...

పురుషులతో పోలిస్తే మహిళల్లో మెదడుకు సంబంధించిన కేసుల భిన్నత్వాన్నీ, సంక్లిష్టతలనూ అధ్యయనం చేయడం కోసమే ఓ ప్రత్యేకమైన ప్రాజెక్టు కూడా నిర్వహితమవుతోంది. అదే 'ఉమెన్స్ బ్రెయిన్ ప్రాజెక్టు'. గతేడాదే ఇది ప్రారంభమైంది. ఇందులో పురుషులకంటే మహిళలు ఎక్కువగా ఎదుర్కొనే ఐదు ముఖ్యమైన ఆరోగ్య సమస్యలపై ప్రత్యేకంగా పరిశోధనలు జరుగుతున్నాయి. అవి... అల్జైమర్స్ డిసీజ్, పక్షవాతం (స్ట్రోక్), మల్టిపుల్ స్క్లిరోసిస్, పార్కిన్‌సన్స్ డిసీజ్, ఎపిలెప్సీ ముఖ్యమైనవి. వీటిల్లో మనదేశంలో అత్యంత ఎక్కువగా ఇబ్బంది కలిగిస్తున్న ప్రధానమైన మూడు జబ్బులైన మైగ్రేన్, పక్షవాతం, మూర్ఛ గురించి తెలుసుకుందాం.


ఎపిలెప్సీ (మూర్ఛ): ఈస్ట్రోజెన్ మూర్ఛ అవకాశాలను పెంచుతుంది. ప్రోజెస్టెరాన్ మూర్ఛ అవకాశాలు తగ్గిస్తుంది. అందువల్లనే పీరియడ్స్, అండం విడుదలయ్యే (ఓవ్యూలేషన్) సమయాల్లో మూర్ఛ అవకాశాలు కాస్త ఎక్కువ. దీన్ని 'కెటమేనియల్ ఎపిలెప్సీ' అంటారు. అలాగే యువతుల్లో పీరియడ్స్ మొదలుకావడం, గర్భధారణ, మెనోపాజ్ వంటివి సైతం వారిలో ఎపిలెప్సీ సమస్యను మరింత సంక్లిష్టం చేస్తాయి.

▲ నోటి ద్వారా తీసుకునే కొన్ని రకాల కుటుంబ నియంత్రణ మందులు మూర్ఛ వచ్చే ముప్పును మరింత పెంచుతాయి. వీటివల్ల మూర్ఛమందుల ప్రభావం తగ్గడం, అలాగే కొన్నిసార్లు మూర్ఛ మందుల వల్ల... ఓరల్ కాంట్రసెప్టివ్ ప్రభావం తగ్గడంతో అవాంఛిత గర్భం వచ్చే ముప్పు పెరుగుతుంది. కార్బమజెపెన్ వంటి ఎపిలెప్సీ మందుల వాడకం విషయంలో ఈ ముప్పు మరింత ఎక్కువ. కాబట్టి మహిళలు తాము వాడుతున్న మందుల గురించి డాక్టర్‌కు విపులంగా చెప్పాలి.

▲ ఎపిలెప్సీకి సాధారణంగా వాడే సోడియమ్ వాల్‌ప్రోయేట్ వంటి మందు పుట్టబోయే బిడ్డకు అంగవైకల్యాలు కల్పించే అవకాశం ఉన్నందున కొన్ని దేశాల్లో వాటిపై నిషేధం కూడా ఉంది. ▲ ఎపిలెప్సీకి వాడే మరికొన్ని మందులు కూడా కొన్ని దుష్ప్రభావాలను కలగజేసే అవకాశం ఉంది. అయితే ఫోలిక్ యాసిడ్ వల్ల ఆ ముప్పును గణనీయంగా తగ్గించడం సాధ్యం. అందుకే ప్రెగ్నెన్సీ ప్లాన్ చేసుకున్న నాటి నుంచి స్త్రీలు ఫోలిక్ యాసిడ్ మాత్రలు వాడటం మంచిది.

▲ **అంతేకాదు...** గర్భధారణ తర్వాత మహిళలు బరువు పెరుగుతారు. ఆ తర్వాత మళ్లీ బరువు తగ్గి, మునపటి స్థాయికి వచ్చే అవకాశమూ ఉంటుంది. వాళ్ల బరువును బట్టి ఎపిలెప్సీ మందుల మోతాదులను మార్చాల్సి ఉంటుంది కాబట్టి ఆ సమయాల్లో డాక్టర్ల పర్యవేక్షణ అవసరం.

మహిళల మెదడు సమస్యల విషయంలో ఇన్ని ప్రత్యేకతలు, సంక్లిష్టతలు ఉన్నందువల్ల ఇటీవల కొన్ని దేశాల్లో 'మహిళల న్యూరాలజీ' అనే ప్రత్యేక విభాగాలకు ప్రాధాన్యం పెరుగుతోంది.



డాక్టర్ బి. చంద్రశేఖర్ రెడ్డి,
సీనియర్ న్యూరో ఫిజీషియన్

మూత్రవిసర్జన సమయంలో తీవ్రమైన నొప్పి లేదా ఇబ్బంది కలిగే సమస్యను వైద్య పరిభాషలో 'డిస్‌యూరియా' అంటారు. గతంలో ఇది కొంత వయసు పైబడ్డవారిలోనే కనిపించేది. కానీ ఇటీవల సాధారణ యువతులు, మహిళలు, మధ్య వయసు వారిలోనూ ఎక్కువగానే కనిపిస్తోంది. ఈ సమస్యకు కారణాలూ, నివారణ, పరిష్కారాల వంటి అవగాహన కోసం ఉపయోగపడేదే ఈ కథనం.

డిస్‌యూరియా
మూత్ర విసర్జనలో నొప్పి ఎందుకు?



మూత్రవిసర్జనలో నొప్పి, ఇబ్బందులు పురుషులూ, మహిళలు... ఇద్దరిలోనూ కనిపించినప్పటికీ... శరీర నిర్మాణపరమైన అంశాల కారణంగా మహిళల్లో ఈ సమస్య కాస్త ఎక్కువగా కనిపిస్తుంది.

మరికొన్ని కారణాలు...

◆ కిడ్నీల నుంచి మూత్రాశయంలోకి మూత్రాన్ని తీసుకెళ్లే నాళాలైన యురేటర్స్‌లో గానీ, మూత్రాశయం (బ్లాడర్)లో గానీ, లేదా బ్లాడర్ నుంచి మూత్రాన్ని శరీరం బయటకు తెచ్చే యూరినరీ ట్రాక్ట్ నాళాల్లో గానీ ఇన్ఫెక్షన్స్ కారణంగా ఈ నొప్పి రావచ్చు.

◆ పురుషుల్లో ప్రోస్టేట్ గ్రంథి పెద్దది కావడం వల్ల ఈ సమస్య రావచ్చు. ◆ ఇక మహిళల్లోనైనా లేదా పురుషుల్లోనైనా కిడ్నీల్లో రాళ్లు ఏర్పడటం, మూత్రంతో ముందుకు జారే క్రమంలో అవి యురేటర్ లేదా యూరినరీ ట్రాక్ట్ నాళాల్లో గీసుకుపోతూ పయనించడం వల్ల నొప్పి వచ్చే అవకాశాలెక్కువ.

◆ ఇలా రాళ్లు గీసుకుపోయినప్పుడు నాళాల్లో వాపు, గాయాల్లో బ్యాక్టీరియా చేరడంతో మూత్రవిసర్జన వ్యవస్థకు నష్టం జరిగే ఆస్కారముంది. అప్పుడూ నొప్పి తీవ్రంగానే వస్తుంది. ◆ డయాబెటిస్ ఉన్నప్పుడు ఈ సమస్య మరింత తీవ్రమయ్యే అవకాశాలెక్కువ. ◆ ఒక్కోసారి మహిళల్లో గర్భధారణ వంటి అంశాలూ సమస్యకు కారణం కావచ్చు. ◆ హాస్పిటల్‌లో చికిత్స తీసుకుంటున్న వారికి క్యాథెటర్ వంటివి వేయడమూ డిస్ యూరియాకు దారితీయవచ్చు. ◆ మెనోపాజ్ తర్వాత మహిళల్లో హార్మోన్ల మార్పుల కారణంగా వెజైనా పొడిబారిపోవడం, యూరినరీ ట్యూబ్ సన్నబడటం (ష్రింక్ కావడం) వల్ల మంట రావడం చాలా సాధారణం. దీన్ని 'మెనోపాజల్ బర్నింగ్'గా చెబుతారు.

లక్షణాలు...

◆ మూత్ర విసర్జన సమయంలో నొప్పితో పాటు ఒక్కోసారి నొప్పి మరీ ఎక్కువగా ఉండి... నిప్పు కాల్చినంత తీవ్రంగానూ ఉండవచ్చు. అప్పటికే సెక్సువల్లీ ట్రాన్స్‌మిటింగ్ డిసీజెస్‌తో బాధపడుతున్నవారిలో ఈ నొప్పి మరింత తీవ్రతరమవుతుంది. నొప్పితోపాటు కొందరిలో మంట, దురద రావచ్చు.

◆ మూత్రం రంగు డార్క్ కలర్‌లో ఉండవచ్చు. కిడ్నీల్లో రాళ్లు యురేటర్ లేదా యూరినరీ ట్రాక్ట్ నాళాల్లో గీసుకుపోతూ పయనించడం వల్ల అయ్యే గాయాల్లోంచి రక్తం స్రవించడంతో మూత్రం రంగు ఇలా డార్క్‌గా మారుతుంది. రక్తస్రావం మరీ ఎక్కువ అయితే మూత్రంలో ఎరుపు చారిక లేదా ఎరుపు కనిపించవచ్చు. కొందరిలో చీము వచ్చే అవకాశాలూ ఉంటాయి.

◆ రాళ్లు గీసుకుపోవడం వల్ల అయిన గాయాల్లో ఇన్ఫెక్షన్ కారణంగా జ్వరం రావచ్చు.

◆ మూత్రంలో దుర్వాసన ఎక్కువగా ఉండవచ్చు.

చికిత్స...

◆ ఇన్ఫెక్షన్ కారణంగా ఈ సమస్య వస్తే డాక్టర్ల పర్యవేక్షణలో తగిన యాంటీబయాటిక్స్ వాడాల్సి ఉంటుంది. ◆ అదే కిడ్నీలో రాళ్ల కారణంగా యురేటర్ లేదా యూరినరీ ట్రాక్ట్ నాళాలు ఒరుకుసుపోయి వస్తే ముందుగా ఇన్ఫెక్షన్ తగ్గడానికి మందులు వాడుతూ, సమాంతరంగా కిడ్నీలో రాయిని తొలగించడానికి అవసరమైన చికిత్స తీసుకోవాలి.



డాక్టర్ సారికా పాండ్య,
సీనియర్ ఫిమేల్ యూరాలజిస్ట్

మెడి టిప్

వేరికోస్ వెయిన్స్ వల్ల బాధలు తగ్గాలంటే...

మోకాలి నుంచి పాదాల వరకు రక్తం కిందికి జారిపోకుండా నిలువరించే కవాటాలు (వాల్వులు) బలహీనమైనప్పుడు రక్తనాళాలు (సిరల్ - వీన్స్) అవి ఉబ్బినట్లుగా కనిపించే సమస్యనే 'వేరికోస్ వెయిన్స్'గా చెబుతారు. కొన్నిసార్లు ఇది తీవ్రంగా బాధిస్తుంది. ఆ బాధలు తగ్గాలంటే...

● పడుకునే సమయంలో కాలిని మిగతా శరీరం కంటే (నిర్దిష్టంగా చెప్పాలంటే గుండె కంటే) కాస్త ఎత్తుగా ఉండేలా చూసుకోవాలి. ఇందుకోసం కాలి కింద ఒకటి లేదా రెండు దిండ్లు పెట్టుకుంటే సరిపోతుంది. ● కూర్చున్నప్పుడు కూడా కాళ్లను కాస్త పైకి ఉంచేలా కాలికింద సపోర్ట్ ఉంచుకోవడం మంచిది. ● మార్కెట్‌లో కొన్ని రకాల స్టాకింగ్స్ వంటి సాక్స్‌లు దొరుకుతాయి. డాక్టర్‌తో చర్చించి, ఆ కంప్రెషన్ సాక్స్‌లు ధరించాలి. ● జాగ్రత్తలు పాటించాక కూడా పరిస్థితి తీవ్రమై, నొప్పి ఎక్కువగా వస్తుంటే డాక్టర్లు 'వీన్ లైగేషన్ అండ్ స్ట్రిప్పింగ్' అనే చికిత్సతో పరిస్థితిని చక్కదిద్దుతారు.

జ్యోతి యర్రాజీకి స్వర్ణం

టెహ్రాన్ (ఇరాన్): ఆసియా ఇండోర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్ జ్యోతి యర్రాజీ స్వర్ణ పతకం గెలుచుకుంది. మహిళల 60 మీటర్ల హర్డిల్స్‌ను 8.12 సెకన్లలో పూర్తి చేసి జ్యోతి మొదటి స్థానంలో నిలిచింది. ఈ క్రమంలో గత ఏడాది తానే నెలకొల్పిన 8.13 సెకన్ల జాతీయ రికార్డును జ్యోతి బద్దలు కొట్టడం విశేషం. ఈ ఈవెంట్ హీట్స్‌ను 8.22 సెకన్లతో అగ్రస్థానంతో ముగించిన జ్యోతి ఫైనల్లో మరింత మెరుగైన ప్రదర్శన కనబర్చింది. అసుకా టెరెడా (జపాన్ – 8.21సె.), లుయి లై యు (హాంకాంగ్ – 8.21 సె.) రజత, కాంస్యాలు గెలుచుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన జ్యోతి భువనేశ్వర్‌లోని రిలయన్స్ ఫౌండేషన్ హై పెర్ఫార్మెన్స్ సెంటర్‌లో శిక్షణ పొందుతోంది. ఈ చాంపియన్‌షిప్‌లో శనివారం మరో రెండు స్వర్ణాలు భారత్ ఖాతాలో చేరాయి. పురుషుల షాట్‌పుట్‌లో తజీందర్‌పాల్ సింగ్ తూర్ పసిడి గెలుచుకున్నాడు. తన రెండో ప్రయత్నంలో అతను గుండును 19.71 మీటర్లు విసిరి అగ్రస్థానం సాధించాడు. మహిళల 1500 మీటర్ల పరుగులో హర్‌మిలన్ బైన్స్ కనకం మోగించింది. రేస్‌ను హర్‌మిలన్ 4 నిమిషాల 29.55 సెకన్లలో పూర్తి చేసి స్వర్ణం గెలుచుకుంది.



భారత్ 1-0 ఆస్ట్రేలియా

మహిళల హాకీ సంచలన విజయం



రూర్కెలా: ఎఫ్‌ఐహెచ్ ప్రొ లీగ్ (మహిళలు)లో భారత జట్టు పటిష్ట ఆస్ట్రేలియాపై ప్రతీకార విజయం సాధించింది. పది రోజుల క్రితం గత లీగ్ మ్యాచ్‌లో ఆసీస్ చేతిలో ఓడిన భారత మహిళలు శనివారం సంచలన విజయాన్ని అందుకున్నారు. హోరాహోరీగా సాగిన ఈ పోరులో భారత్ 1–0 గోల్ తేడాతో ఆసీస్‌ను ఓడించింది. భారత్ తరఫున ఏకైక గోల్‌ను 34వ నిమిషంలో వందన కటారియా సాధించింది. పెనాల్టీ కార్నర్ ద్వారా వచ్చిన ఈ అవకాశాన్ని భారత్ సమర్థంగా వాడుకోగలిగింది. భారత సీనియర్లు, జూనియర్లు సమష్టి ప్రదర్శనతో చెలరేగగా...ఆసీస్ బృందం పూర్తి తడబాటుతో వెనుకంజ వేసింది. 1996 తర్వాత భారత గడ్డపై ఆస్ట్రేలియాను భారత మహిళల జట్టు ఓడించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

సాకేత్ జోడీకి టైటిల్

- సెమీస్‌లో ఓడిన సుమిత్ నగాల్
- బెంగళూరు ఓపెన్ ఏటీపీ టోర్నీ



బెంగళూరు: భారత డేవిస్ కప్ ప్లేయర్ సాకేత్ మైనేని మరో డబుల్స్ టైటిల్ సాధించాడు. బెంగళూరు ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో రామ్‌కుమార్ రామనాథన్‌తో జోడీ కట్టిన ఆంధ్రప్రదేశ్ టెన్నిస్ స్టార్ సాకేత్ శనివారం జరిగిన ఫైనల్లో ఫ్రెంచ్ జంటపై విజయం సాధించాడు. భారత ద్వయం 6–3, 6–4తో మ్యాక్సిమ్ జాన్‌వియెర్–బిటన్ కొజ్మినె జంటపై వరుస సెట్లలో గెలుపొందింది. సింగిల్స్‌లో భారత టాప్‌ర్యాంక్ ప్లేయర్ సుమిత్ నగాల్‌కు మాత్రం సెమీస్‌లో చుక్కెదురైంది. రెండో సీడ్ నగాల్ 6–7 (2/7), 4–6తో ఇటలీకి చెందిన ఏడో సీడ్ స్టెఫానో నెపొలిటనో చేతిలో పరాజయం చవిచూశాడు. ఆట ఆరంభంలో సుమీత్ 4–1తో ఆధిపత్యాన్ని చాటుకున్నాడు. అయితే ఇటలీ ప్లేయర్ వరుసగా గేమ్‌లను గెలవడంతో తొలి సెట్ టైబ్రేక్‌కు దారి తీసింది. భారత ఆటగాడు రెండో సెట్ ఆరంభంలో పట్టుదల కనబరిచినప్పటికీ తర్వాత స్టెఫానో జోరు ముందు నిలువలేకపోయాడు.

'జై'స్వాల్ కమాల్

- యశస్వి మరో సెంచరీ
- రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 196/2
- ఓవరాల్ ఆధిక్యం 322 పరుగులు
- తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లండ్ 319 ఆలౌట్

రాజ్‌కోట్ టెస్టులో రెండో రోజు వెనుకబడినట్లు కనిపించిన భారత్ ఒక్కసారిగా మళ్లీ ఆధిపత్యం ప్రదర్శించింది... బజ్‌బాల్ మాయలో చేజేతులా వికెట్లు కోల్పోయి స్వీయాపరాధంతో ఇంగ్లండ్ తమ పతనానికి అవకాశం కల్పించగా... టీమిండియా చక్కటి బౌలింగ్‌తో పాటు దానిని అందిపుచ్చుకుంది. అశ్విన్ లేని లోటు కనిపించకుండా మన బౌలర్లు ప్రత్యర్థిని పడగొట్టారు. ఆపై యువ యశస్వి మరో దూకుడైన ఇన్నింగ్స్‌తో వరుసగా రెండో సెంచరీ సాధించగా, గిల్ అండగా నిలిచాడు. ఇప్పటికే భారీ ఆధిక్యం సాధించిన భారత్ మ్యాచ్‌ను శాసించే స్థితిలో నిలిచింది. దీంతో ఆదివారం మరిన్ని పరుగులతో అసాధ్యమైన లక్ష్యాన్ని ఇంగ్లండ్ ముందు ఉంచడం ఖాయం.



యశస్వి

రాజ్‌కోట్: ఇంగ్లండ్‌తో మూడో టెస్టును గెలిచి సిరీస్‌లో ఆధిక్యంపై భారత్ కన్నేసింది. మ్యాచ్ మూడో రోజు ఆట ముగిసే సమయానికి భారత్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 2 వికెట్ల నష్టానికి 196 పరుగులు చేసింది. యశస్వి జైస్వాల్ (133 బంతుల్లో 104 రిటైర్డ్‌హర్ట్; 9 ఫోర్లు, 5 సిక్స్‌లు) సెంచరీ సాధించగా, శుబ్‌మన్ గిల్ (120 బంతుల్లో 65 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. వీరిద్దరు రెండో వికెట్‌కు 155 పరుగులు జోడించారు. వెన్ను నొప్పితో బాధపడుతూ మైదానం వీడిన యశస్వి మళ్లీ ఆదివారం బ్యాటింగ్ కొనసాగించే అవకాశం ఉంది. అంతకు ముందు ఓవర్‌నైట్ స్కోరు 207/2తో ఆట కొనసాగించిన ఇంగ్లండ్ తమ తొలి ఇన్నింగ్స్‌లో 319 పరుగులకు ఆలౌటైంది. బెన్ స్టోక్స్ (41) ఫర్వాలేదనిపించగా... మొహమ్మద్ సిరాజ్ 4 వికెట్లు పడగొట్టాడు. ప్రస్తుతం భారత్ ఓవరాల్‌గా 322 పరుగుల ఆధిక్యంలో ఉంది. ఇటీవల కన్నుమూసిన మాజీ క్రికెటర్ దత్తాజీరావు గైక్వాడ్‌కు నివాళిగా భారత క్రికెటర్లు భుజాలకు నల్ల బ్యాండ్‌లు ధరించి బరిలోకి దిగారు.

టపటపా...

పటిష్ట స్థితిలో మూడో రోజు ఆటను మొదలు పెట్టిన ఇంగ్లండ్ శనివారం స్వయంకృతంతో మంచి అవకాశం చేజార్చుకుంది. ప్రధాన బ్యాటర్ జో రూట్ (18) చేసిన తప్పుతో జట్టు పతనం మొదలైంది. మూడో రోజు ఐదో ఓవర్లోనే బుమ్రా బౌలింగ్‌లో అత్యుత్సాహంతో 'రివర్స్ స్కూప్' ఆడిన రూట్ స్లిప్‌లో యశస్వి సూపర్ క్యాచ్‌కు వెనుదిరిగాడు. తర్వాతి ఓవర్లోనే చక్కటి బంతితో బెయిర్‌స్టో (0)ను కుల్దీప్ వికెట్ల ముందు దొరకబుచ్చుకున్నాడు. ఆ తర్వాత 150 పరుగుల మార్క్‌ను అందుకున్న తర్వాత బెన్ డకెట్ (151 బంతుల్లో 153; 23 ఫోర్లు, 2 సిక్స్‌లు) ఎక్కువ సేపు నిలవలేకపోయాడు. ఈ దశలో స్టోక్స్, బెన్ ఫోక్స్ (13) కలిసి క్రీజ్‌లో పట్టుదలగా నిలిచే ప్రయత్నం చేశారు. అయితే లంచ్ తర్వాత భారత బౌలర్లు మళ్లీ చెలరేగారు. వరుస బంతుల్లో స్టోక్స్, ఫోక్స్‌లను పెవిలియన్ పంపించారు. రేహాన్ (6), హార్ట్‌లీ (9) కూడా ఒకే స్కోరు వద్ద అవుట్ కాగా...యార్కర్‌తో అండర్సన్ (1) పని పట్టి ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌ను సిరాజ్ ముగించాడు. 20 పరుగుల వ్యవధిలో ఇంగ్లండ్ చివరి 5 వికెట్లు పడ్డాయి.

భారీ భాగస్వామ్యం...

అండర్సన్ తొలి ఓవర్లో రోహిత్ శర్మ (19) కొట్టిన రెండు ఫోర్లతో భారత్ ఇన్నింగ్స్ మొదలైంది. అయితే కొద్ది సేపటికే రోహిత్‌ను ఎల్బీగా అవుట్ చేసి రూట్ ఇంగ్లండ్‌లో కాస్త ఆనందం నింపాడు. కానీ అది ఆ కొద్ది సేపటికే పరిమితమైంది. గత టెస్టు సెంచరీ హీరోలు యశస్వి, గిల్ మరో భారీ భాగస్వామ్యంతో జట్టును ఆధిక్యంలో నిలిపారు. ఆరంభంలో వీరిద్దరు నిలదొక్కుకునేందుకు ప్రయత్నించినా...ఆ తర్వాత దూకుడు పెంచారు. ముఖ్యంగా ఒక దశలో 73 బంతుల్లో 35 పరుగులతో ఉన్న యశస్వి ఆ తర్వాత మెరుపు షాట్లతో దూసుకుపోయాడు. అండర్సన్ ఓవర్లో వరుస బంతుల్లో 6, 4, 4 బాదడంతో ఇది షురూ అయింది. హార్ట్‌లీ వేసిన తర్వాతి ఓవర్లో వరుసగా 6, 6 కొట్టిన అతను తొలి సిక్స్‌తో 80 బంతుల్లో అర్ధ సెంచరీని అందుకున్నాడు. ఆ తర్వాత సెంచరీని చేరేందుకు యశస్వికి మరో 42 బంతులే సరిపోయాయి. ఈ క్రమంలో అతను ఏ బౌలర్‌నూ వదలకుండా మరో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు బాదాడు. అప్పటి వరకు ప్రేక్షకుడిగా ఉన్న గిల్ కూడా చెలరేగి వుడ్ ఓవర్లో సిక్స్, ఫోర్‌తో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్ 445; **ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్:** క్రాలీ (సి) పటిదార్ (బి) అశ్విన్ 15; డకెట్ (సి) గిల్ (బి) కుల్దీప్ 153; పోప్ (ఎల్బీ) (బి) సిరాజ్ 39; రూట్ (సి) యశస్వి (బి) బుమ్రా 18; బెయిర్‌స్టో (ఎల్బీ) (బి) కుల్దీప్ 0; స్టోక్స్ (సి) బుమ్రా (బి) జడేజా 41; ఫోక్స్ (సి) రోహిత్ (బి) సిరాజ్ 13; రేహాన్ (బి) సిరాజ్ 6; హార్ట్‌లీ (స్టంప్డ్) జురేల్ (బి) జడేజా 9; వుడ్ (నాటౌట్) 4; అండర్సన్ (బి) సిరాజ్ 1; ఎక్స్‌ట్రాలు 20; **మొత్తం** (71.1 ఓవర్లలో ఆలౌట్) 319. **వికెట్ల పతనం:** 1–89, 2–182, 3–224, 4–225, 5–260, 6–299, 7–299, 8–314, 9–314, 10–319. **బౌలింగ్:** బుమ్రా 15–1–54–1, సిరాజ్ 21.1–2–84–4, కుల్దీప్ 18–2–77–2, అశ్విన్ 7–0–37–1, జడేజా 10–0–51–2. **భారత్ రెండో ఇన్నింగ్స్:** యశస్వి (రిటైర్డ్‌హర్ట్) 104; రోహిత్ (ఎల్బీ) (బి) రూట్ 19; గిల్ (నాటౌట్) 65; పటిదార్ (సి) రేహాన్ (బి) హార్ట్‌లీ 0; కుల్దీప్ (నాటౌట్) 3; ఎక్స్‌ట్రాలు 5; **మొత్తం** (51 ఓవర్లలో 2 వికెట్లకు) 196. **వికెట్ల పతనం:** 1–30, 2–191. **బౌలింగ్:** అండర్సన్ 6–1–32–0, రూట్ 14–2–48–1, హార్ట్‌లీ 15–2–42–1, వుడ్ 8–0–38–0, రేహాన్ 8–0–31–0.

మన మహిళలు ఫైనల్‌కు...

- జపాన్‌పై గెలిచిన భారత బృందం
- నేడు థాయ్‌లాండ్‌తో అమీతుమీ
- ఆసియా టీమ్ బ్యాడ్మింటన్


అష్మిత

షా ఆలమ్ (మలేసియా): భారత మహిళల బ్యాడ్మింటన్ జట్టు చరిత్ర సృష్టించింది. ఆసియా బ్యాడ్మింటన్ టీమ్ చాంపియన్‌షిప్‌లో రెండు సార్లు చాంపియన్ అయిన జపాన్‌ను కంగు తినిపించి తొలి సారి ఫైనల్లోకి ప్రవేశించింది. శనివారం జరిగిన సెమీ ఫైనల్లో భారత్ 3–2 స్కోరుతో మాజీ చాంపియన్ జపాన్‌పై ఆఖరి మ్యాచ్ దాకా పోరాడి గెలిచింది. రెండు ఒలింపిక్స్ పతకాల విజేత సింధు సింగిల్స్, డబుల్స్ రెండు మ్యాచ్‌ల్లో ఓడినా... మిగతా సహచరులెవరూ కుంగిపోకుండా జపాన్ ప్రత్యర్థులపై అసాధారణ విజయాలు సాధించారు. నేడు జరిగే టైటిల్ పోరులో భారత్... థాయ్‌లాండ్‌తో తలపడుతుంది. జోరు మీదున్న సింధుకు తొలి సింగిల్స్‌లో నిరాశ ఎదురైంది. ఆమె 13–21, 20–22తో అయ ఒహొరి చేతిలో పరాజయం చవిచూసింది. డబుల్స్‌లో గాయత్రి–ట్రెసా జాలీ జోడీ 21–17, 16–21, 22–20తో ప్రపంచ ఆరో ర్యాంకు నమి మత్సుయమ–చిహరు షిద జంటను ఊహించని రీతిలో కంగు తినిపించింది. దీంతో ఇరు జట్ల స్కోరు 1–1తో సమం కాగా.. రెండో సింగిల్స్‌లో ప్రపంచ 53వ ర్యాంకర్ అష్మిత 21–17, 21–14తో 20వ ర్యాంకర్ ఒకుహరపై సంచలన విజయం సాధించింది. దీంతో భారత్ ఆధిక్యం 2–1కు చేరింది. తనీషా క్రాస్టో గాయం వల్ల సింధు తప్పనిసరి పరిస్థితుల్లో అశ్విని పొన్నప్పతో కలిసి డబుల్స్ మ్యాచ్ ఆడాల్సి వచ్చింది. కానీ ఈ ద్వయం 14–21, 11–21తో ప్రపంచ 11వ ర్యాంకు జంట రెనా మియవుర–అయాకొ సకురమొతో చేతిలో ఓడిపోయింది. మరో సారి ఇరుజట్లు 2–2తో సమవుజ్జీగా నిలువగా... నిర్ణాయక ఆఖరి సింగిల్స్ ఉత్కంఠ పెంచింది. ఇందులో అన్‌మోల్ ఖర్బ్ 21–14, 21–18తో నత్సుకి నిదయిరాపై గెలుపొందడంతో భారత్ ఫైనల్ చేరింది.

కేరళ 258/3

సాక్షి, విజయనగరం: రంజీ ట్రోఫీ ఎలైట్ గ్రూప్ 'బి'లో ఆంధ్రతో జరుగుతున్న మ్యాచ్‌లో కేరళ రెండో రోజు ఆట ముగిసే సమయానికి తమ తొలి ఇన్నింగ్స్‌లో 3 వికెట్లు కోల్పోయి 258 పరుగులు చేసింది. ఓపెనర్ రోహన్ (61; 10 ఫోర్లు), కెప్టెన్ సచిన్ బేబి (87 నాటౌట్; 12 ఫోర్లు), అక్షయ్ (57 నాటౌట్; 5 ఫోర్లు) రాణించారు. సచిన్, అక్షయ్ నాలుగో వికెట్‌కు అభేద్యంగా 134 పరుగులు జోడించారు. అంతకు ముందు 260/7 ఓవర్‌నైట్ స్కోరుతో శనివారం ఆట కొనసాగించిన ఆంధ్ర తొలి ఇన్నింగ్స్‌లో 272 పరుగులకు ఆలౌటైంది. రికీ భుయ్ (87 నాటౌట్; 13 ఫోర్లు) సెంచరీ చేజార్చుకున్నాడు. ప్రస్తుతం కేరళ మరో 14 పరుగులే వెనుకబడి ఉంది.


తనయ్ త్యాగరాజన్‌కు 5 వికెట్లు

మేఘాలయ 304 ఆలౌట్


త్యాగరాజన్

సాక్షి, హైదరాబాద్: రంజీ ట్రోఫీ ప్లేట్ డివిజన్ ఫైనల్లో హైదరాబాద్ స్పిన్నర్ తనయ్ త్యాగరాజన్ (5/103) మేఘాలయను కట్టడి చేశాడు. దీంతో తొలి రోజు ముందుగా బ్యాటింగ్‌కు దిగిన మేఘాలయ 83 ఓవర్లలో 304 పరుగుల వద్ద ఆలౌటైంది. రాజ్ బిస్వ (64; 9 ఫోర్లు, 3 సిక్స్‌లు), ఆకాశ్ చౌదరి (50 నాటౌట్; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) రాణించారు. హైదరాబాద్ బౌలర్లలో రోహిత్ రాయుడు 3 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ మొదలుపెట్టిన హైదరాబాద్ ఆట నిలిచే సమయానికి 5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 25 పరుగులు చేసింది. ఓపెనర్ తన్మయ్ (1), వన్‌డౌన్ బ్యాటర్ రోహిత్ (0)లను డిప్పు సంగ్మా అవుట్ చేయగా, రాహుల్ (9 బ్యాటింగ్), తిలక్ వర్మ (10 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు.

సినిమా


'ఇండియన్ 2'లో కమల్‌హాసన్


'సలార్ 2'లో ప్రభాస్


'దేవర'లో ఎన్టీఆర్


'గేమ్ ఛేంజర్'లో రామ్‌చరణ్

డబుల్ ట్రీట్

అభిమాన హీరో ఒక పాత్రలో కనిపించి సింగిల్ ట్రీట్ ఇస్తేనే అభిమానులు ఖుషీ అయిపోతారు. ఇక రెండు పాత్రల్లో కనిపిస్తే పట్టరాని ఆనందం వారి సొంతం. అలా డబుల్ రోల్‌లో కనిపించి, డబుల్ ట్రీట్ ఇవ్వడానికి కొందరు హీరోలు రెడీ అయ్యారు. ఆ స్టార్స్ చేస్తున్న ద్విపాత్రాభినయం గురించి తెలుసుకుందాం.

● రెండు, మూడు, నాలుగు, పది... ఇలా ఒకే సినిమాలో ఎన్ని పాత్రల్లో అయినా మెప్పించగలరు కమల్‌హాసన్. అలా సేనాపతి, అతని తనయుడు చంద్రబోస్ సేనాపతిగా 'ఇండియన్' (భారతీయుడు) లో కమల్ రెండు పాత్రల్లో మెప్పించిన విషయం తెలిసిందే. శంకర్ దర్శకత్వంలో 1996లో విడుదలైన ఈ చిత్రం ఘనవిజయం సాధించింది. ఇప్పుడు ఇదే కాంబినేషన్‌లో ఈ చిత్రానికి సీక్వెల్‌గా రూపొందుతున్న 'ఇండియన్ 2' సేనాపతి, అతని తండ్రి పాత్ర నేపథ్యంలో ఉంటుంది. అంటే.. సేనాపతికి అంత దేశభక్తి రావడానికి అతని తండ్రి ఎలా కారణం అయ్యాడు? అనేది ఈ చిత్రంలో ఉంటుందట. 1920లలో కథ సాగడంతో పాటు ఇప్పటి కాలం టచ్ అయ్యేలా స్క్రీన్‌ప్లే రెడీ చేశారట శంకర్. ఇక తాజా చిత్రంలో కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా, కీలక పాత్రల్లో రకుల్ ప్రీత్ సింగ్, సిద్ధార్థ్, బాబీ సింహా నటిస్తున్నారు.

● 'సలార్' సినిమా తొలి భాగం 'సలార్ పార్ట్ 1: సీజ్ ఫైర్'తో ప్రభాస్ మరో భారీ హిట్‌ని తన ఖాతాలో వేసుకున్నారు. ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ చిత్రంలో ప్రభాస్ ఒక పాత్రలో కనిపిస్తేనే ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అయ్యారు. ఇక రెండు పాత్రల్లో కనిపిస్తే డబుల్ ధమాకానే. ఈ సినిమాకి సీక్వెల్‌గా రూపొందుతున్న 'సలార్ పార్ట్ 2: శౌర్యాంగ పర్వం'లో ప్రభాస్ రెండు పాత్రల్లో కనిపించనున్నారట. తండ్రీ కొడుకుగా ప్రభాస్ కనిపించే సీన్స్ సరికొత్త అనుభూతిని పంచుతాయని టాక్. ప్రత్యేకించి 1000 మందితో ఫైట్ చేసే ఒక యాక్షన్ సీన్‌లో ప్రభాస్ రెండో పాత్ర (తండ్రి) ఎంట్రీ ఉంటుందని సమాచారం. 'సలార్' తొలి భాగంలో శ్రుతీహాసన్ హీరోయిన్‌గా నటించగా పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర చేశారు. రెండో భాగంలో పృథ్వీరాజ్ కూడా రెండు పాత్రల్లో కనిపిస్తారట. తొలి భాగంలో ఉన్న బాబీ సింహా, శ్రియా రెడ్డి తదితరులు మలి భాగంలోనూ కనిపిస్తారు.

● 'ఈ సముద్రం సేపల్ని కంటే కత్తుల్ని, నెత్తుర్ని ఎక్కువ సూసుండాది.. అందుకేనేమో దీన్ని ఎర్ర సముద్రం అంటారు' అంటూ ఎన్టీఆర్ చెప్పిన డైలాగ్ 'దేవర' సినిమా గ్లింప్స్‌లో ఉన్నాయి. 'జనతా గ్యారేజ్' (2016) వంటి హిట్ మూవీ తర్వాత హీరో ఎన్టీఆర్–డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్‌లో తెరకెక్కుతోన్న చిత్రం 'దేవర'. జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సైఫ్ అలీఖాన్ కీలక పాత్ర చేస్తున్నారు. కల్యాణ్ రామ్ సమర్పణలో మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ .కె నిర్మిస్తున్నారు. రెండు భాగాలుగా రూపొందుతోన్న ఈ మూవీ తొలి భాగం 'దేవర పార్ట్ 1' అక్టోబర్ 10న విడుదల కానుంది. కాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ ఆసక్తికరమైన వార్త ఇండస్ట్రీ వర్గాల్లో, నెట్టింట్లో హల్‌చల్ చేస్తోంది. ఈ సినిమాలో ఎన్టీఆర్ ద్విపాత్రాభినయం చేస్తున్నారన్నది ఆ వార్త సారాంశం. ఎన్టీఆర్ తండ్రీకొడుకుగా సందడి చేస్తారని భోగట్టా. యాక్షన్, ఎమోషన్స్‌తో రూపొందుతోన్న ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇదిలా ఉంటే గతంలో 'ఆంధ్రావాలా, శక్తి, అదుర్స్' సినిమాల్లో ద్విపాత్రాభినయం చేసిన ఎన్టీఆర్ 'జై లవ కుశ'లో త్రిపాత్రాభినయంతో మెప్పించిన విషయం తెలిసిందే.

● ఒక్క సినిమాలో కాదు.. వరుసగా రెండు చిత్రాల్లో రామ్‌చరణ్ రెండు పాత్రల్లో కనిపించనున్నారని సమాచారం. ఒకటి శంకర్ దర్శకత్వంలో రామ్‌చరణ్ హీరోగా నటిస్తున్న 'గేమ్ ఛేంజర్' సినిమా. మరొకటి బుచ్చిబాబు సనా డైరెక్షన్‌లో రామ్‌చరణ్ హీరోగా రూపొందనున్న చిత్రం. ఇక రామ్‌చరణ్ హీరోగా శంకర్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న పాన్ ఇండియా చిత్రం 'గేమ్ ఛేంజర్' విషయానికొస్తే... సమకాలీన రాజకీయాల నేపథ్యంలో రూపొందుతున్న ఈ చిత్రంలో రామ్‌చరణ్ తండ్రీ కొడుకుగా కనిపిస్తారని భోగట్టా. తనయుడి పాత్రలో ఎన్నికల అధికారిగా, తండ్రి పాత్రలో రాజకీయ నేతగా కనిపించనున్నారట. రెండో పాత్రకు సంబంధించిన ఫొటోలు కొన్ని బయటికొచ్చాయి. అందులో చరణ్ 70ల్లో వ్యక్తిగా ఖద్దరు వస్త్రాలు ధరించి సైకిల్‌పై వెళుతూ కనిపించారు. కియారా అద్వానీ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో అంజలి, శ్రీకాంత్, ఎస్‌జే సూర్య, సునీల్ ప్రత్యేక పాత్రధారులు. 'దిల్' రాజు, శిరీష్ నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ దాదాపు 80 శాతం పూర్తయింది. ఇక బుచ్చిబాబు సనా దర్శకత్వంలో రామ్‌చరణ్ చేస్తున్న సినిమా స్పోర్ట్స్ బ్యాక్‌డ్రాప్‌లో ఉంటుంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందనున్న ఈ చిత్రంలో రామ్‌చరణ్ అన్న, తమ్ముడు పాత్రల్లో కనిపించనున్నారట. వెంకట సతీష్ కిలారు నిర్మించనున్న ఈ సినిమా త్వరలోనే సెట్స్‌కి వెళ్లనుంది. కాగా 'మగధీర, నాయక్' చిత్రాల్లో రామ్‌చరణ్ ద్విపాత్రాభినయంతో ఆకట్టుకున్న విషయం తెలిసిందే.

ఈ హీరోలే కాదు.. మరికొందరు కూడా ద్విపాత్రాభినయంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు.

సెల్ఫ్ మేడ్


అమితాబ్ బచ్చన్ ఏఐ పిక్చర్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)పై అమితాబ్ బచ్చన్ ఆసక్తి కనబరుస్తున్నట్లుగా తెలుస్తోంది. ఈ బాలీవుడ్ బిగ్ బి నటుడిగా ఫిల్మ్ ఇండస్ట్రీలోకి వచ్చి 55 ఏళ్లయింది. ఈ నేపథ్యంలో ఏఐతో చేసిన తన ఫొటోలను 'ఎక్స్'లో షేర్ చేశారు అమితాబ్ బచ్చన్. ''సినిమా అనే అద్భుత ప్రపంచంలో 55 ఏళ్లు పూర్తి చేసుకున్నాను. 'సెల్ఫ్ మేడ్'' అంటూ అమితాబ్ బచ్చన్ ఈ ఫొటోలను ఉద్దేశించి పేర్కొన్నారు. నిజంగానే అమితాబ్ 'సెల్ఫ్ మేడ్'. ఎలాంటి సినిమా నేపథ్యం లేకుండా ఇండస్ట్రీలోకి అడుగుపెట్టారు. ఎన్నో కష్టాలు పడి అమితాబ్ బచ్చన్ స్టార్ యాక్టర్‌గా ఎదిగారు. కెరీర్ తొలి నాళ్లలో ఆయన అవమానాలు ఎదుర్కొన్నారు కూడా. తిరస్కరణలకు గురయ్యారు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా కొన్నాళ్లు ముంబై మెరీనా బీచ్‌లో గడిపారు. ఎన్నో సవాళ్లను దాటుకుని 1969లో అమితాబ్ 'సాత్ హిందూస్తానీ' చిత్రంతో యాక్టర్‌గా ఎంట్రీ ఇచ్చారు. తొలి సినిమాకే న్యూ కమర్‌గా నేషనల్ అవార్డు అందుకున్నారు అమితాబ్. అదే ఏడాది ఉత్పల్ దత్ హీరోగా చేసిన 'భువన్ షోమ్' సినిమాకు నరేటర్‌గా చేశారు అమితాబ్. ఆ తర్వాతే మధు, ఉత్పల్‌లతో కలిసి అదే ఏడాది 'సాత్ హిందూస్తానీ' సినిమాతో అమితాబ్ ఎంట్రీ జరిగింది. అలా ముందు తన గొంతు వినిపించి, ఆ తర్వాత నటుడిగా సిల్వర్ స్క్రీన్‌పై కనిపించారు. 'భువన్ షోమ్' చిత్రం మేలో విడుదల కాగా, 'సాత్ హిందూస్తానీ' చిత్రం నవంబరులో విడుదలైంది. ఇక ప్రస్తుతం ప్రభాస్ 'కల్కి 2898 ఏడీ', రజనీకాంత్ 'వేట్టయాన్'తో పాటు హిందీలో రెండు సినిమాల్లో నటిస్తూ బిజీగా ఉన్నారు అమితాబ్ బచ్చన్.

నేటి భారతం


శ్రీధర్

ఒకే ఒక్క పాత్రతో సామాజిక సందేశంతో రూపొందిన చిత్రం 'నేటి భారతం'. యర్రా శ్రీధర్ రాజు నటించి, నిర్మించిన ఈ సినిమాకు భరత్ పారేపల్లి దర్శకత్వం వహించారు. త్వరలోనే ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ''కరోనా తర్వాత ఏర్పడ్డ ఆర్థిక, సామాజిక, రాజకీయ అంశాల నేపథ్యంలో ఈ సినిమా కథనం ఉంటుంది. ఇందులో నేను జర్నలిస్టు పాత్ర చేశాను. సింగిల్ క్యారెక్టర్‌తో వస్తోన్న మా సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు శ్రీధర్.

దంగల్ ఫేమ్ సుహానీ కన్నుమూత


'దంగల్'లో... సుహాని

ఆమిర్ ఖాన్ 'దంగల్'లో బాలనటిగా (చిన్ననాటి బబితా ఫోగట్ పాత్రధారి) నటించిన సుహానీ భట్నాగర్ (19) కన్నుమూశారు. అరుదైన డెర్మటో మయోసైటిస్ రుగ్మతతో బాధపడుతున్న సుహానీని నెల 7న ఆమె కుటుంబ సభ్యులు ఢిల్లీలోని ఎయిమ్స్‌లో ఆస్పత్రిలో చేర్పగా, చికిత్స పొందుతూ 16న సుహానీ కన్నుమూశారు. సుహానీ మరణాన్ని ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్, దర్శకుడు నితీష్ తివారి ధ్రువీకరించారు. 'దంగల్' సినిమా తర్వాత కొన్ని వ్యాపార ప్రకటనలు చేసిన సుహానీ ఆ తర్వాత స్టడీస్‌పై ఫోకస్ పెట్టారు. జర్నలిజం అండ్ మాస్ కమ్యూనికేషన్ డిగ్రీలో రెండో సంవత్సరం చదువుతున్న సమయంలో సుహానీకి ఇలా జరిగింది. చదువు పూర్తయ్యాక సుహానీ యాక్టింగ్‌ను కెరీర్‌గా ఎంచుకోవాలని ఆశ పడిందని ఆమె కుటుంబ సభ్యులు చెబుతూ కన్నీరు మున్నీ రవుతున్నారు. సుహానీ మరణం పట్ల పలువురు చిత్రరంగ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

ప్రేమకు అర్థం చెప్పేలా...


వినాయక్, అపర్ణా దేవి

గ్రామీణ ప్రేమకథతో రూపొందిన చిత్రం 'రాధా మాధవం'. వినాయక్ దేశాయ్, అపర్ణా దేవి జంటగా నటించిన ఈ సినిమాకు దాసరి ఇస్సాకు దర్శకత్వం వహించారు. గోనాల్ వెంకటేశ్ నిర్మించిన ఈ చిత్రం సెన్సార్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. మార్చి 1న ఈ చిత్రం విడుదల కానుంది. ''ప్రేమకు అర్థం చెప్పేలా మా 'రాధా మాధవం' సినిమా ఉంటుంది. ఈ చిత్రం సందేశాత్మకంగా కూడా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది.

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/50y/B.Tech/ Govt.ఆఫీసర్/ 3 లక్షల PM /సొంత ఇండ్లు/రెంట్స్/తోటలు భూములు & 100 కోట్ల ఆస్తి గల పిల్లలు లేని వరుడికి వధువు కావలెను. వధువుతో /ఆస్తితో పనిలేదు (పిల్లలున్నా OK) ఫోన్: 8885788072 [H-787994]

బలిజ/కట్నం ప్రసక్తి లేదు/ M.Tech/ C. Govt.డిప్యూటీ మేనేజర్/ మిధాని/ 95000/-PM/6'ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి తగిన వధువు కావలెను. Ph: 6305007091 [HA-13986]

యాదవ/M.Tech/Govt.Asst.ఇంజనీర్ /జెన్‌కో/80,000/-PM / 6'ఎత్తు /29 సం॥ అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-13986]

SC హిందూ మాల/M.Tech/C.Govt. సైంటిస్ట్/ఇస్రో/1 Lakh PM/ 5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 8297439565 [HA-13986]

SC హిందూ మాదిగ/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/Govt.Asst.ఇంజనీర్/జెన్‌కో/14 Lakhs PA/5'11ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-13986]

యాదవ/B.Tech(సివిల్)/C.Govt. Asst మేనేజర్/SBI/ 55000/-PM/ 5'8" ఎత్తు/ 28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్నం ప్రసక్తి లేదు. Ph: 9515755529 [HA-13987]

SC మాల & క్రిస్టియన్/B.Tech (NIT)/ M.Tech/Govt.A.E/ఇరిగేషన్ Dept/14 Lakhs. PA/5'9"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093 [HA-13987]

SC మాదిగ & క్రిస్టియన్/కట్నం ప్రసక్తి లేదు/ B.Tech / C.Govt.కస్టమ్స్ ఇన్స్‌పెక్టర్/14 Lakhs. PA/5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9676995093, 6304407230 [HA-13987]

వడ్డెర/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/C. Govt. ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్ /ఇన్‌కమ్ ట్యాక్స్ Dept/ 80,000/-PM/5'10"ఎత్తు/ 29 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-13987]

రజక/B.Tech/ C.Govt.J.E / రైల్వే/ 72000/-PM / 5'9"ఎత్తు/28 సం॥ల వరుడికి తగిన వధువు కావలెను. Ph: 9515942275 [HA-13987]

శెట్టిబలిజ: కట్నం ప్రసక్తి లేదు/గుడ్ లుకింగ్ / 28/ 5'10"/ B.Tech/ సాఫ్ట్‌వేర్/కోట్ల ఆస్తి గల వరుడుకి వధువు కావలెను. 8367619529 [H-13988]

కమ్మ: కుల పట్టింపు లేదు/2వ పెళ్లి/ పిల్లలు లేరు/గుడ్ లుకింగ్/40/5'11"/M.Tech/ జాబ్/ గుడ్ సాలరీ/ కోట్ల ఆస్తి గల వరుడుకి వధువు కావలెను. 8367619529 [H-13988]

K.C. రెడ్డి మ్యారేజ్ బ్యూరో ప్రై॥ లి॥

రెడ్డి మ్యారేజ్ బ్యూరో India, Abroad Matches Fast Settlement: Deals with all regions in A.P. & Telangana (For Reddy's only) Cont: K.C. Reddy, Hyderabad. Ph: 9849321309 / 9347807015. PLEASE CHECK MY WHATSAPP STATUS. Email: kcreddy43@gmail.com, Facebook.com/ kcreddymarriagebureau

వధువు కావలెను

Reddy/B.Tech / MS / H1 / USA * 1996/ 5'11"/50Cr *1997/5'9"/60Cr *1995/5'9"/50 Cr *1994/5'8"/30Cr *Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS /H1 /USA *1997/6'/ 400Cr *1995/5'10"/70Cr *1995/6'/20Cr *1989/5'8"/200K. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/MS/H1/USA *1990/ 5'7"/ 50Cr *1991/5'11"/100Cr *1994/6'/15Cr *1986/5'7"/150K/ * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/Canada(PR)/ B.Tech/MS/1992/ 6'/300K/30Cr *UK/H1/MS/1994/5'11"/1.5 Cr/yr *Aus-Citizen/1996/6'/25Cr *Cont : K.C. Reddy -Hyd. Ph: 9347807015

Reddy/MBBS/MD/ 1995/ 5'10"/400Cr *1996/6'/50Cr *DM/1994/5'10"/75Cr *1993/ 5'10"/ 50Cr *1989/5'9"/30Cr. * Cont: K.C. Reddy- Ph: 9347807015/ 9849321309

Reddy/IIT/SWE/India *1994/5'9"/ 1Cr/ yr/ 30Cr *1994/5'11"/70L/yr/25Cr *1996/ 5'6"/40L/ yr/ 20Cr. *Cont: K.C. Reddy-Hyd- Ph: 9347807015/9849321309

Reddy/B.Tech/Business/1994/5'10"/ Contractor/100Cr *1995/5'9"/500Cr *1990/6'/1000Cr * Cont : K.C.Reddy-Hyd- Ph: 9347807015/9849321309

Reddy/Business/B.Tech/1990/5'10"/ 20L/M. Income/25Cr *1996/6'/100Cr * Cont: K.C. Reddy-Mar-Bureau-Hyd- Ph: 9347807015/9849321309

Reddy/Divorcee/ B.Tech/ Business/ 1994/5'11"/250Cr *1981/5'8"/500Cr * 1995/ 5'10"/(IIT)USA Job/20Cr. * Cont. K.C.Reddy-Hyd-Ph: 9347807015

Reddy/Divorcee/Catholic/ V.Handsome Boy/B.Tech/MBA/ 30L/yr/ 5Cr/ 1987/6'/ *Cont: K.C. Reddy - Hyd. Ph: 9347807015/9849321309

వరుడు కావలెను

Reddy / IIIT / Dual Degree / Most Brilliant Girl / Most Beautiful/ 2000 / 5'7" / 46L/yr/10Cr. *Cont. K.C.Reddy-Hyd. Ph: 9347807015

Reddy/B.Tech/ MS/H1/ USA/ Most Beautiful/1997/ 5'5"/60Cr-*1998/5'4"/ 10Cr *IIIT/1996/5'3"/120K/20Cr. * Cont: K.C. Reddy-Hyd- Ph: 9849321309

Reddy/ MS / USA / Most Beautiful/ 1996/ 5'8"/15Cr *1990/5'8/ 30Cr/160K *1996/5'5"/ 10Cr. * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/Catholic/ Beautiful /B.Tech / 1993/5'3"/500Cr *Canada/ PR/ 1996/ 5'6" * Cont: K.C.Reddy-Mar-Bur-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/MBBS/PG *1995/5'7"/10Cr *USA-doc/1996/5'8"/40Cr *DM/1996/ 5'3"/6Cr *1995/5'5"/100Cr *Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015

Reddy/Rich Family *B.Tech/1998/ 5'4"/40Cr/ *1995/5'3"/50Cr *1990/ 5'4"/ 50Cr *1992/5'4"/20Cr *Cont: K.C. Reddy -Hyd-Ph: 9347807015/ 9849321309

Reddy/B.Tech/Beautiful *1993/ 5'7"/ 100Cr *1988/5'3"/400Cr *2000/5'3"/20 Cr/1991/5'7"/10Cr *Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015/9849321309

Reddy/Divorcee /B.Tech / 1993 / 5'7"/ 15Cr *MD/1993/5'8"/40Cr *B.Tech/ 1993/ 5'6"/ 50Cr *1986/5'6"/20Cr * Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015 /9849321309

Reddy/USA-Citizen/Most Brilliant Girl/ 1000Cr/1999/5'6" *Doctor/ USA/ 1995/5'7" * Cont: K.C. Reddy-Hyd. Ph: 9347807015/9849321309

Reddy/ USA-Citizen *2002 / 5'7"/BS *Doctor/1992/5'5" *1992/5'4" *1992/ 5'5"/50Cr *1992/5'7"/50Cr *Cont: K.C. Reddy-Hyd-Ph: 9347807015 [D-888]

కాపు: 56, B.Sc, విడోయర్, VRS, వ్యాపారం, ఇల్లు/ ఆస్తి వరునికి. ఉద్యోగము / వసతి ఉన్న విడో / ఒంటరి, కులం వయస్సుతో పనిలేని వధువు కావలెను. 9840018348 [H-13988]

ఆర్య వైశ్య/కుల పట్టింపు లేదు/ MBA/ 5'6"/ 65వేలు, 1.5 Cr ఆస్తి గల వరునకు ఏదేని చదువుకున్న వధువు కావలెను. సంప్ర:8639798537 [H-787726]

డివోర్స్/కుల పట్టింపులేదు/ 45/5'6"/ Diploma/ Govt. Job/90K PM/సొంత ఇల్లు & Planning Own Startup, Hyd సెటిల్డ్ వరునికి 40 లోపు కుల పట్టింపులేని వధువు కావలెను (Direct) 9182604226 [H-799752]

డైరెక్ట్ కాంటాక్ట్: ఆర్యవైశ్య, 46Yrs/5'.5"/ బిజినెస్, జాబ్, 30 Cr. స్థిరాస్తి గల ఏకైక అబ్బాయికి అందమైన అమ్మాయి కావలెను. (నో బ్రోకర్స్)91821 61015, 76808 72085. [T-3070]

గౌడ/2nd/5.8ఎత్తు/ వ 45/దామనదాయ/ ప్రైవేటు జాబ్/ కోటి రూపాయల ఆస్తి/ కుల పట్టింపు లేని వరుడుకు మొదటి/రెండవ సంబంధం వధువు కావలెను. డైరెక్ట్ : 9063033657 [G-787523]

Reddy/Groom/28 / 5'10"/ MBBS-Residency- USA Citizen, Seeks Bride MBBS/BDS/BE/Any PG. Contact: P. Prabhakar Reddy. 9391198332 [H-801669]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Citizen, BS, 27, 6' 1", SoftWare Engineer, 100 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 11", Engineer, 200 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Business, MBA, 29, 5' 11", Rich Family, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి UK, BE (BITS), 29, 5' 10", SWE, 150 K Pounds, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి BE, 27, 5' 4", SWE, 20 L P/A, 20 Crores, Fair & Slim, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 27, 5' 5", Software Developer, 130 K, 2 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 26, 5'6", SWE, 64L P/A, 10 Crores, Fair & Slim, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 3", SWE, 150 K, H1, 2 Crores, Fair & Slim, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి Business, BE, 30, 5' 6", 10 Crores, Handsome, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 32, 5' 11", SWE, 350 K, 10 Crores, Handsome, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, MCH, 26, 5' 11", Doctor, Rich Family, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, MTech, 34, 6', Team Leader, 16 L P/A, 10 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBA, 29, 5' 7", 10 Crores, Fair & Slim, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5'6", SWE, Amazon, 200 K, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 26, 5' 5", PG Doctor, 25 Crores, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, PG (IIIT), 29, 5' 4", Developer, 10 L P/A, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

Reddy/Groom/30/6'/ V.Fair/BE(OU), MBA IIM, Banglore/ 40 Lak/PA. Seeks Bride any Degree. Contact: P. Prabhakar Reddy. 9391198332 [H-801669]

Reddy/Groom/ II Marriage Groom, 32/5'9"B.Tech IIT, C.Govt.Officer, Seeks Bride BE/BMB/BDS/Any PG. Contact: P. Prabhakar Reddy. 9391198332 [H-801669]

Reddy/Groom/30 / 5'8" / B.Tech (Civil) A.E.Govt. Job, Seeks Bride BE /M.Sc / BDS. Contact: P. Prabhakar Reddy. 9391198332 [H-801669]

★

BC పద్మశాలి/48yrs/Fair/Tall, హ్యాండ్‌సమ్ /ఇంజనీర్‌కు ప్రేమాభిమానాలు గల వధువు కావలెను. (విడో/ డైవర్సీ/సపరేటెడ్) కుల/మత ప్రసక్తి లేదు. Ph: 9959995401 [HA-96614]

Reddy/Groom/35/ 5'9"/ MCA-LLB. Advocate, 1.5 Lk P/A. 15Cr. Seeks Bride BE/MBA/Any PG. Contact: P. Prabhakar Reddy. 9391198332 [H-801669]

రెడ్డి/లేట్ మ్యారేజ్/34y/ నెలకు లక్ష రూపాయల ఆదాయం, Hyd లో సొంత ఇల్లు, కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి ఆంధ్ర/ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ / విడో Ok కుల, కట్నం ప్రసక్తిలేదు. డైరెక్ట్ Ph: 7989079290 [H-801473]

పద్మశాలి క్రిస్టియన్/ వయస్సు 30/ 5'7"/ MA Business / అందమైన వరునికి బాగా స్థిర పడిన అమ్మాయి కావలెను. ఇల్లరికం అయిన ఓకే. డైరెక్ట్ సంప్ర: సెల్ 9014188616 [K- 1187347]


★★

శెట్టిబలిజ/5.2'/26 సం॥/12 L - P.A./ CA చదివిన వరుడికి CA చదివిన వధువు కావలెను. డైరెక్ట్‌గా సంప్ర॥ 7013935033, గుంతకల్లు. [A-3014]

పల్లీలు/25 సం॥/5'.5" అడుగులు/ P.G. చదువు/ నెలకు 20 వేలు జీతం / సొంత ఇల్లు ఉన్న అబ్బాయికి ఏ కులమైనా ఏ మతమైనా పరవాలేదు. కనీసం 10వ తరగతి చదివిన వధువు కావలెను. ✆ : 99858 82851 [R-1184251]

Rtd. Senior Faculty, Principal, Communication Skills Trainer (62 / FC / No Property) invites Life Partner From Educated Women. Contact : 83320 70712. [N-1249266]

వరుడు కావలెను



డైవర్సీ/రెండవ పెళ్లి /40yrs /Govt. ఎంప్లాయ్/ 3,00,000/-(PM)/కోట్ల ప్రాపర్టీ/వెల్ సెటిల్డ్/కుల ప్రసక్తి లేని అందమైన వధువుకి తగిన వరుడు కావలెను (పిల్లలు ఉన్నా & ఇల్లరికం OK) ఆస్తి ప్రసక్తి లేదు. సంప్ర : 9133715309 [H-787994]

రెడ్డి/35yr/5'4"/కుల పట్టింపు లేదు/ఫెయిర్/ PG/ Govt ఎంప్లాయ్ 90K (PM) వెల్ సెటిల్ ఫ్యామిలీ & సొంత ఇల్లు కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం OK) సంప్ర : 8008474869 [H-787994]

క్రిస్టియన్ మాల/B.Tech, IIT / C.Govt. Asst. Exq. ఇంజనీర్/IOCL/90,000/-PM/ 5'5" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8297439565 [HA-13986]

మున్నూరు కాపు/M.Tech/ Govt.AE/ ఇరిగేషన్ Dept / 65000/-PM/5'5" ఎత్తు/ 28 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9912280929 [HA-13987]

రెడ్డి/విడో/కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/ Age: 29/Qly: డిగ్రీ/సొంత వ్యాపారం కలిగిన అందమైన వధువుకు వరుడు కావలెను. 1st (or) 2nd (ఇల్లరికం OK). Ph: 9515673252 [HA-13987]

క్రిస్టియన్ మాల/ M.Tech / IIT/ SWE/ 5'5"ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 6281904073 [HA-13987]

కాపు/53yr/ 2వ పెళ్లి/60,000/-PM మరియు వ్యవసాయ భూమి గల వధువుకు కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. Ph: 9381250286 [HA-13987]

కమ్మ: కుల పట్టింపు లేదు/2వ పెళ్లి/పిల్లలు లేరు/చాలా అందమైన/ 39 సం॥/ B.Tech/ సాఫ్ట్‌వేర్/వెల్‌సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను. పిల్లలున్నా ఓకే. Ph: 8367619529 [H-13988]

బెస్త: (గంగపుత్ర)/చాలా అందమైన/ 27/ 5'4"/ M.Tech/ సాఫ్ట్ వేర్ & గుడ్ ఫ్యామిలీ గల వధువుకి వరుడు కావలెను. Ph: 8367619529 [H-13988]

యాదవ: గుడ్ లుకింగ్/ 25/5'4"/ MBA/ గుడ్ జాబ్ వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ వధువుకు వరుడు కావలెను. US అయినా Ok. 8367619529. [H-13988]

(కుల పట్టింపు లేదు)రెడ్డి: 30y/5'3"ఎత్తు పెద్ద ప్రాపర్టీ కలిగి తండ్రి లేని వధువుకు 1వ లేదా 2వ వరుడు కావలెను (ఆస్తి పట్టింపు లేదు) Photos whatsapp send me. 9885492498 [H-13988]

ఆర్యవైశ్య23y&25y&27y&28y&29y&31y &32y & 34y & 35y&37y&38y&39y&41y& 42y& 44y& 46y & 48y& 50y&53y& 55y&56y & 58y &60y&62y/ జి. సుప్రజా గుప్తా "మా సేవ"(Since 1998): Ph/WA:9291503949. [H-13988]

38 yrs, Govt Emp, 3,00,000, Doctor, కుల ప్రసక్తి లేదు కోట్ల ప్రాపర్టీ, బాగాస్థిరపడిన అమ్మాయికి వరుడు కావలెను. Kid's ఉన్నా Ok. Any Proction. Cell: 9381696641 [H-13988]

రెడ్డి విడో: వయస్సు: 30, డిగ్రీ/ Own Business కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. (కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు) ఇల్లరికం OK, అన్ని కులాల వారికి సంబంధాలు చూడబడును. Ph: 9912511231. [H-13988]

పద్మశాలి: 60y/ విడో/5'4"/Govt Retied/ 50,000/pm /సొంత ఇల్లు/ఆంధ్రాలో పొలాలు/ పిల్లలులేని వధువుకి వరుడు కావలెను. కులప్రసక్తి లేదు Ph: 8688720378 [H-801535]

రెడ్డి: విడో/60y/5'4"/Fair/Govt(H.M) Rtd పెన్షనర్/ సొంత ఇల్లు/25 ఎకరాల కొబ్బరి తోటలు 3L/PM / పిల్లలు లేని వెల్‌సెటిల్డ్ వధువుకు వరుడు కావలెను. కుల ఆస్తి ప్రసక్తి లేదు Ph: 7093717220 [H-801535]

వైశ్యా:/50y/ విడో/ రైల్వేలో జాబ్/ షోరూం/ఫైనాన్స్ బిజినెస్/ 4L Incom / కోట్ల ప్రాపర్టీ కలిగిన వధువుకి FC/BC వరుడు కావలెను. Ph: 8121608458 [H-801535]

ఆస్తి, కుల పట్టింపు లేదు: 58y/విడో/మార్బుల్, గ్రానైట్ బిజినెస్/1L/pm/ 2 సొంత ఇల్లు & రెంట్స్/ 50K/PM ఏబాదరబందిలేని వధువుకి వరుడు కావలెను. Ph: 9014054576 [H-801535]

బ్రాహ్మణ: 30yrs/5'4"/కౌండిన్యస గోత్రం/ డిగ్రీ/PVT జాబ్/రిక్వైర్ మెంట్/ ఎన్‌వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ/ PVT, Govt జాబ్ & పురోహితం అయిన OK Ph: 8074770878 [H-801535]

కాపు: 25y/B.Com, MBA/ Own Business/ 25L P/A/ కోట్ల ప్రాపర్టీ గల ఏకైక వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 9640667754 [H-799801]

కులప్రసక్తి లేదు: 47y/హౌసింగ్ & అర్బన్ డెవలప్‌మెంట్ (Dept) /1Lpm/ Own House/ కోట్ల ప్రాపర్టీ/ 10Acr Land గల Well Settled అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 7416497378 [H-799801]

రెడ్డి: డైవర్స్/ 27y/ B.E, 1.2L P/M/ HYDలో Own plots/ House గల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309344166 [H-799801]

రెండో పెళ్ళి: విడో/ 50y/Fair/ గుంటూరు/Own కాంప్లెక్స్, ల్యాండ్స్ (Rents)/ కోట్ల ప్రాపర్టీ/1 పాప USA లో సెటిల్డ్ ఏ బాధర బందీ లేని ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 7997175138 [H-799801]

రెడ్డి: డైవర్స్/ 28y/M.com/MBA 1LAKH P/M/HYD లో Own plots, కోట్ల ప్రాపర్టీ కలిగిన ఏకైక వధువుకు వరుడు కావలెను. Ph: 9985746131 [H-799801]

రెడ్డి/విడో/ఒంటరి/53Y/Hyd lo డైయిరీ ఫామ్/ సొంత ఫ్లాట్ షో రూం/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను. (నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [H-787994]

2వ పెళ్లి/కుల ప్రసక్తి లేదు/37yrs/B.Tech.EEE/ Govt. ఆఫీసర్/3 లక్షలు(PM)/ సొంత ఇల్లు+ కార్ పిల్లలు లేని 100 కోట్ల ఆస్తి గల V. ఫెయిర్ వెల్ సెటిల్డ్ వధువుకి వరుడు కావలెను (పిల్లలు ఉన్నా & ఇల్లరికం OK) : 8143693504 [H-787994]

బ్రాహ్మణ/ 25/5'3" / ఇంటర్ * 29/5'4"/ B.Sc *33/5'3"/ఇంటర్ *35/5'3"/B.Sc వధువులకు వరులు కావలెను. పురోహితులు కూడా సంప్ర : Ph: 7842635086 [HA-13987]

డైరెక్ట్ రిచ్చు 30 సం॥లు MBBS.PG, 18 లక్షలు P/A. మాల క్రిస్టియన్స్. CNB, ఇంజనీర్స్, డాక్టర్స్, B.Tech, M.Tech వరుడు కావలెను. Whatsapp : 93810 93808 [V-11857]

★

గౌడ్/38/5'5"/ B.Tech/MS/US /Fashion Designer *38/5'4"/B.Tech/ SWE/ Hyd/ 30/5'6"/BE/Govt. Engineer/ Hyd/26/ 5'0"/ B.Tech/MBAగౌడ్ అమ్మాయిలకు తగిన గౌడ్ అబ్బాయిలు కావలెను. సం॥ "శుభమస్తు" DSNR, Hyd.S.Ramulu Goud.8790690309 [H-801536]

రెడ్డి డాక్టర్/1990/ 5'-10"/ MD. (DVL)/డెర్మటాలజిస్ట్ / 15 Cr ప్రాపర్టీ/ పేరెంట్స్ Hydలో సెటిల్డ్ వధువుకు/ Hydలో వెల్ సెటిల్డ్ / 5'-11" పైన ఎత్తు గల రెడ్డి వరుడు కావలెను. సెల్: 9440461893. [K-1187381]

వేదికలు



ధృవ మ్యారేజెస్. అన్ని కులాల వారికి 1/2/విడో/డైవర్స్ తగిన సంబంధాలు చూడబడును. 22 నుండి 60 సం॥ వారికి. 7702955854 [H-793580]

ఫ్రీ రిజిస్ట్రేషన్. అన్ని కులముల వారికి Govt/సాఫ్ట్‌వేర్/ గెజిటెడ్/MBBS/PG/ NRI/PVT/బిజినెస్/1వ/2వ/లేట్/ AP/ TS 15 సం॥ Exp. Ph: 9100474440 [HA-31363]

కేవలం యాదవ / కుర్మ వివాహ సంబంధాలకై గోకుల్ మ్యారేజెస్, పద్మజా యాదవ్. www.gokulmarriage.com, HYD: 9440831748, GUNT: 9440759945, VSP: 9441735157. [HA-13041]

2nd మ్యారేజ్ లకు మాత్రమే! అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయ బడును. నో రిజిస్ట్రేషన్ ఫీ. సంప్ర : 7013226716 [HA-14213]

Brahmin-Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 7032712544 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-13990]

Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Anil, Ph: 7093016945 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-13990]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-13990]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Anil, Ph: 7093016945 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-13990]

Madiga-Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 7032018248 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-13990]

★

14/04/2024 బ్రాహ్మణ వధూ-వరుల స్వయంవరం (Online) Free Registration Bhavani Matrimony, Hyd. Ph: 9704656103/ (9533608887 - Whats app No.) [HA-883]

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC Matches, Late & 2nd Matchesకై సంప్రదించండి: 9704656103, 9533608887 (Whatsapp) [HA-844]

★★

Kalyani Matrimony గౌడ, కాపు మరియు అన్ని కులాలవారి ఉన్నతమైన సాంప్రదాయబద్ధమైన పెండ్లి సంబంధాల కొరకు వెంటనే సంప్ర: Ph: 8500747535, 9533133969 kalyanimatrimony.in [H-801522]

15వ॥ అన్ని కులాల వారికి మీకు తగిన సంబంధాలు చూపించగల పెద్ద సంస్థ రోహిణి. www.rohinimarriagelines.com ✆ 98490 58673, వాట్సప్: 94401 57931, 94407 85888 [B-613]

'పోర్టు'పై సోమిరెడ్డి అసత్య ప్రచారం: మంత్రి కాకాణి



నెల్లూరు(సెంట్రల్): ముడుపులు ఇవ్వలేదనే కారణంతోనే పోర్టుపై టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తూ దుష్ప్రచారం చేస్తున్నారని వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి మండిపడ్డారు. జిల్లాకే తలమానికంగా ఉన్న కృష్ణపట్నం పోర్టు కంటైనర్ టెర్మినల్‌పై సోమిరెడ్డి అవాస్తవాలు మాట్లాడడాన్ని ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. నెల్లూరులోని మంత్రి కాకాణి క్యాంపు కార్యాలయంలో శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. కంటైనర్ టెర్మినల్ ఎక్కడికీ పోదని తాను చెప్పానని, పోర్టు సీఈఓ కూడా చెప్పినా చంద్రమోహన్‌రెడ్డి మాత్రం ప్రజలను తప్పుదోవ పట్టించే విధంగా ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

టికెట్ వస్తుందో రాదో తెలియకే..

సోమిరెడ్డి తనకు ప్రత్యర్థిగా ఉండడం తన దౌర్భాగ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ తరఫున సోమిరెడ్డికి ఎమ్మెల్యే టికెట్ వస్తుందో రాదో కచ్చితంగా చెప్పగలరా అని ప్రశ్నించారు. టికెట్ రాదని ముందే గ్రహించి రెండు నెలలుగా బ్లాక్‌మెయిల్ రాజకీయాలు చేస్తూ దండుకోవడం మొదలు పెట్టారన్నారు. సైదాపురం అక్రమ మైనింగ్ అంటూ హడావుడి చేసిన సోమిరెడ్డి.. ఇప్పుడు ఎందుకు మౌనంగా ఉన్నారో చెప్పాలని ప్రశ్నించారు.

గిరిజన సమస్యలపై దృష్టి సారించండి

ఎస్టీ కమిషన్ చైర్మన్ శంకరరావు

సాక్షి, అమరావతి: ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనం ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు కోరారు. ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కాంతిలాల్ దండేతో శనివారం ఆయన భేటీ అయ్యారు. ప్రభుత్వం చేపడుతున్న ఉద్యోగ అవకాశాల వల్ల తమను తొలగిస్తారన్న ఆందోళనలో గిరిజన సంక్షేమ పాఠశాలలు, ఏకలవ్య, గురుకులాల్లో పనిచేస్తున్న సీఆర్టీలు ఉన్నారని, ఈ అంశంపై క్లారిటీ ఇవ్వాలని కోరారు. గురుకులాల్లో పదోన్నతులు, రెగ్యులరైజేషన్ వినతులు, బొర్రా, అరకుల్లో పర్యాటక రంగంలో పనిచేస్తున్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. గిరిజన పర్యాటక ప్రాంతాల్లో అడ్వెంచర్ పార్కులు ఏర్పాటు చేయాలని కోరారు. సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంతీలాల్ దండే హామీ ఇచ్చారని తెలిపారు.

గ్రీన్ ఎనర్జీలో రిలయన్స్ భారీ పెట్టుబడులు



వ్యవసాయ వ్యర్థాల నుంచి కంప్రెస్డ్ బయోగ్యాస్ ఉత్పత్తి

- రూ.1,920 కోట్లతో రాష్ట్రంలో 15 సీబీజీ యూనిట్ల ఏర్పాటు
- ఈ యూనిట్లకు అదనంగా మరో రూ.1,000 కోట్ల పెట్టుబడులు
- తొలి దశలో 8 యూనిట్ల ఏర్పాటుకు నిర్మాణ పనులు ప్రారంభం
- వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి అందుబాటులోకి
- ప్రత్యక్షంగా, పరోక్షంగా 2 వేల మందికి ఉపాధి
- వ్యర్థాల విక్రయం ద్వారా రైతులకు రూ.45 కోట్ల వరకు అదనపు ఆదాయం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో పర్యావరణహిత ఇంధనం (గ్రీన్ ఎనర్జీ) ఉత్పత్తికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పెద్ద ఎత్తున ప్రోత్సాహం అందిస్తుండటంతో దిగ్గజ సంస్థలు ఈ రంగంలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి. తాజాగా రిలయన్స్ గ్రూప్ సుమారు రూ.1,920 కోట్ల పెట్టుబడితో 15 చోట్ల కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఇందులో భాగంగా తొలి దశలో 8 యూనిట్ల ఏర్పాటుకు నిర్మాణ పనులు జరుగుతున్నాయి. వ్యవసాయ వ్యర్థాలు.. వరిగడ్డి, వేరుశెనగ పొట్టు, జొన్న కంకులు, ఖాళీ కొబ్బరి బొండాలు, చెరకు పిప్పి, మునిసిపాలిటీల నుంచి రోజూ వచ్చే వ్యర్థాల నుంచి కంప్రెస్డ్ బయోగ్యాస్‌ను ఉత్పత్తి చేస్తారు. ఈ 15 యూనిట్ల ద్వారా పూర్తిగా పర్యావరణహితమైన గ్యాస్‌ను ఉత్పత్తి చేయడమే కాకుండా సేంద్రియ ఎరువులను కూడా తయారుచేయొచ్చు. ఇప్పటివరకు ఈ వ్యర్థాలను తరలించే అవకాశం లేకపోవడంతో రైతులు పొలాల్లోనే వాటిని తగులబెడుతున్నారు. దీంతో పెద్ద ఎత్తున వాతావరణ కాలుష్యం వెలువడుతోంది.. నేలసారం కూడా తగ్గిపోతోంది. ఇప్పుడు ఇలా కాకుండా నేరుగా రైతుల నుంచే రిలయన్స్ ఈ వ్యర్థాలను కొనుగోలు చేస్తుంది. ఇందుకోసం ప్రతి యూనిట్‌కు కనీసం ఐదు కలెక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయనుంది. వ్యర్థాల కొనుగోలు చేయడం ద్వారా కనీసం 70 వేల మంది రైతులకు లబ్ధి కలుగుతుందని అంచనా. ప్రతి రైతుకు అదనంగా రూ.6,250 చొప్పున ఏటా రైతులకు రూ.45 కోట్ల వరకు అదనపు ఆదాయం లభించనుంది. అంతేకాకుండా ఈ సీబీజీ యూనిట్లకు అనుబంధంగా మరో రూ.1,000 కోట్ల విలువైన పెట్టుబడులు వస్తాయని రిలయన్స్ అధికారులు వెల్లడించారు.

వాటికి ప్రత్యామ్నాయంగా సీబీజీ..

రానున్న కాలంలో ఎల్‌ఎన్‌జీ (లిక్విడ్ నేచురల్ గ్యాస్), సీఎన్‌జీ (కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్)లకు ప్రత్యామ్నాయంగా సీబీజీ వస్తుందనే అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో రిలయన్స్, అదానీ వంటి సంస్థలు ఈ రంగంలో భారీ పెట్టుబడులు పెట్టడానికి ముందుకొస్తున్నాయి. రిలయన్స్ అనుబంధ కంపెనీ.. రిలయన్స్ బయోఎనర్జీ లిమిటెడ్ దేశవ్యాప్తంగా వచ్చే ఐదేళ్లలో 100 సీబీజీ యూనిట్లను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించింది. ఈ 100 యూనిట్లలో 15 యూనిట్లు ఆంధ్రప్రదేశ్‌లోనే ఏర్పాటు కానున్నాయి. సుమారు రూ.130 కోట్లతో 20 ఎకరాల విస్తీర్ణంలో ఒక్కో యూనిట్ ఉంటుంది. తొలి దశలో భాగంగా కాకినాడ జిల్లాలో 3, తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు వద్ద 2, విజయవాడ పరిటాల వద్ద, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, కర్నూలు జిల్లాల్లో ఒకటి చొప్పున ఏర్పాటు చేయనుంది. తాజాగా పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ చేతుల మీదుగా నిర్మాణ పనులు ప్రారంభమైన ఈ 8 యూనిట్లు వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి అందుబాటులోకి రానున్నాయి. రెండో దశలో మరో ఏడు యూనిట్లను 2026 సెప్టెంబర్ నాటికి అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. మొత్తం ఈ 15 యూనిట్ల ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 2,000 మందికి ఉపాధి లభించనుంది. రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న ఒక్కో యూనిట్ ద్వారా ఏటా 7,000 టన్నుల సీబీజీ, 34,300 టన్నుల సేంద్రియ ఎరువులు ఉత్పత్తి కానున్నాయి.

తగ్గనున్న కర్బన ఉద్గారాలు, దిగుమతులు..

దేశవ్యాప్తంగా రిలయన్స్ ఏర్పాటు చేస్తున్న 100 సీబీజీ యూనిట్లకు ఏటా 5.5 మిలియన్ టన్నుల వ్యవసాయ వ్యర్థాలు అవసరమవుతాయని అంచనా. తద్వారా 2.2 మిలియన్ టన్నుల కర్బన ఉద్గారాలు తగ్గనున్నాయి. ఈ యూనిట్ల ద్వారా సీబీజీనే కాకుండా 2.5 మిలియన్ టన్నుల సేంద్రియ ఎరువులు కూడా ఉత్పత్తవుతాయి. అంతేకాకుండా ఏటా ఏడు మిలియన్ టన్నుల ఎల్‌ఎన్‌జీ దిగుమతులు తగ్గడం ద్వారా విదేశీమారక నిల్వలు పెరగనున్నాయి.

పరిశ్రమలపై పనికిమాలిన కథ

లేనిది ఉన్నట్లుగా రామోజీ అడ్డగోలు రాతలు



సాక్షి, అమరావతి : అసత్యాలను అక్షరాలుగా పేర్చడంలో ఆరితేరిన రామోజీరావు అనేకానేక అబద్ధాల కథనాలతో ఈనాడును నింపేస్తున్నారు. రాష్ట్రంలో దినదినాభివృద్ధి చెందుతున్న పరిశ్రమలపైనా విషం చిమ్ముతున్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంపై బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారు. చిన్న పరిశ్రమలు తీసుకునే రుణాలపై రిజిస్ట్రేషన్ చార్జీలకు సంబంధించి కనీస అవగాహన లేకుండా, లేని భారాన్ని ఉన్నట్లు చూపిస్తూ వైఎస్ జగన్ ప్రభుత్వంపై అభాండాలు వేశారు. ప్రజల్లో అపోహలు సృష్టించే ప్రయత్నం చేశారు. చిన్న, మధ్య తరహా పరిశ్రమలు గతంలో ఎంత రుణం తీసుకున్నా రూ.10 వేలు చెల్లిస్తే సరిపోయేదని, ఇప్పుడు దాన్ని 25 రెట్లు పెంచి వాటిపై భారం వేశారంటూ పచ్చి అబద్ధాన్ని ఈనాడులో అచ్చేశారు. నిజానికి మార్ట్‌గేజ్ బాండ్‌కు చెల్లించాల్సిన స్టాంప్ డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజులో ఎటువంటి మార్పు లేదు. గతంలో ఉన్న ఛార్జీలే ఇప్పటికీ అమల్లో ఉన్నాయి. అయినా 25 రెట్లు పెరిగిందని అబద్ధాలు ప్రచురించేశారు. ఎక్కడ ఏ పరిశ్రమకు ఎలా పెరిగిందో మాత్రం చూపలేకపోయారు. దాన్నిబట్టే ఈనాడులో అచ్చేసింది పచ్చి అబద్ధమని తేలిపోయింది.

ఆ రెండింటికీ తేడా తెలియదా?

డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్స్ దస్తావేజుకి, మార్ట్‌గేజ్ బాండ్‌కి తేడా తెలియకుండా రామోజీ అవాస్తవాలతో ప్రజలను నమ్మించే ప్రయత్నం చేశారు. నిజానికి సూక్ష్మ, చిన్న పరిశ్రమలు రుణాలు పొందినప్పుడు ఇచ్చే డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్స్‌కు మాత్రమే వెయ్యి రూపాయల స్టాంప్ డ్యూటీ వర్తిస్తుంది. మధ్య తరహా పరిశ్రమలకు ఎప్పుడూ స్టాంప్ డ్యూటీ మినహాయింపు లేదు. మధ్యతరహా పరిశ్రమ రూ.5 కోట్లు రుణం తీసుకుంటే దాని మార్ట్‌గేజ్ బాండ్‌కి స్టాంప్ డ్యూటీగా 0.5 శాతం చొప్పున 2.5 లక్షలు చెల్లిస్తున్నారనడం పూర్తి అవాస్తవం. డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్స్‌ని మార్ట్‌గేజ్ బాండ్‌గా ఊహించుకుని దానికి 0.5 శాతం స్టాంప్ డ్యూటీ కట్టాలనే కాకి లెక్క వేసి ప్రజలను మాయ చేయాలనేది రామోజీ ప్రయత్నం. ఒకవేళ ఏదైనా పరిశ్రమ తీసుకునే ఎన్ని కోట్ల రుణానికైనా డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్స్ దస్తావేజుకు చెల్లించే స్టాంప్ డ్యూటీ రూ.50 వేలు మాత్రమే. 0.5 శాతం స్టాంపు డ్యూటీ డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్స్‌కు వర్తించదు. సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు స్టాంపుల చట్టం ప్రకారం వెయ్యి రూపాయల స్టాంప్ డ్యూటీ కడితే సరిపోతుంది. 25 రెట్ల భారం ఎక్కడ వేసినట్లు? ఈ కనీస పరిజ్ఞానం కూడా రామోజీకి లేదు.

వాస్తవానికి రిజిస్ట్రేషన్ల శాఖలో ప్రజలు, పరిశ్రమలకు అనుకూలంగా అనేక మార్పులు జరిగాయి. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ల వ్యవస్థతో పాటు ఈ-స్టాంపింగ్ వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వైఎస్ జగన్ ప్రభుత్వం ప్రవేశపెట్టింది. దీనిద్వారా గతంలోకంటే సులభంగా ప్రజలు రిజిస్ట్రేషన్ల సేవలు పొందుతున్నారు. ఇలాంటి అంశాలను తప్పుదోవ పట్టించే క్రమంలో రామోజీరావు ఉద్దేశపూర్వకంగానే పరిశ్రమలపై రిజిస్ట్రేషన్ల ఛార్జీలతో బాదేస్తున్నారంటూ ఒక కల్పిత కథనాన్ని ప్రచురించారు.

ఘనంగా కేసీఆర్ జన్మదిన వేడుకలు

• తెలంగాణ

సాక్షి, హైదరాబాద్: భారత రాష్ట్ర సమితి అధ్యక్షుడు, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు 70వ జన్మదిన వేడుకలను శనివారం తెలంగాణ భవన్‌లో ఘనంగా నిర్వహించారు. మాజీమంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, సికింద్రాబాద్ పార్లమెంటు నియోజకవర్గ పార్టీఇన్‌చార్జి సాయికిరణ్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. 70 కిలోల కేక్‌ను ఎంపీ కె.కేశవరావు, హైదరాబాద్ మేయర్ విజయలక్ష్మి, మాజీ మంత్రులు మహమూద్ అలీ, శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాస్‌గౌడ్‌లతో కలసి కేటీఆర్ కట్ చేశారు. తర్వాత కేసీఆర్ రాజకీయ జీవితం, తెలంగాణ ఉద్యమ నేపథ్యంతో రూపొందించిన 'అతనే ఒక చరిత్ర'డాక్యుమెంటరీని ప్రదర్శించారు. అసెంబ్లీ లాబీల్లోని పార్టీ శాసనసభాపక్ష కార్యాలయంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు కేక్ కట్ చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

ఆంధ్రా రంజీ జట్టుకు దత్తారెడ్డి ఎంపిక



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ రంజీ క్రికెట్ జట్టుకు అనంతపురానికి చెందిన యువ క్రికెటర్ మచ్చా దత్తారెడ్డి ఎంపికయ్యాడు. గతేడాది బీసీసీఐ నిర్వహించిన అండర్–19, ఈ ఏడాది అండర్ –23 అంతర్ రాష్ట్ర క్రికెట్ పోటీల్లో వికెట్ కీపర్, బ్యాట్స్‌మెన్‌గా దత్తారెడ్డి అద్భుత ప్రతిభ కనబరిచాడు. గతంలో నేషనల్ క్రికెట్ అకాడమీ క్యాంప్‌నకు ఆంధ్ర జట్టు తరపున ఎంపికయ్యాడు. అండర్–12, 14, 16, 19 ఏజ్ గ్రూప్‌లలో ఆంధ్రా జట్టుకు ప్రాతినిధ్యం వహించాడు. దత్తారెడ్డి రాయలసీమ నుంచి పిన్న వయస్కుడైన (19 ఏళ్ల 4నెలలు) క్రికెటర్‌గా ఆంధ్ర రంజీ జట్టులో చేరనున్నారు. ఈ సందర్భంగా దత్తారెడ్డిని ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మ్యాంచో ఫెర్రర్, అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి మధు అభినందించారు.

ప్రిన్సిపాళ్ల పదోన్నతులపై ఎల్లో మీడియా దుష్ప్రచారం

జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ల ఆగ్రహం

సాక్షి, అమరావతి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపాల్స్ పదోన్నతులపై ఎల్లో మీడియా దుష్ప్రచారం చేస్తోందని ప్రభుత్వ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ (జీజేఎల్ఏ) అధ్యక్షుడు ఎం.హనుమంతురావు, ఎస్సీ–ఎస్టీ ప్రిన్సిపాల్స్ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ ఎన్.గోవింద్, డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్ (డీఆర్‌జేఎల్ఏ) జోన్–2 కార్యదర్శి జె.రాంబాబు మండిపడ్డారు. గత ప్రభుత్వంలో అడ్డగోలు ప్రమోషన్లు ఇచ్చినప్పుడు ఎందుకు స్పందించలేదని శుక్రవారం ఓ ప్రకటనలో నిలదీశారు. నాడు–నేడుతో జూనియర్ కళాశాలల రూపురేఖలు మారాయని, ప్రిన్సిపాళ్ల ఖాళీలను భర్తీ చేస్తే మరింత మెరుగైన విద్యను అందించొచ్చని తెలిపారు. ఇందులో భాగంగానే ప్రభుత్వం పూర్తి పారదర్శకంగా ప్రమోషన్ల ప్రక్రియ చేపడుతుంటే అడ్డుకునేందుకు ఎల్లోమీడియా కుట్ర చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలంగాణ

ఆర్మీ రిక్రూట్మెంట్ ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు మార్చి 22

సాక్షి, హైదరాబాద్: భారత సైన్యంలో వివిధ పోస్టులకు సంబంధించి 2024–25 సంవత్సరానికిగాను రిక్రూట్మెంట్‌కు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలని మిలిటరీ ఉన్నతాధికారులు సూచించారు. ఈ నెల 13న ప్రారంభమైన ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్‌కు మార్చి 22 వరకు గడువు ఉన్నట్టు తెలిపారు. www.joinindianarmy.nic.in వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలు అందుబాటులో ఉన్నాయని, ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు.

'చేవెళ్ల చెల్లెమ్మ' అంటే ఎంతో సంతోషం

- వైఎస్సార్‌ను గుర్తు చేసుకున్నా.. ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ చర్చలో సీఎం రేవంత్‌రెడ్డి తనను చేవెళ్ల చెల్లెమ్మ అని సంబోధించడం ఎంతో సంతోషంగా ఉందని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి అన్నారు. తనను ఆ మాట అన్నప్పుడు దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డిని గుర్తుచేసుకున్నానని చెప్పారు. శాసనసభలో రేవంత్ మాట్లాడిన అనంతరం ఆమె మాట్లాడారు. వికారాబాద్, పరిగి, చేవెళ్ల ప్రాంతాలకు నీరు అందించాలని తాను వైఎస్సార్‌ను కోరానని చెప్పారు. 600 మీటర్ల ఎత్తులోని ప్రాంతాలకు కూడా నీళ్లందించేలా 'ప్రాణహిత–చేవెళ్ల' ప్రాజెక్టుకు రూపకల్పన చేశారని వివరించారు. చేవెళ్ల సెంటిమెంట్‌తో అక్కడే పునాది వేశారని చెప్పారు. తాను ఎక్కడి నుంచి ప్రాతినిధ్యం వహించినా.. చేవెళ్ల నియోజకవర్గాన్ని తమ కుటుంబం మర్చిపోదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టినట్టే పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టును కూడా పూర్తి చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సబిత కోరారు.

గ్రూప్‌-2 ప్రిలిమ్స్‌కు సర్వం సిద్ధం

హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్న 3.40 లక్షల మంది

- 25న పరీక్ష
- అదే తేదీన ఎస్‌బీఐ పరీక్ష రాసేవారికి మార్చి 4న అవకాశం
- బ్యాంకు ఉన్నతాధికారులకు లేఖ రాసిన ఏపీపీఎస్సీ
- అంగీకారం తెలిపిన ఎస్‌బీఐ

గ్రూప్‌-2, బ్యాంకు పరీక్ష రాసేవారి వివరాలు సేకరిస్తున్న కమిషన్



సాక్షి, అమరావతి: ఈ నెల 25న నిర్వహించనున్న గ్రూప్‌–2 ప్రిలిమ్స్‌కు ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 14 నుంచి హాల్‌టికెట్ల జారీ మొదలుకాగా ఇప్పటివరకు దాదాపు 3.40 లక్షల మంది డౌన్‌లోడ్ చేసుకున్నారు. కాగా ఈ నెల 25న ప్రిలిమ్స్ పరీక్ష రోజే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) మెయిన్స్ పరీక్ష ఉంది. ఈ నేపథ్యంలో ఏపీపీఎస్సీ ఉన్నతాధికారులు.. ఎస్‌బీఐ ఉన్నతాధికారులతో ఈ అంశంపై చర్చించారు. దీంతో గ్రూప్‌–2తో పాటు ఎస్‌బీఐ పరీక్ష రాసే అభ్యర్థులకు మార్చి 4న పరీక్ష నిర్వహించేందుకు బ్యాంకు అంగీకారం తెలిపింది. దీంతో గత కొన్నిరోజులుగా ఈ అంశాన్ని సాకుగా చూపి గ్రూప్ –2 పరీక్షను వాయిదా వేయించాలని కొన్ని రాజకీయ పక్షాలు చేసిన ప్రయత్నాలకు అడ్డుకట్ట పడింది. అడ్డంకులన్నీ తొలగడంతో ముందే ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం గ్రూప్‌–2 ప్రిలిమ్స్‌ను నిర్వహించనున్నారు.

4,83,525 మంది దరఖాస్తు..

గ్రూప్‌–2 పరీక్షల షెడ్యూల్‌ను గత డిసెంబర్ 7న ఏపీపీఎస్సీ ప్రకటించింది. మొత్తం 899 పోస్టులకు 4,83,525 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో ఫిబ్రవరి 15న ఎస్‌బీఐ ప్రిలిమ్స్ ఫలితాలను వెల్లడించింది. ఫిబ్రవరి 25, మార్చి 4ను మెయిన్స్ తేదీలుగా ప్రకటించింది. దీంతో కొన్ని రాజకీయ పక్షాలు ఫిబ్రవరి 25న గ్రూప్‌–2 ప్రిలిమ్స్ నిర్వహిస్తే అదే రోజు ఎస్‌బీఐ, గ్రూప్స్ రెండు పరీక్షలు రాసే అభ్యర్థులు నష్టపోతారని ప్రచారం మొదలుపెట్టాయి. దీనివల్ల 5 వేల మందికి పైగా నష్టం కలుగుతుందన్నాయి.

అభ్యర్థుల వివరాలు పంపండి..

ఈనెల 25న గ్రూప్‌–2 ప్రిలిమ్స్‌తోపాటు ఎస్‌బీఐ మెయిన్స్ రాసే అభ్యర్థులు తమ వివరాలను తమకు పంపాలని ఏపీపీఎస్సీ ఒక ప్రకటనలో కోరింది. అభ్యర్థులు తమ వివరాలను ఈ నెల 19 రాత్రి 12 గంటల లోగా appschelpdesk@gmail.comకు మెయిల్ చేయాలని సూచించింది.

ఎస్‌బీఐకి లేఖ రాసిన ఏపీపీఎస్సీ

ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ఏపీపీఎస్సీ అధికారులు.. ఎస్‌బీఐ చీఫ్ జనరల్ మేనేజర్‌కు లేఖ రాశారు. ఏపీపీఎస్సీ గ్రూప్‌–2 ప్రిలిమ్స్ తేదీని డిసెంబర్‌లోనే ప్రకటించామని తెలిపారు. ఈ పరీక్షకు 4,83,525 మంది చేసుకున్నారని, పరీక్ష నిర్వహణకు అన్ని ఏర్పాట్లు కూడా పూర్తిచేశామని వివరించారు. ఈ నేపథ్యంలో గ్రూప్‌–2తో పాటు ఎస్‌బీఐ మెయిన్స్ రాసే అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా మార్చి 4న జరిగే ఎస్‌బీఐ స్లాట్‌లో వారికి అవకాశం కల్పించాలని కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఎస్‌బీఐ అధికారులు.. ఈనెల 25న గ్రూప్‌–2 ప్రిలిమ్స్‌కు హాజరయ్యే ఎస్‌బీఐ అభ్యర్థులకు మార్చి 4న జరిగే స్లాట్‌లో అవకాశం కల్పించేందుకు అంగీకరించారు. దీంతో రెండు పరీక్షలు రాసే అభ్యర్థుల వివరాలను ఏపీపీఎస్సీ సేకరిస్తోంది. ఈ క్రమంలో ఇప్పటివరకు గ్రూప్‌–2తో పాటు ఎస్‌బీఐ పరీక్ష కూడా రాసేవారు 14 మంది ఉన్నట్టు తేలింది. పరీక్ష నాటికి ఎంత మంది అభ్యర్థులు ఉంటే వారందరి వివరాలను ఏపీపీఎస్సీ.. ఎస్‌బీఐకి అందించనుంది. దీంతో గ్రూప్‌–2 ప్రిలిమ్స్‌ను యథావిధిగా నిర్వహించనున్నారు.



తూర్పు నౌకాదళంలో యాంకరింగ్ చేసిన ఐఎన్ఎస్ విక్రమాదిత్య

తొలిసారి విశాఖకు 'విక్రమాదిత్య'

- విన్యాసాల్లో పాల్గొనేందుకు చేరుకున్న యుద్ధ విమాన వాహక నౌక
- నేటి నుంచి మిలాన్–2024 రిహార్సల్స్

సాక్షి, విశాఖపట్నం: పశ్చిమ తీరంలో సేవలందిస్తున్న యుద్ధ విమాన వాహక నౌక ఐఎన్ఎస్ విక్రమాదిత్య తొలిసారిగా విశాఖ జలాల్లో అడుగుపెట్టింది. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రం విశాఖపట్నంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న మిలాన్–2024 విన్యాసాల్లో విక్రమాదిత్య పాల్గొననుంది. ఈ నెల 19 నుంచి 27 వరకూ జరిగే మిలాన్ ఎక్సర్‌సైజ్‌లో 50కి పైగా దేశాలు పాల్గొంటున్నాయి. ఇప్పటికే శ్రీలంక, మలేషియా, ఆస్ట్రేలియా, యూఎస్ దేశాలకు చెందిన యుద్ధ నౌకలు ఆయా దేశాల నుంచి విశాఖకు పయనమైనట్లు తూర్పు నౌకాదళ వర్గాలు తెలిపాయి. 22న సిటీ పరేడ్‌కు సీఎం జగన్‌తో పాటు కేంద్ర ప్రభుత్వం తరఫున రక్షణ మంత్రి రాజనాథ్ సింగ్, ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్కడ్ హాజరయ్యే అవకాశం ఉంది. సిటీ పరేడ్‌లో నిర్వహించే విన్యాసాలు, సాంస్కృతిక ప్రదర్శనలకు సంబంధించి 18, 19, 20 తేదీల్లో ఆర్‌కే బీచ్‌లో యుద్ధ నౌకలు, జలాంతర్గాములతో రిహార్సల్స్ నిర్వహిస్తున్నట్లు ఈస్టర్న్ నేవల్ కమాండ్ ప్రకటించింది. దీన్లో భాగంగా శనివారం సాయంత్రం భారత నౌకాదళం పలు ప్రదర్శనలు చేపట్టింది. సన్‌రైజ్ కమాండ్‌ని స్వాగతించేలా ఎంహెచ్–60ఆర్ సీహాక్స్ హెలికాప్టర్లు సముద్ర జలాలపై చేసిన విన్యాసాలు ఆకట్టుకున్నాయి.



వాటర్ బాంబు



హెలికాప్టర్ ద్వారా రెస్క్యూ ప్రదర్శన

ఎంపీ విజయసాయిరెడ్డికి సంసద్ మహారత్న అవార్డు

పురస్కారం అందించిన తెలంగాణ గవర్నర్ తమిళిసై



అవార్డు అందుకుంటున్న విజయసాయిరెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత వి.విజయసాయిరెడ్డి సంసద్ మహారత్న అవార్డును అందుకున్నారు. ఉత్తమ పనితీరు కనబరిచిన పార్లమెంటేరియన్లకు ఏటా ఇచ్చే సంసద్ రత్న అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం శనివారం ఢిల్లీలోని మహారాష్ట్ర సదన్‌లో జరిగింది. రవాణా, పర్యాటక, సాంస్కృతిక శాఖల పార్లమెంటరీ స్థాయీ సంఘం చైర్మన్ హోదాలో ప్రతిష్టాత్మకమైన సంసద్ మహారత్న అవార్డును ఎంపీ విజయసాయిరెడ్డి, ఇదే స్థాయీ సంఘం మాజీ చైర్మన్ టీజీ వెంకటేశ్‌లకు తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందర్‌రాజన్, హోంశాఖ సహాయ మంత్రి అజయ్‌కుమార్ మిశ్రా, జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్స్‌రాజ్ అహిర్, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సంజయ్ కిషన్ కౌల్ ప్రదానం చేశారు. 17వ లోక్‌సభ కాలంలో టూరిజం, రవాణా, సాంస్కృతిక శాఖల పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా అత్యుత్తమ పనితీరుకుగాను విజయసాయిరెడ్డి ఈ అవార్డును అందుకున్నారు. సంసద్ రత్న, సంసద్ మహారత్న, సంసద్ ఉత్కృష్ట మహారత్న అవార్డులను అధీర్ రంజన్ చౌదరి, భతృహరి మహతాబ్, సుప్రియా సూలే, శ్రీకాంత్ ఏక్‌నాథ్ షిండే, హీనా గవిట్, జయంత్ సిన్హా, గద్ది గౌడ, సుధీర్ గుప్తా, అమోల్ రాంసింగ్ కొల్హే, రాజీశర్మ తదితరులు అందుకున్నారు.

అప్పుడే దేశం అభివృద్ధి చెందుతుంది: తమిళిసై

ఈ సందర్భంగా తెలంగాణ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ.. మహిళలకు అన్ని రంగాల్లో సరైన అవకాశాలు కల్పించాలని అన్నారు. పురుషులతో పాటు మహిళలకు సమాన ప్రాతినిధ్యం కల్పించినప్పుడే దేశం మరింత అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కల్పించే చట్టం చేయడం చరిత్రాత్మకమని అన్నారు. పార్లమెంట్‌లో జరిగే చర్చల ఆధారంగా చట్టాల ఉద్దేశం తెలుస్తుందని ఆమె అభిప్రాయపడ్డారు.

సాంకేతిక పరిజ్ఞానంతో టెన్త్ ప్రశ్నపత్రాలు

- ప్రశ్నపత్రం లీకైతే ఏ పరీక్ష గది నుంచి బయటకు వచ్చిందనేది తెలుస్తుంది
- పరీక్షల విభాగం డైరెక్టర్ దేవానందరెడ్డి



పెడన: మార్చి 18 నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించడానికి అన్ని చర్యలు తీసుకున్నట్లు రాష్ట్ర ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ డి.దేవానందరెడ్డి తెలిపారు. ఆయన శనివారం కృష్ణా జిల్లా పెడనలో విలేకరులతో మాట్లాడుతూ ఈ ఏడాది పదో తరగతి ప్రశ్నపత్రాలను సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించామని చెప్పారు. ఎవరైనా లీకు చేస్తే ఆ ప్రశ్నపత్రం ఎక్కడ నుంచి వచ్చింది, ఏ జిల్లా, ఊరు, సెంటరు, పరీక్ష గది, చివరకు ఏ విద్యార్థికి సంబంధించినది అనేది కూడా తెలిసిపోతుందని వివరించారు. ఈ ఏడాది రాష్ట్రవ్యాప్తంగా 6.23 లక్షల మంది రెగ్యులర్ విద్యార్థులు, 1.02 లక్షల మంది ప్రైవేటు విద్యార్థులు పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరుకానున్నారని వివరించారు. పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 3,472 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఒకసారి ఫెయిల్ అయి రెగ్యులర్ విద్యార్థులతో కలిసి తరగతులకు హాజరైన వారిని రెగ్యులర్ విద్యార్థులుగానే పరిగణిస్తామని, సీడబ్ల్యూఎస్ఎన్ (చిల్డ్రన్ విత్ స్పెషల్ నీడ్) స్క్రైబ్ విద్యార్థులు సుమారు 3,800 మంది ఉన్నారని, వీరు స్థానిక పరీక్ష కేంద్రంలోని 9వ తరగతి విద్యార్థుల సాయంతో పరీక్ష రాస్తారన్నారు. పరీక్ష ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతుందని, అనివార్య కారణాల వల్ల అర్ధగంట ఆలస్యమైనా లోపలికి అనుమతిస్తామని, అయితే ఒకేసారి గుంపులుగా ఆలస్యంగా వస్తే మాత్రం అనుమతించేది లేదని ఆయన స్పష్టంచేశారు. మొత్తం ఏడు పరీక్షలు ఉంటాయని, పీఎస్, ఎన్ఎస్ (ఫిజిక్స్, నేచురల్ సైన్సు) పరీక్షలు వేర్వేరుగా ఉంటాయన్నారు. మార్చి 31వ తేదీ నుంచి పదో తరగతి పరీక్షల మూల్యాంకనం 26 జిల్లా కేంద్రాల్లో ప్రారంభిస్తామని, ఏప్రిల్ 8వ తేదీతో పూర్తి చేస్తామని చెప్పారు.

పచ్చమీడియాకు 'అతి'సారం!

- 'జల'దరించే విషపు రాతలు
- కలుషిత జలం కాటేసిందంటూ కట్టుకథలు
- ఏ కారణంతో చనిపోయినా డయేరియా ఖాతాలోనే..!
- గుంటూరు కార్పొరేషన్ ద్వారా స్వచ్ఛనీరే సరఫరా
- నివేదికలన్నీ తేటతెల్లం చేస్తున్నా తప్పుడు కథనాలు



కలుషిత జలం కాటేసింది
గుంటూరులో అతిసారం లక్షణాలతో మరొకరి మృతి
ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయిన మృతుడి భార్య, పిల్లలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/నెహ్రూనగర్(గుంటూరు): పచ్చమీడియాకు అతిసారం సోకినట్టుంది. గుంటూరు నగరంలో కలుషిత జలం కాటేసిందంటూ మరోసారి విషాన్ని విరజిమ్మింది. తప్పుడు కథనాలతో పేట్రేగిపోయింది. చికెన్ పాక్స్, న్యూమోనియా కారణాలతో శుక్రవారం మరణించిన మహ్మద్ ఇక్బాల్ డయేరియాతో మరణించాడని దుష్ప్రచారానికి దిగింది. గత వారంలో మరణించిన పద్మ మరణంపైనా ఇలాగే రాక్షస రాతలు రాసింది. గుంటూరులో నివాసం ఉంటున్న మహ్మద్ ఇక్బాల్ ఈ నెల 11న సాయంత్రం విరేచనాలు , వంటిమీద చీము పొక్కులతో ఆస్పత్రిలో చేరాడు. చికిత్స అందించడంతో విరేచనాలు తగ్గాయి. పొక్కులను చికెన్‌పాక్స్‌గా వైద్యులు గుర్తించారు. బ్లడ్‌షుగర్ లెవల్స్ కూడా 400 దాటి ఉండటంతో డెర్మటాలజీ డాక్టర్లు పరీక్షించి గోరంట్లలోని అంటువ్యాధుల ఆస్పత్రి(జ్వరాల ఆస్పత్రి)లో చేరాలని సూచించారు. ఇక్బాల్ అక్కడికి వెళ్లేందుకు నిరాకరించాడు. జీజీహెచ్‌లోనూ ఉండకుండా వెళ్లిపోయాడు. రెండురోజల తర్వాత 15న న్యూమోనియా లక్షణాలతో ఊపిరితీసుకోవడానికి ఇబ్బందిపడుతూ మళ్లీ వచ్చాడు. అప్పుడు కూడా వైద్యులు జ్వరాల ఆస్పత్రికి వెళ్లాలని సూచించినా వెళ్లలేదు. ఇంటికి వెళ్లిపోయాడు. మళ్లీ తర్వాత రోజు తెల్లవారుజామున రెండు గంటల సమయంలో చికెన్‌పాక్స్, న్యూమోనియా లక్షణాలతో తీవ్రంగా ఇబ్బందిపడుతూ జీజీహెచ్‌కు వచ్చాడు. వచ్చిన అరగంటలోనే మృతి చెందాడు. వైద్యులు చికెన్ పాక్స్, అదుపులో లేని మధుమేహం, న్యూమోనియా లక్షణాలతో చనిపోయాడని నివేదిక ఇచ్చారు. కుటుంబ సభ్యులు భీమవరం వెళ్లడంతో గుంటూరు మేయర్ కావటి మనోహర్‌నాయుడు వారితో ఫోన్‌లో మాట్లాడారు. వారు కూడా అనారోగ్యం వల్లే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటన జరిగిన వెంటనే మృతుడు ఇక్బాల్ నివాసం ఉన్న రైలుపేట ప్రాంతాలలో తాగునీటి నమూనాలు సేకరించి పరీక్షించారు. ఎక్కడా నీరు కలుషితం కాలేదని నివేదికలొచ్చాయి.

గుండెపోటుతోనే పద్మ మరణం

ఈనెల 10న మరణించిన ఎం.పద్మ(18) కూడా కార్డియాక్ అరెస్టుతో చనిపోయిందని వైద్యులు ప్రాథమికంగా నిర్ధారించారు. వాంతులు, విరేచనాలతో రెండురోజుల పాటు ఆర్ఎంపీ వద్ద వైద్యం చేయించుకుని ఆఖరి ఘడియల్లో జీజీహెచ్‌లో చేరింది. అస్పత్రిలో చేరిన కొద్దిసేపటికే కార్డియాక్ అరెస్టుతో మృతి చెందింది.

కలుషిత నీరైతే ఒకరిద్దరే జబ్బున పడతారా?

కలుషిత నీరైనా, అతిసారం అయినా ఒకరిద్దరే జబ్బున పడరని వైద్యులు చెబుతున్నారు. ఆ కలుషిత నీరు తాగిన అందరూ రోగం బారిన పడతారని పేర్కొంటున్నారు. అలాంటప్పుడు ఒక వేళ కలుషిత నీటి వల్ల ఇక్బాల్, పద్మ జబ్బు బారిన పడితే వారి కుటుంబాలు ఎలా ఆరోగ్యంగా ఉన్నాయన్న ప్రశ్నకు ఎల్లోమీడియా వద్దగానీ, టీడీపీ నేతల వద్దగానీ సమాధానం లేదు.

అధికారులు అప్రమత్తం

ఎల్లోమీడియావి కట్టుకథలే అయినా గుంటూరు నగరపాలక సంస్థ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈనెల పది నుంచి నగరంలో రోజుకు వెయ్యికిపైగా తాగునీటి శాంపిల్స్ సేకరించి పరీక్షలు చేస్తున్నారు. ఎక్కడా కూడా తాగునీరు కలుషితం అయినట్టు ఆధారాలు దొరకలేదు. మినరల్ వాటర్ వల్ల అనారోగ్య సమస్యలు వస్తున్నాయని రీజనల్ మెడికల్ ల్యాబ్ రిపోర్టు ఇచ్చింది. పలు ఆర్ఓ ప్లాంట్లలో ఉండాల్సిన పీహెచ్ కన్నా తక్కువ ఉండటం, బ్యాక్టీరియా ఉండడాన్ని గుర్తించారు. వీటిపై చర్యలకు రంగం సిద్ధం చేశారు. మరోవైపు పానీపూరి కోసం వాడుతున్న నీరు కలుషితంగా ఉండటం వల్ల వ్యాధులు వస్తున్నాయని రీజినల్ ల్యాబ్ నిర్ధారించింది. ఈ విషయాలన్నీ తెలిసినా కేవలం ప్రభుత్వంపై బురద జల్లడమే లక్ష్యంగా పచ్చమీడియా రెచ్చిపోతోంది.

స్వచ్ఛనీరే సరఫరా చేస్తున్నాం



గుంటూరు నగర ప్రజలకు నగరపాలక సంస్థ ద్వారా స్వచ్ఛనీరే సరఫరా చేస్తున్నాం. కొన్ని పత్రికలు రాజకీయ అజెండాతో కలుషిత జలాలు అంటూ విషం చిమ్ముతున్నాయి. రైలుపేటకు చెందిన ఇక్బాల్ చికెన్‌పాక్స్, న్యూమోనియాతోనే చనిపోయాడు. ఈ విషయాన్ని అతడి కుటుంబ సభ్యులూ, జీజీహెచ్ వైద్యులూ ధ్రువీకరించారు. గత ప్రభుత్వ హయాంలో 2018లో గుంటూరు నగరంలో 27 మంది అతిసారంతో మృతి చెందారు. అప్పట్లో జీజీహెచ్‌లో రెండు వేల మంది చికిత్స తీసుకున్నారు. డయేరియా అయితే వందల మంది ఆస్పత్రుల పాలవుతారు. ప్రజలకు సరఫరా చేసిన ప్రతినీటి బొట్టునూ పరీక్షించిన తర్వాతే కుళాయిలకు వదులుతున్నాం. సీజనల్ వ్యాధులు సోకుతున్నందున ప్రజలంతా కాచి చల్లార్చిన నీటినే తాగాలని ముందే సూచించాం. ఇంటింటి ప్రచారమూ చేపట్టాం. రీజనల్ మెడికల్ ల్యాబ్ నివేదిక మేరకు మినరల్ వాటర్ ప్లాంట్ల నిర్వహణపై తగిన చర్యలు తీసుకోవాలని ఫుడ్ కంట్రోల్ శాఖకు లేఖ రాశాం.

– మీడియాతో మేయర్ కావటి మనోహర్ నాయుడు, కమిషనర్ కీర్తిచేకూరి, డిప్యూటీ మేయర్ బాలవజ్రబాబు

విద్యారంగంలో విప్లవాత్మక సంస్కరణలు



పురస్కారాలు పొందిన విద్యార్థులతో సురేష్‌కుమార్ తదితరులు

- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్
- ఎడ్యుకేషనల్ ఎపిఫని మెరిట్ టెస్ట్ విజేతలకు సత్కారం

సాక్షి, అమరావతి: విద్యావంతులైన యువకులు ప్రభుత్వ పాఠశాలలపై ప్రేమతో నడుపుతున్న ఎడ్యుకేషనల్ ఎపిఫని సంస్థ ఆధ్వర్యంలో ప్రతిభా పరీక్ష నిర్వహించి, విజేతలను నగదు పురస్కారాలతో సత్కరించడం అభినందనీయమని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్ చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఇటీవల నిర్వహించిన 'ఎడ్యుకేషనల్ ఎపిఫని మెరిట్ టెస్ట్–2024'లో ఉత్తమ ప్రతిభ సాధించిన రాష్ట్ర, జిల్లాస్థాయి విజేతలను శనివారం విజయవాడలో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సురేష్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర విద్యారంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయని చెప్పారు. చాట్ జీపీటీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి అద్భుత సాంకేతిక పరిజ్ఞానాన్ని మన రాష్ట్ర విద్యావ్యవస్థలో ప్రవేశపెట్టడం గొప్ప విషయమన్నారు. విద్యార్థులు చాలెంజ్‌గా ఉన్న అంశాలపై అవగాహన పెంచుకోవాలని, అప్పుడే ఉన్నతంగా ఎదిగేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు 8వ తరగతిలో ప్రభుత్వం ఉచితంగా ఇస్తున్న ట్యాబ్స్‌ను సక్రమంగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. కోడ్ తంత్ర సీఈవో టి.ఎస్.వి.రమణ మాట్లాడుతూ ఎడ్యుకేషనల్ ఎపిఫని సంస్థ నిర్వహించే ప్రతిభా పరీక్ష విద్యార్థులు పోటీపరీక్షల్లో రాణించేందుకు సన్నాహకంగా ఉందని చెప్పారు. అనంతరం విద్యార్థులకు నగదు పురస్కారాలతో సత్కరించారు. సంస్థ కన్వీనర్ పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు డాక్టర్ తవనం వెంకటరావు, ఎన్టీఆర్ జిల్లా డీఈవో సుబ్బారావు, ఎపిఫని సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి విజేతలు వీరే..

పదోతరగతి విభాగంలో శ్రీకాకుళం జిల్లా చిన్నబాదం ఉన్నత పాఠశాల విద్యార్థి మళ్ల ప్రణీత్‌రాజ్, శ్రీ సత్యసాయి జిల్లా సంజయ్‌నగర్ మున్సిపల్ స్కూల్ విద్యార్థి చారుగుండ్ల తులసీకార్తీక్, విశాఖపట్నం అర్బన్ మల్కాపురం మున్సిపల్ పాఠశాల విద్యార్థి అల్లు జశ్వంత్‌కుమార్ మొదటి మూడుస్థానాల్లో నిలిచారు. వీరికి వరుసగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ.20 వేల వంతున నగదు బహుమతులు అందించారు. ఏడో తరగతి విభాగంలో కడప జిల్లా రామేశ్వరం మున్సిపల్ పాఠశాల విద్యార్థులు యంజర్ల ప్రణీత్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, విజయనగరం జిల్లా కుమరం ఉన్నత పాఠశాల విద్యార్థి రాయవరపు శరణ్య మొదటి మూడుస్థానాల్లో నిలిచారు. వీరికి వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేల వంతున నగదు బహుమతులు అందించారు. జిల్లా స్థాయి విజేతలకు కూడా నగదు పురస్కారాలను అందజేశారు.

'విశ్వకర్మ యోజన' నమోదులో ఏపీ మూడో స్థానం

- సంప్రదాయ వృత్తి, హస్త కళాకారుల కోసం పథకం
- దేశంలో ఇప్పటివరకు 3,31,684 మంది వృత్తిదారుల నమోదు
- ఏపీ నుంచి 44,034 మంది నమోదుతో మూడో స్థానం

సాక్షి, అమరావతి: గ్రామాల్లో సంప్రదాయ కుల వృత్తిదారులు, హస్త కళాకారుల వ్యాపారాన్ని బలోపేతం చేసేందుకు ఉద్దేశించిన 'ప్రధానమంత్రి విశ్వకర్మ యోజన' నమోదులో ఏపీ మూడో స్థానంలో ఉందని కేంద్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భానుప్రతాప్‌సింగ్‌వర్మ ఇటీవల రాజ్యసభలో వెల్లడించారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో పీఎం విశ్వకర్మ యోజన కింద లబ్ధి పొందే వారి కోసం గతేడాది సెప్టెంబర్‌లో పోర్టల్ ప్రారంభించగా.. ఈ ఏడాది జనవరి నెలాఖరు నాటికి దేశంలోని అన్ని రాష్ట్రాల్లో మొత్తం 3,31,684 మంది వృత్తిదారులు నమోదైనట్టు తెలిపారు. నమోదులో కర్ణాటక తొలి స్థానం, గుజరాత్ రెండో స్థానంలో నిలవగా.. ఏపీ మూడో స్థానంలో ఉందని వివరించారు. నమోదైన వృత్తిదారులకు ఆయా వృత్తుల్లో నైపుణ్య శిక్షణ ఇవ్వడంతోపాటు తొలి విడతలో 5 శాతం వడ్డీకే రూ.లక్ష చొప్పున రుణాలు మంజూరు చేస్తామని, రెండో విడతలో రూ.2 లక్షల చొప్పున మంజూరు చేస్తామన్నారు. ఎటువంటి పూచీకత్తు లేకుండానే ఎంటర్‌ప్రైజ్ డెవలప్‌మెంట్ కింద లబ్ధిదారులకు రుణాలు మంజూరు చేయనున్నట్టు పేర్కొన్నారు. తొలుత పొందిన రూ.లక్షను 18 నెలల్లో తిరిగి చెల్లించిన వారికి 30 నెలల్లో తిరిగి చెల్లించేలా రూ.2 లక్షల వరకు రెండోసారి రుణం ఇస్తారని, ఈ రుణాలకయ్యే క్రెడిట్ గ్యారెంటీ ఫీజును కేంద్ర ప్రభుత్వం భరిస్తుందని వివరించారు. లబ్ధిదారులకు స్కిల్ అప్‌గ్రెడేషన్ కింద ఐదు రోజులపాటు ప్రాథమిక శిక్షణ, ఆ తరువాత 15 రోజులకు పైగా అడ్వాన్స్ శిక్షణ ఇస్తారు. శిక్షణ కాలంలో స్టైఫండ్ కింద రోజుకు రూ.500 ఇస్తారు. శిక్షణ పొందిన లబ్ధిదారులకు ఆయా వృత్తులకు సంబంధించిన టూల్‌కిట్‌తోపాటు ప్రోత్సాహకంగా రూ.15 వేలు ఇస్తారు. ఈ పథకాన్ని లబ్ధిదారులకు చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంది. రాష్ట్రస్థాయిలో పరిశ్రమల శాఖ, జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఆధ్వర్యంలో కమిటీలను కూడా ఏర్పాటు చేసింది.

పీఎం విశ్వకర్మ యోజన కోసం నమోదు చేసుకున్న వారి సంఖ్య ఇలా.. (జనవరి నెలాఖరు వరకు)

రాష్ట్రం	నమోదైన లబ్ధిదారులు
కర్ణాటక	1,09,986
గుజరాత్	52,328
ఆంధ్రప్రదేశ్	44,034
అసోం	36,866
జమ్మూకశ్మీర్	25,355
ఉత్తరప్రదేశ్	11,316
మహారాష్ట్ర	9,537

పథకం ఎవరికి వర్తిస్తుందంటే..

వడ్రంగి పనివారు, బోట్ల తయారీదారులు, పనిముట్లు, కమ్మరి, సుత్తి, టూల్‌కిట్ తయారీదారులు, తాళాలు బాగు చేసేవారు, వెండి, బంగారు నగలు తయారీదారులు, కుమ్మరి, శిల్పి, చెప్పులు, బూట్లు కుట్టే వారు, తాపీ మేస్త్రీలు, బుట్టలు, చాపలు, చీపుర్లు తయారు చేసేవారు, బొమ్మల తయారీదారులు, బార్బర్, చాకలి పనివారు, దర్జీలు, ఫిషింగ్ నెట్ మేకర్లు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం । 18 । ఫిబ్రవరి । 2024

చెరువులో చేపల తుదిశ్వాస

మైసూరు: మైసూరు నగరంలో ఉన్న కుక్కరెహళ్ళి చెరువులో నీరు కలుషితం కావడంతో చెరువులు మృత్యువాత పడుతున్నాయి. పెద్ద పెద్ద సైజులో ఉన్న 60కి పైగా చేపలు చనిపోయాయి. ఆ చేపలను కుక్కలు పట్టుకొచ్చి ఇళ్ల మధ్య తింటున్నాయని ప్రజలు వాపోయారు. పాలికె అధికారులు పట్టించుకోవడం లేదని, చెరువు కలుషితం కాకుండా చర్యలు తీసుకుని జలచరాల్ని కాపాడాలని ప్రజలు కోరారు.


ఒడ్డుకు కొట్టుకొచ్చిన చేపలు

న్యూస్‌రీల్

నగరంలో బాల్య వివాహం

బనశంకరి: సిలికాన్ నగరంలో బాల్య వివాహం జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. బాలిక తల్లిదండ్రులకు చెప్పకుండా ఆమె పెదనాన్న , పెద్దమ్మ కలిసి ఓ యువకునితో మూడుముళ్లు వేయించారు. బాలిక తల్లి ఈ ఘటన పై సర్జాపుర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. తమ కూతురు ఇంకా మైనర్ అని, ఆమెను బలవంతం చేసి చింతామణి కైవారలోని యల్లమ్మ గుడిలో పెళ్లి చేశారని ఫిర్యాదులో తెలిపారు. హలసినకాయపుర గ్రామానికి చెందిన వినోద్‌కుమార్‌తో బాలిక కొన్నిరోజుల కిందట వివాహమైంది. వరుడు, అతని కుటుంబీకులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆమె కోరింది.

నక్సలైటు శ్రీమతికి కస్టడీ



శివాజీనగర: కరపత్రాల పంపిణీ, ప్రభుత్వ ఆస్తి నష్టం, విధ్వంసానికి కుట్ర పన్నిన ఆరోపణలతో కేరళలో అరెస్టయిన చిక్కమగళూరు జిల్లాకు చెందిన మహిళా నక్సలైటు శ్రీమతికి ఎన్ఆర్ పుర కోర్టు 14 రోజుల జ్యుడిషియల్ కస్టడీ విధించింది. పై ఆరోపణలతో పాటు బెదిరింపులు, తుపాకీ చూపి చోరీ చేయడం వంటి 9 ఆరోపణలతో పోలీసులు కేసులు నమోదు చేశారు. వాటి ప్రకారం కేరళలో తలదాచుకున్న శ్రీమతిని అరెస్ట్ చేసి కార్కళ పోలీసులకు అప్పగించారు. కార్కళ పోలీసుల నుంచి శృంగేరి పోలీసులు అదుపులోకి తీసుకుని ఎన్ఆర్ పుర కోర్టుకు హాజరుపరిచారు. జ్యుడిషియల్ కస్టడీ విధించడంతో ఆమెను జైలుకు తరలించారు.

మహిళా పోలీస్ ఆత్మహత్య


మంజుశ్రీ (ఫైల్)

దొడ్డబళ్లాపురం: మహిళా కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్న సంఘటన రామనగర తాలూకా ద్యావసంద్ర గ్రామంలో చోటుచేసుకుంది. బెంగళూరు మైకో లేఔట్ పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పనిచేసే మంజుశ్రీ (29) కి శివాజీనగర పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యింది. శుక్రవారం రాత్రి స్వగ్రామం ద్యావసంద్రకు వచ్చి ఇంట్లో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకుంది. పని ఒత్తిడి లేదా బదిలీ ఇష్టం లేక ఇలా చేసుకుని ఉంటుందని అనుమానిస్తున్నారు. హారోహళ్లి పోలీసులు కేసు నమోదు చేశారు.

మణిపాల్‌లో విద్యార్థి..

యశవంతపుర: పరీక్షల భయంతో విద్యార్థి ఒకరు భవనంపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉడుపి జిల్లా మణిపాల్ మాహె వర్సిటీలో జరిగింది. బిహార్‌కు చెందిన సత్యం సుమన్ (19) ఇంజినీరింగ్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. పరీక్ష జరుగుతున్న సమయంలో భవనం 6వ అంతస్తు నుంచి దూకడంతో తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మరణించాడు. ఈ దుర్ఘటనతో విద్యార్థులు భయాందోళనకు గురయ్యారు. పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.



బెంగళూరు షెరటాన్‌లో నగల ప్రదర్శనలో నటి నిశ్వికా నాయుడు

సైబర్ నేరం.. ఆచూకీ కష్టం


సైబర్ నేరాలకు అమాయకులు బలి

- అధిక కేసుల్లో దొరకని దొంగలు
- కేసులు వేలాది, అరెస్టులు వందల్లోనే
- దేశంలో సైబర్ నేరాల్లో రెండవ స్థానంలో కన్నడనాడు
- జాగ్రత్తే జనానికి రక్ష




సైబర్ దొంగల బారిన పడకుండా ఉండడమే శ్రేయస్కరం

బనశంకరి: చోరీలు, దొంగతనాలు, దోపిడీలు, మోసాలు లాంటి కనిపించే నేర కార్యకలాపాలు తగ్గుముఖం పడితే, కంటికి కనబడని ఆన్‌లైన్ లోకంలో సైబర్ నేరాలు హెచ్చుమీరిపోయాయి. ఆదమరిచిన తక్షణం లక్షలాది రూపాయలను కేటుగాళ్లు కాజేస్తారు. ఇటువంటి నేరాల్లో నేరగాళ్ల బ్యాంక్ అకౌంట్ ఫ్రీజ్ చేసి వెనక్కి రప్పించడంలో పోలీసులు కొద్దిమేరే సఫలం అవుతున్నారు. ఎక్కువ నేరాల్లో సైబర్ వంచకులను అరెస్టు చేసి జైలుశిక్ష విధించడంలో ఆశించిన వేగం లేదు.

దేశంలో సైబర్ నేరాల్లో వృద్ధి..

- ఎన్‌సీఆర్‌బీ నివేదిక ప్రకారం దేశంలో సైబర్ నేరాలు 24 శాతం హెచ్చుమీరాయి. సైబర్ క్రైంలో కర్ణాటక రెండో స్థానంలో ఉంది. దేశంలోని మహానగరాలతో పోలిస్తే బెంగళూరులో ఎక్కువ సైబర్ నేరాలు జరుగుతున్నాయి. బాధితుల్లో విద్యావంతులు, ఐటీ బీటీ ఉద్యోగులు, శ్రీమంతులు అధికంగా ఉంటున్నారు.
- దేశంలో 2021లో 52,974 సైబర్ వంచన కేసులు నమోదు కాగా 2022లో 65,893 కేసులు వచ్చాయి. దేశంలో 2021లో 736 మంది, 2022లో 1407 మంది సైబర్ నేరగాళ్లకు మాత్రమే జైలు శిక్ష పడింది. అనేక కేసుల్లో నిందితుల ఆచూకీ లేదు.
- మరికొన్ని కేసుల్లో వంచకులు పట్టుబడినప్పటికీ నేరాలు రుజువు చేయడానికి సాక్ష్యాధారాలు లేక పోవడంతో విడుదలయ్యారు. ఇంకా కొన్ని కేసులు కోర్టుల్లో విచారణదశలో ఉన్నాయి. అందుకే సైబర్ దొంగల చేతిలో మోసపోకుండా జాగ్రత్తలు పాటించడమే ఉత్తమం.

బాధితుల కోసం 1930..

ఊరట ఏమిటంటే సైబర్ నేరాలకు గురైన బాధితులు తక్షణమే 1930 హెల్ప్‌లైన్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేస్తే వంచకుల అకౌంట్‌కు బదిలీ కాబడిన నగదును ఫ్రీజ్ చేస్తారు. తరువాత చట్టప్రకారం బాధితులకు వాపస్ అందిస్తారు. ఇలా దేశవ్యాప్తంగా 2021 ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు 4 లక్షల సైబర్ కేసుల్లో రూ.1000 కోట్లకు పైగా నగదును బాధితులకు అప్పగించారు. బెంగళూరు, కర్ణాటకలో కూడా పెద్దసంఖ్యలో బాధితులకు ప్రయోజనం కలిగింది. 2021 ఏప్రిల్ 1 నుంచి ఇప్పటి వరకు దేశంలో రూ.10,300 కోట్లను సైబర్ చోరులు దోచుకోగా ఇందులో 10 శాతం డబ్బును బ్యాంక్ అకౌంట్లలో ఫ్రీజ్ చేసి బాధితులకు అప్పగించారు.

కర్ణాటక కంటే యూపీ వేగం..

సైబర్ దొంగలను పట్టుకోవడంలో కర్ణాటక పోలీసులు వెనుకబడ్డారని ఎన్‌సీఆర్‌బీ నివేదికలో ప్రస్తావించింది. దీనికి సాంకేతిక పరిజ్ఞానం కొరత అని పోలీస్ అధికారులు తెలిపారు. 12,556 కేసులు నమోదైతే, 679 మంది నేరగాళ్లను మాత్రమే అరెస్ట్ చేశారు. కానీ ఉత్తరప్రదేశ్ పోలీసులు 8,249 కేసుల్లో 7,122 నిందితులను అరెస్టు చేయడం గమనార్హం.


డిమాండ్ల సాధన కోసం బెంగళూరు స్వతంత్ర పార్కులో దళిత సంఘాల ధర్నా

అన్ని వర్గాలకు మోదీ పెద్దపీట: కేంద్రమంత్రి

బనశంకరి: గత 70 ఏళ్ల నుంచి దేశంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో దేశం అభివృద్ధి సాధించలేదని కేంద్ర సామాజిక న్యాయ మంత్రి రామదాస్ అథవాలె ఆరోపించారు. శనివారం బెంగళూరులో ఆయన విలేకరులతో మాట్లాడారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతోందన్నారు. నేడు అన్ని సముదాయాలు రిజర్వేషన్ల కోసం డిమాండ్ చేస్తున్నాయని తెలిపారు. రాహుల్‌గాంధీ ఓబీసీ గణనకు డిమాండ్ చేస్తున్నారని, కానీ యుపీఏ ప్రభుత్వం ఉన్న సమయంలో ఎందుకు నిర్ణయం తీసుకోలేదని ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల పెంపునకు డిమాండ్ ఉందన్నారు. కర్ణాటకలో 28 ఎంపీ సీట్లలో బీజేపీ 25 సీట్లు గెలుస్తుందని చెప్పారు.

● సప్తమి రథోత్సవం


రథ సప్తమి మహోత్సవం సందర్భంగా రేవు నగరం మంగళూరులో వేంకట రమణ స్వామి రథోత్సవం వైభవోపేతంగా జరిగిన దృశ్యం. స్వామి వారి తేరు వేడుక, అదే సమయంలో పల్లకీ ఉత్సవం జరిగింది. వేలాది భక్తజనం తిలకించి తరించారు.

● తేరుపై రంగనాథుడు



తుమకూరు: తుమకూరు జిల్లాలోని శిర తాలూకాలోని తావరెకెరె గ్రామంలో వెలసిన చరిత్ర ప్రఖ్యాత బండి రంగనాథ స్వామి దేవస్థానం బ్రహ్మరథోత్సవం వేడుకలు శనివారం వైభవంగా జరిగాయి. వేలాది మంది భక్తుల మధ్య తేరు సంబరం సాగింది. జై రంగనాథా అని జపిస్తూ తేరును లాగారు. ఈ సందర్భంగా భక్తులు తేరుపైకి అరటిపండ్లు, పూల వర్షం కురిపించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు టిఆర్ దేవరాజు, తహసిల్దార్ దత్తాత్రేయ గాద, అజయ్‌గౌడ, ఎంటి రంగనాథ్ తదితరులు పాల్గొన్నారు.

విహారయాత్ర తలకిందులు


ఢీకొని బోల్తా పడిన టిప్పర్ లారీ


తుక్కు తుక్కయిన కారు

- కారును ఢీకొన్న టిప్పర్
- నలుగురు బెంగళూరువాసులకు తీవ్రగాయాలు

మైసూరు: కంకర మట్టితో వెళ్తున్న టిప్పర్ లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా నడిపి కారును ఢీకొట్టాడు, కారు నుజ్జునుజ్జు కాగా అందులోని నలుగురు తీవ్రంగా గాయపడిన సంఘటన మైసూరు జిల్లా నంజనగూడు తాలూకాలో మైసూరు– ఊటీ హైవేలో జరిగింది. బెంగళూరు యలహంకకు చెందిన బీజేపీ రాష్ట్ర ఎస్సీ యువ మోర్చా అధ్యక్షుడు జగదీష్ (40), జాన్ (40), హలసూరుకు చెందిన సుజయ్ (29), సతీష్ (35) తీవ్రంగా గాయపడినవారు. అంబులెన్సులో వారిని మైసూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వీరిలో జగదీష్, జాన్‌ల పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. బెంగళూరు నుంచి కారులో బండీపుర అడవి టూర్‌కి వెళ్లారు. అక్కడ సరదాగా గడిపి తిరిగి వస్తున్న సమయంలో టిప్పర్ డ్రైవర్ అడ్డదిడ్డంగా నడుపుతూ కారును ఢీకొన్నాడు. దీంతో కారు ఎగిరి కొంత దూరం పడిపోయింది. లారీ కూడా పల్టీలు కొట్టింది. నంజనగూడు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

లారీ ఢీకొని బైకిస్టు బలి..

చెరుకు లోడుతో వెళుతున్న లారీ, ఢీకొనడంతో బైకిస్టు చనిపోయిన సంఘటన జిల్లాలో టి.నరిసిపుర తాలూకాలోని విజయపుర గ్రామంలో జరిగింది. కుక్కూరు గ్రామానికి చెందిన ప్రశాంత్ (31) ధర్మస్థల సేవాసంస్థలో పనిచేస్తుంటాడు. 7 నెలల కిందటే ఇతనికి పెళ్లయింది. శనివారం పని మీద బైక్‌పై వెళ్తుండగా చెరుకు లారీ ఢీకొనడంతో ఘటనాస్థలంలోనే మరణించాడు. తలకాడు పోలీసులు పరిశీలించి కేసు నమోదు చేశారు.

కుక్కల దాడిలో బాలికకు గాయాలు

మైసూరు: వీధి కుక్కలు దాడి చేయడంతో బాలికకు తీవ్ర గాయాలైన దుర్ఘటన మైసూరు నగరంలో జరిగింది. గుండూరావు నగరలో నివాసం ఉంటున్న పి.యోగీష్ నాలుగేళ్ల కుమార్తె శనివారం ఇంటి ముందు ఆడుకుంటోంది. ఈ సమయంలో కొన్ని వీధి కుక్కలు బాలిక మీద దాడి చేశాయి. బాలిక గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి కుక్కలను తరిమివేశారు. కాళ్లు చేతులు, కడుపు, ముఖంపై ఎక్కువగా కరిచాయి. తీవ్రంగా గాయపడిన చిన్నారిని కేఆర్ ఆస్పత్రికి తరలించారు.

ఇరానీ చోరుల ముఠా అరెస్టు

బనశంకరి: ఇళ్లలో చోరీలు, చైన్ స్నాచింగ్‌లకు పాల్పడి దోచుకుని, ఆ సొత్తును అమ్ముకునే ముగ్గురు ఇరానీ గ్యాంగ్‌ను మహాలక్ష్మీ లేఔట్ పోలీసులు అరెస్టుచేశారు. వీరి వద్ద నుంచి రూ.7.82 లక్షల విలువచేసే 127 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. బెళగావి జిల్లా గోకాక్ తాలూకా నాసీర్ ఇరాని, అమీర్‌జాద ఇరాని, జాహీర్ అబ్బాస్ అనే ముగ్గురు దొంగలు కురబరహళ్లిలో 60 ఫీట్ రోడ్డు సమీపంలోని బంగారు నగల షాపులో చోరీ సొత్తును విక్రయిస్తున్నట్లు పోలీసులకు తెలిసింది. వెంటనే మహాలక్ష్మీ లేఔట్ పోలీసులు వెళ్లి దొంగలను అరెస్టు చేశారు.

కార్ల షోరూంలలో మంటలు


అగ్ని ప్రమాదానికి గురైన షోరూం


పాక్షికంగా కాలిన కార్లు

- శివమొగ్గలో సంఘటన

శివమొగ్గ: శివమొగ్గ నగరంలో ఉన్న శంకరమఠం రోడ్డులోని హుండై కార్ల షోరూంలో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. కొన్ని కార్లు దెబ్బ తిన్నాయి. ఆ షోరూం పక్కనే ఉన్న టాటా కార్ల షోరూంలోకి కూడా మంటలు వ్యాపించి అందులో ఉన్న నాలుగు కార్లు కాలిపోయాయి. సిబ్బంది రాత్రి షోరూం మూసివేసి వెళ్లిపోయారు. ప్రమాదం ఎలా జరిగిందో గానీ ఉవ్వెత్తున మంటలు ఎగసిపడ్డాయి. అందులోని రెండు కార్లు, ఫర్నిచర్, కంప్యూటర్లు ఇతర సామగ్రి బుగ్గి అయిపోయింది. మంటలు పక్కనే ఉన్న టాటా షోరూంని కూడా తాకడంతో అక్కడా అగ్నిప్రమాదం జరిగి నాలుగు కార్లు, ఇతరత్రా వస్తుసామగ్రి దగ్ధమయ్యాయి. ఫైర్, పోలీసులు చేరుకుని మంటలను ఆర్పివేశారు. కరెంటు షార్ట్ సర్క్యూట్ వలన ప్రమాదం జరిగి ఉండొచ్చని భావిస్తున్నారు.

సీఎం కారు అడ్డగింత

యశవంతపుర: మంగళూరులో జరిగిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశానికి హాజరు కావడానికి వెళ్తున్న సీఎం సిద్దరామయ్య, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కార్లను బీజేపీ కార్యకర్తలు అడ్డుకుని హిందూ వ్యతిరేకులంటూ నినాదాలు చేశారు. కార్యకర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. శనివారం మంగళూరు అడ్యార్‌లోని సహ్యాద్రి కాలేజీలో బృహత్ కాంగ్రెస్ కార్యకర్తల సమావేశం జరిగింది. ఇందులో సిద్దు, ఖర్గే, డీసీఎం డీకే శివకుమార్, కేసీ వేణుగోపాల్, రణదీప్ సింగ్ సుర్జేవాలతో పాటు మంత్రులు, ఎంపీలు పాల్గొన్నారు. కాంగ్రెస్ నాయకుల వాహనాలను బీజేపీ కార్యకర్తలు అడ్డుకుని ఉద్రిక్తతను సృష్టించారు.

సాంత్వనం.. చిత్రలేఖనం

- నగరంలో అలరించే ప్రదర్శన


చిత్ర ప్రదర్శనలో వర్ధమాన చిత్రకారులు

బనశంకరి: నగర ఒత్తిడి జీవనంలో అలసిన మనసులకు హృద్యమైన చిత్రలేఖనాలు సాంత్వననిస్తాయి. బసవనగుడిలో కలర్స్ బ్రీజ్ పేరుతో మొదలైన పెయింటింగ్స్ ప్రదర్శన నగరవాసులకు కనువిందు చేస్తోంది. బీపీ.వడియా రోడ్డులో ఇన్స్టిట్యూట్ ఆఫ్ వరల్డ్ కల్చర్‌లో సీనియర్ చిత్రకారుడు కే.మాల్యాద్రి ఆధ్వర్యంలో బృంద చిత్ర ప్రదర్శన శుక్రవారం ఆరంభమైంది. ఇందులో 18 మంది వర్ధమాన కళాకారులు గీసిన విభిన్న రకాల చిత్రాలు ఆకట్టుకుంటాయి. ప్రకృతి, వన్యజీవులు, దేవీదేవతలు, నగర జీవనం తదితరాలను ఇతివృత్తంగా చేసుకుని చిత్రకారులు కుంచె ద్వారా నవ్యమైన చిత్రాలను గీశారు. మహిళా కళాకారులు ఎక్కువమంది పాల్గొనడం విశేషం. మేటి కళాకారులకు తీసిపోని రీతిలో వైవిధ్య రీతిలో పెయింటింగ్స్‌ను గీశారు. ఈ ప్రదర్శన 20 వరకు జరుగుతుంది.




పెయింటింగ్స్ వీక్షణం



ఎమ్మెల్సీ ఎన్నికలో రికార్డు ఓటింగ్



శివాజీనగర: బెంగళూరు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నియోజకవర్గ ఉప ఎన్నికలకు శుక్రవారం శాంతియుత పోలింగ్ జరిగింది. సుమారు 86.38 శాతం పోలింగ్ నమోదైంది. ఈ ఉప ఎన్నికల ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి 20న నిర్వహిస్తారు. బెంగళూరు నగర, గ్రామీణ, రామనగర జిల్లాల పరిధిలో పోలింగ్ జరిగింది. ఈసారి రికార్డుస్థాయిలో ఓటేశారు. బెంగళూరు నగర జిల్లాలో 83.97 శాతం, బీబీఎంపీ సెంట్రల్‌లో 83.19 శాతం, ఉత్తరలో 82.43 శాతం, దక్షిణలో 82.51 శాతం మంది ఓటేశారు. బెంగళూరు గ్రామీణ జిల్లాలో 96.02 శాతం పోలింగ్, రామనగర జిల్లాలో 95.77 శాతం పోలింగ్ జరిగింది. కాంగ్రెస్ అభ్యర్థి పుట్టణ్ణ, జేడీఎస్ అభ్యర్థి ఏపీ రంగనాథ్‌తో పాటు ఎన్నికల్లో 9 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఈ ఉప ఎన్నికల్లో గెలిచిన అభ్యర్థి పదవీకాలం 2026 నవంబర్ 11 వరకే ఉంటుంది. రంగనాథ్, పుట్టణ్ణ మధ్య తీవ్ర పోటీ నెలకొంది.

రాజ్యసభ బరిలో ఐదుగురు..

రాష్ట్రంలో రాజ్యసభకు జరుగుతున్న ఎన్నికల నామినేషన్ల పరిశీలనలో ఇద్దరు అభ్యర్థులు తిరస్కరణకు గురయ్యారు. ఐదుగురి నామినేషన్లను ఆమోదించారు. బీజేపీ అభ్యర్థి నారాయణ సా.కె బాండెగె, కాంగ్రెస్ అభ్యర్థులైన అజయ్ మాకెన్, జీ.సీ.చంద్రశేఖర్, సయ్యద్ నాసీర్ హుసేన్, జేడీఎస్ అభ్యర్థి డీ.కుపేంద్ర రెడ్డి నామినేషన్ అంగీకారమయ్యాయి. స్వతంత్రులు కే.పద్మరాజన్, కెంగనూరులను తిరస్కరించారు. 20వ తేదీ సాయంత్రం పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను ప్రకటిస్తారు. మూడు పార్టీల నుంచి ఐదుమంది అభ్యర్థులు దిగడంతో పోలింగ్ అనివార్యంగా మారింది. ఈ నెల 27న ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధానసౌధలో పోలింగ్ జరుగుతుంది. సాయంత్రం 5 గంటల తరువాత ఓట్లను లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు.

24, 25న రాజ్యాంగ ఐక్యత సభ: సీఎం

శివాజీనగర: భారత రాజ్యాంగం, ఐక్యత గురించి ఈ నెల 24, 25 తేదీల్లో బెంగళూరులో జాతీయ ఐక్యతా సమావేశం ఏర్పాటు చేసినట్లు సీఎం సిద్దరామయ్య తెలిపారు. శనివారం బెంగళూరు విధానసౌధలో ఆయన మాట్లాడారు. అన్ని వర్గాల కోసం అంబేడ్కర్ రాజ్యాంగం అందజేశారు. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 సంవత్సరాలైంది. అయినా కూడా నేటికీ దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతలు ఉన్నాయి. పేదలు అవకాశాలకు నోచుకోలేకపోయారు. అందుచేత రాజ్యాంగంపై జాగృతి కల్పించే లక్ష్యంతో 24, 25 తేదీల్లో ఐక్యతా సమావేశం జరుగుతుందని చెప్పారు. జిల్లాల్లోనూ జాగృతి అభియాన సాగుతుందని తెలిపారు.

రామ రథోత్సవం

మైసూరు: రథ సప్తమి వేడుకల సందర్భంగా చామరాజనగర జిల్లా కొళ్ళేగాలలో ఉన్న శ్రీరామ ఆలయంలో రథోత్సవం కనులపండువగా జరిగింది. ఉదయం నుంచి వివిధ పూజా కార్యక్రమాలను నిర్వహించి తేరు వేడుక జరిపారు. స్థానిక ప్రముఖులు సునీతా తిమ్మేగౌడ ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.



క్లుప్తంగా

పెన్షన్ పెంపుపై దేవదాసీల హర్షం


ఆనందం వ్యక్తం చేస్తున్న దేవదాసీలు

రాయచూరు రూరల్: రాష్ట్రంలో దేవదాసీలకు సర్కార్ మాసిక పెన్షన్ పెంచడంపై హర్షం వ్యక్తమవుతోంది. ఈ సందర్భంగా శనివారం సంచాలకురాలు పద్మ మాట్లాడుతూ... బడ్జెట్‌లో పెన్షన్ రూ. 2 వేలు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా వారంతా ఒక్కచోటకు చేరి ఆనందం పంచుకున్నారు.

శ్రీ కృష్ణ దేవరాయలను ఆదర్శంగా తీసుకోవాలి


కృష్ణ దేవరాయల విగ్రహానికి నివాళి

రాయచూరు రూరల్: మూన్నూరు కాపు సమాజం సభ్యులు శ్రీకృష్ణ దేవరాయలను ఆదర్శంగా తీసుకోవాలని మాజీ శాసన సభ్యుడు పాపారెడ్డి అన్నారు. మూన్నూరు కాపు సమాజం వీరాంజనేయ కళ్యాణ మంటపంలో శ్రీ కృష్ణ దేవరాయల జయంతిని పురస్కరించుకుని జ్యోతి వెలిగించి మాట్లాడారు. నేటి యువత విజయనగర రాజుల చరిత్రను తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో నరసరెడ్డి, క్రిష్ణమూర్తి, సర్వమంగళ, చెన్నారెడ్డి, జ్యోతి, శంకర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బసవణ్ణ తత్త్వాల సంరక్షణ మన బాధ్యత


బసవేశ్వరుడి చిత్రపటాన్ని ఆవిష్కరించిన మంత్రి


రాయచూరు రూరల్: సమాజంలో బసవేశ్వర తత్త్వాల సంరక్షణ మనందరి బాధ్యత అని మంత్రి బోసురాజ్ అన్నారు. శనివారం జిల్లా పంచాయతీ సభాంగణంలో బసవేశ్వర చిత్రపటాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. 12వ శతాబ్దంలో సాంఘిక న్యాయం కోసం పోరాడిన దార్శనికుడన్నారు. తన వచనాల ద్వారా మూఢ నమ్మకాలపై జాగృతి కల్పించారన్నారు. సమావేశంలో ఎమ్మెల్యే బసన గౌడ. జిల్లాధికారి చంద్రశేఖర్ నాయక్, ఎస్పీ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగం, చట్టంపై జాగృతి కల్పించాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్వామిజీ

రాయచూరు రూరల్: ప్రజలకు రాజ్యాంగం, చట్టంపై జాగృతి కల్పించాలని హైకోర్టు జడ్జి ఇందిరేష పిలుపునిచ్చారు. శనివారం ఎల్‌వీడి కళాశాల మైదానంలో సేఠ్ చూనిలాల్ అమర్ చంద్ బోహర న్యాయ కళాశాల సువర్ణ మహోత్సవాన్ని ప్రారంభించి మాట్లాడారు. న్యాయ కళాశాల 50 ఏళ్ల పూర్తి చేసుకోవడం సంతోషకర విషయమన్నారు. ప్రతి ఒక్కరూ న్యాయ వ్యవస్థకు భంగం కలగకుండా నడుచుకోవాలన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న విజయపుర రామక్రిష్ణ స్వామి వివేకానంద ఆశ్రమానికి చెందిన నిర్భయానంద సరస్వతి మాట్లాడుతూ... నేడు దేశంలో సోమరితనం పెరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి మారుతి బగాడే, న్యాయశాస్త్ర విశ్వ విద్యాలయం వైస్ చాన్సలర్ బసవరాజ్, తారానాథ్ విద్యా సంస్థల అధ్యక్షుడు సుఖాణి, పవన కుమార్, అంబాపతి పాటిల్, పురుషోత్తం ఇనాణ్ణి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐకి పురస్కారం


పురస్కారం అందుకున్న ప్రకాశ్

రాయచూరు రూరల్: జిల్లాలోని రాయచూరు గ్రామీణ ఎస్ఐ ప్రకాశ్ ఉత్తమ అధికారిగా జాతీయ స్థాయిలో పురస్కారం పొందారని ఎస్పీ నిఖిల్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... లక్నోలో ఈనెల 16న జరిగిన ఆలిండియా పోలీస్ డ్యూటీ మీట్‌లో వెండి పతకాన్ని ఐజీపీ డాక్టర్ ప్రణవ్ చేతుల మీదుగా ఎస్ఐ ప్రకాశ్ అందుకున్నారు.


భక్తుల కొంగుబంగారం సవదత్తి యల్లమ్మ


రేణుక యల్లమ్మ ఆలయం


జాతరకు ఎద్దుల బండ్లలో వస్తున్న భక్తులు

- ఏడు కొండల ఆది దేవతగా పూజలు
- బెళగావి జిల్లా సవదత్తిలో మహిమాన్విత క్షేత్రం

సాక్షి,బళ్లారి: పవిత్ర పుణ్యక్షేత్రాలు, మఠాలకు నిలయమైన కర్ణాటకలో సవదత్తి యల్లమ్మ ఆలయానికి ప్రత్యేకత ఉంది. బెళగావి జిల్లాలోని సవదత్తిలో వెలసిన ఈ రేణుకా యల్లమ్మ ఆలయానికి చారిత్రాత్మక, మహిమాన్విత నేపథ్యం ఉంది. పురాణ కాలం నుంచి రేణుక యల్లమ్మ చరిత్రకు ఎంతో పేరు వచ్చింది. దక్షిణ భారత దేశంలో ఏడు కొండలపై వెలసిన శ్రీ వెంకటేశ్వర సన్నిధి తర్వాత అత్యధిక జనాలను తమ అపార మహిమలతో ఆకర్షించే శ్రీ రేణుక యల్లమ్మ జాతర దేశ, నలుమూల నుంచి భక్తులు తరలివస్తారు. అంతేకాకుండా ఏడాది పొడవున భక్త జన సందడి షరామామూలే. ఎంతో చరిత్ర కలిగిన ఏడు కొండలపై కొలువు దీరిన ధార్మిక పుణ్యక్షేత్రంగా భాసిల్లుతోంది.


ఆలయ పరిసరాల్లో భక్తుల రద్దీ

ఆదిశక్తి స్వరూపం :
అగస్త్యముని ఆశీర్వాదంతో పుత్ర కామేష్టి యాగం చేసిన కాశ్మీర రాజు, రేణుక రాజ, భోగవతి దంపతులకు జన్మించిన రేణుక ఆదిశక్తి స్వరూపం. జమదగ్ని ధర్మపత్రి, పతివ్రతగా చూపించిన ఆమె గురించి కథనాలు, మహిమలు నిజంగా దైవ స్వరూపమే. మామ రుచికముని, అత్త సత్యవతిని తల్లిదండ్రులు సమానంగా అనురాగం చూపిన ప్రేమ విశ్వాసాలను గడించడంతో పాటు, ఇంటిల్లిపాది పిల్లలకు తన సంతానంతో పాటు ప్రాతివ్రత్యాన్ని కాపాడిన జగత్తులో తన ఆదర్శాలతో చరస్మరణీయమయ్యారు.

ఏడు కొండల అదిదేవత :
రేణుకాదేవి యల్లమ్మ పేరుతో కర్ణాటక, మహారాష్ట్ర, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల నుంచి కాకుండా దేశ, విదేశాల నుంచి వచ్చే భక్తులకు ఆరాధ్యదేవతగా పేరుగాంచారు. ఏడు కొండలు అది దేవత యల్లమ్మగా పూజలు అందుకుంటున్నారు. యల్లమ్మ గుడ్డ పరిసరాలు పరిధిలో సిద్దరకొళ్ల, పరసగడ్డకొళ్ల, గౌరవనకొళ్ల, తమ్మననకళ్ల, మావినకొళ్ల, సంగప్పనకొళ్ల, బోరోసాబినకొళ్ల ఇలా ఏడు పర్వతాలకు చరిత్రలో జరిగే ఘటనలో దృష్ట్యాంతాలకు నిదర్శనంగా ఈ ఏడు పర్వతాలు వెలిశాయి. ఏడు కొండలయల్లమ్మ నీవమ్మా అంటూ పాటలు పాడుకుంటూ తమ పయనాన్ని కొనసాగిస్తారు.

దేవాలయ ప్రాధాన్యత :
దేవాలయంలో ప్రవేశించే భక్తులు పసుపుపచ్చని బండారం, నుదిటిపై దిద్దుకోవడంతో పాటు యల్లమ్మ తల్లి నీ పాదాలకు ఉదో,..ఉదో అంటూ (నమస్కారాలు) దేవాలయం చుట్టు తిరుగుతారు. ఈ బండారం తమ సిరిసంపదల భాగ్యాలకు ప్రతీకగా, గౌరవంతో తీసుకెళ్లడం ఇక్కడికి వచ్చిన భక్తులు సంప్రదాయంగా కొనసాగుతోంది. కాగా మాఘ మాసంలో భారత పౌర్ణమి శుభవేళ జరిగే జాతరకు భారీ సంఖ్యలో భక్త జన సందోహం వస్తారు. శివరాత్రి అమావాస్య వరకు 25 లక్షలు మంది యల్లమ్మను దర్శించుకుంటారు. ప్రతి రోజు ఉదయం 4 గంటల నుంచి 6 గంటల వరకు, సాయంత్రం అభిషేకాలు నిత్యం కొనసాగుతాయి. ప్రతి మంగళ, శుక్రవారాలలో ఇదే సమయాలలో ప్రత్యేక అలంకారాలు పూజలు జరుగుతాయి. యల్లమ్మ గుడ్డకు విచ్చేసే భక్తులు గ్రామీణ ప్రాంతాల నుంచి ఎద్దులు బండ్లలో పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు. ఈనెల 24న జరగనున్న భారత (మాఘ) పౌర్ణమి యల్లమ్మ ఆలయం భక్త జన సందడితో నెలకొంటుంది.

బసవణ్ణ చిత్రపటానికి పూజలు

హొసపేటి: నగరంలోని జిల్లాధికారి కార్యాలయం సభాంగణం హాలులో శనివారం జిల్లా పరిపాలన కార్యక్రమం నిర్వహించారు. సాంస్కృతిక రాయబారి జగజ్యోతి బసవణ్ణ చిత్రపటానికి జిల్లాధికారి దివాకర్, ఎస్పీ హరిబాబు, జిల్లా పంచాయతీ అధికారి సదాశివప్రభు, తహసీల్దార్ శృతి చిత్రపటానికి పూలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సమాజంలో పేరుకు పోయిన మూఢ నమ్మకాలను పారదోలేందుకు బసవణ్ణ ఎంతో కృషి చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బసవన్నకు విశ్వగురువు విశ్వనాయక బిరుదులను అందించ్చిందని తెలిపారు. ప్రభుత్వం ఆదేశం మేరకు అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో బసవన్న చిత్రపటాన్ని ఆవిష్కరించామన్నారు. సందర్భంగా వీరశైవ సంఘం నేతలు, వివిధ సంఘం నాయకులు కార్యకర్తలు అధికారులు పాల్గొన్నారు.


బసవన్న చిత్రపటానికి పూజలు చేస్తున్న దృశ్యం

బసవణ్ణ మార్గంలో నడవాలి

గంగావతి: కర్ణాటక సాంస్కృతిక నేతగా విశ్వగురు బసవన్నను ప్రభుత్వం ప్రకటించడంతో ఆయన చిత్రపటానికి శనివారం ఎమ్మెల్యే గాలి జనార్దన్ రెడ్డి తహసీల్దార్ కార్యాలయంలో పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... బసవణ్ణ తత్త్వాలు ఆదర్శాలను పాటించడం ద్వారా సంతోషకరమైన జీవనాన్ని పొందవచ్చని తెలిపారు. అదే విధంగా లక్ష్మీ నారాయణ చెరువును పూడికతీతకు పలు సంఘాలు ఎమ్మెల్యే జనార్దన్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఆనెగుంది ఉత్సవాన్ని మార్చి 11, 12 తేదీలలో నిర్వహిస్తామని ఎమ్మెల్యే గాలి జనార్ధన్‌రెడ్డి ప్రకటించారు. మార్చి 2,3 కనకగిరి ఉత్సవం జరుగుతున్న కారణంగా ఆనెగుంది ఉత్సవాన్ని 11,12కు నిర్వహించేందు నిర్ణయించామన్నారు. తహసీల్దార్ నాగరాజ్, సిబ్బంది, చెరువు అభివృద్ధి రైతు సంఘం, గంగావతి పరిసర సంరక్షణ సమితి, శరణ బళగ నేతలు డాక్టర్, శివకుమార్ మాలపాటిల్, బీ.కరీంబాష, ఉల్లేశప్ప తదితరులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు వినతి పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

మహిళ అనుమానాస్పద మృతి

- బావిలో పడేసి హత్య చేశారని ఫిర్యాదు

రాయచూరు రూరల్: తమ తల్లిని బావిలో పడేసి హత్య చేశారని ఆరోపిస్తూ ఇద్దరు పిల్లలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటన దేవదుర్గ తాలూకాలో చోటుచేసుకుంది. వివరాలు... కూలి పనుల కోసం లింగసుగూరు తాలూకా కోటా గ్రామం నుంచి దేవమ్మ (35), తన కుమార్తె కావేరి (16), కుమారుడు ప్రజ్వల్ (14) దేవదుర్గకు వచ్చారు. ఇంటి సమీపంలో ఉంటున్న హొన్నటిగి శివప్ప, దురగమ్మలతో కలిసి నిత్యం పనులకు వెళ్లేవారు. ఈ క్రమంలో సిద్దప్ప తరచూ దేవమ్మతో గొడవ పడేవాడు. ఈ నేపథ్యంలో 16న దేవమ్మ తాలూకాలోని ఓ బావిలో శవమై కనిపించింది. దీంతో తమ తల్లి మరణానికి శివప్ప, దుర్గమ్మలు కారణమని దేవమ్మ పిల్లలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి కేసు నమోదు చేశారు.


దేవమ్మ మృతదేహం


మాట్లాడుతున్న ప్రజ్వల్, కావేరి

నేర రహిత సమాజానికి చేతులు కలపాలి

కోలారు: చట్టాలు తెలీదని తప్పులు చేస్తే శిక్షలు తప్పవని జిల్లా కానూను ప్రాధికార కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి సునీల్ ఎస్ హొసమని తెలిపారు. శనివారం తాలూకాలోని సుందరపాళ్య ప్రభుత్వ పబ్లిక్ పాఠశాలలో జిల్లా కానూను సేవల ప్రాధికార, న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కానూను అరివు నెరవు కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. నేర రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, గర్భస్థ శిశువుకు కూడా హక్కులు ఉంటాయనేది తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో మంజుల భీమరావ్, ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, ఉపాధ్యాయుడు పరమేష్, భీమప్ప, రశ్మి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న న్యాయమూర్తి సునీల్

29న ప్రభుత్వ ఉద్యోగుల సమ్మేళనం

కోలారు: బెంగుళూరులోని ప్యాలెస్ మైదానంలో ఈ నెల 29న రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల మహా సమ్మేళనాన్ని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రారంభిస్తున్నారని, జిల్లా నుంచి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సురేష్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని వ్యవసాయ శాఖ సభాంగణంలో నిర్వహించిన జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యవర్గ సమితి సభకు అధ్యక్షత వహించి మాట్లాడారు. 7వ వేతన సంఘం, ఓపీఎస్ అమలు, నగదు రహిత చికిత్స పథకం, అమలు చేయడానికి సమ్మేళనంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామన్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల గౌరయర బళగ అధ్యక్షుడు నారాయణ స్వామి, నౌకరుల సంఘం జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్, కోశాధికారి విజయ్, కార్యాధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్ట్

హుబ్లీ: ఇద్దరు చైన్ స్నాచర్లను నగరంలోని కేశ్వపుర పోలీసులు శనివారం అరెస్ట్ చేసి వారి నుంచి రూ.1.90 లక్షల విలువైన బంగారు చైన్‌లు, బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను రాణిబెన్నూరుకు చెందిన ఆకాశ్, ప్రవీణ్‌లుగా గుర్తించారు. ఈ నెల 2న బైక్‌లో వచ్చిన వీరు రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళ్తున్న మహిళ మెడలో బంగారు చైన్ లాక్కొని ఉడాయించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దావణగెరెలో వీరిని అరెస్ట్ చేశారు. ఉత్తర విభాగం ఏసీపీ శివప్రకాష్ నాయక్ సారథ్యంలో కేశ్వపుర సీఐ ఆధ్వర్యంలోని బృందం నిందితులను అరెస్ట్ చేసింది.

విశ్రాంత అధికారిపై కేసు

హుబ్లీ: ఎస్కాంకు చెందిన కోట్లాది రూపాయల విలువ చేసే పరికరాలను దుర్వినియోగం చేసిన విషయంపై ఇక్కడి పాతహుబ్లీ పోలీసులు సదరు కార్యాలయం విశ్రాంత గోడౌన్ అధికారి బసవరాజుపై కేసు నమోదు చేశారు. గత ఏడాది జనవరి నుంచి ఆరు నెలల పాటు హుబ్లీ నగర, గ్రామీణ గోడౌన్ అధికారిగా ఉన్న సమయంలో రూ.51 కోట్ల విలువైన పరికరాలు ఇతర మార్గాల ద్వారా దుర్వినియోగం చేశారని ఆరోపణ ఉంది. మొత్తం రూ.51.69 కోట్ల మేర అక్రమాలకు పాల్పడ్డారని ఎస్కాం అధికారి శరణమ్మ ఫిర్యాదులో పేర్కొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కంప్లి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సిరుగుప్ప తాలూకా తెక్కలికోట పట్టణంలో సెక్టర్ అధికారి చంద్రమౌళి బృందం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ జరుగనున్న లోక్‌సభ ఎన్నికలు సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు తదితర వాటిపై ఎన్నికల కమిషన్‌కు నివేదిక ఇస్తామన్నారు. ఈ సందర్భంగా పది పోలింగ్ కేంద్రాలను వారు పరిశీలించారు.

పిల్లలకు విషమిచ్చి తండ్రి ఆత్మహత్యాయత్నం

హొసపేటి: కుటుంబ కలహాలతో విసిగిపోయిన ఓ వ్యక్తి తన ఇద్దరు పిల్లలకు విషం ఇచ్చి తాను ఆత్మహత్యకు యత్నించిన ఘటన శనివారం విజయనగర జిల్లా కూడ్లిగి తాలూకా కాంచోబనహళ్లి గ్రామంలో జరిగింది. ఉదయం మారెప్ప తన ఇద్దరు పిల్లలకు విషం ఇచ్చాడు. స్థానికులు వెంటనే విషయం గుర్తించి వారిని కూడ్లిగి ఆస్పత్రికి తరలించారు. ఇద్దరు పిల్లలు కోలుకోగా మారెప్ప పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు. కాంహొస్లళ్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పూర్తి వివరాలు విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

కోలారు వార్తలు...

విజ్ఞాన వస్తు ప్రదర్శనలు ఎంతో ఉపయుక్తం

కోలారు: విజ్ఞాన వస్తు ప్రదర్శనలు విద్యార్థులలో క్రియాశీలతను పెంచడంతో పాటు ప్రశ్నించే స్థాయి వస్తుందని విద్యాశాఖ సంయోజకుడు ఎస్ రాఘవేంద్ర తెలిపారు. శనివారం నగరంలోని ఆర్క్ ఇంటర్ నేషనల్ పాఠశాలలో నిర్వహించిన విజ్ఞాన వస్తు కళా ప్రదర్శనను ప్రారంభించి మాట్లాడారు. విజ్ఞానం, గణితం కష్టతర విషయమనే భయాన్ని పిల్లలో కలగడానికి అవకాశం కల్పించరాదన్నారు. కృత్యాధార లేదా ప్రయోగాత్మక పద్ధతుల ద్వారా బోధించినట్లయితే వీటిని సులభంగా విద్యార్థులకు అర్థమయ్యేలా చేయవచ్చునని తెలిపారు. వస్తు ప్రదర్శనలో విద్యార్థులు తయారు చేసిన రోబో, డ్రోన్, ఆధునిక నగర నిర్మాణ సౌలభ్యాలు విశేషంగా ఆకట్టుకోవడంతో విద్యార్థుల సృజనాత్మకత ఎంతో మెచ్చుకోదగినదన్నారు. నేడు విద్యార్థులకు విద్యతో పాటు సంస్కారం నేర్పించడం ఎంతో అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల పాలక మండలి అధ్యక్షుడు డాక్టర్ వేణుగోపాల్, సిఎల్ శ్రీనివాసులు, జెఎస్ రామకృష్ణ పాల్గొన్నారు.


వస్తు ప్రదర్శనను పరిశీలిస్తున్న దృశ్యం

గనుల అక్రమ తవ్వకాలపై లోకాయుక్తకు ఫిర్యాదు

కెజీఎఫ్: తాలూకాలోని కదరిగానకుప్ప గ్రామ సర్వే నెంబర్ 3లో 20 ఎకరాలు, సర్వే నెంబర్ 71లో ఐదు ఎకరాల స్థలంలో కొంతమంది అక్రమంగా గనుల తవ్వకాలు జరుపుతున్నారని, దీనిపై తగిన చర్యలు తీసుకోవాలని లోకాయుక్త ఎస్పీ ఉమేష్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. శనివారం లోకాయుక్త ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో భాగంగా లోకాయుక్తకు పలు ఫిర్యాదులు అందాయి. అందులో ప్రధానంగా గనుల తవ్వకాలపై ఫిర్యాదులు వచ్చాయి. 25 ఎకరాల స్థలంలో అత్యంత విలువైన నల్లరాయి ఉందని, అక్రమ తవ్వకాల వల్ల ప్రభుత్వానికి కోట్ల రూపాయల నష్టం కలుగుతోంది. వెంటనే దీనికి అడ్డుకట్ట వేయాలన్నారు. ఏపీఎంసీ ప్రాంతంలోని 25 ఎకరాల స్థలంలో విలువైన నల్లరాతి నిక్షేపాలు ఉన్నాయి. దీనిని అక్రమంగా తరలించి కొంతమంది సొమ్ము చేసుకుంటున్నారని ఫిర్యాదులో ఆరోపించారు. లోకాయుక్త ఎస్పీ మాట్లాడుతూ.. ప్రజలు ఏ విషయంపైనైనా నిర్భయంగా ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. ప్రజల ఫిర్యాదులకు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా లోకాయుక్తకు 23 ఫిర్యాదులు అందాయి.


ఫిర్యాదులు స్వీకరిస్తున్న లోకాయుక్త ఎస్పీ

రైతు సంఘం ధర్నా

కోలారు: వివిధ డిమాండ్ల సాధన కోసం రైతు సంఘం పదాధికారులు శనివారం బంగారుపేట పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు టీఎస్ రామేగౌడ కరువు సమయంలో రైతులు అనేక సమస్యలు ఎదుర్కొన్నారని, రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపలేదన్నారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో పంటలు సాగు చేస్తే వాటికి మద్దతు ధరలు లభించడం లేదన్నారు. అదే విధంగా అర్హులైన రైతులందరికి పహణీ అందించాలని, రైతులను పదే పదే కార్యాలయం చుట్టూ తిప్పుకోకూడదన్నారు. గోశాలలు స్థాపించాలని, పశువుల మేతకు ఇబ్బంది కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బంగారుపేట తాలూకా వ్యాప్తంగా ఆక్రమణలకు గురైన చెరువులు, గుండుతోపు, రాజకాలువలలో వెంటనే ఆక్రమణలు తొలగించాలని డిమాండ్ చేశారు. ఈ స్టాంప్ వ్యయాన్ని రైతుల హిత దృష్టిలో ఉంచుకుని వెంటనే తగ్గించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో తాలూకా అధ్యక్షుడు మురళి, వినోద్, మంజు, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించిన దృశ్యం

అధ్యక్ష, ఉపాధ్యక్ష ఎన్నిక ఏకగ్రీవం

కోలారు: తాలూకాలోని నెనుమనహళ్లి పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం అధ్యక్షుడిగా ఎన్‌వి రాజేంద్ర, 5వ సారి ఉపాధ్యక్షుడిగా సాదిక్‌కుర్మిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం సహకార సంఘ కార్యాలయంలో నిర్వహించిన ఎన్నికలో అధ్యక్ష, ఉపాధ్యక్ష స్థానాలకు వీరిద్దరే నామినేషన్ దాఖలు చేయడం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. నూతన అధ్యక్ష, ఉపాధ్యక్షులను సంఘం డైరెక్టర్లు అభినందించారు.

పౌష్టికాహార లోపంతో ఉన్న చిన్నారులను గుర్తిస్తున్నాం


అధికారి రమేష్‌బాబుతో మాట్లాడుతున్న దృశ్యం

కంప్లి: సండూరు తాలూకా బండ్రి పరిధిలో పౌష్టికాహార లోపంతో ఉన్న పిల్లను గుర్తించే ప్రత్యేక కార్యక్రమం చేపట్టామని జిల్లా ఆరోగ్య, కుటుంబ కళ్యాణ అధికారి డాక్టర్. వై రమేష్ బాబు తెలిపారు. సండూరు తాలూకా బండ్రి పరిధిలోని 45లో కేంద్రాల అపౌష్టి పిల్లలను గుర్తించే వినూత్న కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. బండ్రి గ్రామ పరిధిలోని 45వ అంగనవాడి కేంద్ర పరిధిలోని జన్మించిన నాటి నుండి ఆరేళ్లలోపు గల 3600 పిల్లలకు ఆరోగ్య పరీక్షలు చేస్తామన్నారు. అనంతరం వారికి పౌష్టికాహారం అందజేస్తామన్నారు.

ప్రజా సేవలను మరింత మెరుగు పరచాలి

రాయచూరు రూరల్: నేటి ఆధునిక యుగంలో ప్రజల సేవలను మరింత మెరుగుపరచాలని మంత్రి బోసురాజు అన్నారు. శనివారం యరమరాస్ ఆఫ్ తాబ్ పాఠశాలలో ఉత్తమ సేవలందించిన వారికి కాయక యోగి అవార్డులు అందించి మాట్లాడారు. కార్యక్రమంలో పాఠశాల సంచాలకుడు సయ్యద్ సిరాజ్, నేతలు జయన్న, శాంతప్ప,శివమూర్తి రుద్రప్ప అంగడి, శ్రీనివాస్, బసవరాజ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హులియమ్మ ఆలయం ప్రారంభోత్సవం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న స్వామీజీ

కంప్లి: దైవ చింతన ప్రతి ఒక్కరిలో ఉండాలని, అప్పుడే వారి జీవనంలో ప్రశాంతత ఉంటుందని ఉజ్జయిని సద్ధర్మ పీఠం జగద్గురు సిద్దలింగ రాజదేశీకేంద్ర శివాచార్య స్వామీజీ తెలిపారు. హుడేం గ్రామంలో నూతనంగా నిర్మించిన హులియమ్మ దేవి దేవస్థాన ప్రారంభోత్సవంలో పాల్గొని మాట్లాడారు. దేవుడిపై నమ్మకంతో ఎలాంటి కార్యాలు చేపట్టిన అవి సఫలీకృతం అవుతాయన్నారు.

అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి


రాజ్యంగ జాగృతి రథానికి స్వాగతం పలుకున్న దృశ్యం

కెజీఎఫ్: రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని విద్యావంతులు కావాలని దళిత సంఘర్ష సమితి రాష్ట్ర సంఘటనా సంచాలకుడు సూలికుంటె రమేష్ అన్నారు. శనివారం బంగారుపేట తాలూకా సూలికుంటె గ్రామంలో పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన రాజ్యాంగ జాగృతి జాతా రథానికి ఆయన స్వాగతం పలికి మాట్లాడారు. భారత రాజ్యాంగం ప్రపంచంలో ఉత్తమ రాజ్యాంగం గుర్తింపు సాధించిందన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రశ్మి, దళిత నాయకుడు చంద్రశేఖర్, తాపం ఈఓ రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బయలు బసవేశ్వర స్వామి రథోత్సవం


ప్రత్యేక అలంకరణలో స్వామివారు

మాలూరు: తాలూకాలోని సొణకపనహట్టి గ్రామ సమీపంలో ఉన్న శ్రీ బయలు బసవేశ్వర స్వామి రథోత్సవం శనివారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి మూల విగ్రహానికి విశేష అలంకరణ, పూజలు చేశారు. ఉదయం మూల విరాట్టుకు అభిషేకం, మహా మంగళారతి తదితర పూజాది కార్యక్రమాలు జరిగాయి. అనంతరం రథోత్సవం జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.